


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 161

శనివారం 31-8-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'వరుస లాభాల' రికార్డు

సెన్సెక్స్ 9వ రోజూ లాభాలే.. ఇంట్రాడే, ముగింపుల్లోనూ గరిష్టాలు -15లో



అల్‌కరాజ్ అవుట్

యూఎస్ ఓపెన్ టెన్నిస్ టోర్నీ నుంచి రెండో రౌండ్‌లోనే నిష్క్రమణ. -15లో



తలవంచి క్షమాపణ కోరుతున్నా..

మహారాష్ట్రలో శివాజీ మహారాజ్ విగ్రహం కూలిపోవడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.


- వివరాలు 6లో



మౌనమేల మోదీజీ!

మహిళలపై నేరాలకు పాల్పడేవారికి కఠిన శిక్షలు విధించేలా కేంద్రం పటిష్ట చట్టం తేవాలంటూ మమత మోదీకి లేఖ రాశారు.

- వివరాలు 6లో



ఆత్మరక్షణకు ఆయుధాలు!

రాత్రి షిఫ్టుల్లో పనిచేసే మహిళా వైద్యులు ఆత్మరక్షణకు ఆయుధాలను తీసుకెళ్లాలనే భావనకు వచ్చారని ఐఎంఏ వెల్లడించింది.

- వివరాలు 6లో



ట్రంప్ శకం ముగిసింది!

అమెరికా రాజకీయాల్లో ట్రంప్ శకం ముగిసిందని అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ అభిప్రాయపడ్డారు.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లది హైడ్రామా



ఆరు గ్యారంటీలు, రుణమాఫీ అంశాన్ని పక్కదారి పట్టించేందుకే కాంగ్రెస్.. బీఆర్ఎస్‌తో కలిసి డ్రామాకు తెరలేపిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. 'హైడ్రా' రెండు, మూడు కట్టడాలను కూల్చి హైడ్రామా మొదలుపెట్టిందని ధ్వజమెత్తారు.

- వివరాలు 2లో ▶

సింగరేణిలో 2,364 ఉద్యోగాల క్రమబద్ధీకరణ



సింగరేణి కాలరీస్‌లో పనిచేస్తున్న 2,364 మంది బదిలీ వర్కర్లను జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరించేందుకు ఆమోదం లభించింది. ఈ మేరకు త్వరలోనే ఉత్తర్వులు జారీ చేయాలని సంబంధిత డైరెక్టర్‌ను సింగరేణి సీఎండీ ఎన్. బలరాం ఆదేశించారు.

- వివరాలు 3లో ▶

నేడు రాజకీయ పార్టీలతో ఎస్ఈసీ భేటీ



స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై రాష్ట్ర ఎన్నికల సంఘం వేగం పెంచింది. శనివారం అన్ని రాజకీయ పార్టీలతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి సమావేశం నిర్వహించనున్నారు.


- వివరాలు 2లో ▶

గోండ్వానా టు ఆస్ట్రేలియా.. వయా ఇండియా!



వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆస్ట్రేలియాకు మన దేశం నుంచి జీవజాతులు తరలిపోయినట్టు సీసీఎంబీ శాస్త్రవేత్త జాహ్నవి జోషి తేల్చారు. మన దేశంలో కోట్ల ఏళ్ల కిందటి నుంచే జీవ వైవిధ్యం ఉందనే ఆధారాలను గుర్తించారు.

- వివరాలు 16లో ▶



జ్వర భద్రం



వరంగల్ ఎంజీఎం కిటకిట: శుక్రవారం రాత్రి 9 గంటలకు పిల్లల వార్డు ఇలా..

డెంగీకి తోడు చికున్‌గున్యా, ఇతర విష జ్వరాల దాడి

'మిక్స్‌డ్ ఇన్ఫెక్షన్ల'తో అల్లాడిపోతున్న జనం

నీరసం, ఒళ్లు నొప్పులతో సొంత పనులూ చేసుకోలేనంతగా సతమతం...

ఈ ఏడాది ఇప్పటికే 6,050 డెంగీ కేసులు నమోదు.. 'లెక్క'లోకి రానివి మరెన్నో!

రోగులతో ఆస్పత్రులు ఫుల్.. పలు ఆస్పత్రుల్లో మందుల కొరత

చాలా చోట్ల మౌలిక సదుపాయాలు కరువు..

ప్రైవేటు ఆస్పత్రులకు వెళితే వేలు, లక్షల్లో ఫీజుల వసూళ్లు

'నిలువు దోపిడీ' సమర్పించుకోలేక అల్లాడుతున్న జనం

దీనిపై ప్రభుత్వం దృష్టిపెట్టాలని విజ్ఞప్తులు

డెంగీ రాష్ట్రాన్ని వణికిస్తోంది. ఇంతకుముందులా కాకుండా 'మిక్స్‌డ్ ఇన్ఫెక్షన్ల'తో జనాల ఆరోగ్యాన్ని నిలువునా పీల్చిపిప్పిచేస్తోంది. రెండు, మూడు రకాల వైరస్‌లు సోకుతుండటం ప్రమాదకరంగా మారుతోంది. జ్వరంతోపాటు తీవ్ర నీరసం, ఒళ్లంతా నొప్పులతో.. కనీసం బెడ్‌పై నుంచి లేచి నడవలేనంతగా బాధపెడుతోంది. ప్రభుత్వ ఆస్పత్రులకు వెళితే తగిన వైద్యం అందక.. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి 'నిలువు దోపిడీ' సమర్పించుకోలేక.. శారీరకంగానే కాదు, మానసికంగానూ జనం అల్లాడిపోయే పరిస్థితి కనిపిస్తోంది. విషజ్వరాలతో పరిస్థితి దారుణంగా మారుతున్నా, ప్రైవేటు ఆస్పత్రుల దోపిడీ కళ్లముందే కనిపిస్తున్నా.. ప్రభుత్వం నుంచి తగిన స్పందన లేదనే ఆగ్రహం వ్యక్తమవుతోంది.

వివరాలు 2లో

మిక్స్‌డ్ ఇన్ఫెక్షన్లతో తీవ్ర ప్రభావం

సీరో టైప్-1, 2 డెంగీ వేరియంట్లతో ఆరోగ్యం సీరియస్.. కోవిడ్ వచ్చి తగ్గినవారిలో నీరసం మరింత ఎక్కువ

అడిషనల్ డీఎంఈ రాజారావు వెల్లడి

'ప్రైవేట్'పై ఉక్కుపాదం

- అడ్డగోలు వసూళ్లు చేస్తే కఠిన చర్యలు తప్పవు
- బాధితులు పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ ఆఫీసు కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదు చేయొచ్చు
- 'సాక్షి'తో వైద్యారోగ్యశాఖ మంత్రి రాజనర్సింహ

బేషరతుగా విచారం వ్యక్తం చేస్తున్నా..

న్యాయ వ్యవస్థపై నాకు అపార గౌరవం ఉంది

సుప్రీంకోర్టు వ్యాఖ్యలపై సీఎం రేవంత్‌రెడ్డి



స్పీడ్‌పై సమీక్షలో సీఎం రేవంత్, మంత్రి జూపల్లి

సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ లిక్కర్ స్కాంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు బెయిల్ రావడంపై తాను చేసినట్టుగా చెబుతున్న వ్యాఖ్యలకు సంబంధించి పత్రికల్లో వచ్చిన కథనాలపై బేషరతుగా విచారం వ్యక్తం చేస్తున్నానని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన నేపథ్యంలో ఆయన స్పందించారు. తనకు న్యాయ వ్యవస్థపై అపార గౌరవం ఉందని, కోర్టు భావనను అర్థం చేసుకోగలనని పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. 'భారత న్యాయ వ్యవస్థపై నాకు పూర్తి విశ్వాసం ఉంది. ఆగస్టు 29, 2024న పలు పత్రికల్లో నా పేరిట వచ్చిన వార్తల ఆధారంగా గౌరవ న్యాయస్థానం విచక్షణను నేను ప్రశ్నించినట్టుగా కోర్టు భావించడాన్ని అర్థం చేసుకోగలను. న్యాయ ప్రక్రియ పట్ల నాకు పూర్తిస్థాయిలో నమ్మకం ఉందని మరోమారు తెలియజేస్తున్నాను. పత్రికల్లో ఆ వ్యాఖ్యలను అసందర్భంగా నాకు ఆపాదించారు. న్యాయవ్యవస్థ, ఆ వ్యవస్థకున్న స్వతంత్రతపై నాకు అపార గౌరవం ఉంది. రాజ్యాంగాన్ని సంపూర్ణంగా విశ్వసించే నేను న్యాయ వ్యవస్థ ఎప్పుడూ ఉన్నతంగా ఉండాలని కోరుకుంటాను..' అని సీఎం పేర్కొన్నారు.

1000 ఎకరాల్లో కొత్త జూపార్క్

హైదరాబాద్‌కు వెలుపల ఏర్పాటు చేయాలి

అనంత్ అంబానీలా ముందుకు వచ్చే వారిని ఆహ్వానించాలి

- 'స్పీడ్'పై సమీక్షలో సీఎం ఆదేశాలు
- అనంతగిరిలో నేచర్ వెల్‌నెస్ సెంటర్
- టీటీడీ తరహాలో యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డు

5లో

'జువ్వలదిన్నె' ప్రారంభం
జగన్ కల సాకారం

1,250 బోట్లు నిలుపుకునేలా హార్బర్ అభివృద్ధి.. అందుబాటులోకి జగన్ కలల ప్రాజెక్టు


రూ.392.58 కోట్లతో నిర్మిస్తున్న

పూడిమడక హార్బర్‌కూ శంకుస్థాపన

రూ.3,500 కోట్లతో 10 హార్బర్ల నిర్మాణం చేపట్టిన జగన్ సర్కార్

ఎన్నికల కోడ్ రావడంతో జువ్వలదిన్నె ప్రారంభం వాయిదా

12లో



ఆ తర్వాతే చట్టప్రకారం ముందుకు వెళ్లండి

పల్లా రాజేశ్వర్‌రెడ్డి పిటిషన్‌పై ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లను పక్కాగా తేల్చండి

సాక్షి, హైదరాబాద్: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం కొర్రెముల గ్రామంలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి చెందిన 'గాయత్రి'నిర్మాణాలపై చట్టప్రకారం ముందుకు వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టం చేసింది. తొలుత అక్కడి నాదెం చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్), బఫర్‌జోన్లను పక్కాగా నిర్ధారించాలని ఆదేశించింది. సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్‌ల సహకారంతో ఈ ప్రక్రియ చేపట్టి.. చెరువు ఎన్ని ఎకరాలు, ఆక్రమణలు ఎంతమేర జరిగాయన్నది తేల్చి.. ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేయాలని స్పష్టం చేసింది. వారి వాదనలు విన్నాక చట్టప్రకారం మిగతా 5వ పేజీలో ▶

2026 మార్చిలో 'దేవాదుల' ప్రారంభం

సోనియాగాంధీ చేతుల మీదుగా జరిపిస్తాం

- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వెల్లడి
- 300 రోజుల్లో 60 టీఎంసీల వినియోగం.. 7 జిల్లాలు సస్యశ్యామలం
- ప్రాజెక్టుల భూసేకరణకు ప్రత్యేక అధికారి

సాక్షి ప్రతినిధి, వరంగల్: దేవాదుల ప్రాజెక్టు పెండింగ్ పనులు 2026 మార్చి లోపు వందశాతం పూర్తి చేసి, అదే నెలలో సోనియాగాంధీ చేతుల మీదుగా ప్రారంభిస్తామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. ఏడాదిలో 300 రోజుల పాటు 60 టీఎంసీల నీటిని వినియోగించుకుని ఏడు మిగతా 5వ పేజీలో ▶



తుపాకులగూడెం వద్ద గోదావరిని పరిశీలిస్తున్న మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, సీతక్క, ఎమ్మెల్యేలు, అధికారులు

పైపులైన్‌తో చేనుకు **సాగునీరు**

- రాష్ట్రంలోనే తొలి మైక్రో ఇరిగేషన్ పథకం
- ఆదిలాబాద్ జిల్లా మత్తడివాగు ప్రాజెక్టులో ఓ కాలువ బదులు భూగర్భ పైపులైన్

5లో

తమకు న్యాయం చేయాలని కోరుతూ హాస్టల్ వద్ద భైఠాయించి నిరసన తెలుపుతున్న విద్యార్థినులు



రాక్షస రాజ్యంలో 'గుడ్ల'గూబలు!

విద్యార్థినుల వాష్‌రూమ్‌ల్లో సీక్రెట్ కెమెరాలు.. 300 వీడియోలు రికార్డు

కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీలో దారుణం..

ఈ ఘటన వెనుక అధికార పార్టీకి చెందిన నేతలు.. కాలేజీ నిర్వాహకులు టీడీపీ ప్రముఖుల సన్నిహితులే

ఆరోపణలు ఎదుర్కొంటున్న విద్యార్థిని తండ్రి టీడీపీ నేత.. కప్పిపుచ్చి పక్కదారి పట్టించేందుకు సర్కారు యత్నాలు

అర్ధరాత్రి కరెంట్ ఆపేసి రహస్యంగా పోలీసుల తనిఖీలు..

స్నానాల గదుల్లో షవర్లు ఊడదీసి గుట్టుగా తరలింపు

- వీడియోలు బయటకు లీకైనట్లు తల్లడిల్లుతున్న విద్యార్థినులు.. వారం క్రితమే యాజమాన్యం దృష్టికి తెచ్చినా పట్టించుకోకుండా నోరు నొక్కే యత్నాలు
- ఫేక్ న్యూస్ అంటూ తొలుత బుకాయింపు.. ప్రశ్నించిన విద్యార్థులపై ఎదురు కేసులు పెడతామంటూ హెచ్చరికలు
- వర్షంలోనూ విద్యార్థినుల ఆందోళన.. ప్రజా సంఘాల మద్దతు
- న్యాయం చేయాలంటూ మంత్రిని నిలదీయడంతో కళాశాల వద్ద తీవ్ర ఉద్రిక్తత

12లో

ఇలాంటివుట్





భారత్‌కు 4 పతకాలు

పారిస్‌లో జరుగుతున్న పారాలింపిక్స్‌లో శుక్రవారం భారత్ పతకాల జోరు ప్రదర్శించింది. ఒకే రోజు మన ఖాతాలో 4 పతకాలు చేరాయి. ఇందులో ఒక స్వర్ణం, రజతం, రెండు కాంస్యాలు ఉన్నాయి. గత టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించిన షూటర్ అవని లేఖరా ఈ సారి దానిని నిలబెట్టుకుంటూ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ స్టాండింగ్ ఎస్‌హెచ్1 ఈవెంట్‌లో పసిడిని తన ఖాతాలో వేసుకుంది. ఇదే ఈవెంట్‌లో మోనా అగర్వాల్‌కు కాంస్యం దక్కింది. పురుషుల ఎయిర్ పిస్టల్‌లో మనీశ్ నర్వాల్ రజతం గెలుచుకోగా...100 మీటర్ల స్ప్రింట్‌లో ప్రీతి పల్ కూడా కాంస్యం సాధించింది.

వివరాలు 15లో

ఇక ఆన్‌లైన్‌లోనే.. ఆ సర్టిఫికెట్లు



9 రకాల సేవలు మీ సేవకు బదలాయింపు

క్రీమీలేయర్-నాన్‌క్రీమీలేయర్, మార్కెట్‌వాల్యూ సర్టిఫైడ్‌కాపీ, ఖాస్రా, సెస్లా పహాణీలు..

సాక్షి, హైదరాబాద్: ఇప్పటివరకు మాన్యువల్‌గా రెవెన్యూవర్గాలు జారీ చేస్తున్న 9 రకాల సర్టిఫికెట్లు ఇక నుంచి ఆన్‌లైన్‌లోనే ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో విద్య, ఉద్యోగార్థులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలకు తోడు రెవెన్యూ సంబంధిత రికార్డులు కూడా ఉన్నాయి. ఇప్పటివరకు కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు మీసేవ ద్వారానే ఆన్‌లైన్‌లో ఇస్తున్నారు. అయితే, ఈ సర్టిఫికెట్లు ఏడాదిలోపు రెండోసారి తీసుకుంటే మాత్రం మాన్యువల్‌గా తహసీల్దార్ కార్యాలయాలే ఇస్తున్నాయి. ఇప్పుడు ఏడాదిలోపు తీసుకున్నప్పటికీ ఆన్‌లైన్‌లో ఇవ్వాలని ప్రభుత్వం యోచిస్తోంది. గ్యాప్ సర్టిఫికెట్, పేరు మార్పిడి పత్రం, స్థానికత నిర్ధారణ, క్రీమీలేయర్-నాన్‌క్రీమీలేయర్, మార్కెట్ వాల్యూ సర్టిఫైడ్‌కాపీ, ఖాస్రా, సెస్లా పహాణీలు, ఆర్వోఆర్-ఐబీ రికార్డులు ఇక నుంచి మీసేవకేంద్రాల ద్వారా ఇవ్వాలనుకుంటున్నామని, ఇందుకు సంబంధించిన సమాచారం, సర్టిఫికెట్ ఫార్మాట్‌లను తమకు పంపాలని భూపరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిత్తల్ అన్ని జిల్లాల కలెక్టర్లకు సర్క్యులర్ జారీ చేశారు. క్షేత్రస్థాయి నుంచి వచ్చే ఈ సమాచారం ఆధారంగా ముందుకెళ్లాలని సీసీఎల్ఏ వర్గాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో త్వరలోనే ఈ సర్టిఫికెట్ల కోసం మీసేవకేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటే, అక్కడి నుంచే వాటిని జారీ చేసేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేయనుంది.

మనకూ కావాలి 'హేమ' కమిటీ

తెలంగాణ సర్కారును కోరిన సమంత



సాక్షి, హైదరాబాద్: తెలుగు చిత్ర పరిశ్రమలో మహిళలకు సురక్షితమైన పని వాతావరణాన్ని నెలకొల్పడానికి వీలుగా జస్టిస్ కె.హేమ కమిటీ తరహాలో సబ్ కమిటీని నియమించాలని నటి సమంత తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. మలయాళ చిత్ర పరిశ్రమలో లైంగిక వేధింపులపై నియమించిన జస్టిస్ హేమ కమిటీ ఇచ్చిన నివేదికపై పలువురు సినీ ప్రముఖులు స్పందిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా సమంత కూడా సోషల్ మీడియా వేదికగా స్పందించారు. 'తెలుగు చిత్ర పరిశ్రమలోని మహిళలమైన మేము జస్టిస్ హేమ కమిటీ నివేదికను స్వాగతిస్తున్నాం. దీనికి బాటలు వేసిన మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

అంధుల ఇళ్లను కూల్చేస్తారా?

మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్



సాక్షి, హైదరాబాద్: కష్ట నష్టాల కోర్చి మహబూబ్‌నగర్‌లో అంధులు నిర్మించుకున్న ఇళ్లను కూల్చివేయడం దారుణమని మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. ఆయన తెలంగాణ భవన్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ క్రిస్టియన్ కాలనీ పరిధిలోని అంధుల కాలనీలో అర్ధరాత్రి 400 మంది పోలీసులు వెళ్లి ఇళ్లు కూల్చివేశారని, తాము అంధులమని వేడుకున్నా పోలీసులు కనికరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లలోని తమ సామగ్రిని తీసుకుంటామని బతిమిలాడినా సమయం ఇవ్వకుండా కూల్చివేశారని విమర్శించారు. వీరికి 2007 లో కాంగ్రెస్ ప్రభుత్వం పట్టాలు ఇస్తే, బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథ నీళ్లు, విద్యుత్ ఇచ్చిందని గుర్తు చేశారు. నాలుగేళ్ల పాటు పింఛను డబ్బులతో చిట్టీలు వేసుకొని నిర్మించుకున్న పేదల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేయడం విచారకరమన్నారు. బడాబాబులకు 30 రోజుల గడువిచ్చి, పేదల ఇళ్లను మాత్రం ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కూల్చివేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

ఛత్తీగఢ్‌కు సంపత్‌కుమార్.. జార్ఖండ్‌కు సిరివెల్ల ప్రసాద్

పలు రాష్ట్రాలకు కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులను నియమించిన ఏఐసీసీ

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలోని పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఏఐసీసీ కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులను పార్టీ అధిష్టానం నియమించింది. తెలంగాణకు చెందిన సంపత్‌కుమార్‌ను ఛత్తీస్‌గఢ్‌కు, ఏపీకి చెందిన సిరివెల్ల ప్రసాద్‌ను జార్ఖండ్‌కు సెక్రటరీలుగా నియమించినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే తెలంగాణకు కార్యదర్శులుగా పీసీ విష్ణునాథ్, పి.విశ్వనాథన్‌లను.. ఏపీకి సెక్రటరీగా గణేష్‌కుమార్ యాదవ్, జాయింట్ సెక్రటరీగా ఫలక్ వర్మను నియమించినట్లు పేర్కొన్నారు. వారంతా ప్రధాన కార్యదర్శులు, ఇన్‌చార్జీలకు అనుబంధంగా పనిచేస్తారన్నారు.

ఇది ప్రతీకార పాలన

బీఆర్ఎస్ నేత ప్రవీణ్ కుమార్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రజాపాలనకు బదులుగా.. ప్రతీకార పాలన నడుస్తోందని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శించారు. ఆయన తెలంగాణ భవన్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. విద్యా సంస్థల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు బాధ్యతలను అక్షయపాత్ర సంస్థకు అప్పగించడం సరికాదన్నారు. గురుకుల విద్యాసంస్థల్లో బ్రహ్మకుమారీస్ సంస్థతో ధ్యానం నేర్పాలనే నిర్ణయాన్ని తప్పుబట్టారు. శాస్త్రీయ విజ్ఞానం పెంపొందించకుండా.. చిన్న వయసులో పేద విద్యార్థులకు నిరాశావాదం నూరిపోయడం సరికాదన్నారు. గురుకుల సొసైటీల్లో బోధన గాడి తప్పిందని, పాఠశాలలు సమస్యలతో కునారిల్లుతున్నాయని విమర్శించారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడండి

- ఒక పార్టీలో గెలిచి మరో పార్టీలోకి.. చట్టవిరుద్ధం
- హైకోర్టులో కేఏ పాల్ పిల్.. విచారణ వాయిదా

సాక్షి, హైదరాబాద్: ఒక పార్టీ నుంచి పోటీ చేసి గెలిచిన వెంటనే మరో పార్టీలోకి ఫిరాయిస్తున్నారని.. ఇలాంటి వారి శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేసేలా ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు జారీ చేయాలని హైకోర్టును ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ.పాల్ విజ్ఞప్తి చేశారు. ఆయా నియోజకవర్గ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేస్తున్నారని చెప్పారు. పిల్‌గా నంబర్ కేటాయించి విచారణ చేపట్టాలని అభ్యర్థించారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేసేలా ఈసీని ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో కేఏ.పాల్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే రిజిస్ట్రీ అభ్యంతరాలతో నంబర్ కేటాయించలేదు. ఈ అభ్యంతరాలపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్‌అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ఇప్పటికే ఇదే అంశంపై మూడు పిటిషన్లు సింగిల్ జడ్జి వద్ద పెండింగ్‌లో ఉన్నాయి కదా.. మళ్లీ పిల్ ఎందుకని ప్రశ్నించింది. అవి రాజకీయ ప్రయోజనం.. ఇది ప్రజా ప్రయోజనం కోసం దాఖలైన పిటిషన్ అని పాల్ బదులిచ్చారు. దీనిపై ఓ అఫిడవిట్ దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశించగా.. సోమవారం దాఖలు చేస్తానన్నారు. ఒక పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యే దానం నాగేందర్ వెంటనే అధికార పార్టీలో చేరి.. ఆ తర్వాత ఏకంగా పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేశారని చెప్పారు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, వీరంతా ఐదేళ్లపాటు యథేచ్ఛగా తమ అధికారాలను అనుభవిస్తున్నారని.. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఇలాంటి వారిపై చర్యలు చేపట్టాలన్నారు. రిజిస్ట్రీ అభ్యంతరాలను పక్కకు పెట్టి విచారణకు స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు. అఫిడవిట్ వేసిన తర్వాత పరిశీలిస్తామన్న ధర్మాసనం.. విచారణ వాయిదా వేసింది.

మనకూ కావాలి 'హేమ' కమిటీ

▶ మొదటి పేజీ తరువాయి

కేరళ డబ్ల్యూసీసీ (ఉమెన్ ఇన్ సినిమా కలెక్టివ్) నిరంతర ప్రయత్నాలను అభినందిస్తున్నాం. తెలుగు చిత్ర పరిశ్రమలోని మహిళలకు మద్దతుగా నిలిచేందుకు 2019లో నెలకొల్పిన 'ది వాయిస్ ఆఫ్ ఉమెన్'కూడా డబ్ల్యూసీసీ గ్రూప్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి..'అని సమంత సూచించారు.

జ్వర భద్రం

డెంగీకి తోడు చికున్‌గున్యా, ఇతర విష జ్వరాల దాడి



శుక్రవారం నిలోఫర్ ఆస్పత్రి వార్డులో జ్వర బాధితులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రం జ్వరాలతో మంచాన పడింది. డెంగీ, చికున్‌గున్యా, మలేరియా వ్యాప్తి రోజురోజుకూ పెరుగుతోంది. పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా జనం విష జ్వరాలతో అల్లాడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులన్నీ కిటకిటలాడుతున్నాయి. చాలా ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందుల కొరత, మౌలిక సదుపాయాలు లేకపోవడం, వైద్య సిబ్బంది కొరతతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళితే అడ్డగోలుగా వసూలు చేస్తున్న ఫీజులు చూసి కళ్లు తేలేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం నుంచి స్పందన కనిపించడం లేదని బాధితులు వాపోతున్నారు.

పెరుగుతున్న డెంగీ తీవ్రత

రాష్ట్రంలో వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో జ్వర సర్వే జరుగుతోంది. గ్రామాల్లో ఆశ కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి సర్వే చేస్తున్నారు. వైద్యారోగ్యశాఖ లెక్కల ప్రకారం రాష్ట్రంలో ఈ ఏడాది ఇప్పటివరకు ఏకంగా 6,051 డెంగీ కేసులు, 164 చికున్‌గున్యా కేసులు, 197 మలేరియా కేసులు నమోదయ్యాయి. కానీ లెక్కల్లోకి రాని కేసులు భారీ స్థాయిలో ఉన్నాయనే అంచనా. ముఖ్యంగా డెంగీ దడ పుట్టిస్తోంది. జూలై, ఆగస్టు రెండు నెలల్లోనే ఏకంగా 3,317 డెంగీ కేసులు నమోదయ్యాయి. ఇందులో హైదరాబాద్‌లో అత్యధికంగా 1,267 కేసులు, నల్లగొండ జిల్లాలో 276 కేసులు, ఖమ్మం జిల్లాలో 181 కేసులు నమోదయ్యాయి. మిగతా జిల్లాల్లోనూ విష జ్వరాల కేసులు పెరిగినా.. అధికారికంగా నమోదవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు చాలా ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవసరమైన మందులు లేకపోవడం, టెస్టింగ్ కిట్ల కొరత ఇబ్బందికరంగా మారింది.

రూ.50 వేల నుంచి రూ.2 లక్షలదాకా వసూళ్లు

ప్రైవేట్ ఆస్పత్రులకు వెళితే వేలకు వేలు వసూలు చేస్తున్నాయని డెంగీ, ఇతర విష జ్వరాల బాధితులు వాపోతున్నారు. ముఖ్యంగా డెంగీ వచ్చి ఆస్పత్రిలో చేరితే చాలు.. పరిస్థితిని బట్టి రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు చికిత్సల కోసం వసూలు చేస్తున్న పరిస్థితి. ఈ పరిస్థితిని చక్కదిద్దడంలో వైద్యశాఖ యంత్రాంగం విఫలమవుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. డెంగీ, ఇతర విష జ్వరాల నియంత్రణ, బాధితులకు చికిత్స అందించడంపై దృష్టిపెట్టాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించినా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా కనిపిస్తోంది. ఉన్నతాధికారులు ప్రభుత్వ ఆస్పత్రులను తనిఖీ చేస్తూ, పరిస్థితిని చక్కదిద్దడంపై ఫోకస్ చేస్తున్నా.. ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీని మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

నిజామాబాద్ జిల్లా ఆస్పత్రికి రికార్డు స్థాయిలో రోగులు

శుక్రవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రికి రాష్ట్రంలోనే అత్యధికంగా 2,680 మంది ఔట్ పేషెంట్లు వచ్చారు. హైదరాబాద్‌లోని ఉస్మానియాకు 2,566 మంది, గాంధీకి 2,192 మంది, వరంగల్ ఎంజీఎంకు 2,385 మంది ఔట్ పేషెంట్లు వచ్చారు. ఓపీ నమోదైంది. సీజనల్ వ్యాధులు విజృంభిస్తుండడంతో ఆస్పత్రులకు రోగుల తాకిడి పెరుగుతోంది.

ప్లేట్‌లెట్స్ టెస్టు కోసం బయటికి..

నాలుగు రోజుల నుంచి జ్వరం వస్తోంది. ఆస్పత్రిలో మూడు రోజులుగా వైద్యం తీసుకుంటున్నా. నా భర్తకు కూడా జ్వరమే. ఆస్పత్రిలో ప్లేట్‌లెట్ టెస్ట్ చేసే సదుపాయం లేదని టెస్టుల కోసం బయటికి పంపించారు.

– కె.లక్ష్మితిరుపతమ్మ, సత్తుపల్లి

మందులు సరిగా ఇవ్వడం లేదు

నేను నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నా. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వస్తే.. వైద్యులు పారాసెటమాల్ 650 ఎంజీ మాత్రలు రాశారు. కానీ సిబ్బంది 500 ఎంజీ మాత్రలు, అదీ రెండు రోజులకు సరిపడానే ఇచ్చారు. 650 ఎంజీ మాత్రలు బయట కొనుక్కోవాలని చెప్పారు.

– మశమ్మ, నాగర్‌కర్నూల్

మిక్స్‌డ్ ఇన్ఫెక్షన్లతో తీవ్ర ప్రభావం



''ఏ వైరల్ జ్వరం అయినా వీక్‌నెస్ ఉంటుంది. కోవిడ్ వచ్చిపోయిన వారిలో నీరసం మరింత ఎక్కువగా ఉంటోంది. వైరల్ జ్వరం వచ్చిన వారు విశ్రాంతి ఎక్కువగా తీసుకోవాలి. లేకుంటే సాధారణ స్థితికి రావడానికి ఎక్కువ రోజులు పడుతుంది. డెంగీలో సీరో టైప్-2 అనేది మన వద్ద ఎక్కువగా వ్యాపిస్తోంది. మిగతా డెంగీ వేరియంట్ల కంటే దీని తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అదే మిక్స్‌డ్ ఇన్ఫెక్షన్స్ ఉంటే తీవ్రత మరింత పెరుగుతుంది. ఎవరికైనా సీరో టైప్-1 డెంగీ ఒకసారి వచ్చి, రెండోసారి సీరో టైప్-2 వస్తే.. మొదటిదాని యాంటీబాడీస్, రెండో టైప్ ఇన్‌ఫెక్షన్ క్రాస్ రియాక్షన్ వల్ల ఆరోగ్య పరిస్థితి మరింత సీరియస్ అవుతుంది. ఇక డెంగీలో ప్లేట్‌లెట్లు పడిపోవడం కంటే.. ప్లాస్మా లీకేజీ చాలా ప్రమాదకరం. రక్తంలోని నీరు రక్తనాళాల నుంచి లీక్ అవడమే ప్లాస్మా లీకేజీ. దీనివల్ల పల్స్, బీపీ పడిపోవడం, తర్వాత తీవ్ర కడుపు నొప్పి, వాంతులు రావడం, చెమటలు పట్టడం, అపస్మారక స్థితిలోకి వెళ్లడం, అవయవాలు విఫలమయ్యే కూడా వెళ్తుంది. అయితే వంద మందికి డెంగీ వస్తే.. అందులో ఐదుగురికి మాత్రమే ప్లాస్మా లీకేజీ వరకు వెళ్లే ప్రమాదం ఉంటుంది. డెంగీలో ప్లేట్‌లెట్లు పడిపోవడం సాధారణ లక్షణమే. చాలా మందిలో వాటంతట అవే పెరుగుతాయి. ఒకవేళ రక్తస్రావం జరుగుతున్నా, 20 వేల కన్నా తక్కువకు ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గిపోయినా.. ప్లేట్‌లెట్లు ఎక్కించాల్సి వస్తుంది. ప్లేట్‌లెట్ టెస్టులను పెథాలజిస్ట్ చూసి నిర్ధారించాలి. మిషన్‌లో లెక్కిస్తే.. ఉన్నదాని కంటే తక్కువగా చూపించే చాన్స్ ఉంటుంది.

– ప్రొఫెసర్ ఎం.రాజారావు, అడిషనల్ డీఎంఈ

ఏ ఆస్పత్రిలో చూసినా అవే సమస్యలు..

- మహబూబ్‌నగర్ జిల్లా జనరల్ ఆస్పత్రితోపాటు పీహెచ్‌సీలలో మందుల కొరత ఉంది. అన్ని రకాల యాంటీ బయాటిక్స్ అందుబాటులో లేవు. జలుబు సిరప్, కంటి చుక్కల మందులు, క్లేవమ్ వంటి మందులు కూడా లేవు. ఇంజక్షన్లు అందుబాటులో లేవు. వైద్యులు ఐదారు రకాల మందులు రాస్తే వాటిలో రెండు, మూడు రకాలు మాత్రమే ఉంటున్నాయి. మిగతావి బయట కొనుక్కోవాల్సి వస్తోంది.
- నాగర్‌కర్నూల్ జిల్లా జనరల్ ఆస్పత్రిలో జ్వరం, ఇతర జబ్బులకు కేవలం రెండు రోజులకు మాత్రమే మందులు ఇస్తున్నారు.
- నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మందుల కొరత తీవ్రంగా ఉంది. వారం రోజులకు మందులు రాస్తే.. మూడు రోజుల మందులే ఇస్తున్నారు. కొన్ని రకాల మందులు లేకపోవడంతో బయట కొనాల్సిన పరిస్థితి నెలకొంది.
- బోధన్ ఆస్పత్రిలో రోగుల సంఖ్య పెరగడంతో వరండాలో బెడ్స్ వేసి వైద్యం అందిస్తున్నారు.

డెంగీతో ఇద్దరి మృతి



హర్షిత్‌చారి



సుతారి కనకలక్ష్మి

పాపన్నపేట(మెదక్)/సిద్దిపేట అర్బన్: వేర్వేరు జిల్లాల్లో డెంగీతో బాధపడుతూ ఇద్దరు మృతి చెందారు. మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని చీకోడ్‌కు చెందిన వడ్ల రాజుకు ఇద్దరు కొడుకులు. పెద్దకొడుకు హర్షిత్‌చారి (11)కి వారం రోజుల క్రితం డెంగీ సోకగా.. కుటుంబ సభ్యులు మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి లో చేర్పించారు. అక్కడ నయం కాకపోవడంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ డబ్బులు కట్టలేక, నిలోఫర్‌కు తరలించగా.. హర్షిత్ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మరణించాడు. సిద్దిపేట అర్బన్ మండలం తడ్కపల్లికి చెందిన సుతారి కనకలక్ష్మి జ్వరంతో బాధ పడుతుండటంతో సిద్దిపేటలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయించినా తగ్గకపోవడంతో.. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడా నయం కాకపోవడంతో నిమ్స్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది.

ప్రైవేట్ ఆస్పత్రులపై ఉక్కుపాదం మోపుతాం

'సాక్షి'తో వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



సాక్షి, హైదరాబాద్: ప్రైవేట్ ఆస్పత్రుల్లో డెంగీ పేరుతో ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నారన్న విషయం తన దృష్టికి వచ్చిందని.. అలాంటి వాటిపై ఉక్కుపాదం మోపుతామని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హెచ్చరించారు. ఈ అంశంపై ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులను పర్యవేక్షించేందుకు టాస్క్‌ఫోర్స్ పనిచేస్తోందని.. ఇప్పటికే చాలా ప్రైవేట్ ఆస్పత్రులను పరిశీలించిందని తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీపై శనివారం సమావేశం నిర్వహించనున్నామని చెప్పారు. డెంగీని గుర్తించేప్పుడు టెస్టు రిపోర్టులు సరిగా ఉంటున్నాయా లేదా పరిశీలిస్తామని తెలిపారు. రెండు, మూడు రోజుల్లో చర్యలు ప్రారంభం అవుతాయన్నారు. ఆస్పత్రులు డెంగీ పరీక్షలు చేసిన, నిర్ధారణ అయిన వివరాలను ప్రభుత్వానికి ఇవ్వాలన్నారు.

కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదు చేయండి: ప్రైవేట్ ఆస్పత్రులు అవసరం ఉన్నా, లేకున్నా టెస్టులు చేస్తున్నాయని మంత్రి మండిపడ్డారు. ఈ పరిస్థితిని నియంత్రించాలంటే క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్‌ను కఠినంగా అమలు చేయాల్సి ఉందన్నారు. ప్రజారోగ్య సంచాలకుల కార్యాలయంలో కంట్రోల్ రూం నడుస్తోందని.. విషజ్వరాల బాధితులు తమ సమస్యలపై దానికి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ''సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు, క్షేత్రస్థాయిలో పరిస్థితిని పర్యవేక్షించేందుకు ఉన్నతాధికారులంతా ఆస్పత్రుల పర్యటనకు వెళ్లాలని ఆదేశించాం. జిల్లాలో కలెక్టర్, వైద్యాధికారులు, మున్సిపల్, పంచాయతీరాజ్‌శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి.. పరిస్థితులను చక్కదిద్దాలని ఆదేశించాం. మందుల కొరత ఉండకూడదని చెప్పాం..'' అని మంత్రి వెల్లడించారు.

కోఠి ఆస్పత్రిలోని వెక్టార్ బార్న్ డిసీజెస్ విభాగం కంట్రోల్ రూం నంబర్ 94404 90716

రాష్ట్రాన్ని మరో బుల్డోజర్ రాజ్ కానివ్వొద్దు

కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేకు కేటీఆర్ విజ్ఞప్తి

- తెలంగాణలో అమానవీయ ఘటనలపై మీ స్పందన ఏమిటంటూ 'ఎక్స్'లో ప్రశ్నలు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణను మరో బుల్డోజర్ రాజ్ చేయొద్దంటూ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించాలని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయాన్ని, చట్టాన్ని ఉల్లంఘిస్తూ పేదలకు గూడు లేకుండా చేసే ప్రయత్నాన్ని మీరు సమర్థిస్తున్నారా అని ప్రశ్నించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో కేటీఆర్ పలు ప్రశ్నలు సంధించారు. 'ఒకరి ఇంటిని కూల్చివేసి వారి కుటుంబాన్ని నిరాశ్రయులుగా మార్చటం అమానవీయం, అన్యాయం అని గతంలో మీరే అన్నారు. ఇప్పుడు తెలంగాణలో పేదల ఇళ్లను అదే రీతిలో కూల్చేస్తూ వారిని నిరాశ్రయులు చేస్తున్నారు. దీనికి మీ సమాధానం ఏమిటి?' అని ప్రశ్నించారు.

పేదల జీవితాలను ఆగం చేస్తోన్న కాంగ్రెస్

మహబూబ్‌నగర్ పట్టణంలోని 75 మంది పేదల ఇళ్లను తెల్లవారుజామున 3 గంటలకు ఎలాంటి నోటీసులు లేకుండా కూల్చివేసిన సంఘటనను ఖర్గే దృష్టికి తీసుకెళ్లారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చివేసిన 75 ఇళ్లలో 25 నివాసాలు వికలాంగులకు చెందినవేనని పేర్కొన్నారు. చట్టపరమైన ప్రక్రియను అనుసరించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించటమనేది చట్టపరంగా సరైన విధానం కాదని కేటీఆర్ పేర్కొన్నారు. సుమారు 40 ఏళ్ల క్రితం నుంచే ఇళ్లు కట్టుకొని నివాసం ఉన్న పేదల ఇళ్లను ఎలాంటి నోటీసులు లేకుండా కూల్చేయడం ఎంతటి అమానవీయమో ఖర్గే చెప్పాలన్నారు. చట్టాన్ని ఉల్లంఘిస్తూ పేదల జీవితాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఆగం చేస్తోందని కేటీఆర్ విమర్శించారు.

బీఆర్ఎస్‌పై కక్షతో రూ.10వేల కోట్ల ఎస్‌డీఎఫ్ పనులు రద్దు

మాజీమంత్రి హరీశ్‌రావు ఆరోపణ



సాక్షి, హైదరాబాద్: ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీపై ఉన్న కక్షతో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే కుట్రలకు పాల్పడుతోందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.10వేల కోట్లు విలువ చేసే 34,511 ఎస్‌డీఎఫ్ పనులను రద్దు చేయడం సీఎం రేవంత్ రెడ్డి దివాళాకోరు రాజకీయాలకు పరాకాష్టగా పేర్కొన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేసీఆర్ ప్రభుత్వం గత ఆర్థిక ఏడాదిలో మంజూరు చేసిన ఎస్‌డీఎఫ్ నిధులను కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేసిందనీ, ఈ నిధుల నుంచే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలకు రూ.10 కోట్ల చొప్పున మంజూరు చేసిందని ఆయన ఆరోపించారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలకు ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం దుర్మార్గమన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని గత ప్రభుత్వం మంజూరు చేసిన పనులను రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేయడం దారుణమని విమర్శించారు. దాదాపు పూర్తయిన పనులకు కూడా బిల్లుల చెల్లింపులు నిలిపివేశారనీ, దీంతో పంచాయతీలు, మున్సిపాలిటీల్లో అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయి మౌలిక సదుపాయాల కల్పనకు ఆటంకం కలుగుతోందని హరీశ్ ఆందోళన వ్యక్తం చేశారు. అభివృద్ధి నిలిచిపోవడంతో పాటు అనేక మంది ఉపాధిని కూడా కోల్పోయారని ఆరోపించారు. గత ప్రభుత్వ ఆనవాళ్లను లేకుండా చేయాలని కంకణం కట్టుకున్న రేవంత్ అనాలోచిత చర్యల ఫలితంగా సీఎం తన ఉనికినే ప్రజల్లో లేకుండా చేసుకుంటున్నారని హరీశ్ వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లది హైడ్రామా

గ్యారంటీలు, రుణమాఫీని పక్కదారి పట్టించేందుకే..

- ఇందులో భాగంగానే బీజేపీలో బీఆర్ఎస్ విలీనమవుతుందని దుష్ప్రచారం
- బీజేపీ సభ్యత్వ నమోదు వర్క్‌షాప్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్



మాట్లాడుతున్న బండి సంజయ్

లింగోజిగూడ: ఆరు గ్యారంటీలు, రైతు రుణమాఫీ అంశాన్ని పక్కదారి పట్టించేందుకే కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్‌తో కలిసి డ్రామాకు తెరలేపిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. ఇందులో భాగంగానే బీజేపీలో బీఆర్ఎస్ విలీనమవుతుందని దుష్ప్రచారం చేస్తోందని దుయ్యబట్టారు. సెప్టెంబర్ 3 నుంచి చేపట్టనున్న బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా రంగారెడ్డి జిల్లా అర్బన్ సభ్యత్వ శిక్షణా తరగతులను శుక్రవారం నాగోల్‌లోని ఓ కన్వెన్షన్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ సుప్రీంకోర్టులో కవిత తరఫున వాదించి ఆమెకు బెయిల్ ఇప్పించింది కాంగ్రెస్ సీనియర్ నేత అభిషేక్ మను సింఘ్వీయేనని అందరికీ తెలుసన్నారు. అందుకే తెలంగాణ నుంచి ఆయన రాజ్యసభ ఎంపీ పదవికి పోటీ చేస్తే 38 ఎమ్మెల్యేలు ఉన్న బీఆర్ఎస్ కనీసం నామినేషన్ కూడా వేయ లేదని పేర్కొన్నారు. త్వరలో కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనం ఖాయమన్నారు.

2019లో నార్త్ బ్లాక్‌లోకి వెళ్లలేకపోయా.. ఇప్పుడు అక్కడే పనిచేస్తున్నా

బీజేపీలో కష్టపడే ప్రతి కార్యకర్తకు ప్రాధాన్యం, గుర్తింపు ఉంటుందని బండి సంజయ్ అన్నారు. 2019లో నార్త్ బ్లాక్‌లోకి వెళ్లలేక బయటి నుంచే సెల్ఫీ తీసుకున్న తాను... ఇప్పుడు అదే నార్త్ బ్లాక్‌లో కేంద్ర మంత్రిగా పనిచేస్తున్నానని చెప్పారు. 2028 రాష్ట్రంలో బీజేపీ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలని సూచించారు. కార్యక్రమంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్, రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, ప్రేమేందర్‌రెడ్డి, కొత్త రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

నేడు రాజకీయ పార్టీలతో ఎస్ఈసీ భేటీ

'స్థానిక'ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై చర్చ

సెప్టెంబర్ ఆఖరులోగా ఓటర్ల జాబితా పూర్తికి చర్యలు

అక్టోబర్ చివర లేదా నవంబర్ మొదట్లో గ్రామ పంచాయతీల ఎన్నికలు!



సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) వేగం పెంచింది. రాష్ట్రంలోని 12,769 గ్రామపంచాయతీల పాలక మండళ్ల పదవీకాలం ముగిసి ఏడునెలలు దాటుతున్న నేపథ్యంలో ముందుగా పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధం చేసింది. ఇందులో భాగంగా శనివారం అన్ని రాజకీయ పార్టీలతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారధి సమావేశం నిర్వహించనున్నారు. ఎన్నికల నిర్వహణ తీరు, ఓటర్ల జాబితాల ఖరారు, పోలింగ్ స్టేషన్ల ఏర్పాట్లు.. తదితరాలపై పార్టీల నేతలకు స్పష్టతనివ్వనున్నారు. ఓటర్ల జాబితాల ఖరారు, పోలింగ్ స్టేషన్లు, ఇతర ఏర్పాట్లను సెప్టెంబర్ ఆఖరులోగా పూర్తిచేయాలని చూస్తున్నారు. ఓటర్ల జాబితాల ప్రచురణ ముగిశాక రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ల వివరాలు అందిన వెంటనే అదేరోజు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు ఎస్ ఈసీ సన్నాహాలు చేస్తోంది. స్థానిక ఎన్నికల్లోనూ అన్నీ కలుపుకుని 50% రిజర్వేషన్లు మించరాదని సుప్రీంకోర్టు ఆదేశాలున్న విషయం తెలిసిందే. అయితే అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తామని మేనిఫెస్టోలో హామీనిచ్చింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితుల్లో బీసీలకు 42% రిజర్వేషన్ల అమలు ఎలా సాధ్యమన్న విషయం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వపరంగా చేస్తున్న ఏర్పాట్లను బట్టి చూస్తే అక్టోబర్ చివర్లో లేదా నవంబర్ మొదట్లో గ్రామపంచాయతీ, కొన్నిరోజుల వ్యవధి తర్వాత మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే.. సెప్టెంబర్ 8న ఎస్ఈసీ పార్థ సారధి మూడేళ్ల పదవీకాలం ముగియనుంది. అయితే ఇప్పటికే ఆయన ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ప్రక్రియను మొదలుపెట్టినందున, ఆయన ఆధ్వర్యంలోనే ఎన్నికలు పూర్తి చేసేందుకు ప్రభుత్వం మొగ్గు చూపవచ్చని సమాచారం.

రేవంత్, భట్టి, ఉత్తమ్ భేటీ

నామినేటెడ్ పోస్టుల భర్తీపై చర్చ?

సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం రాత్రి భేటీ అయ్యారు. జూబ్లీహిల్స్ లోని సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో నామినేటెడ్ పోస్టుల భర్తీ విషయం, రాష్ట్ర రాజకీయ పరిణా మాలపై ముగ్గురు కీలక నేతలు చర్చించినట్లు తెలుస్తోంది. నామినేటెడ్ పోస్టుల ఎంపికపై ఏకాభిప్రాయం రాగానే హై కమాండ్ ఆమోదం తీసుకుని త్వరలోనే అధికారికంగా జాబితా ప్రకటించాలని నిర్ణయించినట్లు సమాచారం.

అధికారులకు పూర్తి స్వేచ్ఛ

- మంచి నిర్ణయాలు తీసుకోండి.. ఫలితాలు సాధించండి
- ప్రజలపై భారం పడకుండా ప్రత్యామ్నాయ
- ఆర్థిక వనరులపై దృష్టి సారించండి: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



సాక్షి, హైదరాబాద్: గత ప్రభుత్వం తరహాలో కాకుండా ప్రజా ప్రభుత్వంలో అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని, అధికారులు స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకు ని ఫలితాలు రాబట్టాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. ప్రభుత్వ ఖజానాకు రాబడులు పెంచేందుకుగాను ఆయా శాఖల అధికారులు స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ప్రజలపై ఎలాంటి భారం పడకుండా ప్రత్యామ్నాయ ఆర్థిక వనరులపై దృష్టి సారించాలని కోరారు. శుక్రవారం డాక్టర్. బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో రాష్ట్ర ఖజానాకు ఆదాయం పెంపు అంశంపై ఆయన ఆదాయార్జన శాఖల ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడు తూ రాష్ట్ర ప్రధాన ఆర్థిక వనరుల్లో జీఎస్టీ ఒకటని, ఈ జీఎస్టీ లీకేజీలను అరికట్టి మరిత ఆదాయానికి కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.

ల్యాండ్ పూలింగ్‌లో గత సర్కారు మాదిరి తప్పులు చేయొద్దు

ల్యాండ్ పూలింగ్‌లో గత ప్రభుత్వం చేసిన తప్పులు పునరావృతం కాకుండా చూసుకోవాలని, సీఎం రేవంత్ రెడ్డి ప్రతినెలా ఆదాయం పెంపుపై నిర్వహించే సమావేశానికి నూతన ఆలోచనలతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని రావాలని భట్టి విక్రమార్క సూచించారు. సమావేశంలో ఆదాయార్జన శాఖల ఉన్నతాధికారు లు కె. రామకృష్ణారావు, దానకిశోర్, ఎస్ఎంఏ. రిజ్వీ, సందీప్‌కుమార్ సుల్తానియా, కృష్ణభాస్కర్, బుద్ధ ప్రకాశ్, గౌతం, సురేంద్రమోహన్, సునీల్, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

నాడు సుభాషితాలు.. నేడు విమర్శలా?

హరీశ్‌రావుపై మండిపడిన మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: 'చెరువులే మన భాగ్యవనరులు' అని పత్రికల్లో మంత్రిగా వ్యాసాలు రాసిన హరీశ్‌రావు... హైదరాబాద్‌లో చెరువుల పరిరక్షణకు ఆవిర్భవించిన హైడ్రాను ఆడిపోసుకోవడం విడ్డూరంగా ఉంది. నాడు చెరువుల పరిరక్షణపై సుభాషితాలు పలికి..ఇప్పుడు విమర్శలు చేయడం మీకే చెల్లింది' అని మంత్రి సీతక్క మండిపడ్డారు. 'గంగాళంలా ఉండే చెరువులు తాంబాళంలా మారినయి...వాటిని తిరిగి గంగాళంగా మార్చుతామన్న నాటి మీ మాటలను గుర్తు చేసుకోవాలి' అని హితవు పలికారు. చెరువుల పరిరక్షణపై రెండు నాల్కల ధోరణిని విడనాడాలని బీఆర్ఎస్ నేతలు, హరీశ్‌రావుకు ఓ ప్రకటనలో సీతక్క సూచించారు. 'మీ హయాంలో రాజధానిలో వందలాది చెరువులు కనుమరుగయ్యాయి. వర్షాకాలంలో వరద నీరు పోయే దారి లేక ఏటా పదుల సంఖ్యలో ప్రజలను బలిగొన్నా మీరు పట్టించుకోలేదు. చెరువోద్ధారకులుగా చిత్రీకరించుకునే మీ హయాంలో హైదరాబాద్ చెరువులు సర్వనాశనం అయ్యాయి. మిషన్‌కాకతీయ పేరుతో హడావుడి చేసినా హైదరాబాద్‌లో ఒక్క చెరువునూ కాపాడలేదు. వాటి సర్వేను పూర్తి చేయకుండా, వాటి హద్దులు గుర్తించకుండా కుట్రపూరితంగా వ్యవహరించిన మీ తీరును కాగ్ 2020లోనే తప్పుబట్టింది' అని ధ్వజమెత్తారు.

తెలంగాణలో రివర్స్ పాలిటిక్స్

ప్రతిపక్ష నేతను అసెంబ్లీకి రావాలని అభ్యర్థించాల్సి వస్తోంది: జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో రివర్స్ పాలిటిక్స్ నడుస్తున్నాయని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. ఏ రాష్ట్రంలోనైనా ప్రజా సమస్యలపై చర్చ కోసం అసెంబ్లీ సమా వేశాలు నిర్వహించాలని ప్రతిపక్ష పార్టీలు అధికార పక్షాన్ని డిమాండ్ చేస్తాయని, కానీ మన రాష్ట్రంలో మాత్రం అసెంబ్లీ సమావేశాలు పెట్టి.. ప్రతిపక్ష నాయ కుడిని హాజరు కావాలని అభ్యర్థించాల్సి వస్తోందని ఎద్దేవా చేశారు. శుక్రవారం ఆయన గాంధీభవన్‌లో రాష్ట్ర మత్స్య సహకార సొసైటీల కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌తో కలసి విలేకరులతో మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ ఇప్పుడు ప్రజాక్షేత్రంలోకి వస్తానని అంటున్నారని, ఇంట్లో కూర్చుని ప్రకటనలు ఇవ్వడానికే పరిమితమైన ఆయన ఎప్పుడైనా ప్రజల్లోకి వచ్చారా అని ప్రశ్నించారు.

రోజుకు రూ.వెయ్యి జరిమానా

- లీగల్ సర్వీసెస్ అథారిటీకి చెల్లించాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- 'ఐఏఎంసీ'పిల్‌పై కౌంటర్ వేయనందుకు చర్యలు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ అండ్ మీడియేషన్ సెంటర్ (ఐఏఎంసీ) ట్రస్టుకు రూ.300 కోట్ల విలువైన 3.7 ఎకరాల ప్రభుత్వ భూమిని ఉచితంగా కేటాయించడంపై కౌంటర్ దాఖలు చేయాలని గత నవంబర్‌లో ఆదేశించినా వేయకపోవడంతో హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వ తీరును తప్పుబడుతూ, కౌంటర్ దాఖలు చేసే వరకు రోజుకు రూ.వెయ్యి చొప్పున తెలంగాణ లీగల్ సర్వీసెస్ అథారిటీకి జరిమానాగా చెల్లించాలని ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం రాయదుర్గ్ సర్వే నం.83/1లో 3.70 ఎకరాలను ఐఏఎంసీకి కేటాయిస్తూ 2021, డిసెంబర్ 26న రాష్ట్ర ప్రభుత్వం జీవో 126 జారీ చేసింది. అలాగే నిర్వహణ ఖర్చుల కింద రూ.3 కోట్ల సాయం చేస్తూ మరో జీవో ఇచ్చింది. ఈ జీవోలను సవాల్ చేస్తూ న్యాయవాదులు వెంకట్రామిరెడ్డి, కోటి రఘునాథరావు 2023లో హైకోర్టులో వేర్వేరు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. గత నవంబర్‌లో విచారణ సందర్భంగా పిటిషనర్ వాదనలు వినిపిస్తూ.. ఉచితంగా భూమి, ఆర్థిక సాయంపై ప్రభుత్వ జీవోలు చట్టవిరుద్ధమన్నారు. ఈ జీవోలను రద్దు చేసి, ఇప్పటికే చెల్లించిన సొమ్మును తిరిగి వసూలు చేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. వాదనలను విన్న ధర్మాసనం.. ప్రతివాదులైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శి, రెవెన్యూశాఖ కార్యదర్శి, ఐఏఎంసీ సీఈవోలకు నోటీసులు జారీచేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని గత నవంబర్‌లో ఆదేశించింది. ఈ పిల్‌లపై జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ కె.సుజన ధర్మాసనం శుక్రవారం మరోసారి విచారణ చేపట్టింది. ఇప్పటివరకు కౌంటర్లు దాఖలు చేయకపోవడంపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనికి బాధ్యత వహిస్తూ కౌంటర్ వేసే వరకు టీఎస్ఎల్ఎస్ఏకి రోజుకు రూ.వెయ్యి చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేసింది.

'ఫార్మా'పై సర్కార్ అప్పీల్

- ఫార్మాసిటీ భూసేకరణ పరిహారం ప్రకటనను గతేడాది నిలిపేస్తూ హైకోర్టు సింగిల్ జడ్జి తీర్పు
- దీన్ని సవాల్ చేస్తూ తాజాగా పిటిషన్ వేసిన ప్రభుత్వం
- కౌంటర్ దాఖలుకు సమయం కోరిన ప్రతివాదులు
- రెండు వారాలకు వాయిదా వేసిన సీజే ధర్మాసనం

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని ఫార్మాసిటీ భూసేకరణ ప్రక్రియను పరిహారం ప్రకటన నాటి నుంచి నిలిపివేస్తూ గతేడాది హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అప్పీల్ దాఖలు చేసింది. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లి, కుర్మిద్ద తదితర గ్రామాల్లో ఫార్మాసిటీ ఏర్పాటు కోసం 1,702 ఎకరాల భూసేకరణలో ప్రభుత్వం అన్ని నిబంధనలను ఉల్లంఘిస్తోందని.. దాన్ని అడ్డుకోవాలంటూ 259.02 ఎకరాలకు చెందిన దాదాపు 180 మంది రైతులు హైకోర్టులో 2020లో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి.. భూసేకరణకు జారీ చేసిన నోటిఫికేషన్లు, అవార్డులు సహా అన్ని ప్రక్రియలను కొట్టేస్తూ తీర్పు ఇచ్చారు. తాజా మార్కెట్ ధరల ప్రకారం ఫార్మాసిటీ భూసేకరణ ప్రక్రియను మళ్లీ ప్రారంభించాలని స్పష్టం చేశారు. భూసేకరణ చట్టం–2013లోని సెక్షన్ 15 (2), 16, 18 తదితరాల్లో పేర్కొన్న నిబంధనలను అధికారులు పాటించలేదని తేల్చిచెప్పారు. ప్రాథమిక నోటిఫికేషన్ గడువు ముగిసిపోవడంతో చెల్లకుండా పోతుందని.. ప్రజాప్రయోజనాల రీత్యా పరిహారం ప్రకటన నుంచి రద్దు చేస్తూ ఉత్తర్వులిచ్చారు. గతేడాది ఆగస్టులో ఇచ్చిన ఈ తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ద్విసభ్య ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేసింది. ఈ అప్పీల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం శుక్రవారం విచారణ ప్రారంభించింది. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. చట్ట ప్రకారమే అవార్డు జారీ చేసినా సింగిల్ జడ్జి దాన్ని పరిగణనలోకి తీసుకోలేదన్నారు. పెద్ద మొత్తంలో బహుళ ప్రయోజనం కోసం భూసేకరణ చేపట్టినప్పుడు అతికొద్ది మంది నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం లేదని వాదించారు. ఈ మేరకు సుప్రీంకోర్టు పలు తీర్పుల్లో పేర్కొందని నివేదించారు. అలాగే అప్పీల్‌లో జాప్యానికి మన్నింపు కోరుతూ మధ్యంతర పిటిషన్ వేశారు. అయితే ఏడాది తరువాత అప్పీల్ వేయడంపై తమకు అభ్యంతరాలు ఉన్నాయని.. కౌంటర్ వేయడానికి అవకాశం ఇవ్వాలని ప్రతివాదులు కోరడంతో అంగీకరించిన ధర్మాసనం.. విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

ఎస్సీ విద్యార్థుల ఉపకారానికి కేంద్రం నిధులు

సాక్షి, హైదరాబాద్: ఎస్సీ విద్యార్థుల ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలకు భారీ ఊరట లభించింది. ఈ రెండు పథకాల అమలులో కేంద్ర ప్రభుత్వం 60శాతం వాటా భరించేందుకు మార్గం సుగమమైంది. ఇదివరకు కూడా కేంద్రం ఈ పథకాలకు నిర్దిష్ట కోటా నిధులు ఇస్తుండగా... నాలుగేళ్ల క్రితం విధించిన నిబంధనలతో కేంద్రం నుంచి నిధులు నిలిచిపోయాయి. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం నిబంధనల్లో సవరణలు చేయనున్నట్లు స్పష్టం చేయడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి అందాల్సిన సాయం 2024–25 విద్యా సంవత్సరం నుంచి తిరిగి అందనుంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో ఈ ఆర్థిక సంవత్సరంలో కేంద్రం నుంచి దాదాపు రూ.300 కోట్లు రాష్ట్ర కోటాలో జమకానున్నాయి.

బీసీ గురుకుల అగ్రికల్చర్ డిగ్రీ కాలేజీలో
ప్రవేశాల గడువు పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ పరిధిలోని గురుకుల వ్యవసాయ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తు గడువును సెప్టెంబర్ 15 వరకు పొడిగించినట్లు సొసైటీ కార్యదర్శి బి.సైదులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వనపర్తి, కరీంనగర్‌లో రెండు వ్యవసాయ డిగ్రీ కళాశాలలున్నాయని, టీఈఏపీసెట్- 2024లో వచ్చిన ర్యాంకు ఆధారంగా ప్రవేశాలు చేపడతామన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు సొసైటీ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ పద్ధతిలో నిర్దేశించిన గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గురుకుల ఫైన్ ఆర్ట్స్ కాలేజీలో ప్రవేశాల దరఖాస్తు గడువు శనివారం (ఆగస్టు31)తో ముగుస్తుందని, ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9032644463, 9063242329 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

సింగరేణిలో 2,364 ఉద్యోగాల క్రమబద్ధీకరణ

- బదిలీ వర్కర్లను జనరల్ మజ్దూర్లుగా గుర్తించేందుకు ఆమోదం
- త్వరలోనే ఉత్తర్వులు.. 234 మంది మహిళలకు శాశ్వత ఉద్యోగాలు

సాక్షి, హైదరాబాద్/ గోదావరిఖని: సింగరేణి కాలరీస్‌లో పనిచేస్తున్న 2,364 మంది బదిలీ వర్కర్లను జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరించేందుకు ఆమోదం లభించింది. సంస్థలో చేరిన తర్వాత ఒక కేలండర్ సంవత్సరంలో భూగర్భ గనుల్లో 190 రోజులు, ఉపరితల గనులు, ఇతర విభాగాల్లో 240 రోజులు విధులు నిర్వహించిన వారిని రెగ్యులరైజ్ చేస్తున్నట్టు సింగరేణి సీఎండీ ఎన్.బలరాం వెల్లడించారు. ఈ మేరకు త్వరలోనే ఉత్తర్వులు జారీ చేయాలని సంబంధిత డైరెక్టర్‌ను ఆదేశించారు. ఈ ఏడాది సెప్టెంబర్ 1 నుంచి వీరిని జనరల్ మజ్దూర్లుగా గుర్తించబోతున్నట్టు శుక్రవారం ఒక ప్రకటనలో బలరాం తెలిపారు. సింగరేణిలో సేవ చేసే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరించినందున మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, డ్యూటీలకు గైర్హాజరు కావొద్దని, సమయ పాలన పాటిస్తూ విధులు నిర్వర్తించాలని ఆయన కోరారు.

వీరు ఎవరంటే..!

సింగరేణిలో కారుణ్య, డిపెండెంట్ ఉద్యోగ నియామక ప్రక్రియలో భాగంగా సంస్థలో చేరిన వారిని తొలుత బదిలీ వర్కర్లుగా నియమిస్తారు. వీరు ఏడాది కాలం పనిచేసిన తర్వాత కనీస మస్టర్లు పూర్తి చేస్తే జనరల్ మజ్దూర్లుగా గుర్తిస్తారు. వీరిలో ఉన్నత విద్యార్హతలు కలిగిన వారు ఉంటే పదోన్నతులు పొందడానికి అర్హులవుతారు. క్వార్టర్ల కేటాయింపులో కూడా ఈ జనరల్ మజ్దూర్లకు ప్రాధాన్యం ఉంటుంది. ఈసారి క్రమబద్ధీకరణ ద్వారా 234 మంది మహిళలు శాశ్వత ఉద్యోగాలు పొందనున్నారు. ఏరియాల వారీగా పరిశీలిస్తే కార్పొరేట్ ఏరియా (25), కొత్తగూడెం (17), ఇల్లందు (9), మణుగూరు (21), భూపాలపల్లి (476), రామగుండం-1 (563), రామగుండం-2 (50), రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్టు (240), శ్రీరాంపూర్ (655), మందమర్రి (299), బెల్లంపల్లి (9) మంది రెగ్యులరైజ్ కానున్నారు.

2, 3 తేదీల్లో గ్రూప్స్‌పై అవగాహన సదస్సు

సాక్షి, హైదరాబాద్: టీజీపీఎస్సీ నిర్వహిస్తున్న గ్రూపు-1, గ్రూప్-2 పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థుల కోసం తెలంగాణ ఉద్యమం, చరిత్ర, సంస్కృతి, సాహిత్యంపై సెప్టెంబర్ 2, 3 తేదీల్లో ఉచిత అవగాహన తరగతులు నిర్వహించనున్నట్టు కృష్ణప్రదీప్ 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమీ చైర్మన్ కృష్ణప్రదీప్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ గంటా చక్రపాణి, ప్రొఫెసర్ అడపా సత్యనారాయణ, ప్రొఫెసర్ సి.గణేశ్, డాక్టర్ ద్యానవల్లి సత్యనారాయణ, డాక్టర్ మామిడి హరికృష్ణ వక్తలుగా పాల్గొంటారని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు 9133517733 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

14 మంది ఉత్తమ అధ్యాపకుల ఎంపిక

సాక్షి, హైదరాబాద్: గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న 14 మంది అధ్యాపకులను ఉత్తమ అధ్యాపకులుగా ఇంటర్‌మీడియట్ బోర్డ్ ఎంపిక చేసింది. వీరిని సెప్టెంబర్ 5వ తేదీన సత్కరించనున్నారు. వీరిలో ప్రిన్సిపాళ్లు జి.వెంకయ్య (వనపర్తి), మీటకోటి సింహాచలం (ఏన్కూర్), సయ్యద్ అబ్దుల్ హమీద్ (రంగారెడ్డి), పి.సంపత్‌కుమార్ (నర్సంపేట) ఉన్నారు. జూనియర్ లెక్చరర్లుగా పనిచేస్తున్న డాక్టర్ ఎన్.ప్రవీణ్ రాజు (మలక్‌పేట), డాక్టర్ ఎల్.కొమురారెడ్డి (నర్సంపేట), డాక్టర్ బాబూరావు (సంగారెడ్డి), డాక్టర్ వి.శేఖరయ్య (సరూర్‌నగర్), డాక్టర్ ఆర్‌యూ శిల్ప (చౌటుప్పల్), ఎండీ ఖుర్షీద్ (భద్రాద్రి కొత్తగూడెం) ఉన్నారు. ఉత్తమ అవార్డులు పొందిన వారిని టీజీజేఎల్ఏ-475 సంఘం నేత సురేశ్ కొప్పిశెట్టి అభినందించారు.

ఇంజనీరింగ్ సీట్లు ఇలా పెంచేస్తే ఎలా?

- రాష్ట్రాన్ని సంప్రదించాలి కదా?
- ఏఐసీటీఈ, యూజీసీ చైర్మన్లతో ప్రొఫెసర్ లింబాద్రి, శ్రీరాం వెంకటేశ్ భేటీ

సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్లు పెంచడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ)కి రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. సీట్లు పెంచడం, బ్రాంచిల మార్పిడి చేపట్టే సమయంలో రాష్ట్రంతో సంప్రదించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తం చేసింది. రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్ ఢిల్లీలో ఏఐసీటీఈ చైర్మన్ ప్రొఫెసర్ సీతారాం, యూజీసీ చైర్మన్ ప్రొఫెసర్ ఎం.జగదీశ్‌కుమార్‌ను కలిశారు. రాష్ట్రంలో ఉన్నత విద్యలో తీసుకొస్తున్న మార్పులు, జాతీయ స్థాయి సహకారంపై కొన్ని ప్రతిపాదనలు చేశారు. అయితే ప్రధానంగా ఇటీవల ఇంజనీరింగ్ సీట్ల పెంపు వ్యవహారాన్ని ఏఐసీటీఈ దృష్టికి తీసుకెళ్ళినట్టు తెలిసింది. ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు సివిల్, మెకానికల్, ఈఈఈ వంటి కోర్సులను రద్దు చేసుకున్నాయి. వీటి స్థానంలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఇతర కంప్యూటర్ కోర్సులు ఇవ్వాలని కోరాయి. దీనికి ఏఐసీటీఈ అనుమతించింది. కానీ రాష్ట్ర ప్రభుత్వం సమ్మతించలేదు. దీంతో ప్రైవేటు కాలేజీలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. ఈ నేపథ్యంలోనే కేంద్ర, రాష్ట్ర విద్యా సంస్థల సమన్వయంపై తన అభిప్రాయాన్ని ఏఐసీటీఈ, యూజీసీకి వివరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో ఏటా లక్ష మంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు పట్టాలతో బయటకొస్తున్నారని ఏఐసీటీఈకి ఉన్నత విద్యా మండలి తెలిపింది. ఇందులో నైపుణ్యం ఉన్నవాళ్ళు 15 శాతానికి మించి ఉండటం లేదని, దీనివల్ల ఉపాధి అవకాశాలు లభించడం లేదని పేర్కొంది.

ఒకసారి రాష్ట్రానికి రండి: ఉన్నత విద్యామండలి డిగ్రీ, పీజీ కోర్సుల్లో గుణాత్మక మార్పులు తెచ్చిందని యూజీసీ చైర్మన్‌కు లింబాద్రి, వెంకటేశ్ తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన కొత్త కోర్సులను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని యూజీసీ సహకరించాలని కోరారు. ఒకసారి ఉన్నత విద్యా సంస్థలతో సమావేశమయ్యేందుకు రాష్ట్రానికి రావాలని లింబాద్రి కోరారు. ఇలావుండగా రాష్ట్రంలో పెండింగ్‌లోని మూడు లా కాలేజీలకు అనుమతులు లభించినట్టు ఆయన తెలిపారు.

> పరస్పరం స్నేహితుల్లా కలిసిమెలిసివుండే ఆ రెండు పక్షులూ (జీవాత్మ, పరమాత్మ) ఒకే చెట్టు (ఈ శరీరం)ను ఆశ్రయించి ఉంటాయి. ఒకటి ఆ వృక్ష ఫలాన్ని (కర్మరూప ఫలాన్ని) రుచి చూస్తుంటుంది. రెండవది ఏమీ తినకుండా అలా చూస్తూ ఉంటుంది.
> – ముండకోపనిషత్తు (హైందవ ధర్మం)

సాక్షి

శనివారం, 31 ఆగస్టు 2024

అంతరిక్షంలో పైపైకి...

అంతరిక్ష రంగంలో మన శాస్త్రవేత్తలు సాధిస్తున్న విజయపరంపర వాణిజ్యపరంగా కాసుల వర్షం కురిపించటం కొత్తేం కాదు. అంతరిక్షంలో మనకన్నా చాలాముందే అనేక విజయాలు నమోదు చేసుకున్న దేశాలకు సైతం ఈ విషయంలో మన ఇస్రో సంస్థ దీటుగా నిలిచిన వైనం కూడా పాత కథే. మరోసారి దీన్ని అంతర్జాతీయ అంతరిక్ష సలహా సంస్థ నోవాస్పేస్ నివేదిక ధ్రువపరిచింది. గత పదేళ్లలో అంతరిక్ష రంగంలో భారత్‌కొచ్చిన ఆదాయం 6,300 కోట్ల డాలర్లని నివేదిక తెలిపింది. అంటే మన జీడీపీ వృద్ధిలో ఇస్రో పాత్ర ఎనలేనిదన్న మాట. ఈ రంగం నానాటికీ విస్తరిస్తోంది. అవసరాలు పెరుగుతున్న కారణంగా అవకాశాలు కూడా ఊహకందని రీతిలో విస్తరిస్తున్నాయి. మన అంతరిక్ష రంగంలో ప్రత్యక్షంగా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో 96,000 మంది సిబ్బంది పనిచేస్తుండగా... మొత్తంగా లక్షలాదిమంది ఉపాధి పొందుతున్నారు. రానున్న కాలంలో ప్రైవేటు రంగ పెట్టుబడులు మరింతగా పెరిగే అవకాశాలున్నాయన్న అంచనాలను గమనిస్తే ముమ్ముందు ఉద్యోగావకాశాలు ఏ స్థాయిలో ఉండబోతున్నాయో ఊహించవచ్చు. అంతరిక్ష రంగంలో ప్రైవేటు పెట్టుబడులను పెంచాలని కేంద్ర ప్రభుత్వం నిరుడు నిర్ణయించింది. పర్యవసానంగా 2020లో 54 స్టార్టప్‌లుండగా ఇప్పుడవి 200కు చేరుకున్నాయి. మన దేశం మాత్రమే కాదు... లాభదాయకమని తేలడంతో పలు దేశాలు సైతం అంతరిక్ష రంగ పెట్టుబడులపై శ్రద్ధ పెడుతున్నాయి. ఆ రంగాన్ని విస్తరించటానికి కృషి చేస్తున్నాయి. వచ్చే పదేళ్లలో ప్రపంచ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ 18 లక్షల కోట్ల డాలర్లకు చేరవచ్చని ఆమధ్య వరల్డ్ ఎకనామిక్ ఫోరం లెక్కేసింది. పెట్టుబడుల రీత్యా మన అంతరిక్ష రంగం ప్రస్తుతం ఎనిమిదో స్థానంలో ఉంది.

అంతిమంగా అతి పెద్ద విజయం సాధించటానికి ముందు తప్పులు దొర్లటం అతి సహజమనీ, ఏ విజయానికైనా ఇలాంటి చరిత్రే ఉంటుందనీ ప్రముఖ అణు శాస్త్రవేత్త నీల్స్ బోర్ ఎప్పుడో చెప్పారు. మన అంతరిక్ష రంగం కూడా ఎన్నో ఆటుపోట్లు చవిచూసింది. 1975లో ఆర్యభట్ట ఉపగ్రహ ప్రయోగం తర్వాత మన అంతరిక్ష కార్యక్రమం పట్టాలెక్కడానికి పదేళ్లు పట్టిందంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఏ సమస్య అయినా అత్యంత క్లిష్టమైనదని చెప్పడానికి రాకెట్ సైన్స్‌తో పోలుస్తుంటారు. ఒక రాకెట్ అంతరిక్షంలోకి దూసుకుపోవాలన్నా, నిర్దిష్ట కక్ష్యలో ఉపగ్రహాన్ని ఉంచాలన్నా ఎన్నో సూక్ష్మ అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. సాంకేతికంగా రాకెట్‌లోని వ్యవస్థలూ, ఉప వ్యవస్థలూ ఒకదానితో ఒకటి సమన్వయం చేసుకోవాలి. చిన్న లోపమైనా చోటుచేసుకోకూడదు. ఒక ఉపగ్రహాన్ని పంపటానికే ఇంత సంక్లిష్ట ప్రక్రియ అవసరం కాగా, ఒకేసారి బహుళ ఉపగ్రహాలను ప్రయోగించటం అంటే మాటలు కాదు. ఇస్రో ఇలాంటి విన్యాసాలను అవలీలగా పూర్తి చేయగలిగిందంటే దాని వెనకున్న దశాబ్దాల కృషి సామాన్యమైనది కాదు. పైగా అగ్రరాజ్యాలు ఉపగ్రహాలను పంపటానికి వసూలు చేసే సొమ్ముతో పోలిస్తే ఇస్రో ధర ఎంతో చవక. అందువల్లే అనేక దేశాలు తమ ఉపగ్రహాల ప్రయోగానికి ఇస్రోను ఎన్నుకుంటున్నాయి. వేరే అంతరిక్ష ప్రయోగ సంస్థలతో పోలిస్తే ఇస్రో చేసే వ్యయం అతి తక్కువ. మన దేశం గత దశాబ్దంలో 1,300 కోట్ల డాలర్లు వ్యయం చేయగా 6,300 కోట్ల డాలర్ల ఆదాయం రావటం ఇందుకే. 2014లో ఈ ఆదాయం కేవలం 3,800 కోట్ల డాలర్లని గుర్తుపెట్టుకుంటే మనవాళ్లు సాధించిన ఘనతేమిటో అర్థమవుతుంది.

అంతరిక్ష పరిజ్ఞానం మన నిత్య జీవితంతో అనేక రకాలుగా పెనవేసుకుపోయింది. టెలికాం రంగం ప్రస్తుతం 6జీ వైపుగా అడుగులేస్తున్నదంటే అది మన ఉపగ్రహాల సమర్థత వల్లనే. రిసోర్స్ శాట్, కార్టోశాట్ వంటివి పంట భూమి స్వభావం, మట్టిలో తేమ శాతం, పంటల తీరుతెన్నులు తదితర అంశాల్లో ఎప్పటికప్పుడు రైతుకు అవసరమైన సమాచారాన్ని అందిస్తున్నాయి. వారు తగిన ప్రణాళికలు రూపొందించుకునేందుకు, సరైన నిర్ణయాలు తీసుకునేందుకు తోడ్పడి సాగు దిగుబడిని పెంచటానికి దోహదం చేస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యాల సమయంలో అప్రమత్తం చేయటానికి, ఏదైనా అనుకోని దుర్ఘటన సంభవిస్తే తక్షణం సహాయ సిబ్బంది రంగంలోకి దిగటానికి ఉపగ్రహాలు సమాచారమిస్తున్నాయి. నిత్యం దేశంలో 8 లక్షలమంది మత్స్యకారులు ఈ ఉపగ్రహాలు అందించే సమాచారంతో లబ్ధి పొందుతున్నారు. పట్టణప్రాంత ప్రణాళికలకూ, మౌలిక సదుపాయాల పర్యవేక్షణకూ ఇస్రో పంపిన ఉపగ్రహాల సమాచారం ఉపయోగపడుతోంది. ఇస్రో అంతరిక్ష రంగ కార్యకలాపాలను రానున్నకాలంలో మరింత విస్తృతం చేయదల్చుకుంది. ప్రపంచ అంతరిక్ష రంగ ఆర్థిక వ్యవస్థలో ఇస్రో వాటా ప్రస్తుతం 2 శాతం. దీన్ని 2034 నాటికి 10 శాతానికి పెంచాలన్నది ఇస్రో లక్ష్యం. అంతరిక్ష సాంకేతికతల్లో స్వావలంబన సాధించే దిశగా ఇప్పటికే అనేక చర్యలకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ఉపగ్రహాలకు అవసరమైన హార్డ్‌వేర్ కోసం విదేశాలపై ఆధారపడవలసి వస్తున్నది. ఆ విషయంలో సాగుతున్న పరిశోధన, అభివృద్ధి పర్యవసానంగా ఇప్పటికే ఎన్నో కొత్త సాంకేతికతలు అందుబాటులోకొచ్చాయి.

అయితే అంతరిక్షంలో ఆధిపత్యాన్ని సాధించి అందరినీ శాసించేందుకు ఇప్పటికే అమెరికా తన ప్రయత్నాలు తాను చేస్తోంది. తనకు అనుకూలంగా అంతర్జాతీయ అంతరిక్ష న్యాయనిబంధనలు రూపొందేలా పావులు కదుపుతోంది. కనుక మనం అప్రమత్తంగా ఉండటం, అందుకు తగిన వ్యూహరచన చేయటం ముఖ్యం. ఇస్రో ఏర్పడిన ఈ అర్ధ శతాబ్దపు కాలంలో ఆ సంస్థ చేసిన కృషి అసాధారణమైనదీ, అనుపమానమైనదీ. దాన్ని మరింత విస్తృతపరుచుకుంటేనే గగనవీధుల్లో విజయపరంపర నిరంతరం సాగుతుంది.

ఈయూ అనుభవం నేర్పే పాఠాలు

విశ్లేషణ



అమర్‌జీత్ భుల్లర్

జన్యుమార్పిడి(జీఎం) పంటలపై కేంద్రప్రభుత్వం ఆమోదయోగ్యమైన విధానాన్ని తేవాలని సుప్రీంకోర్టు కోరింది. జీఎం పంటలను చాలా రాష్ట్రాల వ్యవసాయ సంఘ నాయకులు వ్యతిరేకిస్తున్నారు. మనుషులు, జంతువులు, మొక్కల మీద వీటి ప్రతికూల ప్రభావాలపై ఎన్నో సందేహాలు ఉన్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకునే యూరోపియన్ యూనియన్ దేశాలు తీవ్రమైన నియంత్రణలను రూపొందించాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ నిర్ణయం, జీఎం జనరేటర్ల ఒత్తిడి ఉన్నప్పటికీ, ఈ పంటలను సులభంగా ఆమోదించడానికి దూరంగా ఉన్నాయి. ఒకనాటి హరిత విప్లవం ఫలితంగా ఉత్పాదకత పెరిగింది. కానీ ప్రతికూల ప్రభావాలు లేకుండా పోలేదు. అందుకే జీఎం సాంకేతికతకు సంబంధించిన ప్రభావాలను సమగ్రంగా అంచనా వేయాలి.

జన్యుమార్పిడి పంటలపై ఒక జాతీయ విధానాన్ని రూపొందించాలని పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖను ఇటీవల సుప్రీంకోర్టు కోరింది. గత రెండు దశాబ్దాలుగా దేశంలో జన్యుమార్పిడి పంటల ప్రవేశాన్ని సంశయవాదులు అడ్డుకోగలిగారు. పర్యావరణం, వ్యవసాయ వైవిధ్యం, మానవులు, జంతువుల ఆరోగ్యంపై జన్యుమార్పిడి పంటల ప్రభావాలపై 18 రాష్ట్రాలకు చెందిన వ్యవసాయ సంఘాల నాయకులు గత వారం ఒక జాతీయ సదస్సును నిర్వహించారు. జన్యుమార్పిడి పంటలను వారు ఏకగ్రీవంగా వ్యతిరేకిస్తున్నారు.

జన్యుమార్పిడి జీవులకు సంబంధించి తగిన ఆమోదయోగ్యమైన విధానాన్ని రూపొందించడానికి భారతదేశం పోరాడుతోంది. యూరోపియన్ యూనియన్(ఈయూ) తన సభ్య దేశాలలో జన్యుమార్పిడి ఉత్పత్తులు, విత్తనాల ప్రవేశాన్ని నియంత్రించడానికి చాలా కాలం కుస్తీ పట్టింది. సమగ్రమైనది కానప్పటికీ, మంచి విధానాన్ని రూపొందించగలిగింది. ఇది భారత్‌కు పాఠాలను అందిస్తుంది.

ప్రపంచం ఇప్పటివరకు మూడు 'హరిత విప్లవాలను' చూసిందని వ్యవసాయ వృద్ధి చరిత్ర చెబుతోంది. మొదటిది 1930లలో యూరప్, ఉత్తర అమెరికాలో ప్రారంభమైంది. ఎరువులు, పురుగు మందులు, యంత్రాలు, వ్యవసాయ నిర్వహణను సమర్థవంతంగా వినియోగించడం ద్వారా ఇది మొక్కజొన్న, ఇతర సమశీతోష్ణ వాతావరణ పంటలలో త్వరిత దిగుబడిని పెంచింది. రెండో హరిత విప్లవం కొన్ని భారతీయ రాష్ట్రాలతోపాటు 1960లు, 1970లలో చోటు చేసుకుంది. ఇది అభివృద్ధి చెందుతున్న దేశాలకు, ఉష్ణమండలంలో పండించే పంటలకు అదే విధమైన సాంకేతికతను బదలాయించింది. స్థానిక పరిశోధనలను ఉపయోగించడం ద్వారా ఈ సాంకేతికతలు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా రూపుదిద్దుకున్నాయి.

జన్యుమార్పిడి ఉత్పత్తులు, ముఖ్యంగా వ్యవసాయంలో జన్యు ఇంజినీరింగ్ ఉపయోగించి ఉత్పత్తి చేసిన విత్తనాలు 1970లలో కనిపించాయి. వీటిని 1990లలో ప్రధానంగా ఉత్తర అమెరికాలో వాణిజ్యీకరించారు. ఈ సాంకేతికతను ప్రబోధించినవారు వ్యవసాయ ఉత్పాదకతలో ఇది మరొక అపారమైన పెరుగుదలకు దారితీస్తుందనీ, ఆహార సరఫరాలో గుణాత్మక మెరుగుదలను అందజేస్తుందనీ పేర్కొన్నారు. మొదటి రెండు హరిత విప్లవాలకూ, మూడవ దానికీ మధ్య ఉన్న పెద్ద తేడా ఏమిటంటే, నిశ్చయాత్మకమైన కుతూహలంతో దీనిని ప్రపంచం స్వీకరించలేదు. మానవులు, జంతువులు, మొక్కల ఆరోగ్యంపై ఈ సాంకేతికతలోని ప్రతికూల ప్రభావాలపై ఎన్నో సందేహాలు ఉన్నాయి.

అందుకే వీటి ఉత్పత్తులపై యూరోపియన్ యూనియన్ దేశాలు తీవ్రమైన నియంత్రణలను రూపొందించాయి. అయితే అమెరికా, కెనడా, అర్జెంటీనా, బ్రెజిల్ చాలా వరకు వ్యవసాయ బయోటెక్ అనువర్తనాలను అనుమతించాయి. భారత్‌తో సహా చాలా ఇతర దేశాలు ఈ విషయంలో సరైన మార్గం కోసం పోరాడుతున్నాయి.



యూరోపియన్ దేశాలు ఈ సాంకేతికతను మొట్టమొదట గట్టిగా వ్యతిరేకించి, తర్వాత తీవ్రమైన నియంత్రణ విధానాన్ని అనుసరించాయి. చాలా యూరోపియన్ ప్రభుత్వాలు, యూరోపియన్ యూనియన్ కూడా జన్యుమార్పిడి జీవులతో ముడిపడి ఉన్న ప్రమాదాల అనిశ్చితిని దృష్టిలో ఉంచుకుని, చేతులు కాలాక ఆకులు పట్టుకోవడానికి బదులుగా ముందు జాగ్రత్త విధానాన్ని స్వీకరించాయి.

ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనల ప్రకారం, 'అదే' తరహా ఉత్పత్తుల దిగుమతిని పరిమితం చేయాలంటే, బలమైన శాస్త్రీయ సాక్ష్యం అవసరమని అమెరికా వాదిస్తోంది (అదే తరహా ఉత్పత్తి అంటే నేరుగా పోటీ పడే లేదా ప్రత్యామ్నాయ ఉత్పత్తి). దిగుమతిదారులు లేదా దిగుమతి చేసుకునే దేశాలు తప్పనిసరిగా జీఎం విత్తనం లేదా ఉత్పత్తి మానవ లేదా జంతువు లేదా మొక్కల ఆరోగ్యానికి సురక్షితం కాదని తిరస్కరించలేని శాస్త్రీయ ఆధారాలను అందించాలి.

ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, విత్తనం లేదా ఉత్పత్తి 'సురక్షితమైనది' అని రుజువు చేయాల్సిన బాధ్యత జీఎం విత్తన ఉత్పత్తిదారులపై లేదా దాని ఎగుమతిదారులపై లేదు; అది 'సురక్షితం కానిది' అని నిరూపించాల్సిన బాధ్యత దిగుమతిదారులపై ఉంది. మరో మాటలో చెప్పాలంటే, సురక్షితమని నిరూపించడం విక్రేత బాధ్యత కాదు, అది కొనుగోలుదారు బాధ్యత. కాబట్టి, హానికారకం అని రుజువయ్యేంత వరకూ అది సరైనదే అని అన్ని దేశాలూ భావించాల్సి ఉంటుంది. ఈ కారణంగా ప్రపంచ వాణిజ్య సంస్థ ఆమోదించిన స్వేచ్ఛా వాణిజ్య విధానంలో, బలమైన శాస్త్రీయ సాక్ష్యం లేనప్పుడు అమెరికా నుండి జన్యుమార్పిడి దిగుమతులను ఈయూ నియంత్రించలేదు. అయితే అమెరికా దృక్పథంతో విభేదిస్తూ, ఈయూ తన సభ్య దేశాలచే జన్యుమార్పిడి విత్తనాలు/ఉత్పత్తుల దిగుమతిని పరిమితం చేయడానికి అందుబాటులో ఉన్న అన్ని మార్గాలను ఉపయోగించింది. ఈ పంట రకాల ఆమోదాన్ని తాత్కాలికంగా నిలుపుదల (1998–2004) చేస్తూ దాని చర్యలను ప్రారంభించింది.

ఈ నిలుపుదలను ఆగ్రహించిన అమెరికా, అర్జెంటీనా, కెనడా దేశాలు ఈయూ నియంత్రణ విధానానికి వ్యతిరేకంగా 2003లో ప్రపంచ వాణిజ్య సంస్థలో ఒక దావాను ప్రారంభించాయి. ఈయూ విధానం చట్టవిరుద్ధమైన వాణిజ్య పరిమితులను సృష్టిస్తోందని పేర్కొన్నాయి. దాంతో డబ్ల్యూటీవో వివాద పరిష్కార ప్యానెల్ 2006 సెప్టెంబరులో ఫిర్యాదు చేసిన దేశాలకు అనుకూలంగా తీర్పును వెలువరించింది. డబ్ల్యూటీవో నిబంధనలకు అనుగుణంగా తన ఆమోద ప్రక్రియను తేవాలని యూరోపియన్ యూనియన్‌ను కోరింది.

డబ్ల్యూటీవో నిర్ణయానికి ముందే యూరోపియన్ యూనియన్ తన విధాన ప్రక్రియను మార్చుకుంది. అయితే అది ఇప్పటికీ సంక్లిష్టంగానే ఉంది. సభ్య దేశాల శాస్త్రీయ సంస్థలతో సన్నిహిత సంప్రదింపుల ద్వారా నష్టంపై అంచనా వేయడం జరిగింది. ఈ అభిప్రాయాన్ని బహిరంగ సంప్రదింపుల కోసం ప్రజలకు అందుబాటులో ఉంచారు. ఈయూ నిబంధనల ప్రకారం, అనేక రకాల కారణాల ఆధారంగా పంట సాగును నిలిపివేయడానికీ, నిషేధించడానికీ లేదా పరిమితం చేయడానికీ సభ్య దేశాలకు హక్కు ఉంటుంది. పర్యావరణం, వ్యవసాయ విధాన లక్ష్యాలు, సామాజిక-ఆర్థిక ప్రభావం వంటివి కారణాలుగా చూపొచ్చు. ఫలితంగా, ఐరోపాలో వాణిజ్యీకరణ కోసం చాలా తక్కువ వ్యవసాయ బయోటెక్ అప్లికేషన్లను ఆమోదించారు.

ప్రపంచ వాణిజ్య సంస్థ నిర్ణయం ఎలా ఉన్నప్పటికీ, అమెరికా ప్రభుత్వం నుండి స్థిరమైన ఒత్తిడి ఉన్నప్పటికీ, ఈయూ సభ్యదేశాలు, ఇతర యూరప్ దేశాలు జన్యుమార్పిడి పంటలను, ముఖ్యంగా ఆహార గొలుసులో భాగమైన వాటిని సులభంగా ఆమోదించడానికి నిరంతరం దూరంగా ఉన్నాయి. ఈయూ, ఇతర దేశాల విముఖత అనేది ప్రభుత్వాలపై డబ్ల్యూటీవో, జన్యుమార్పిడీ టెక్నాలజీ జనరేటర్ల ఒత్తిడిని బలహీనపరిచింది. ఇది భారతదేశం తన స్వతంత్ర మార్గాన్ని ఎంచుకోవడానికి ఎంతో సాయపడుతుంది.

జన్యుమార్పిడి జీవులపై సముచితమైన, ఆమోదయోగ్యమైన విధానాన్ని తీసుకురావాల్సిన బాధ్యతను సుప్రీంకోర్టు సరిగ్గానే కేంద్రానికి అప్పగించింది. భారతీయ విధాన రూపకర్తలు తప్పనిసరిగా యూరోపియన్ అనుభవాన్ని పరిశీలించాలి. ఇంతకుముందు మనం హరిత విప్లవ సాంకేతికతను అంగీకరించాం. దీని ఫలితంగా వ్యవసాయ ఉత్పాదకత పెరిగింది; కానీ కొన్ని దీర్ఘకాలిక ప్రతికూల ప్రభావాలు లేకుండా పోలేదు. అందుకే ఈసారి, జన్యుమార్పిడి సాంకేతికతకు సంబంధించిన సానుకూల, ప్రతికూల ప్రభావాలను సమగ్రంగా అంచనా వేయాలి.

వ్యాసకర్త నార్తర్న్ బ్రిటిష్ కొలంబియా యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ ('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ప్రచారం మంచిదా?



కొన్ని రాష్ట్రాలు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను పనిలో పెట్టుకుంటున్నాయి. రాష్ట్రం గురించి సానుకూలంగా మాట్లాడితే నెలకు 8 లక్షల రూపాయల వరకూ చెల్లిస్తున్నాయి. ఇది సరైన పని కాదని నా ఆలోచన. మనం మంచి చేస్తే జనం మన గురించి మాట్లాడాలిగానీ, మనం డబ్బులు చెల్లిస్తే కాదు.

– డి. ముత్తుకృష్ణన్, ఫైనాన్సియల్ ప్లానర్

శభాష్ ఫిలిప్పీన్స్



ఇండియా 2000 సంవత్సరంలోనే 'గోల్డెన్ రైస్'ను బయట పారేసింది; 2010లో బీటీ వంకాయ మీద మారటోరియం విధించింది. కానీ బిల్ గేట్స్ తన డబ్బును ఉపయోగించి ఫిలిప్పీన్స్ రైతుల మీద వాటిని రుద్దే ప్రయత్నం చేశారు. 'జన్యు మార్పిడి' ఎజెండాను ఫిలిప్పీన్స్ ప్రజలు మరోసారి తిప్పికొట్టారు. (వాటి మీద కోర్టు నిషేధం విధించిన నేపథ్యంలో.)

– వందనా శివ, పర్యావరణవేత్త

నవ్విపోతారు



కంగనా రనౌత్ సరదా ఇంటర్వ్యూ క్లిప్పులన్నీ ఎవరైనా ఒక దగ్గర చేర్చి ఒక సినిమాగా చేస్తే, అది కచ్చితంగా 'ఎమర్జెన్సీ' (కంగనా కొత్త సినిమా) కన్నా పెద్ద హిట్ అవుతుంది.

– నరుందార్, వ్యంగ్య వ్యాఖ్యాత

సౌఖ్యం మీ చెంత...



సౌఖ్యం కలిగించే వస్తువులను వెంటాడటం మొదలుపెడితే, వాటిల్లో చిక్కుకుపోతారు. అదే మీరు స్థిరంగా ఉంటే, అవే మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తాయి. మీరు ఏదీ కోరుకోకపోతే, అన్నీ మీ చెంతకే వస్తాయి.

– శ్రీశ్రీ రవిశంకర్, ఆధ్యాత్మిక గురువు

జాగ్రత్తగా...



వర్షపు రోజు తమ కార్లను ఎలా నడపాలో చాలామందికి తెలీదు. రోడ్ల మీద ఉండే నిలువ నీళ్లు చాలామంది మీదికి చిల్లుతుంటాయి. దయచేసి జాగ్రత్తగా నడపండి. రోడ్డు మీద నడిచేవాళ్లకు గౌరవం ఇవ్వండి.

– ఆర్జే నవీర్, రేడియో హోస్ట్

ఇన్ బాక్స్

జనరల్ బోగీలను పెంచాలి

ఈ మధ్య పిల్లల అడ్మిషన్ల కోసం ఆంధ్ర రాష్ట్రం ఆ చివరి నుంచి ఈ చివర వరకూ ఎడాపెడా తిరగాల్సివచ్చింది. ఈ రెండు వారాల మొత్తం ప్రయాణం రైలుబళ్లలోనే జరిగింది. సీజన్, అన్ సీజన్‌తో సంబంధం లేకుండా భారతీయ రైలు నిండుకుండలా పరిగెడుతోందని అర్థం చేసుకున్నాను. కనీసం రెండు నెలల ముందుగా ప్రయాణాలు ప్లాన్ చేసుకోకుండా రైలు బండియానం నడివయసు వారికి కూడదని కూడా అర్థమయింది. రైలుబళ్లు జనంతో కిక్కిరిసి నడుస్తున్నాయి. అయితే సామాన్య ప్రయాణీకుడు ఎక్కే జనరల్ బోగీల సఖ్యను తగ్గించి, ఏసీ బోగీలను పెంచుతూ పోతుండటమే విడ్డూరం. సౌకర్యవంతమైన ప్రయాణాన్ని కోరుకునే వారికి ఆ మేర సదుపాయాలు కల్పించవలసిందే. కాని, చాలా విచిత్రంగా జనరల్ కంపార్టుమెంటులను కుదించి, చివరకు ఒకటి లేదా రెండు బోగీలే దాదాపు అన్ని సూపర్ ఫాస్ట్ రైలుబళ్లలో అమరుస్తున్నారు. స్లీపర్ క్లాసు బోగీలను సైతం కుదించి, వాటి స్థానంలో కూడా ఏసీ బోగీలనే అమర్చడాన్ని సగటు భారతీయుడు ఎలా అర్థం చేసుకోవాలో తెలియని సంగతి.

భారతీయ రైల్వే ద్వారా చేయవలసిన వ్యాపార వాణిజ్యాలు గూడ్సు రైళ్ల ద్వారా జరుగుతాయని సామాన్య జనం అనుకునేది ఒట్టి మిథ్య. రైల్వే టికెట్ వెబ్‌సైట్ ఐఆర్‌సీటీసీ దేశంలోనే కాదు ఆసియా ఖండంలోనే అతి పెద్ద ఈ-కామర్స్ వెబ్ సైట్‌గా అవతరించింది. ఆర్థిక సర్వే సమాచారం మేరకు గత ఏడాదిలో భారతీయ రైల్వే 673 కోట్ల మంది ప్రయాణీకులను తమ గమ్యస్థానాలకు చేర్చింది. అలాంటి రైల్వే కాస్త మానవీయ ముఖం ధరిస్తే బాగుణ్ను. లెక్కకు మించి ప్రయాణం చేస్తున్న ఈ దేశపు దిగువ మధ్య తరగతికి అత్యుత్తమ రవాణా సాధనం రైలు బండి. అక్కడ జనరల్ కంపార్టుమెంటులు పెంచితే గొప్ప వసతి అందజేసి నట్లవుతుంది.

– దుప్పల రవికుమార్
సీనియర్ జర్నలిస్టు, నరసన్నపేట

కాంగ్రెస్‌ను బీజేపీ నిలువరించేనా?

అభిప్రాయం



దిలీప్ రెడ్డి

పదేళ్లుగా కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీగా బీజేపీ హరియాణాలో 'ప్రభుత్వ (ప్రజా) వ్యతిరేకత'ను ఎదుర్కొంటోంది. ఫలితంగా కొన్ని బలమైన వర్గాలు పార్టీకి క్రమంగా దూరమౌతున్న సంకేతాలున్నాయి. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల ఫలితాలు, పలు సర్వే సంస్థలు రాబట్టిన సమాచార వివరాలు ఇదే విషయాన్ని నొక్కి చెబుతున్నాయి. కాంగ్రెస్ ఆధిక్యతను ప్రధాన సర్వే సంస్థలన్నీ చెప్పకనే చెబుతున్నాయి. కానీ, ప్రజాక్షేత్రం కొన్నిసార్లు గోప్యంగా, గుంభనంగా ఉండటం రాజకీయాల్లో సహజం. క్షేత్ర సమాచారం, సంకేతాలు, మేధావుల విశ్లేషణలు ప్రతికూలంగా ఉన్నా తమ ప్రయత్నాలు మాత్రం మానకుండా పార్టీలు కొనసాగిస్తాయి. ప్రస్తుతం బీజేపీ పరిస్థితి కూడా అలాగే ఉంది.

2014, 2019 ఎన్నికల్లో పదికి పది లోక్‌సభ స్థానాలు గెలిచిన బీజేపీ, ఈసారి 5 చోట్ల ఓడిపోయింది. చేసిన తప్పులు దిద్దుకునే పనిలో బీజేపీ ఉంటే, అవన్నీ తప్పులనీ సదరు తప్పుడు విధానాలన్నీ తాము అధికారంలోకి రాగానే పక్కన పెడతామని కాంగ్రెస్ ప్రచారం చేస్తోంది. ప్రజలు ఎవరిని నమ్ముతారన్న దాన్ని బట్టే వారి మొగ్గు ఎన్నికల్లో ప్రతిబింబించే అవకాశముంది. కేంద్ర, రాష్ట్ర సర్కార్లపై హరియాణా ప్రజానీకానికి కోపం ఎందుకు? మహిళా రెజ్లర్ల అవమానాలు, రైతు పంటకు ఎమ్మెస్పీ దక్కకపోవడం, మూడు వ్యవసాయ చట్టాలు పరోక్షంగా తొంగిచూడటం, కోటాల వివాదం, నిరుద్యోగం, అగ్నివీర్... వంటి విధాన వ్యవహార పరమైన అంశాల రీత్యా ప్రజావ్యతిరేకత పెరుగుతూ వస్తున్నట్టు 'పీపుల్స్ పల్స్' క్షేత్ర పరిశీలనలో వెల్లడవుతోంది. వీటికి తోడు, ఎలక్ట్రానిక్ పాలనకై బీజేపీ ప్రభుత్వం తీసుకున్న చొరవ, చివరకు అమలు లోపాల వల్ల వికటించింది. రైతుల పేరిట ఈ-అకౌంట్లు తెరిపించి, సబ్సిడీలు, పంట నష్టపరిహారాలు, ఇతర ప్రయోజనాలను నేరుగా వారికే అందేట్టు ఏర్పాటు చేసిన (మేరా ఫసల్ మేరా బయోరా – ఎమ్మెఫ్ఎంబీ) పథకం ఆచరణలో విఫలమైంది. సరైన శిక్షణ లేక, అవగాహన కల్పించక రైతులు దీన్ని వాడక పోగా చీదరించుకున్నారు. అటువంటిదే, 'పరివార్ పహచాన్ పత్ర్' (పీపీపీ) కూడా ప్రజలకు పెద్దగా నచ్చలేదు. మరోపక్క, 'పోర్టల్ సర్కార్...' అని విమర్శించిన కాంగ్రెస్ నేత హుడా, తాము అధికారంలోకి రాగానే ఇందులో చాలా పద్ధతులు, విధానాలను ఎత్తివేస్తామని చెబుతున్నారు.

పంజాబ్‌తో విడిపోయి రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత హరియాణా వికాస్ పార్టీ, భారతీయ క్రాంతిదళ్, హరియాణా జన సభ, భారత జాతీయ లోక్‌దళ్, జననాయక్ జనతా పార్టీ... ఇలా పలు ప్రాంతీయ పార్టీలొచ్చాయి. కొన్ని పొత్తులు ఎన్నికల ముందు కుదిరితే, మరి కొన్ని ఎన్నికల తర్వాత ప్రభుత్వ ఏర్పాటు సమయాల్లో కుదిరిన దాఖలాలున్నాయి. ఇప్పుడు హరియాణాలో ప్రధాన ప్రత్యర్థులైన బీజేపీ, కాంగ్రెస్‌కు ఎవరితోనూ పొత్తు లేదు. ఎన్నికల ముందు మాత్రం ఐఎన్ఎల్డీ మాయావతి నేతృత్వంలోని బీఎస్పీతో జట్టుకట్టింది. వీరు



చూపే ప్రభావం, ఆ యా నియోజకవర్గాల్లో చీల్చే ఓట్లను బట్టి జాట్‌లతో పాటు దళిత ఓటర్ల మొగ్గులో తేడాలు రావచ్చు. బయటకు కనిపించే దాన్ని బట్టి, అది విపక్షమైన కాంగ్రెస్‌కే దెబ్బగా పరిణమించొచ్చు. ఇటువంటి పరిస్థితే జేజేపీ–ఎఎస్పీ (కాన్షీరామ్ వర్గం) జోడీ వల్ల కూడా ఎదురయ్యే ఆస్కారముంది. సంఖ్యాపరంగా జనాభాలో జాట్‌లు (25 శాతం), దళితులు (20 శాతం) అధికులుగా ఉండటమే ఈ సమీకరణాల ఆలోచనలకు కారణం. 2019 ఎన్నికల్లో తాను గెలిచిన 10 అసెంబ్లీ స్థానాలతో మద్దతు ప్రకటించి, బీజేపీతో సంకీర్ణ సర్కారులో భాగమైన జేజేపీ ఇప్పుడు వారితో లేదు. అందుకు కారణం లేకపోలేదు. జాటేతర వర్గాల్లో పట్టుపెంచుకోవాలనే కోరిక బీజేపీది. అందుకే, మెజా రిటీ వర్గంగా, అంటే 30 శాతం జనాభాగా ఉన్న ఓబీసీలపై కన్నేసింది. జేజేపీకి రెండు కారణాలున్నాయి. ఒకటి, భాగస్వామిగా ఉన్న తమనే బీజేపీ కకావికలు చేసిందని కోపం. గెలిచిన 10 మందికి గాను ఇప్పుడు ముగ్గురు ఎమ్మెల్యేలు మాత్రమే జేజేపీలో మిగిలారు. ప్రజా వ్యతిరేకత బలంగా ఉన్న బీజేపీతో అంటకాగటం వల్లే తమ ఉనికి, నిన్నటి లోక్‌సభ ఎన్నికల్లో ప్రశ్నార్థకమైందని జేజేపీ ఆందోళన చెందుతోంది. 'ఇండియా' కూటమి భాగస్వామి 'ఆప్' ఇక్కడ విడిగా పోటీ చేయడం కాంగ్రెస్‌కు నష్టం కలిగించేదే! 'ఎవరికీ మెజారిటీ రాదు, చివరకు మేమే కీలకం అవుతాం' అని జేజేపీ అధినేత దుష్యంత్ చౌతాలా ఇప్పటికే ప్రకటించారు.

దాదాపు నేరుగా తలపడుతున్న ప్రధాన ప్రత్యర్థి పార్టీలు కాంగ్రెస్, బీజేపీల్లో అంతర్గత కుమ్ములాటలున్నాయి. పదేళ్ల పాలకపక్షంగా 2014–19 కాలం కన్నా 2019–24 లోనే పార్టీ సంస్థాగతంగా ఇబ్బందులెదుర్కొంటోంది. మాజీ ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ ప్రధాని మోదీ మనిషి. అయినా... ప్రజా వ్యతిరేకత గుర్తించి, ఇంకోపక్క ఓబీసీల్లో పట్టు పెంచుకునే క్రమంలో, 2024 ఎన్నికల ముందు ఆయన్ని దింపి నాయబ్ సింగ్ సైనీని ముఖ్యమంత్రి చేసుకున్నారు. అయినా... ఆశించిన ఓట్లు రాలలేదు. నాటి పరిస్థితిని మించి, ఇప్పుడు ఖట్టర్‌ను కేంద్ర మంత్రిని చేస్తే ఆయన మళ్లీ హరియాణా ప్రజల ముందుకు వచ్చారు. ఏ మేర వారు ఆదరిస్తారో చూడాలి. 2019 ఎన్నికల్లో లభించిన 28.5 శాతం ఓటు వాటా నుంచి నిన్నటి (2024) ఎన్నికల్లో 43.67 శాతానికి ఓటు వాటా పెంచుకున్న కాంగ్రెస్ పార్టీ కూడా అంతర్గత లుకలుకలతో రగులుతోంది. 'పార్టీ పునరుద్ధరణలో... మేమూ హక్కుదారులమే!' అనే సంకేతాలతో పోటీ ర్యాలీలు జరుపుతూ, అసెంబ్లీ బరిలో పోటీకి ఆసక్తి కనబరచిన షెల్జాకుమారి, రణ్‌దీప్ సూర్జేవాలా... వంటి వారి అత్యుత్సాహానికి అధిష్ఠానం అడ్డుకట్ట వేసింది. పార్టీ నాయకత్వ పరంగా, ప్రజాదరణ పరంగా చివరకు భూపీందర్ హుడానే కాంగ్రెస్‌కు రథ సారథిగా నిలుస్తున్నారు. పార్టీ ఎంపీలెవరూ అసెంబ్లీకి పోటీ చేయబోరని కాంగ్రెస్ నాయకత్వం స్పష్టత నిచ్చింది. ప్రజల దృష్టిలో బలమైన ప్రాంతీయ పరికల్పనలు, ఆశలు, ఆకాంక్షలుండే హరియాణాలో రెండు జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌లు ప్రత్యర్థులై ఒకరిపై ఒకరు ఏ మేరకు ఆధిపత్యం సాధిస్తారనేదే రేపటి ఎన్నికల ఫలితం!

వ్యాసకర్త పొలిటికల్ ఎనలిస్ట్, పీపుల్స్ పల్స్ సర్వే సంస్థ

ఆత్మజ్యోతి వెలిగించాలి

ప్రపంచ మానవాళి ఎదుర్కొంటున్న ఆధ్యాత్మిక, సామాజిక, భౌతిక సమస్యలకు పరిష్కార మార్గంగా మాతా నిర్మలాదేవి 'సహజయోగ ధ్యానా'న్ని 1970 మేలో ప్రవేశ పెట్టారు. ప్రపంచవ్యాప్తంగా సుమారు 150 దేశాల్లో ప్రజలు సహజ యోగాన్ని ఆచరిస్తున్నారు.

మనిషి తనకు ఏ మాత్రం ప్రయోజనం లేని, అనవసరమైన అలవాట్లకు ఎందుకు బానిస అవుతున్నాడు? ఈ బాధల నుండి మనిషిని విముక్తి చేయడం ఎలా? అనే విషయాల పరిష్కారం కోసం నిర్మలా దేవి తన చిన్ననాటి నుండి తపన పడేవారు. వీటి కోసం ఎన్నో బోధనలు చదివారు. ఎన్నో ఆధ్యాత్మిక ప్రవచనాలు విన్నారు. అయితే మనిషి పురోగతిని సాధించాలంటే తనలోని అంతర్గత శక్తిని గుర్తించాలని గ్రహించారు. ఈ శక్తితో మనిషి తనలోని ఆత్మ జ్యోతిని వెలిగించుకోవాలి. ఆ జ్యోతి ద్వారానే మనిషి తన చుట్టూ ఉన్న వారిలోని జ్యోతిని వెలిగించాలి. అదే నేటి సమస్యలకు పరిష్కారమని తెలుసుకున్నారు. ప్రతి మనిషిలోను నిద్రాణ స్థితిలో ఉన్న భగవంతుని శక్తిని జాగృతం చేసి మన చుట్టూ ఉన్న పరమ చైతన్య శక్తితో అనుసంధానం చేస్తే మనిషిలో అనూహ్యమైన పరివర్తన తీసుకురావచ్చనే మహత్తర సత్యాన్ని కనుగొన్నారు. భగవంతుడితో అనుసంధానమయ్యేందుకు ఇదే అత్యంత అనుకూలమైన, శక్తిమంతమైన మార్గంగా భావించిన ఆమె... ఈ 'సహజ యోగ'ను ప్రపంచానికి తెలియజేసేందుకు కంకణం కట్టుకున్నారు.

'వసుధైక కుటుంబం' అనే భారతీయ జీవన విధానాన్ని ప్రపంచానికి మరోసారి గుర్తు చేయడంతోపాటు 'ద్వేషరహిత, ప్రేమపూరిత సమాజ' నిర్మాణానికి నడుం బిగించారు. సమస్త మానవాళిలో పరస్పర ప్రేమానురాగాలు, ఆప్యాయత, సౌభ్రాతృత్వం వంటివి అవసరమనీ, ఇందుకోసం శాంతి, సామరస్యంతో కూడిన సమాజం అవసరమనీ, అందుకు సహజయోగమే శరణ్యమనీ మనసా, వాచా, కర్మణా చేసి చూపించి ఆదర్శ గురువుగా నిలిచారు.

– కల్లూరు రామకృష్ణ, సహజయోగ ట్రస్ట్ ఏపీ కోఆర్డినేటర్ । 77570 57758

(విజయవాడలో నేడు, రేపు నిర్మల్ ఇంటర్నేషనల్ లీడర్స్ అకాడమీ (నీలా) రాష్ట్రస్థాయి సెమినార్)

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, తిథి: బ.త్రయోదశి తె.3.53 వరకు (తెల్లవారితే ఆదివారం), తదుపరి చతుర్దశి, నక్షత్రం: పుష్యమి రా.9.18 వరకు, తదుపరి ఆశ్లేష, వర్జ్యం: లేదు, దుర్ముహూర్తం: ఉ.5.41 నుండి 7.25 వరకు, అమృతఘడియలు: ప.2.40 నుండి 4.20 వరకు, శనిత్రయోదశి ; రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు, యమగండం: ప.1.30 నుండి 3.00 వరకు, సూర్యోదయం: 5.48, సూర్యాస్తమయం: 6.15.



పైపులైన్‌తో పంటచేలకు సాగునీరు



సాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన పైపులైన్‌కు సంబంధించిన బ్లాక్‌లు (ఇన్‌సెట్‌లో) పైపులైన్

రాష్ట్రంలోనే తొలి మైక్రో ఇరిగేషన్ పథకం

ఆదిలాబాద్ జిల్లా మత్తడివాగు ప్రాజెక్టులో ఓ కాలువ బదులు అండర్‌గ్రౌండ్‌లో కిలోమీటర్ల మేర పైపులైన్

కుడికాలువ ద్వారా సాగులోకి రానున్న 1200 ఎకరాలు

సాక్షి, ఆదిలాబాద్: తాంసి మండలం వడ్డాడి గ్రామంలోని మత్తడివాగు మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టుకు ఓ ప్రత్యేకత ఉంది. ఎడమ కాలువ నుంచి గ్రావిటీ ద్వారా చేలకు సాగునీరు అందిస్తుండగా, కుడివైపు పైపులైన్ ద్వారా నీటి సరఫరా చేస్తుండడమే ఆ ప్రత్యేకత. ప్రాజెక్టు నుంచి అండర్‌గ్రౌండ్‌లో పైపులైన్ వేసి చేలకు నీరందించే ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోనే తొలిసారిగా పనులు చేపట్టగా, ఇటీవల పూర్తయ్యాయి. ఇటీవల సీఎం జిల్లా పర్యటనకు వస్తున్నారని ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు. కానీ ఆ పర్యటన రద్దు కావడంతో మళ్లీ ముహూర్తం చూస్తున్నారు.

రైతులు భూములు ఇవ్వకపోవడంతో..

మత్తడివాగు ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా 8,500 ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు. ఇక కుడి వైపు 1,200 ఎకరాల ఆయకట్టుకు స్థిరీకరణ ఏళ్లుగా నిలిచిపోయింది. కాలువల నిర్మాణం కోసం రైతులు తమ భూములు ఇచ్చేందుకు నిరాకరించడమే. ఈ పరిస్థితుల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రత్యామ్నాయ పద్ధతిపై దృష్టి సారించారు. అప్పట్లో భారీ నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్న హరీశ్‌రావు తదితరులు మధ్యప్రదేశ్ పర్యటనకు వెళ్లినప్పుడు పైపులైన్ ద్వారా సాగునీరు అందిస్తున్న పథకాన్ని పరిశీలించారు. ఆ తర్వాత మహారాష్ట్రలోనూ ఇలాంటి స్కీమ్‌ను చూశాక మత్తడివాగు ప్రాజెక్టుకు కుడి కాలువ స్థానంలో పైపులైన్ వేయాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆ తర్వాత దీనికి సంబంధించి జైన్ అనే కాంట్రాక్ట్ సంస్థకు రూ.7.34 కోట్లతో ఈ మైక్రో ఇరిగేషన్ పథక నిర్మాణానికి టెండర్ అప్పగించింది. ఈ కంపెనీకి కర్ణాటకలో ఇదివరకు ఇలాంటి స్కీమ్ నిర్మించిన అనుభవం ఉంది. ప్రాజెక్టు కుడివైపు అండర్‌గ్రౌండ్‌లో 9 కిలోమీటర్ల మేర ప్రధాన పైపులైన్ వేయగా, మరో 20 కిలోమీటర్లు అంతర్గత పైపులైన్ వేశారు. ప్రాజెక్టు సమీపంలోనే నిర్మించిన పంప్‌హౌస్ ద్వారా నీరు ఎత్తిపోసి పైపులైన్‌తో సరఫరా చేస్తారు.

ఇదీ ప్రాజెక్టు స్వరూపం..

ఈ మధ్యతరహా ప్రాజెక్టును అప్పటి సీఎం వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకొని పనులకు శ్రీకారం చుట్టారు. వైఎస్ మొదటిసారి ముఖ్యమంత్రి అయిన తర్వాత పల్లెబాట కార్యక్రమంలో భాగంగా జిల్లాకు వచ్చినప్పుడు ప్రాజెక్టుకు భూమిపూజ చేశారు. ఆ తర్వాత 2008లో ఆయన చేతుల మీదుగానే ఈ ప్రాజెక్టు ప్రారంభించారు. అప్పట్లో రూ.62.4 కోట్లు వెచ్చించారు. 0.571 టీఎంసీల సామర్థ్యంతో ఐదు గేట్లతో ప్రాజెక్టు నిర్మించారు.

నీటి పంపిణీ ఇలా..

ప్రధాన పైపులైన్‌కు 25 బ్లాక్‌లు ఏర్పాటు చేశాం. మధ్యలో 8 ఔట్ లెట్లు నిర్మించాం. ఈ ఔట్ లెట్లు చేల వరకు నీటిని తీసుకెళతాయి. ఇలా 1200 ఎకరాలకు సాగునీరు సరఫరా చేస్తాం. ఈ ఔట్‌లెట్లకు నంబర్ ఇస్తాం. అక్కడ ఒక మీటర్ కూడా ఏర్పాటు చేస్తాం. తద్వారా ఏ ఔట్ లెట్‌లో ఎంత నీటి వినియోగం జరుగుతుందనేది నమోదవుతుంది. దీంట్లో సెన్సార్ విధానంలో స్కాడా సిస్టమ్ అమలు చేస్తున్నాం. తద్వారా ఏ బ్లాక్‌లో, ఏ ఔట్‌లెట్లో నీటి వినియోగం జరుగుతుందనేది స్పష్టంగా తెలుస్తుంది. డిమాండ్ ఉన్నచోట నీటి సరఫరాకు ఈ సిస్టమ్ అనువుగా ఉంటుంది.

– శ్రీనివాసరావు, డీఈ, నీటిపారుదల శాఖ, మత్తడివాగు ప్రాజెక్టు

1000 ఎకరాల్లో కొత్త జూపార్క్

- హైదరాబాద్‌కు వెలుపల ఏర్పాటు చేయాలి
- అనంత్ అంబానీలా ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలు, సంస్థలను ఆహ్వానించాలి
- 'స్పీడ్'పై సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌కు వెలుపల వెయ్యి ఎకరాల్లో కొత్త జూపార్క్‌ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వివిధ ప్రాంతాల నుంచి జంతువులు, పక్షులను తీసుకువచ్చి కొత్త జూపార్క్‌లో ఉంచాలని చెప్పారు. జామ్‌నగర్‌లో అనంత్ అంబానీ 3 వేల ఎకరాల్లో వనతార వన్యప్రాణి సంరక్షణ కేంద్రాన్ని నెలకొల్పిన విషయాన్ని సీఎం ప్రస్తావించారు. అలా ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలు, సంస్థలను ఆహ్వానించాలని సూచించారు. పట్టణ అటవీకరణను అభివృద్ధి చేయాలని అన్నారు. 'స్పీడ్'(స్మార్ట్ ప్రోయాక్టివ్ ఎఫిషియెంట్ అండ్ ఎఫెక్టివ్ డెలివరీ)పై సమీక్షలో భాగంగా శుక్రవారం సచివాలయంలో పర్యాటకాభివృద్ధి ప్రాజెక్టులపై అధికారులతో ఆయన సమావేశమయ్యారు.

అనంతగిరిలో హెల్త్ టూరిజం అభివృద్ధి..

అనంతగిరిలో అద్భుతమైన ప్రకృతి అటవీ సంపద ఉండటూ, అక్కడున్న 200 ఎకరాల ప్రభుత్వ భూములను హెల్త్ టూరిజం అభివృద్ధికి వినియోగించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. బెంగళూరులోని జిందాల్ నేచర్ క్యూర్ ఇనిస్టిట్యూట్ తరహాలో అక్కడ నేచర్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేసే అంశంపై చర్చించారు. వెల్‌నెస్‌సెంటర్ ఏర్పాటుకు జిందాల్ ప్రతినిధులు ఆసక్తిగా ఉంటే సంప్రదింపులు జరపాలని, ప్రకృతి వైద్య రంగంలో పేరొందిన ప్రముఖ సంస్థలను ఆహ్వానించాలని సూచించారు. రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కొత్త విధానాన్ని రూపొందించాలని, పర్యాటక రంగంలో ముందున్న రాష్ట్రాల్లో దీనిపై అధ్యయనం చేయాలని చెప్పారు.

బంగారు తాపడం పనుల్లో వేగం పెంచండి

యాదగిరిగుట్ట ఆలయ రాజగోపురానికి బంగారు తాపడం పనులు తక్షణమే పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. భక్తులకు సౌకర్యాల కల్పన, విడిది చేసేందుకు కాటేజీల నిర్మాణంపై దాతలు, కార్పొరేట్ సంస్థల సహకారం తీసుకోవాలన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు తరహాలో యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రామప్ప ఆలయం ఆకృతిలో కీసరగుట్ట ఆలయాన్ని అధునాతన సాంకేతికతను వినియోగించి పునర్నిర్మించాలని చెప్పారు.

పర్యాటకంపై వేర్వేరు పాలసీలు

టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం, హెల్త్ టూరిజం అభివృద్ధికి విడివిడిగా పాలసీలను రూపొందించాలని సమావేశంలో నిర్ణయించారు. రవాణాతో పాటు వసతి సౌకర్యం, పర్యాటకులకు అవసరమైన అన్ని సదుపాయాలు ఉండేలా పర్యాటక ప్యాకేజీలుండాలన్నారు. కవ్వాల్, అమ్రాబాద్ అటవీ ప్రాంతాల్లో సఫారీలను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని, కొన్నిచోట్ల రాత్రి విడిది ఉండే కాటేజీలను నిర్మించాలని చెప్పారు.

కొత్త ప్రాజెక్టులన్నీ పీపీపీ పద్ధతిలో..

హరిత హోటళ్లు, వసతి గృహాలు నిర్మించి వదిలేస్తే సరిపోదని, వీటి నిర్వహణ నిరంతరం మెరుగ్గా ఉంటేనే పర్యాటకులను ఆకర్షిస్తాయని రేవంత్ చెప్పారు. పర్యాటక రంగంలో కొత్తగా చేపట్టే ప్రాజెక్టులన్నింటినీ ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ)తో చేపట్టాలని సూచించారు. ఉద్యోగాల కల్పనతో పాటు రాష్ట్ర అభివృద్ధికి దోహదపడేలా టూరిజం అభివృద్ధి జరగాలన్నారు.

హెల్త్ టూరిజం అభివృద్ధి చేయాలి

హైదరాబాద్ ఫోర్త్ సిటీలో వెయ్యి ఎకరాల్లో ఏర్పాటు చేసే హెల్త్ హబ్‌లో హెల్త్ టూరిజంను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇక్కడ తమ సెంటర్లు నెలకొల్పేందుకు ముందుకు వచ్చే సంస్థలకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహకాలు ఇచ్చేలా కొత్త పాలసీ తయారు చేయాలని చెప్పారు. వివిధ దేశాల నుంచి వచ్చేవారికి వైద్య సేవలందించేందుకు వన్ స్టాప్ సొల్యూషన్ ప్యాకేజీలు రూపొందించాలని సూచించారు. హైదరాబాద్‌ను మెడికల్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దాలన్నారు. పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లను పక్కాగా తేల్చండి

▶ మొదటి పేజీ తరువాయి

చర్యలు చేపట్టాలని తేల్చిచెప్పింది.

ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దు..

చట్ట విరుద్ధంగా తమ విద్యా సంస్థల భవనాల కూల్చివేతకు హైడ్రా, అధికారులు ప్రయత్నిస్తున్నారంటూ.. గాయత్రి విద్యా, సాంస్కృతిక ట్రస్టు, అనురాగ్ వర్సిటీ, నీలిమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్, గూడ మధుకర్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. 796, 813 సర్వే నంబర్లలోని 17.21 ఎకరాల్లో ఎలాంటి చర్యలు చేపట్టకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. పిటిషన్లపై జస్టిస్ టి.వినోద్‌కుమార్ శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి, ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ రాహుల్‌రెడ్డి వాదనలు వినిపించారు. "1954, 1955 కాస్రా పహాణీ ప్రకారం నాదెం చెరువు విస్తీర్ణం 61 ఎకరాలు. పిటిషనర్ విద్యా సంస్థలు బఫర్ జోన్‌లోనే ఉన్నాయి. కూల్చివేత సహా ఎలాంటి చర్యలు చేపట్టినా పిటిషనర్‌కు నోటీసులు జారీ చేస్తాం. ఆ భూముల్లో ఇకపై ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా పిటిషనర్‌ను ఆదేశించాలి" అని న్యాయమూర్తిని స్పెషల్ జీపీ కోరారు. దీనికి న్యాయమూర్తి సమ్మతిస్తూ.. అధికారుల నుంచి అనుమతి పొందినా కూడా తదుపరి ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని పిటిషనర్లను ఆదేశించారు. నాగోల్‌లోని సర్వే ఆఫ్ ఇండియా, సనత్‌నగర్, షాద్‌నగర్‌లలోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీల నుంచి నాదెం చెరువుకు సంబంధించి స్పష్టమైన మ్యాప్‌లను తీసుకుని.. వాటి ఆధారంగా చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను నిర్ధారించాలని స్పెషల్ జీపీకి సూచించారు. ఆ తర్వాత అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

పలివెలలో నలుగురికి కుక్కకాటు



కుక్కకాటుకు గురైన వెంకటేశం

మునుగోడు: నల్లగొండ జిల్లా మునుగోడు మండలంలోని పలివెల గ్రామంలో శుక్రవారం ఒకే కుక్క గంట వ్యవధిలో నలుగురిని కరిచింది. జక్కుల వెంకటేశం తన ఇంటి ముందు నిలబడగా 8 సార్లు కరిచింది. ఆ వెంటనే రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న బత్తుల వెంకన్నను కరిచి అక్కడి నుంచి మరోచోటుకు వెళ్లి 15 ఏళ్ల బాలుడిని, ఆ పక్కనే ఉన్న మరో వ్యక్తిని కరిచింది. దీంతో ఆ గ్రామ ప్రజలు కుక్కని వెంటబడి గ్రామ శివారుకు తరిమికొట్టారు.

శృంగేరి పీఠం అనుమతులు తీసుకోండి

వేములవాడ ఆలయ విస్తరణపై సీఎం ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్/వేములవాడ: వేములవాడ ఆలయ విస్తరణ డిజైన్లు, నమూనాలకు వెంటనే శృంగేరి పీఠం అనుమతులు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సచివాలయంలో శుక్రవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో సహా వేములవాడ ఆలయ అర్చకులు సీఎంను కలిశారు. ఆలయ విస్తరణకు బడ్జెట్‌లో రూ.50 కోట్లు కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం ఆలయ విస్తరణ పనులపై ఆరా తీశారు. అధికారులు బదులిస్తూ శృంగేరి పీఠానికి వెళ్లి అనుమతులు తీసుకోవలసి ఉందని చెప్పడంతో.. వెంటనే వెళ్లి అనుమతులు తీసుకుని పనులు ప్రారంభించాలని సూచించారు. సీఎంను కలిసిన వారిలో ఆలయ ఈవో వినోద్, స్థపతి వల్లి నాయగం, ప్రధానార్చకుడు ఉమేశ్ శర్మ, అధికారులు రాజేశ్, రఘునందన్ తదితరులున్నారు.



సీఎం రేవంత్‌ను ఆశీర్వదిస్తున్న అర్చకులు. చిత్రంలో ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్

సహజ వనరుల రక్షణ కోసమే హైడ్రా

మంత్రి శ్రీధర్‌బాబు



బంజారాహిల్స్(హైదరాబాద్): ప్రకృతి ప్రసాదించిన సహజ వనరులను రక్షించుకోకపోతే అది పర్యావరణ విధ్వంసానికి దారి తీస్తుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు హెచ్చరించారు. నదులు, చెరువులు, వాగులు, అడవులు.. ప్రతీది మానవాళి మనుగడకు అవసరమైనదే అని ఆయన అన్నారు. శుక్రవారం 'గ్రిహ'(జీఆర్ఐహెచ్ఏ) పర్యావరణ సంస్థ నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ, మనం సాధించిన అభివృద్ధితో పాటు జీవావరణానికి అపార నష్టం జరుగుతోందని ఇప్పటికే ప్రపంచ దేశాలన్నీ గుర్తించాయని అన్నారు. వేగంగా జరుగుతున్న పర్యావరణ మార్పులను నియంత్రించేందుకు వ్యక్తిగత స్థాయిలో, ప్రభుత్వ పరంగా నియంత్రణ చర్యలు తీసుకోవాల్సి ఉందని ఆయన సూచించారు. చెరువులు, వర్షపు నీటి నాలాలు, నదులను కాపాడేందుకే సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని తమ ప్రభుత్వం 'హైడ్రా'విభాగాన్ని ఏర్పాటు చేసి, దిద్దుబాటు చర్యలకు పూనుకుంటోందని వెల్లడించారు. నాలాలు, చెరువులు ఆక్రమణలకు గురికావడం వల్ల వరద ముంపు సమస్య తలెత్తుతోందని ఆయన తెలిపారు. తమ ప్రభుత్వం ఏర్పాటు చేయబోయే ఫ్యూచర్ సిటీ అత్యాధునిక టెక్నాలజీలతో కార్బన్ రహిత (జీరో కార్బన్) నగ రంగా రూపొందుతుందని వెల్లడించారు. ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి సాంకేతిక సహకారం అందించాల్సిందిగా మహీంద్రా యూనివర్సిటీని కోరామని, దీనికి గ్రిహ సంస్థ కూడా తోడుగా నిలిచి పర్యావరణహిత నగరానికి దోహదపడాలని శ్రీధర్‌బాబు కోరారు.

వీలైనంత త్వరలో స్కిల్స్ వర్సిటీ నమూనాలు

ఆర్కిటెక్ట్‌లను ఆదేశించిన సీఎం రేవంత్

5వేల చరణాలతో కూడిన అతిపెద్ద జానపద గీత పుస్తకం విడుదల

సాక్షి, హైదరాబాద్: యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి పూర్తిస్థాయి డిజైన్లను, నమూనాను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సచివాలయంలో శుక్రవారం ఆయన స్కిల్స్ వర్సిటీకి సంబంధించిన ప్రాథమిక డిజైన్లను పరిశీలించారు. వాటికి చేయాల్సిన మార్పుల గురించి ఆర్కిటెక్ట్‌లకు సూచించిన రేవంత్ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ డిజైన్ల విషయంలోనూ పలు సూచనలు చేశారు. అదేవిధంగా సచివాలయంలో పలువురు ప్రముఖులు సీఎం రేవంత్‌ను కలిశారు. జానపద కళాకారుడు కుమారస్వామి రచించిన 5వేల చరణాలతో కూడిన ప్రపంచంలోనే అతిపెద్ద జానపద గీతాన్ని పుస్తకరూపంలో రేవంత్ విడుదల చేశారు. మతి భానుమూర్తి రచించిన 'జయ సేనాపతి' నవలను ఆవిష్కరించిన సీఎం ప్రతిష్టాత్మక వరల్డ్ ఫుడ్ ఫౌండ్ టాప్ అవార్డు గ్రహీత డాక్టర్ సమరేందుతో సమావేశమయ్యారు. ఈ భేటీలో ప్రొఫెసర్ జానయ్య కూడా పాల్గొన్నారు.

ఎప్పటికైనా ఉత్తమ్ సీఎం అవుతారు

నా నాలుకపై మచ్చలు ఉన్నాయి.. నేనంటే జరుగుతదంతే

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



సాక్షి, యాదాద్రి: 'నా నాలుక మీద నల్లటి మచ్చలు ఉన్నాయి నేను ఏమి అంటే అది జరుగుతుందని మా అమ్మ చెప్పింది. ఇప్పుడు కాకపోయినా భవిష్యత్‌లో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సీఎం అవుతారు' అని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం భువనగిరిలో జరిగిన సాగు నీటి ప్రాజెక్టుల సమీక్ష సమావేశంలో రాజగోపాల్‌రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సమావేశానికి మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు హాజర య్యారు. భువనగిరి జిల్లాలో మూసీ కాలువల పరిస్థితిని రాజగోపాల్‌రెడ్డి వివరిస్తూ.. వేదికపై ఉన్న సీఎం అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని సంబోధించారు. అనంతరం మరో సారి మాట్లాడుతూ.. తాను చేసిన వ్యాఖ్యలు మీడియాలో వచ్చాయట.. ఇక ఎంత గొడవ, ఎంత పంచాయితీ ఉందో అని అన్నారు. పదవుల కోసం పాకులాడాల్సిన అవసరం తనకు లేదని, పదవులు వాటంతట అవే నడుచుకుంటూ వస్తాయని చెప్పారు. మూసీ కాలువల ఆధునికీకరణ విషయంలో ఇంజనీర్లు ఇచ్చే రివ్యూ సరిగా లేదని తెలిపారు. మంత్రి ఉత్తమ్..నీటిపారుదల శాఖ అధికారులు, ఎంపీ, ఎమ్మెల్యేలతో మరోసారి హైదరాబాద్‌లో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు.

2026 మార్చిలో 'దేవాదుల' ప్రారంభం

▶ మొదటి పేజీ తరువాయి

జిల్లాలను సస్యశ్యామలం చేస్తామని చెప్పారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని తుపాకులగూడెం దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును శుక్రవారం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, నీటిపారుదల శాఖ నిపుణులతో కలిసి ఆయన సందర్శించారు. దేవాదుల పంప్‌హౌస్ వద్ద ప్రాజెక్ట్ పురోగతిపై ఉత్తమ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిర్దేశిత గడువులోపు దేవాదుల పూర్తి చేసి 5.57 లక్షల ఎకరాలకు నీళ్లు అందిస్తామని చెప్పారు. సమ్మక్క సారక్క బరాజ్ ఎన్వోసీ కోసం ఛత్తీస్‌గఢ్‌ను ఒప్పిస్తామన్నారు. ధరలు పెరగడంతో ఇరిగేషన్ ప్రాజెక్టులకు భూసేకరణ ఇబ్బందిగా మారిందని, ఇందుకోసం ప్రత్యేక ఐఏఎస్ అధికారిని నియమిస్తున్నామని తెలిపారు. వీలైనంత త్వరగా సీతారామసాగర్, పాలమూరు-రంగారెడ్డిలను పూర్తి చేసి వినియోగంలోకి తెస్తామని చెప్పారు.

ప్రతి ప్రాజెక్టులో వేల కోట్ల స్కాం: ఇరిగేషన్ శాఖను అడ్డుపెట్టుకొని మాజీ సీఎం కేసీఆర్ డెకాయిట్‌లా వ్యవహరించారని, ప్రతి ప్రాజెక్టులో వేల కోట్ల స్కాం జరిగిందని ఉత్తమ్ ఆరోపించారు. ఇరిగేషన్ ప్రాజెక్టులపై అవగాహన లేకుండా తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో ప్రాజెక్ట్‌ల పేరుతో రూ.1.81 లక్షల కోట్ల నిధులు ఖర్చుపెట్టారని, రూ.14 వేల కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉంచారని వెల్లడించారు. రూ.1.81 లక్షల కోట్ల నిధులను ఖర్చు చేసినా లక్ష ఎకరాలకు కూడా అదనంగా సాగునీరు ఇవ్వలేకపోయారని విమర్శించారు. దేవాదుల పెండింగ్ బిల్లులను తప్పనిసరిగా చెల్లిస్తామని మంత్రి చెప్పారు.

15 ఏళ్లుగా నత్తనడకన దేవాదుల: పొంగులేటి

దేవాదుల ప్రాజెక్ట్ పనులు 15 ఏళ్లుగా నత్తనడకలో సాగాయని మంత్రి పొంగులేటి విమర్శించారు. దీనికోసం మరో 3 వేల ఎకరాల భూసేకరణ నవంబర్ 15 లోపు జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ఇచ్చిన హామీ మేరకు, భూములకు నష్టపరిహారం చెల్లిస్తామని తెలిపారు. మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, గండ్ర సత్యనారాయణరావు, మురళీ నాయక్, యశస్వినిరెడ్డి, కేఆర్ నాగరాజు, ప్రభుత్వ కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ పాల్గొన్నారు.

చెరువులు ఆక్రమిస్తే ఊపేక్షించం

సాక్షి, యాదాద్రి: రాష్ట్ర వ్యాప్తంగా చెరువులు, కుంటలు ఎవరు ఆక్రమించినా ఉపేక్షించేది లేదని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరిలో ఉన్న నీటిపారుదల వనరులపై ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. గత పదేళ్లలో అన్ని శాఖల కంటే ఎక్కువగా నష్టపోయింది నీటిపారుదల శాఖే అని అన్నారు. సీఎం ఆలోచనల మేరకు మూసీ నదిలో నీటి లభ్యతను పెంచుతామన్నారు.

రుణమాఫీకి మరో రూ.500 కోట్లు: పొంగులేటి

రైతు రుణమాఫీ కోసం అవసరమైతే అదనంగా మరో రూ.500 కోట్లు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి పొంగులేటి వెల్లడించారు. ఇంకా ఇవ్వాల్సిన రూ.13 వేల కోట్లతో పాటు అవసరమైతే మరిన్ని నిధులు ఇస్తామన్నారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, వేముల వీరేశం, మందుల సామేల్, మల్‌రెడ్డి రంగారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే పాల్గొన్నారు.

వీరేశంను అడ్డుకున్న పోలీసులు: భువనగిరిలో హెలిపాడ్ వద్ద మంత్రులు ఉత్తమ్, పొంగులేటిలకు స్వాగతం పలకడానికి వస్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహించిన ఆయన.. హెలిపాడ్ వద్దకు వెళ్లకుండానే వెను దిరిగారు. ఇది గమనించిన ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిలు వీరేశంను వెనక్కి రావా లని కోరారు. ఎవరు ఏమిటో తెలియదా అంటూ పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన వీరేశం.. హెలిపాడ్ వద్దకు వెళ్లకుండా నేరుగా వేదికపైకి వచ్చారు. కాగా ఎమ్మెల్యేను అడ్డు కున్న ఘటనపై విచారణ జరుపుతున్నామని భువనగిరి డీసీపీ రాజేశ్ చంద్ర చెప్పారు. అంతకుముందు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని కూడా పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు.

ఆత్మరక్షణకు ఆయుధాలు

- రాత్రి షిఫ్టుల్లో అభద్రత
- మహిళా వైద్యుల్లో మరీ ఎక్కువ
- జూనియర్ డాక్టర్లపై అధిక హింస
- ఐఎంఏ అధ్యయనంలో కీలకాంశాలు

దేశంలో మూడింట ఒక వంతు వైద్యులు రాత్రి షిఫ్టుల్లో అభద్రతతో పనిచేస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది మహిళలే. దాంతో కొందరైతే ఆత్మరక్షణ కోసం ఆయుధాలను తీసుకెళ్లడం తప్పదన్న భావనకు కూడా వచ్చారట. ఐఎంఏ అధ్యయనం ఈ మేరకు వెల్లడించింది. కోల్‌కతాలోని ఆర్జీ కర్ ప్రభుత్వ వైద్య కళాశాల, ఆస్పత్రిలో ట్రైనీ మహిళా వైద్యురాలిపై అత్యాచారం, హత్య దేశమంతటా ఆందోళనకు దారితీయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాత్రి షిఫ్టుల్లో వైద్యుల భద్రతను అంచనా వేయడానికి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆన్‌లైన్ సర్వే చేపట్టింది. 3,885 వైద్యుల వ్యక్తిగత ప్రతిస్పందనలతో నిర్వహించిన ఈ సర్వే దేశంలోనే అతి పెద్ద అధ్యయనమని ఐఎంఏ పేర్కొంది. సర్వేలో పాల్గొన్న వారిలో 85 శాతం మంది 35 ఏళ్లలోపు వారు. 61 శాతం ఇంటర్న్ లేదా పోస్ట్ గ్రాడ్యుయేట్ ట్రైనీలున్నారు. కేరళ స్టేట్ ఐఎంఏ రీసెర్చ్ సెల్ చైర్మన్ డాక్టర్ రాజీవ్ జయదేవన్, ఆయన బృందం రూపొందించిన ఈ సర్వే ఫలితాలను ఐఎంఏ కేరళ మెడికల్ జర్నల్ అక్టోబర్ సంచికలో ప్రచురించనున్నారు. ఈ ఆన్‌లైన్ సర్వేను గూగుల్ ఫామ్ ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులకు పంపారు. 24 గంటల్లో 3,885 స్పందనలు వచ్చాయని డాక్టర్ జయదేవన్ తెలిపారు. ''వీరిలో చాలామంది దేశవ్యాప్తంగా వైద్యులు, ముఖ్యంగా మహిళలు రాత్రి షిఫ్టుల్లో అరక్షితంగా ఉన్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆరోగ్య సంరక్షణ కేంద్రాల్లో భద్రతా సిబ్బంది, పరికరాలను మెరుగుపరచాల్సిన అవసరముంది'' అని అధ్యయనం పేర్కొంది.

అధ్యయన నివేదిక...

కొన్ని ఎంబీబీఎస్ కోర్సుల్లో లింగ నిష్పత్తికి అనుగుణంగా మహిళలు 63 శాతం ఉన్నారు. తమకు భద్రత లేదని భావించే వారి నిష్పత్తి మహిళల్లో ఎక్కువగా ఉన్నట్టు సర్వేలో తేలింది. 20–30 ఏళ్ల వయస్సున్న వైద్యులు అతి తక్కువ భద్రతా భావాన్ని కలిగి ఉన్నారు. వీరంతా ఎక్కువగా ఇంటర్న్‌లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు. నైట్ షిఫ్టుల్లో 45 శాతం మందికి డ్యూటీ రూమ్ కూడా అందుబాటులో లేదు. రద్దీ, ప్రైవసీ లేకపోవడం, డ్యూటీ గదులకు తాళాలు లేకపోవడమే గాక అవి సరిపోవడం లేదు. దాంతో వైద్యులు ప్రత్యామ్నాయ విశ్రాంతి ప్రాంతాలను వెదుక్కోవాల్సి వస్తోంది. అందుబాటులో ఉన్న డ్యూటీ గదుల్లో మూడింట ఒక వంతు అటాచ్డ్ బాత్రూములు లేవు. దాంతో ఆ అవసరాలకు వైద్యులు అర్ధరాత్రి వేళల్లో బయటికి వెళ్లాల్సి వస్తోంది. సగానికి పైగా (53 శాతం) ప్రాంతాల్లో డ్యూటీ రూము వార్డు/ క్యాజువాలిటీకి దూరంగా ఉంది. ప్రధానంగా జూనియర్ డాక్టర్లు ఇలాంటి హింసను అనుభవిస్తున్నారు. పాలన లేదా విధాన రూపకల్పనలో వీరికి ప్రమేయం ఉండటం లేదు.



వైద్యుల సూచనలు...

శిక్షణ పొందిన భద్రతా సిబ్బంది సంఖ్యను పెంచాలి.	సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి.	సరైన వెలుతురు ఉండేలా చూడాలి.	సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ (సీపీఏ) అమలు చేయాలి.
అలారం వ్యవస్థలను ఏర్పాటు చేయాలి.	తాళాలతో కూడిన సురక్షిత డ్యూటీ గదుల వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలి.		సురక్షితమైన, పరిశుభ్రమైన డ్యూటీ రూములు ఏర్పాటు చేయాలి.
– ఆహారం, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల్లో మెరుగుదల అవసరం.	ఆస్పత్రుల్లో తగినంత వైద్య సిబ్బందిని నియమించాలి.		వార్డులు ఇతర ప్రాంతాల్లో రద్దీ లేకుండా ఏర్పాట్లు చేయాలి.

అదనపు సూచనలు

మద్యం సేవించిన లేదా మాదకద్రవ్యాల మత్తులో ఉన్న వ్యక్తుల నుంచి క్యాజువాలిటీలో పని చేస్తున్న వైద్యులు మౌఖిక, శారీరక బెదిరింపులను ఎదుర్కొంటున్నారు. అత్యవసర గదుల్లో మహిళా వైద్యులకు అనవసరంగా తాకడం, అనుచిత ప్రవర్తన వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. పరిమిత సిబ్బంది, తక్కువ భద్రత ఉన్న చిన్న ఆసుపత్రుల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. భద్రతా సమస్యలు తలెత్తినప్పుడు నిర్వాహకుల నుంచి ఉదాసీనత వ్యక్తమవుతోందని చాలా మంది వైద్యులు తెలిపారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

టైట్లర్‌పై హత్యాభియోగాలు నమోదు చేయండి

సీబీఐకి రౌజ్ అవెన్యూ కోర్టు ఆదేశాలు



న్యూఢిల్లీ: 1984 సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో కాంగ్రెస్ నాయకుడు జగదీశ్ టైట్లర్‌పై హత్య, ఇతర నేరాభియోగాలు నమోదు చేయాల్సిందిగా ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు శుక్రవారం సీబీఐకి ఆదేశాలు జారీచేసింది. నాటి అల్లర్లలో ఉత్తర ఢిల్లీలోని పుల్ బంగాష్ ప్రాంతంలో ముగ్గురు సిక్కుల హత్యకు సంబంధించి టైట్లర్‌పై హత్యాభియోగాలు నమోదు చేయాలని ఆదేశించింది. హత్య, అల్లర్లు, నేరాలకు ప్రేరేపించడం, చట్టవిరుద్ధంగా గుమిగూడటం, రెండు వర్గాల మధ్య విద్వేషాలను రగల్చడం, అక్రమంగా చొరబడటం, దొంగతనం.. తదితర అభియోగాలపై మాజీ కేంద్రమంత్రి జగదీశ్ టైట్లర్‌పై న్యాయ విచారణ జరపడానికి తగిన ఆధారాలున్నాయని కోర్టు అభిప్రాయపడింది. సెప్టెంబరు 13న అభియోగాలను నమోదు చేయాలని సీబీఐకి సూచించారు. ఆ రోజు కోర్టు విచారణకు ప్రత్యక్షంగా హాజరు కావాలని జగదీశ్ టైట్లర్‌ను ఆదేశించారు.

బీజేపీలో చేరిన చంపయ్ సోరెన్



రాంచీ: జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి చంపయ్ సోరెన్(67) బీజేపీలో చేరారు. జేఎంఎం ప్రస్తుత పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేయడంతోపాటు పార్టీలో తనను అవమానించారని ఆరోపిస్తూ రెండు రోజుల క్రితం ఆయన ఆ పార్టీకి, మంత్రి పదవికి రాజీనామా చేశారు. శుక్రవారం రాంచీలోలో జరిగిన కార్యక్రమంలో కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ చంపయ్ సోరెన్‌కు కండువా కప్పి, బీజేపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చంపయ్ సోరెన్‌ను 'టైగర్ జిందా హై' అంటూ చౌహాన్ అభివర్ణించారు. జార్ఖండ్ ఉద్యమంలో కొల్హాన్ ప్రాంతంలో కీలకంగా ఉన్న చంపయ్‌ను అక్కడి వారు 'కొల్హాన్ టైగర్'గా పిలుచుకుంటారు. చంపయ్ మాట్లాడుతూ..ఢిల్లీ, కోల్‌కతాలలో ఉన్న సమయంలో తనపై హేమంత్ సోరెన్ ప్రభుత్వం నిఘా పెట్టిందని, దీన్ని జీర్ణించుకోలేకే ఆ పార్టీని వీడి బీజేపీలో చేరాల్సి వచ్చిందన్నారు.

మరోసారి కరోనా పంజా?

- అమెరికా, దక్షిణ కొరియాలో భారీగా కేసులు
- భారత్‌కు సైతం పొంచి ఉన్న ముప్పు: నిపుణుల అంచనా



న్యూఢిల్లీ: కోవిడ్–19 సృష్టించిన విలయాన్ని దేశ ప్రజలు ఇప్పటికీ మర్చిపోలేదు. ప్రాణాంతక మహమ్మారి కాటుకు లక్షల మంది బలయ్యారు. క్రమంగా వైరస్ వ్యాప్తి నిలిచిపోయింది. సాధారణ పరిస్థితులు ఏర్పడ్డాయి. కానీ, కోవిడ్–19 మరోసారి విజృంభించే అవకాశాలు కనిపిస్తున్నాయని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. అమెరికా, దక్షిణ కొరియా తదితర దేశాల్లో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య మళ్లీ పెరుగుతోంది. అమెరికాలో 25 రాష్ట్రాల్లో కరోనా వైరస్ వ్యాప్తి ఉధృతం అవుతున్నట్లు సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్, ప్రివెన్షన్(సీడీసీ) వెల్లడించింది. దక్షిణ కొరియాలో చాలామంది కరోనా బారినపడి, చికిత్స కోసం ఆసుపత్రుల్లో చేరుతున్నారు. ఇండియాలో ఈ ఏడాది జూన్, జూలైలో 908 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయని, ఇద్దరు బాధితులు మరణించారని ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్ఓ) వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా 85 దేశాల్లో జూన్ 24 నుంచి జూలై 21 మధ్య వారానికి సగటున 17,358 పాజిటివ్ కేసులు నమోదైనట్లు తెలియజేసింది. ఇతర దేశాల్లో ఉన్నట్లుగా ఇండియాలో పరిస్థితి అంత తీవ్రంగా లేకపోయినా మనం అన్నింటికీ ఇప్పటి నుంచే సిద్ధపడి ఉండడం మంచిదని నోయిడాలోని శివ నాడార్ యూనివర్సిటీ ప్రొఫెసర్, వైరాలజిస్టు దీపక్ సెహగల్ సూచించారు. వైరస్ మరోసారి తీవ్రస్థాయిలో వ్యాప్తి చెందే పరిస్థితులు కనిపిస్తున్నాయని అన్నారు. ఈసారి వైరస్ వ్యాప్తిలో వేగం 11 శాతం పెరిగిందని, బాధితుల్లో 26 శాతం మంది మరణిస్తున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలియజేసిందని వెల్లడించారు. ఇది నిజంగ ఆందోళకరమైన పరిణామమేనని పేర్కొన్నారు.

మౌనమేల మోదీజీ!



- లేఖపై మీ ప్రతిస్పందనేది?
- ప్రధాని మోదీకి బెంగాల్ సీఎం మమతా బెనర్జీ మరో లేఖ
- నేరగాళ్లకు అత్యంత కఠిన శిక్ష విధించేలా కేంద్రం చట్టం తీసుకురావాలని వినతి

కోల్‌కతా: మహిళలపై అత్యాచారం, హత్య వంటి తీవ్రమైన నేరాలకు పాల్పడేవారికి అత్యంత కఠినమైన శిక్ష విధించాలని, ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం పటిష్టమైన చట్టం తీసుకురావాలని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మరోసారి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆమె శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ఈ లేఖను 'ఎక్స్'లో పోస్టు చేశారు. కోల్‌కతాలో ఆర్జీ కర్ ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్‌పై అఘాయిత్యం అనంతరం మోదీకి మమత లేఖ రాసిన సంగతి తెలిసిందే. అత్యాచారం, హత్య కేసుల్లో విచారణ, దోషులకు శిక్ష విధించడానికి ఒక స్పష్టమైన గడువు విధించాలని ప్రధానమంత్రిని కోరారు. అయితే, గతంలో రాసిన లేఖపై నరేంద్ర మోదీ నుంచి ఇంకా ఎలాంటి స్పందన రాలేదని తాజా లేఖలో మమతా బెనర్జీ ఆక్షేపించారు. అత్యంత సున్నితమైన అంశంపై ప్రధానమంత్రి స్పందించకపోవడం బాధ కలిగిస్తోందన్నారు. తన లేఖపై ప్రధానమంత్రి నుంచి కాకుండా కేంద్ర మహిళ, శిశు అభివృద్ధి శాఖ నుంచి సమాచారం వచ్చిందని తెలిపారు. తాను లేవనెత్తిన అంశాలకు కేంద్ర మహిళ, శిశు అభివృద్ధి శాఖ మంత్రి నుంచి వచ్చిన లేఖలో పెద్దగా ప్రాధాన్యం ఇవ్వలేదని తప్పుపట్టారు. విషయ తీవ్రతను కేంద్ర ప్రభుత్వం సరిగ్గా అర్థం చేసుకోవడం లేదని విమర్శించారు. పశ్చిమ బెంగాల్‌లో మహిళలు, బాలలపై నేరాలను అరికట్టే విషయంలో తమ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని మమతా బెనర్జీ పేర్కొన్నారు. 10 ప్రత్యేక పోక్సో కోర్టుల ఏర్పాటుకు అనుమతి ఇచ్చామన్నారు. 88 ఫాస్ట్–ట్రాక్ ప్రత్యేక కోర్టులు, 62 పోక్సో గుర్తింపు ఉన్న కోర్టులు ఇప్పటికే పని చేస్తున్నాయని తెలియజేశారు. '112', '1098' హెల్ప్‌లైన్ నెంబర్లు సేవలందిస్తున్నాయని వెల్లడించారు. అత్యవసర పరిస్థితుల్లో మహిళలు డయల్–100 సేవలు ఉపయోగించుకుంటున్నారని చెప్పారు. పశ్చిమ బెంగాల్‌లో మహిళల భద్రతకు అక్కడి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని మమతా బెనర్జీకి ఇటీవల రాసిన లేఖలో కేంద్ర మహిళ, శిశు అభివృద్ధి శాఖ మంత్రి అన్నపూర్ణ దేవి ఆరోపించారు. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీకి మమత మరోసారి లేఖ రాసినట్లు తెలుస్తోంది.

పాకిస్తాన్ చర్యకు ప్రతిచర్య తప్పదు: జైశంకర్



న్యూఢిల్లీ: భారత్ నిష్క్రియ దేశం కాదని, పాకిస్తాన్ వైపు నుంచి ఎలాంటి చర్య వచ్చినా అందుకు ప్రతి చర్య కచ్చితంగా ఉంటుందని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ తేల్చిచెప్పారు. పాకిస్తాన్ చర్య సానుకూలమైనా, ప్రతికూలమైనా భారతదేశ ప్రతిస్పందన అదే విధంగా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రతి ఒక్క చర్యకు తదుపరి పరిణామాలు ఉంటాయన్నారు. పాకిస్తాన్‌తో నిరంతర చర్చల కాలం ముగిసిపోయిందని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని ఉద్ఘాటించారు. మాజీ దౌత్యవేత్త రాజీవ్ సిక్రీ రాసిన 'స్ట్రాటజిక్ కోనండ్రమ్: రీషేపింగ్ ఇండియాస్ ఫారిన్ పాలసీ' పుస్తకాన్ని శుక్రవారం ఢిల్లీలో జైశంకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో ఏ దేశానికైనా సరే పొరుగు దేశాలు ఒక సమస్యగా మారుతాయని చెప్పారు. పొరుగున అత్యంత శక్తివంతమైన దేశాలు ఉంటే సమస్య మరింత పెరుగుతుందని వెల్లడించారు. ఇందుకు చైనా ఒక ఉదాహరణ అని తెలిపారు.

అసోం అసెంబ్లీలో ఇక నో నమాజ్ బ్రేక్



గువహటి: అసోం అసెంబ్లీలో శుక్రవారం ముస్లిం ఎమ్మెల్యేల నమాజ్ కోసం ఇచ్చే రెండు గంటల విరామాన్ని రద్దు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ప్రకటించారు. ఇకపై నమాజ్ బ్రేక్ ఉండబోదన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల నుంచి ఈ నిర్ణయాన్ని అమలు చేస్తామని శాసనసభ అధికారులు తెలిపారు. 'రెండు గంటల జుమ్మా బ్రేక్ రద్దు చేయడం ద్వారా అసోం అసెంబ్లీ ఉత్పాదకతకు మొదటి ప్రాధాన్యత ఇచ్చింది. వలసపాలన తాలూకు అవశేషాన్ని తొలగించింది. అసెంబ్లీలో శుక్రవారం నమాజ్ విరామాన్ని ముస్లిం లీగ్‌కు చెందిన సయ్యద్ సాదుల్లా 1937లో తెచ్చారు' అని హిమంత ఎక్స్‌లో పేర్కొన్నారు.

గిరిజన బాలికపై గ్యాంగ్ రేప్

టీకమ్‌గఢ్: మధ్యప్రదేశ్‌లోని టీకమ్‌గఢ్‌లో పొలం పనికి వెళ్లిన 13 ఏళ్ల గిరిజన బాలికపై సామూహిక అత్యాచారం జరిగింది. ఖర్గపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పచెర్ గ్రామంలో ఆగస్టు 15వ తేదీన దారుణం చోటుచేసుకుంది. అయితే, బాధిత బాలిక కుటుంబీకులు గురువారం ఆ ప్రాంతంలో పర్యటించిన ఇన్‌చార్జి మంత్రి కృష్ణ గౌర్‌కి విషయం తెలపడంతో వెలుగులోకి వచ్చింది. మంత్రి ఆదేశాల మేరకు పోలీసులు గ్యాంగ్ రేప్ కేసు నమోదు చేసి, సలీం ఖాన్, లాలూ ఖాన్ అనే వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై భారతీయ న్యాయ్ సంహిత(బీఎన్ఎస్)తోపాటు పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేశామని ఎస్పీ రోహిత్ కష్వానీ చెప్పారు. 'బాధిత బాలిక తండ్రి ఢిల్లీలో కార్మికుడిగా పనిచేస్తుండగా, గ్రామంలో తల్లి తన పిల్లలతో ఉంటోంది. ఆగస్టు 15న పొలం పనికి వెళ్లిన బాలికను నిందితులు తమ పొలంలోకి తీసుకెళ్లి రేప్ చేశారు. విషయం ఎవరికైనా చెబితే చంపుతామని బెదిరించారు' అని ఖర్గపూర్ స్టేషన్ ఇన్‌చార్జి మనోజ్ ద్వివేది తెలిపారు. బాధిత కుటుంబీకులు రేప్ విషయాన్ని పోలీసుల దృష్టికి ఎందుకు తీసుకురాలేకపోయారనే విషయమై దర్యాప్తు చేపట్టామన్నారు.

ఛత్రపతి పాదాల వద్ద తలవంచి క్షమాపణ కోరుతున్నా..

- శివాజీ అభిమానులనూ క్షమాపణ అర్థిస్తున్నా
- శివాజీ విగ్రహం కూలడంపై ప్రధాని మోదీ తీవ్ర ఆవేదన
- మహారాష్ట్రలో వాద్వాన్ ఓడరేవు ప్రాజెక్టుకు శంకుస్థాపన

పాల్ఘార్: మహారాష్ట్రలోని సింధుదుర్గ్ జిల్లాలో ఇటీవల ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం కూలిపోవడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటన పట్ల శివాజీని, శివాజీ అభిమానులను క్షమాపణ కోరుతున్నట్లు చెప్పారు.. శివాజీ అంటే కేవలం ఒక పేరు, ఒక పాలకుడు కాదని అన్నారు. ఆయన మనకు ఒక దైవం అని స్పష్టంచేశారు. ఈ రోజు ఛత్రపతి పాదాల వద్ద తలవంచి క్షమాపణ కోరుతున్నానని తెలిపారు. విగ్రహం కూలిపోవడం పట్ల శివాజీ అభిమానుల మనసులు గాయపడ్డాయని, వారందరినీ క్షమాపణ అర్థిస్తున్నానని అన్నారు. మహారాష్ట్రలోని పాల్ఘార్ జిల్లాలో రూ.76,000 కోట్లతో నిర్మించే వాద్వాన్ ఓడరేవు ప్రాజెక్టుకు ప్రధాని మోదీ శుక్రవారం పునాది రాయి వేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ప్రసంగించారు. మనం పాటించే విలువలను చాలా భిన్నమైనవని పేర్కొన్నారు. దైవంలాంటి ఛత్రపతి శివాజీ కంటే మనకు ఇంకేదీ గొప్ప కాదని స్పష్టంచేశారు. పదేళ్ల క్రితం బీజేపీ ప్రధానమంత్రి అభ్యర్థిగా తన పేరు ఖరారు కాగానే మహారాష్ట్రలోని రాయ్‌గఢ్‌ను సందర్శించానని, శివాజీ సమాధి వద్ద ధ్యానం చేశానని మోదీ గుర్తుచేసుకున్నారు. మరాఠా వీరుడు వీర సావర్కర్‌ను కొందరు వ్యక్తులు ఇష్టారాజ్యంగా దూషిస్తున్నారని, అవమానిస్తున్నారని ఆరోపించారు. వారు ఆయనకు క్షమాపణ చెప్పడానికి సిద్ధంగా లేరని విమర్శించారు.

పదేళ్లలో చేపల ఉత్పత్తి రెట్టింపు

'అభివృద్ధి చెందిన భారత్' అనే మన లక్ష్య సాధనలో 'అభివృద్ధి చెందిన మహారాష్ట్ర' ఒక కీలక భాగమని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. రాష్ట్ర ప్రగతి కోసం గత పదేళ్లుగా అనేక చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. మహారాష్ట్ర శక్తిసామర్థ్యాలు, సంపదతో రాష్ట్ర ప్రజలే కాకుండా దేశమంతా ప్రయోజనం పొందాలన్నదే తమ ఉద్దేశమని వెల్లడించారు. తీర ప్రాంత గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. మత్స్యకారుల సహకార సంఘాలను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. వెనుకబడిన, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం తమ ప్రభుత్వం పూర్తి అంకితభావం, నిజాయితీతో పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళా సాధికారతకు కట్టుబడి ఉన్నట్లు చెప్పారు. చేపల పరిశ్రమలో మహిళల భాగస్వామ్యం మరింత పెరగాలన్నారు. 'ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన' ద్వారా వేలాది మంది మహిళల సాధికారతకు చేయూత అందించామని వివరించారు. చేపల ఉత్పత్తిలో మన దేశం ప్రపంచంలో రెండో అతి పెద్ద దేశంగా రికార్డుకెక్కిందని హర్షం వ్యక్తం చేశారు. 2014లో మన దేశంలో చేపల ఉత్పత్తి కేవలం 8 మిలియన్ టన్నులుగా ఉందని, ఇప్పుడు 17 మిలియన్ టన్నులకు చేరిందని వెల్లడించారు. పదేళ్లలో ఉత్పత్తి రెట్టింపు అయ్యిందన్నారు. రూ.76,000 కోట్లతో వాద్వాన్ పోర్టు నిర్మిస్తున్నామని, ఇది దేశంలోనే అతిపెద్ద కంటైనర్ పోర్టు అవుతుందని చెప్పారు. అభివృద్ధి దిశగా భారతదేశ ప్రయాణంలో ఇదొక చరిత్రాత్మకమైన రోజు అని మోదీ వ్యాఖ్యానించారు. రూ.1,560 కోట్లతో నిర్మించే 218 ఫిషరీస్ ప్రాజెక్టులకు సైతం ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. రూ.360 కోట్లతో రూపొందించిన వెస్సెల్ కమ్యూనికేషన్, సపోర్టు సిస్టమ్ ప్రారంభించారు. బానిసత్వపు సంకెళ్లు తెంచుకున్న 'నూతన భారత్'కు దేశ శక్తిసామర్థ్యాలు ఏమిటో పూర్తిగా తెలుసని స్పష్టంచేశారు.



3 నుంచి ప్రధాని బ్రూనై, సింగపూర్ పర్యటన

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ సెప్టెంబర్ మొదటి వారంలో సింగపూర్, బ్రూనై దేశాల్లో పర్యటించనున్నారు. సెప్టెంబర్ 3–4వ తేదీల్లో ప్రధాని మోదీ బ్రూనైలో పర్యటిస్తారని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ తెలిపారు. భారత ప్రధాని ఒకరు బ్రూనైలో పర్యటించడం ఇదే మొదటిసారని ఆయన చెప్పారు. రెండు దేశాల మధ్య సంబంధాలకు 40 ఏళ్లవుతున్న సందర్భంగా ప్రధాని అక్కడికి వెళ్తున్నారన్నారు. బ్రూనై నుంచి ప్రధాని సెప్టెంబర్ 4–5 తేదీల్లో సింగ్‌పూర్‌ను సందర్శిస్తారని చెప్పారు. సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్ ఆహ్వానం మేరకు మోదీ ఈ పర్యటన చేపట్టనున్నారని జైశ్వాల్ వివరించారు.

బాదల్ మత నియమ ఉల్లంఘనకు పాల్పడ్డారు

15 రోజుల్లో క్షమాపణ చెప్పాలని అకల్ తఖ్త్ ఆదేశం



అమృత్‌సర్: శిరోమణి అకాలీ దళ్(ఎస్ఏడీ) అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్ మత నియమోల్లంఘనకు పాల్పడ్డారని సిక్కుల అత్యున్నత అధికార కేంద్రం అకల్ తఖ్త్ పేర్కొంది. జతేదార్ జ్ఞాని రఘుబీర్ సింగ్ సారథ్యంలోని ఐదుగురు సిక్కు ప్రధాన అర్చకుల సారథ్యంలో అకల్ తఖ్త్ శుక్రవారం సమావేశమై ఈ మేరకు తీర్మానించింది. 2007–17 సంవత్సరాల మధ్య ఎస్ఏడీ పంజాబ్‌లో అధికారంలో ఉండగా ఘోరమైన నాలుగు తప్పిదాలకు పాల్పడిందని పేర్కొంది. ఆ పార్టీ చీఫ్ 15 రోజుల్లోగా తమ ఎదుట హాజరై లిఖిత పూర్వకంగా క్షమాపణ చెప్పాలని ఆదేశించింది. అప్పటి కేబినెట్‌లోని సిక్కు మంత్రులు కూడా క్షమాపణ చెప్పాల్సిందేనని స్పష్టం చేసింది. అకల్ తఖ్త్ తీర్మానంపై బాదల్ స్పందించారు. ఆ నిర్ణయాన్ని శిరసావహిస్తానన్నారు. త్వరలోనే అకల్ తఖ్త్ ఎదుట హాజరై క్షమాపణ కోరుతానని చెప్పారు.

మహిళా హక్కుల పరిరక్షకురాలు

జస్టిస్ హిమా కోహ్లిపై సీజేఐ చంద్రచూడ్ ప్రశంసలు



న్యూఢిల్లీ: జస్టిస్ హిమా కోహ్లి ఒక మహిళా జడ్జి మాత్రమే కాదని స్త్రీ హక్కుల పరిరక్షణకు తీవ్రంగా పాటుపడ్డారని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ కితాబిచ్చారు. సెప్టెంబరు 1న రిటైరవుతున్న హిమా కోహ్లి గౌరవార్థం సీజేఐ శుక్రవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఆమె రిటైరయ్యాక సర్వోన్నత న్యాయస్థానంలో ఇద్దరు మహిళా న్యాయమూర్తులు.. జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ బేలా ఎం. త్రివేదిలు ఉంటారు. 'జస్టిస్ కోహ్లితో కలిసి ధర్మాసనంపై కూర్చోవడం ఎంతో ఆహ్లాదాన్ని ఇస్తుంది. హిమా.. మీరొక మహిళా జడ్జి మాత్రమే కాదు.. స్త్రీల హక్కుల పరిరక్షకురాలు కూడా' అని సీజేఐ చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. ఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్స్ కాలేజీలో చంద్రచూడ్, హిమాకోహ్లిలు బ్యాచ్‌మేట్లు కావడం గమనార్హం. న్యాయం కోసం జస్టిస్ కోహ్లి తన జీవితాన్ని ధారబోశారని అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి అన్నారు. 2006 మే నెలలో ఢిల్లీ హైకోర్టు అదనపు జడ్జిగా నియమితులైన హిమా కోహ్లి.. 2007 ఆగస్టులో శాశ్వత జడ్జి అయ్యారు. జనవరి 7, 2021న తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2021 ఆగస్టు 31న సుప్రీంకోర్టు జడ్జిగా పదోన్నతి పొందారు.

ట్రంప్ శకం ముగిసింది!

రిపబ్లికన్‌కు ప్రభుత్వంలో చోటిస్తా ● సీఎన్ఎన్ ఇంటర్వ్యూలో హారిస్

వాషింగ్టన్: అమెరికా రాజకీయాల్లో ట్రంప్ శకం ముగిసిందని అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ అభిప్రాయపడ్డారు. ఆయన్ను దాటి ప్రగతిబాటన ముందుకు సాగేందుకు అమెరికా ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రిపబ్లికన్ల అధ్యక్ష అభ్యర్థి అయిన ట్రంప్‌ది దేశాన్ని విభజించే ఎజెండా అని ఆరోపించారు. తన రన్నింగ్‌మేట్ టిమ్ వాల్జ్‌తో కలిసి గురువారం సీఎన్ఎన్ చానల్‌కు హారిస్ ఇంటర్వ్యూ ఇచ్చారు. డెమొక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా ఖరారయ్యాక ఆమె ఇచ్చిన తొలి ఇంటర్వ్యూ ఇదే. వలసలు, వాతావరణ మార్పులతో పాటు చమురు వెలికితీత వంటి పలు అంశాలపై తన వైఖరిలో వచ్చిన మార్పులను హారిస్ పూర్తిగా సమర్థించుకున్నారు. తాను మొదటినుంచీ పాటిస్తూ వచ్చిన విలువల్లో మాత్రం ఇప్పటికీ, ఎప్పటికీ ఏ మార్పూ లేదని స్పష్టం చేశారు. తాను ప్రెసిడెంట్ అయితే రిపబ్లికన్ నేతకు ప్రభుత్వంలో స్థానం కల్పిస్తానని హారిస్ ప్రకటించారు. తద్వారా తాను అమెరికన్లందరికీ ప్రెసిడెంట్‌నని నిరూపిస్తానన్నారు. తన భారత, జమైకా మూలాలపై ట్రంప్ చేస్తున్న ఆరోపణలపై స్పందించేందుకు ఇష్టపడలేదు. దక్షిణాసియా వ్యక్తిగా చెప్పుకునేందుకు ఇష్టపడే హారిస్ అధ్యక్ష ఎన్నికల్లో లబ్ధి కోసం హఠాత్తుగా తన నల్లజాతి మూలాలను గురించి మాట్లాడుతున్నారని ట్రంప్ ఇటీవల పదేపదే ఆరోపిస్తుండటం తెలిసిందే. మెక్సికో నుంచి అక్రమ వలసలు అమెరికన్ల భద్రతకు ప్రధాన సమస్యేనని హారిస్ అన్నారు. వాటిపై కఠినంగా వ్యవహరిస్తానని స్పష్టం చేశారు. గాజా తదితరాలపై బైడెన్ విధానాలను కొనసాగిస్తానని ఆమె వెల్లడించారు.



బైడెన్ ఫోన్ చేసిన వేళ...

పోటీ నుంచి తప్పుకోవాలని అధ్యక్షుడు జో బైడెన్ నిర్ణయించుకున్నాక ఆ విషయం తనకు వ్యక్తిగతంగా ఫోన్ చేసి తెలిపారని హారిస్ వెల్లడించారు. ''నేనప్పుడు నా కుటుంబీకులతో సరదాగా గడుపుతున్నా. పాన్‌కేకులు తినడం ముగించి పజిల్ సాల్వ్ చేస్తుండగా బైడెన్ ఫోన్ చేసి ఈ మాట చెప్పారు. నిజమేనా అని ఒకటికి రెండుసార్లు అడిగా. ఆయన అవునన్నారు. తన స్థానంలో నేనే అభ్యర్థి కావాలని స్పష్టంగా చెప్పారు'' అని గుర్తు చేసుకున్నారు.

ఇద్దరు వ్యోమగాములతోనే.. ఐఎస్ఎస్‌కు 'డ్రాగన్'

ఫిబ్రవరిలో సునీతతో తిరిగి రాక

వాషింగ్టన్: సెప్టెంబర్లో ప్రయోగించనున్న స్పేస్ ఎక్స్ డ్రాగన్ రాకెట్‌లో నలుగురు వ్యోమగాములకు బదులు ఇద్దరే అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లనున్నట్టు శుక్రవారం ప్రకటించింది. ''నిక్ హేగ్ (అమెరికా), అలెగ్జాండర్ గోర్బునోవ్ (రష్యా) డ్రాగన్‌లో ప్రయాణించనున్నారు. మరో ఇద్దరు నాసా వ్యోమగాములు జెనా కార్డ్‌మన్, స్టెఫానీ విల్సన్ వెళ్లడం లేదు'' అని తెలిపింది. ఐఎస్ఎస్‌లో చిక్కుకుపోయిన సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌లను ఫిబ్రవరిలో వెనక్కు తీసుకొచ్చేందుకు వీలుగా అందులో రెండు సీట్లు ఖాళీగా ఉంచాలని నిర్ణయించడమే ఇందుకు కారణం. వారిద్దరూ గత జూన్‌లో బోయింగ్ తొలిసారిగా ప్రయోగించిన స్టార్‌లైనర్‌లో ఐఎస్ఎస్‌కు వెళ్లడం తెలిసిందే. ఆ క్రమంలో అందులో చాలా సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దాంతో స్టార్‌లైనర్ క్షేమంగా తిరిగిరావడంపై అనుమానాలు కమ్ముకున్నాయి. వాటికి మరమ్మతులు కూడా పూర్తిస్థాయిలో సాధ్యపడలేదు. ఈ నేపథ్యంలో వ్యోమగాములను అందులో వెనక్కు తీసుకు రావడం క్షేమం కాదని నాసా నిర్ణయించింది. స్టార్‌లైనర్ శుక్రవారం ఖాళీగానే తిరిగి వచ్చే అవకాశముంది.

భారత్‌లో సదస్సు నిర్వహించండి

- మోదీకి జెలెన్‌స్కీ ప్రతిపాదన
- ఉక్రెయిన్‌కు మద్దతు కూడగట్టడమే లక్ష్యం



న్యూఢిల్లీ: రష్యాతో యుద్ధం ముగించడమే లక్ష్యంగా భారత్‌లో ప్రపంచదేశాల సదస్సును నిర్వహించాలని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమియర్ జెలెన్‌స్కీ కోరారు. ఈనెల 23న మోదీ ఉక్రెయిన్‌లో పర్యటించినపుడు జెలెన్‌స్కీ ఈ ప్రతిపాదనను ఆయన ముందుంచారని విశ్వసనీయవర్గాలు తెలిపాయి. అమెరికా అధ్యక్ష ఎన్నికలకు (నవంబరు 5) ముందే రెండో ప్రపంచ దేశాధినేతల సదస్సు జరగాలని జెలెన్‌స్కీ కోరుకుంటున్నారు. గ్లోబల్ సౌత్ (దక్షిణార్ధగోళ) దేశాల మద్దతును కూడగట్టాలని జూన్‌లో స్విట్జర్లాండ్ వేదికగా జరిగిన తొలి సదస్సులో ఉక్రెయిన్ యత్నించింది. అంతర్జాతీయంగా గుర్తించిన సరిహద్దుల మేరకు ఉక్రెయిన్ సార్వభౌమత్వానికి తమ మద్దతు ఉంటుందని మోదీ 23న సంకేతాలిచ్చారు. అయితే ఉక్రెయిన్ కోరినట్లుగా సదస్సు నిర్వహించడానికి భారత్ ఇంకా సమ్మతించలేదు. రష్యా– ఉక్రెయిన్ యుద్ధ విమరణ కోసం శాంతి ప్రక్రియలో నిర్మాణాత్మక పాత్ర పోషించడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రధాని మోదీ సంకేతాలిచ్చారని విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ ఒక ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. గ్లోబల్ సౌత్ దేశాల్లో.. ముఖ్యంగా భారత్‌లో రెండో అంతర్జాతీయ సదస్సు జరగాలని ఉక్రెయిన్ కోరుకుంటోందని జెలెన్‌స్కీ అధికార ప్రతినిధి తెలిపారు. శాంతి సాధన కోసం జెలెన్‌స్కీ 10 అంశాల ఫార్ములాను రూపొందించారు. ఉక్రెయిన్ భూభాగంలోని ఆక్రమిత ప్రాంతాలన్నింటి నుంచీ రష్యా వైదొలగాలని, ముఖాముఖి చర్చలకు ముందు ప్రపంచదేశాలు రష్యాను దూరంగా పెట్టాలని జెలెన్‌స్కీ కోరుతున్నారు. శాంతిచర్చల వేదికపై రష్యా ఉన్నపుడే.. ఏ ప్రయత్నమైనా ముందుకు సాగుతుందని గ్లోబల్ సౌత్ దేశాలు అంటున్నాయి. స్విట్జర్లాండ్‌లో జూన్ 15–16 తేదీల్లో జరిగిన చర్చలకు 100 పైగా దేశాలు హాజరైనప్పటికీ.. ఉక్రెయిన్ ప్రపంచ మద్దతును కూడగట్టడంలో పూర్తిగా సఫలీకృతం కాలేకపోయింది. చైనా గైర్హాజరు కాగా, భారత్, ఇండోనేషియా, దక్షిణాఫ్రికాలు తుది ప్రకటనపై సంతకం చేసేందుకు నిరాకరించాయి.

అమిత్‌షాతో పశ్చిమబెంగాల్ గవర్నర్ భేటీ

వైద్యురాలి హత్యానంతర పరిణామాలను వివరించిన ఆనంద బోస్



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను శుక్రవారం పశ్చిమబెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్ కలిశారు. అమిత్ షా నివాసంలో జరిగిన భేటీలో కోల్‌కతాలోని ఆర్జీ కర్ ఆస్పత్రిలో ట్రెయినీ వైద్యురాలి హత్యోదంతం, అనంతర పరిణామాలపై చర్చించారు. ఈ ఘటనపై సీబీఐ విచారణ, రాష్ట్ర పోలీసు శాఖ బాధ్యత వంటి విషయాలపై సుమారు గంటపాటు వీరిద్దరి మధ్య చర్చ జరిగింది. వైద్యురాలి మృతి వ్యవహారంలో చోటుచేసుకున్న పరిణామాలపై హోంశాఖకు ఆనంద్ బోస్ నివేదిక అందజేశారు. గత వారం గవర్నర్ ఆనంద బోస్ ఢిల్లీలో రాష్ట్రపతి ముర్ముతోపాటు ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌ను కలిసి ఆర్జీ కర్ ఆస్పత్రి ఘటన, అనంతరం రాష్ట్రంలో చోటుచేసుకున్న పరిణామాలను వారికి వివరించడం తెలిసిందే.



25 రోజుల్లో 570 ఫోన్లు రికవరీ

25 రోజుల్లో 570 మొబైల్ ఫోన్లు రికవరీ చేశామని సైబరాబాద్ క్రైమ్స్ డీసీపీ కె.నర్సింహ అన్నారు. ఫోన్ పోగానే సీఈఐఆర్ యాప్‌లో ఫోన్ నంబర్ నమోదు చేయాలన్నారు. -8లో



గ్లోబల్ ఫేవరెట్.. మొరాకో

న్యూయార్క్‌తో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందిన మొరాకన్ రెస్టారెంట్ నగరంలోని జూబ్లీహిల్స్ వేదికగా ప్రారంభమైంది. - సిటీ ప్లస్‌లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.0/23.0

నగరంలో శనివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉంది. గరిష్టంగా 30, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

పీర్జాదిగూడ మేయర్‌గా అమర్‌సింగ్



మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ నూతన మేయర్‌గా అమర్ సింగ్ ఎన్నికయ్యారు. ఈ నెల 9న గత మేయర్ జక్క వెంకట్ రెడ్డిపై కార్పొరేటర్లు పెట్టిన అవిశ్వాసం నెగ్గడంతో జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశాల మేరకు శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్ రెడ్డి శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 11.30 గంటలకు నూతన మేయర్ నామినేషన్ స్వీకరించారు. మేయర్ పదవి అమర్ సింగ్ నామినేషన్ మాత్రమే రావడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆర్డీవో అధికారంగా ప్రకటించి నియామక పత్రాన్ని అందించారు. అమర్ సింగ్ మేయర్‌గా బాధ్యతలను స్వీకరించారు. అనంతరం మేయర్, కార్పొరేటర్లు, నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. సన్మాన కార్యక్రమంలో కాంగ్రెస్ మేడ్చల్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, హరివర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ ఎరినాను పరిశీలించిన మేయర్



కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీ నెక్సస్‌మాల్ ఎదురుగా ఫ్లై ఓవర్ కింద కొత్తగా ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ ఎరినా సెంటర్‌ను శుక్రవారం నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పరిశీలించారు. వినాయక చవితి సందర్భంగా చెరువుల వద్ద చేపట్టనున్న నిమజ్జన ఏర్పాట్లును పరిశీలించేందుకు కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌తో కలిసి ప్రగతి నగర్ చెరువును పరిశీలించారు. అనంతరం ఐడీఎల్ చెరువుకు వెళ్లే మార్గంలో కేపీహెచ్‌బీ కాలనీలోని స్పోర్ట్స్ ఏరినాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇండోర్ క్రీడలకు అనువుగా తీర్చిదిద్దిన స్పోర్ట్స్ ఎరినా ఆకట్టుకునేలా ఉందని అధికారులను అభినందించారు. మిగిలిన ఫ్లై ఓవర్స్ కిందా ఇలాగే ఏర్పాట్లు చేయాలని, ఆధునికంగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఇ చిన్నారెడ్డి, ఈఈ శ్రీనివాస్, డీఈ ఆనంద్, ఏఈ సాయిప్రసాద్ పాల్గొన్నారు.

నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్ బదిలీ



రామకృష్ణారావు

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావుపై బదిలీ వేటు పడింది. ఇటీవల నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సర్వే నంబర్ 134లోని ఎర్రకుంట ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు జరిగాయనే ఫిర్యాదుతో స్పందించిన హైడ్రా మూడు అపార్ట్‌మెంట్‌లను ఈ నెల 14న కూల్చివేసింది. ఇక్కడి నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన బాచుపల్లి తహసీల్దార్ పూల్‌సింగ్, కమిషనర్ రామకృష్ణారావులను అధికారులు బాధ్యులుగా గుర్తించారు. రెవెన్యూ విభాగానికి చెందిన సర్వేయర్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ హస్తం ఉన్నట్లు విచారణలో తేలింది. తహసీల్దార్ పూల్‌సింగ్ ప్రమేయం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. హెచ్ఎండీఏ అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ సుధీర్‌కుమార్ అనుమతి మంజూరు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని గుర్తించారు. నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావుపైనా చర్యలకు హైడ్రా సిద్ధమైంది. ఈ క్రమంలోనే కమిషనర్‌ను నిజాంపేట్ నుంచి నర్సాపూర్ బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జనరల్ ట్రాన్స్‌ఫర్‌లో భాగంగా ఈ బదిలీ జరిగిందా? లేక ఎర్రకుంట సమస్యతోనే బదిలీ అయ్యిందా? అనే విషయంలో స్థానికంగా తీవ్రంగా చర్చ జరుగుతుంది. ప్రస్తుతం నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్‌గా సౌజన్య నియమితులయ్యారు.

న్యాయం చేసేదెవరు?: నిర్మాణాలు పూర్తయిన తర్వాత ఎఫ్‌టీఎల్‌లో ఉన్నాయంటూ హైడ్రా కూల్చివేయడం అన్యాయమని వాటి యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్ని అనుమతులు ఇస్తేనే తాము నిర్మాణాలు పూర్తి చేశామని, నోటీసులు ఇవ్వకుండా కూల్చివేయడంతో తీవ్రంగా నష్టపోయామని, తాము న్యాయ పోరాటం చేస్తామని బిల్డర్లు చెబుతున్నారు.

మహిళలు భద్రంగా ఉన్నామని ఫీలయ్యే రోజులు రావాలి

- ఆధ్యాత్మిక భావనతోనే హైదరాబాద్‌కు వచ్చా
- ప్రియాంక గాంధీ భర్త రాబర్ట్ వాద్రా



పెద్దమ్మ ఆలయంలో..

బంజారాహిల్స్: ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ భర్త రాబర్ట్ వాద్రా కీలక వ్యాఖ్యలు చేశారు. తన భార్య, కూతురు సహా దేశ మహిళలందరూ తాము భద్రంగా ఉన్నామని ఫీలయ్యే రోజులు రావాలని కోరుకుంటున్నట్లు రాబర్ట్ వాద్రా అన్నారు. శుక్రవారం ఆయన జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో తాను పవర్ ఆఫ్ సెంటర్ కావడం కాలమే నిర్ణయిస్తుందన్నారు. తాను కేవలం ఆధ్యాత్మిక భావనతోనే హైదరాబాద్‌కు వచ్చానని రాబర్ట్ వాద్రా స్పష్టం చేశారు. అనంతరం బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని మసీదులో ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



రాబర్ట్ వాద్రాకు ఆధ్యాత్మిక గ్రంథాల అందజేత









గణనాథులకు తుది మెరుగులు

నవరాత్రి ఉత్సవాలకు గణనాథులు సిద్ధమవుతున్నారు. వినాయక చవితి సమీపిస్తుండటంతో కళాకారులు గణేష్ విగ్రహాలకు తుది మెరుగులు దిద్దుతున్నారు. ఉప్పల్‌లో గణపతి ప్రతిమలు శరవేగంగా తయారవుతున్నాయి. మూషిక వాహనుడి మూర్తులు నగరంలో భారీ సంఖ్యలో కొలువుదీరనున్నాయి.

ఎల్‌ఆర్‌ఎస్.. రూల్స్ చేంజ్

హెచ్ఎండీఏతో పాటు రెవెన్యూ, ఇరిగేషన్ తనిఖీలు తప్పనిసరి

- మూడు విభాగాలు అనుమతిస్తేనే ముందుకు..
- హైడ్రా ఎఫెక్ట్‌తో పలు మార్పులు
- ఇప్పటి వరకు హెచ్ఎండీఏ పరిధిలోనే ఎల్‌ఆర్‌ఎస్...

నిబంధనలను సవరించిన ప్రభుత్వం



ఆదాయం రూ.1000 కోట్లకు పైగా..

హెచ్ఎండీఏ పరిశీలనలో ఉన్న 3.44 లక్షలకు పైగా దరఖాస్తుల నుంచి ప్రభుత్వానికి ఫీజుల రూపంలో రూ.1000 కోట్లకు పైగా ఆదాయం వచ్చే అవకాశం ఉన్నట్లు అంచనా. ప్రస్తుతం అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు ప్రభుత్వాన్ని నిధుల లేమి వెంటాడుతున్న దృష్ట్యా వివిధ మార్గాల్లో ఆదాయ సముపార్జనపైన ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ క్రమంలోనే ఎల్‌ఆర్‌ఎస్ అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్ణయించినట్లు అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. హెచ్ఎండీఏ నుంచి రూ.1000 కోట్లకు పైగా ఆదాయం రావచ్చని అంచనా వేస్తుండగా.. మున్సిపాలిటీల ద్వారా అందజేసే ఎల్‌ఆర్‌ఎస్ అనుమతులతోనూ మరో రూ.500 కోట్లకు పైగా ఆదాయం వచ్చే అవకాశం ఉండవచ్చని అంచనా.

సాక్షి, సిటీబ్యూరో: అక్రమ స్థలాల క్రమబద్ధీకరణ పథకం (లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) నిబంధనలను ప్రభుత్వం సవరించింది. ఇప్పటి వరకు హెచ్ఎండీఏ అధికారులే క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి ఎల్‌ఆర్‌ఎస్ అందజేస్తుండగా ఇక నుంచి హెచ్ఎండీఏతో పాటు రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు కూడా సంయుక్తంగా క్షేత్రస్థాయి తనిఖీల్లో తప్పనిసరిగా పాల్గొనాలని పేర్కొంది. సదరు లే అవుట్‌లు, ప్లాట్‌లు చెరువులు, కుంటలు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల పరిధిలో లేవని మూడు విభాగాలకు చెందిన అధికారులు నిర్ధారించిన తర్వాతే ఎల్‌ఆర్‌ఎస్ అందజేయనున్నారు. లేఅవుట్‌లను క్రమబద్ధీకరించే బాధ్యతలు హెచ్ఎండీఏ పరిధిలోనే ఉన్నప్పటికీ రెవెన్యూ ఇరిగేషన్ ఆమోదం తప్పనిసరిగా మారింది. దీంతో భవిష్యత్‌లో నిర్మాణదారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భవనాలను నిర్మించుకొనేందుకు అవకాశం లభిస్తుంది. హెచ్ఎండీఏ పరిధిలో స్థలాల క్రమబద్ధీకరణ కోసం 2020లో దరఖాస్తు చేసుకున్న వారికి ప్రస్తుతం ఎల్‌ఆర్‌ఎస్‌లను అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిన సంగతి తెలిసిందే. మున్సిపాలిటీల పరిధిలోని ప్లాట్‌లకు స్థానిక సంస్థల నుంచి అనుమతులు లభించనున్నాయి. గ్రామ పంచాయతీల్లో ఉన్న లేఅవుట్‌లకు మాత్రం హెచ్ఎండీఏ నుంచి ఎల్‌ఆర్‌ఎస్ అనుమతులు లభించనున్నాయి. సుమారు 3.44 లక్షలకు పైగా ఎల్‌ఆర్‌ఎస్ అనుమతులను అందజేయాల్సి ఉంది.

క్లస్టర్‌ల ఏర్పాటు..

ఎల్‌ఆర్‌ఎస్‌ల పరిశీలన కోసం హెచ్ఎండీఏ పరిధిలోని శంషాబాద్, ఘట్‌కేసర్, మేడ్చల్-1, మేడ్చల్-2, శంకర్‌పల్లి-1, శంకర్‌పల్లి-2 జోన్‌లలోని గ్రామాలను క్లస్టర్లుగా ఏర్పాటు చేశారు. ఒక క్లస్టర్ పరిధిలో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్ ఫైళ్ల పరిశీలన కోసం జిల్లా కలెక్టర్ నియమించిన రెవెన్యూ అధికారులు, హెచ్ఎండీఏ ప్లానింగ్ విభాగం నుంచి సహాయ ప్లానింగ్ అధికారి, ఇరిగేషన్ విభాగం నుంచి ఏఈ స్థాయి అధికారి ఆయా క్లస్టర్‌లలో ఉన్న ప్లాట్‌లను స్వయంగా పరిశీలిస్తారు. ఆ ప్లాట్‌లు ప్రభుత్వ భూములు, చెరువులు, బఫర్‌జోన్‌లలో ఉన్నట్లు గుర్తిస్తే ఎల్‌ఆర్‌ఎస్‌కు అవకాశం ఉండదు. సాధారణంగా లేఅవుట్‌ల క్రమబద్ధీకరణలో ఇప్పటి వరకు ఇరిగేషన్, రెవెన్యూ విభాగాల నుంచి వచ్చే నిరభ్యంతర పత్రాలను పరిశీలించి హెచ్ఎండీఏ అధికారులే అనుమతులను ఇస్తున్నారు. కానీ.. ఇక నుంచి తాజాగా చేసిన మార్పుల మేరకు దరఖాస్తుల పరిశీలన దశలోనే మూడు విభాగాలు కలిసి ఈ ప్రక్రియను పూర్తి చేస్తాయి. దీంతో ప్రత్యేకంగా ఎన్ఓసీల అవసరం ఉండదు. హైడ్రా ప్రభావంతో చేసిన ఈ మార్పులు బాగానే ఉన్నప్పటికీ ఎల్‌ఆర్‌ఎస్ అనుమతులలో మరింత జాప్యం చోటుచేసుకొనే అవకాశం ఉంటుందని స్థలాల యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివిధ కారణాలతో ఇప్పటికే ఫైళ్లు నత్తనడకన సాగుతుండగా మూడు విభాగాలకు చెందిన అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరమే అనుమతులు ఇవ్వడం వల్ల మరింత జాప్యం నెలకొంటుందని పేర్కొంటున్నారు.

మొబైల్ యాప్ ద్వారా పరిశీలన...

ప్లాట్లు, ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ కోసం అప్పటి ప్రభుత్వం 2020లో నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో హెచ్ఎండీఏ పరిధిలోని వివిధ జోన్‌లలో లక్షల్లో దరఖాస్తులు వెల్లువెత్తాయి. రూ.1000 దరఖాస్తు రుసుము చెల్లించి చాలా మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సమర్పించారు. వీటిని పరిశీలించి ప్రొసీడింగ్‌లను ఇచ్చేందుకు అప్పట్లో ప్రభుత్వం కలెక్టర్‌లకు బాధ్యతలను అప్పగించింది. ఈ క్రమంలోనే కోర్టు కేసుల కారణంగా ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు. దరఖాస్తుదారుల వివరాలన్నింటిని సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) సేకరించి నిక్షిప్తం చేసింది.ఇలా పెండింగ్ జాబితాలో పడిన ఎల్‌ఆర్‌ఎస్‌లను పరిశీలించి అనుమతులను ఇవ్వాలని గత ప్రభుత్వం హయాంలోనే నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు హెచ్ఎండీఏలోని వివిధ జోన్‌ల నుంచి 3,44,726 దరఖాస్తులు అందాయి. ఇవి కాకుండా మున్సిపాలిటీల పరిధిలో మరో 1.5 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు అంచనా. వీటిపై దరఖాస్తుదారులు ఆయా మున్సిపల్ కార్యాలయాల నుంచే ఎల్‌ఆర్‌ఎస్ అనుమతులను పొందవచ్చు. ఎల్‌ఆర్ ఎస్ దరఖాస్తుల పరిశీలన కోసం సీజీజీ తాజాగా ఓ యాప్‌ను సిద్ధం చేసింది.

ఎవరి గోల వారిదే!

'హైడ్రా'ను అడ్డంగా వాడేసుకుంటున్న పలువురు

- దీని పేరుతో భయపెడుతున్న కొందరు అధికారులు
- సోషల్ మీడియాలో ఇబ్బడిముబ్బడిగా కార్టూన్లు, మీమ్స్
- కంటెయినర్ ఇళ్లంటూ ప్రచారం చేసుకుంటున్న వ్యాపారులు



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీని (హైడ్రా) ఎవరికి నచ్చినట్లు వారు వాడేసుకుంటున్నారు. చెరువులు, కుంటలు, నాలాలు, పార్కులతో పాటు ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసం సర్కారు ఈ విభాగానికి రూపమిచ్చింది. ఇంకా పూర్తి స్థాయిలో సిబ్బంది రాకుండానే తన బుల్డోజర్లకు పని చెప్పిన హైడ్రా నగరంలో హాట్ టాపిక్‌గా మారింది. దీన్ని ఎవరెవరు? ఎలా? వాడుకుంటున్నారంటే..

అధికార ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం..

ఈ 'బుల్డోజర్ వింగ్' పని తీరును ఆధారంగా చేసుకుని అధికార, ప్రతిపక్షాలు మాటల తూటాలు పేల్చుకుంటున్నాయి. ఇది భావితరాల భవిష్యత్ కోసమని ఒకరంటే.. హైడ్రా కాదు హైడ్రామా అని అని మరొకరు అంటున్నారు. ఈ కూల్చివేత వెనుక రాజకీయ వేధింపులు, కక్ష సాధింపులు ఉన్నాయని, ఓ పార్టీ వారినే టార్గెట్ చేసుకున్నారని, ఓ వర్గం జోలికి వెళ్లట్లేదని మరికొందరు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం మాత్రం నగరంలో హైడ్రా పని తీరుపై పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తోంది. దీన్ని మరింత బలోపేతం చేయడానికి, ఇతర ప్రాంతాలకూ విస్తరించడానికి సన్నాహాలు చేస్తోంది.

నోటీసులతో భయపెడుతున్న అధికారులు..

హైడ్రా అధికారులు ఇప్పటికే నగరంతో పాటు శివార్లలో ఉన్న అనేక కట్టడాలను కూల్చేసింది. అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలపై నోటీసులు ఇచ్చే అధికారం వీరికి లేకున్నా.. లోకల్ బాడీస్‌తో ఇప్పిస్తున్నారు. దీంతో ఏ విభాగం? ఎప్పుడు? ఏమని నోటీసులు ఇస్తుందో అనే భయం అనేక మందిలో ఉంది. దీన్ని కొన్ని విభాగాలకు చెందిన అధికారులు క్యాష్ చేసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. హైడ్రా కూల్చేస్తుందంటూ కొన్ని నిర్మాణాలకు అనుమతులు ఇచ్చి, భయభ్రాంతులకు గురి చేసి, తమ 'పని' కానిచ్చుకుంటున్నారని తెలుస్తోంది. గురువారం ప్రధాన కార్యదర్శి వద్ద జరిగిన సమావేశంలోనూ ఈ అంశం చర్చకు వచ్చినట్లు సమాచారం.

ఈ టైమ్‌లో కంటెయినర్లే బెటర్ అంటూ..

హైడ్రా కార్యకలాపాలను వ్యాపారులు సైతం తమకు అనుకూలంగా మార్చేసుకుంటున్నారు. గడచిన కొన్నేళ్లుగా కంటెయినర్ ఇళ్లు బాగా ప్రాచుర్యం పొందాయి. దీనికోసం అనేక తయారీ కంపెనీలు సైతం పుట్టుకువచ్చాయి. ఇప్పటి వరకు ఈ కంటెయినర్ ఇళ్లను ఎక్కువగా ఫామ్‌హౌస్‌లు, బోట్ హౌస్‌లు, గెస్ట్‌హౌస్‌లతో పాటు దుకాణాల కోసమే నిర్వహిస్తున్నారు. ఫుల్ ట్యాంక్ లెవల్, బఫర్ జోన్లలో ఉన్న ఇళ్లను హైడ్రా కూల్చేస్తోంది. ఈ నేపథ్యంలోనే కంటెయినర్ ఇళ్లు ఖరీదు చేసుకోవాలని, వీటిని ఎప్పుడు కావాలంటే అప్పుడు, ఎక్కడకు కావాలంటే అక్కడకు తరలించవచ్చంటూ ఓ వ్యాపార సంస్థ ప్రచారం చేసుకుంటోంది. యాడ్‌లో ఓ భవనం కూల్చివేత ఫొటో, పక్కనే కంటెయినర్ ఇంటి ఫొటోలు పెట్టి హల్‌చల్ చేస్తోంది.

'ఓ స్త్రీ రేపు రా' గుర్తు చేస్తూ కార్టూన్..

సోషల్‌మీడియాలో హైడ్రాను ఉటంకిస్తూ అనేక మీమ్స్, కార్టూన్లు వైరల్‌గా మారుతున్నాయి. వీటిలో 'ఓ స్త్రీ రేపు రా'ను గుర్తు చేస్తూ రూపొందించిన కార్టూన్ వివిధ సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో చక్కర్లు కొడుతోంది. ఓ స్త్రీ రేపు రా.. కొన్నేళ్ల క్రితం ఎవరి నోట విన్నా ఎక్కడ చూసినా ఇదే టాపిక్ ఉండేది. ప్రతి ఇంటి తలుపు మీద అలా రాసి ఉండేది. ఎవరో ఒక మహిళ బిచ్చం ఎత్తుకోవడానికి వస్తుందని, ఆమెకు పొరపాటున బిచ్చం వేస్తే... అలా వేసిన వాళ్లు వెంటనే చనిపోతారనే వదంతులు అప్పట్లో సంచలనం సృష్టించాయి. ఆ మహిళ వచ్చినపుడు తలుపు మీద ఓ స్త్రీ రేపు రా అని రాసి ఉంటే అది చదువుకుని వెళ్లిపోతుందంటూ అలా చేయించారు. తాజాగా హైడ్రా హల్‌చల్ నేపథ్యంలో ఓ ఇంటిపై 'ఓ బుల్డోజర్ రేపు రా' అని రాసి ఉన్న కార్టూన్ వైరల్‌గా మారింది.



కత్వా చెరువు కబ్జా



మల్లంపేట కత్వా చెరువును ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలు

దుండిగల్: చెరువులను కబ్జా చేసి చేపట్టిన నిర్మాణాలపై 'హైడ్రా' ఉక్కుపాదం మోపుతోంది. అక్రమార్కులు హైడ్రా పేరు వినగానే హడలిపోతున్నారు. వరుసగా అక్రమ నిర్మాణాలనూ కూల్చివేస్తున్న అధికారులు మల్లంపేటలో కబ్జాకు గురైన కత్వా చెరువుపై ఏం చర్యలు తీసుకుంటారోనని ఉత్కంఠ నెలకొంది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గండిమైసమ్మ-దుండిగల్ మండలం మల్లంపేటలోని సర్వే నెంబరు 170/3, 170/4, 170/5లోని 15 ఎకరాలను మూడు దశాబ్దాల క్రితం ముగ్గురు స్వాతంత్ర్య సమరయోధులకు ప్రభుత్వం కేటాయించింది. ఏడేళ్ల క్రితం శ్రీలక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్ సంస్థ ఈ భూమిని కొనుగోలు చేసింది. 3.20 ఎకరాల స్థలంలో విల్లాల నిర్మాణం కోసం ఆ సంస్థ 6,418 చదర పు గజాల్లో 35 విల్లాలు, 5,394 చదరపు గజాల్లో మరో 30 విల్లాల నిర్మాణ అనుమతుల కోసం హెచ్ఎండీఏకు దరఖాస్తు చేసుకుంది.



బఫర్ జోన్‌లో నిర్మించిన విల్లాలు


గ్రామ పంచాయతీ అనుమతులతో నిర్మాణాలు..

- హెచ్ఎండీఏ నుంచి 65 విల్లాలకు మాత్రమే అనుమతులు తీసుకున్న సదరు సంస్థ గ్రామ పంచాయతీ అనుమతి పత్రాలు సృష్టించి ఏకంగా 260 విల్లాలను నిర్మించింది. అనుమతులు తీసుకోకుండా అక్రమంగా విల్లాలు నిర్మించారని మున్సిపల్ అధికారులు 2021లో వీటిని సీజ్ చేశారు.
- మల్లంపేటలోని ఈ విల్లాల పక్కనే కత్వా చెరువు ఉంది. నిర్మాణ సంస్థ తమ 15 ఎకరాలతో పాటు మరో మూడు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసినట్లు ఆరోపణలున్నాయి. విషయాన్ని గుర్తించిన ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు 2021 సెప్టెంబరులో జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు.
- ఎఫ్‌టీఎల్‌లో 1.14 గుంటలు, బఫర్ జోన్‌లో 16 గుంటల భూమి కబ్జాకు గురైనట్లు గుర్తించారు. నిర్మాణ సంస్థ మొత్తం 1.30 ఎకరాల చెరువు స్థలంలో అక్రమంగా 8 విల్లాలను నిర్మించింది. చెరువును చెరిపేసి అక్రమంగా చేపట్టిన విల్లాలను కూల్చివేయాలని పలువురు కోరుతున్నారు. హైడ్రా అధికారులు చెరువులను పరిరక్షించి అక్రమ నిర్మాణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఇక కత్తిరింపే!

హెచ్చరికలను బేఖాతరు చేసిన కేబుల్ ఆపరేటర్లు

- ఇప్పటికే మూడుసార్లు ఆదేశాలు జారీ చేసిన డిస్కం
- స్తంభాలకు వేలాడుతున్న వైర్ల తొలగింపునకు ఆదేశం



సాక్షి, సిటీబ్యూరో: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌లకే కాదు ఆర్టిజన్ కార్మికుల మృత్యువాతకు కారణమవుతున్న టీవీ, ఇంటర్నెట్ కేబుల్స్‌ను పూర్తిస్థాయిలో తొలగించేందుకు డిస్కం రంగం సిద్ధం చేసింది. విద్యుత్ స్తంభాలకు గుదిబండగా మారిన ఈ కేబుల్స్‌ను ఎక్కడిక్కడే కత్తిరించేయాలని నిర్ణయించింది. కేబుల్స్ మాటున విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఇంటర్నెట్, టీవీ ఆపరేటర్లపై కేసులు నమోదు చేయనుంది. నగరంలోని పలు విద్యుత్ లైన్లు చెట్ల కిందే ఉన్నాయి. ఈదురు గాలులతో కూడిన వర్షానికి ఆయా చెట్ల కొమ్మలు విరిగి లైన్లపై పడుతున్న విషయం తెలిసిందే. రెండు స్తంభాల మధ్య పెద్ద సంఖ్యలో టీవీ, ఇంటర్నెట్ కేబుల్స్ వేలాడుతుండటం, కొమ్మల బరువుకు స్తంభాలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలుతున్న విషయం తెలిసిందే. విద్యుత్ సరఫరాలో గంటల తరబడి అంతరాయానికి కారణమవుతోంది. ఇన్సులేటర్ ఫెయిల్, లూజు కనెక్షన్ల వల్ల జాయింట్ల వద్ద స్పార్క్‌లు ఏర్పడి ఇంట్లోకి సరఫరా నిలిచిపోతుండటం, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు లైన్‌మెన్లు, ఆర్టిజన్ కార్మికులు ఆయా స్తంభాలపైకి ఎక్కాల్సి వస్తుండటం, స్తంభాల చుట్టూ వేలాడుతున్న కేబుల్స్ ఉండలు కార్మికుల కాలుకు తగిలి వారు జారిపడుతుండటం తెలిసిందే. ఇటు సరఫరాకు, అటు కార్మికుల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ కేబుల్స్‌ను తొలగించాలని డిస్కం సీఎండీ ముషారఫ్ ఫరూఖీ నిర్ణయించారు. ఆ మేరకు ఆయా ప్రాంతాల్లోని కేబుల్ ఆపరేటర్లతో మూడు దఫాలుగా చర్చలు జరిపారు. ఎవరి కేబుళ్లు వారు తొలగించుకోవాల్సిందిగా సూచించగా, కొంత మంది స్వచ్ఛందంగా కేబుళ్లను తొలగించుకున్నారు. మెజార్టీ ఆపరేటర్లు మాత్రం సీఎండీ ఆదేశాలను బేఖాతరు చేశారు. డిస్కం వారికి ఇచ్చిన గడువు కూడా ముగియడంతో ఇక యాక్షన్‌లోకి దిగాల్సిందిగా సీఎండీ ఫరూఖీ క్షేత్రస్థాయి ఇంజినీర్లకు ఆదేశాలు జారీ చేశారు.

రాంనగర్‌లో కూల్చివేతలు



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న దృశ్యం

ముషీరాబాద్: అక్రమ కట్టడాలపై 'హైడ్రా' చేపట్టిన చర్యల్లో భాగంగా జీహెచ్‌ఎంసీ ముషీరాబాద్ సర్కిల్ 15 పరిధిలోని రాంనగర్ చౌరస్తా సమీపంలోని మణెమ్మ గల్లీలో రోడ్డును ఆక్రమించి నిర్మించిన పలు కట్టడాలను హైడ్రా, జీహెచ్‌ఎంసీ సిబ్బంది శుక్రవారం కూల్చివేశారు. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. మణెమ్మ గల్లీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల ఫిర్యాదు మేరకు అధికారులు 48 గంటల్లో అక్రమ కట్టడాలను కూల్చివేయడం గమనార్హం. వివరాల్లోకి వెళితే... రాంనగర్‌లోని మణెమ్మ గల్లీలో రోడ్డు, నాలాను అక్రమించి కొందరు అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో గల్లీలో వర్షపునీరు బయటికి వెళ్లకపోవడంతో తాము గత కొన్నేళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గత మంగళవారం అసోసియేషన్ నేతలు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆయన బుధవారం సాయంత్రం జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ అధికారులతో కలిసి మణెమ్మ గల్లీలో పర్యటించారు. రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ రికార్డులు, స్థానికుల ఇళ్ల డాక్యుమెంట్లు పరిశీలించి తనకు నివేదిక అందజేయాలని టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. వారు అందజేసిన నివేదికను పరిశీలించిన హైడ్రా కమిషనర్ రోడ్డు, నాలాను అక్రమించి చేపట్టిన కట్టడాలను తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో శుక్రవారం ఉదయం నుంచి హైడ్రా, జీహెచ్‌ఎంసీ అధికారులు పలు కట్టడాలను కూల్చివేవారు. దీంతో అధికారులు బాధితులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కూల్చివేతలను టౌన్ ప్లానింగ్ ఏసీపీ దేవేందర్, సెక్షన్ ఆఫీసర్ హఫీజ్, హైడ్రా అధికారులు రోహిత్‌రెడ్డి, ముషీరాబాద్ సీఐ రాంబాబు, ఎస్సై ప్రసాద్‌రెడ్డి పర్యవేక్షించారు.

బాధితుల ఆందోళన...

రాంనగర్ చౌరస్తా మణెమ్మ గల్లీలో కూల్చివేతల నేపథ్యంలో ఉద్రిక్తత నెలకొంది. కూల్చివేతలను అడ్డుకునేందుకు బాధిత కుటుంబాలు ప్రయత్నించారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలు చేపడితే తాము ఉన్న ఫలంగా ఎక్కడికి వెళ్లాలని బాధిత కుటుంబాల మహిళలు అధికారులను నిలదీశారు. నాలుగు దశాబ్దాలుగా నివాసం ఉంటున్న పేదల కుటుంబాలను ఎలా కూల్చివేస్తారని కాంగ్రెస్ పార్టీ నాయకులు విజయ్‌యాదవ్ అధికారులతో వాగ్వాదానికి దిగారు.

ఆసుపత్రి నుంచి తప్పించుకుని.. ఫ్లైఓవర్ పైనుంచి దూకి..

వృద్ధుడి ఆత్మహత్య

అత్తాపూర్: తన రోగం నయం కాదని ఆసుపత్రిలో ఉన్నా లాభం లేదనుకుని ఉస్మానియా ఆస్పత్రి నుంచి తప్పించుకుని వచ్చిన ఓ వృద్ధుడు పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ వే ఫ్లై ఓవర్ పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై ప్రభాకర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా, బాలనగర్ మండలం, ఒడిత్యాల గ్రామానికి చెందిన యాదయ్య(60) కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో వారం రోజుల క్రితం కుమారుడు యాదయ్య, కోడలు మాధవి అతడిని ఉస్మానియా ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న యాదయ్య తన రోగం నయం కాదని, చనిపోవటమే మేలని భావించి ఆసుపత్రి నుంచి తప్పించుకుని వచ్చి పీవీ నర్సింహారావు ఫ్లై ఓవర్ పైకి చేరుకున్నాడు. శుక్రవారం ఉదయం పిల్లర్ నెంబర్ 162 వద్ద కిందకు దూకడంతో తీవ్రంగా గాయపడిన అతడిని పోలీసులు తిరిగి ఉస్మానియా ఆసుపత్రికే చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

25 రోజుల్లో 570 ఫోన్లు రికవరీ



మాట్లాడుతున్న సైబరాబాద్ క్రైమ్స్ డీసీపీ నర్సింహ

చోరీకి గురైన ఫోన్లు బాధితులకు అందజేత

- 8 నెలల్లో 2,696 ఫోన్లు స్వాధీనం
- ఫోన్ పోయిన వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేయాలి
- పోయిన ఫోన్ వాడితే దొరికే అవకాశం ఉంటుంది
- బాధితుల్లో ఆనందం కోసమే రికవరీ
- సైబరాబాద్ క్రైమ్స్ డీసీపీ కె.నర్సింహా



బాధితుడికి సెల్ ఫోన్ అందిస్తున్న డీసీపీ

గచ్చిబౌలి: ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి 25 రోజుల్లో 570 మొబైల్ ఫోన్లు రికవరీ చేశామని సైబరాబాద్ క్రైమ్స్ డీసీపీ కె.నర్సింహ అన్నారు. ఫోన్ పోయిన వెంటనే బాధితులు సీఈఐఆర్ యాప్‌లో ఫోన్ నెంబర్ నమోదు చేయాలని ఆయన సూచించారు. శుక్రవారం గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో రికవరీ అయిన ఫోన్లను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ సీసీఎస్, ఐటీ విభాగం పోలీసులు ఎనిమిది నెలల్లో 2,696 ఫోన్లు రికవరీ చేయగా మూడు నెలల్లో 1200 ఫోన్లు, 25 రోజుల్లో రూ.1.20 కోట్ల విలువైన 570 మొబైల్ ఫోన్లు రికవరీ చేసినట్లు తెలిపారు. దైనందిన జీవితంలో మొబైల్ ఫోన్ల పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. సెల్ ఫోన్ పోయిన వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో మొబైల్ ఫోన్, ఐఎంఈఐ నెంబర్‌లను రిజిస్టర్ చేయాలని సూచించారు. పోర్టల్‌లో రిజిస్టర్ చేస్తే ఫోన్ బ్లాక్ అవుతుందని, ఎవరైనా సిమ్ వేసి వాడితే ఫోన్ ఎక్కడ ఉందో ఇట్టే తెలిసిపోయే అవకాశం ఉందన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి రికవరీ సెల్ ఫోన్లను వ్యయ, ప్రయాసాలకు ఓర్చి తీసుకొచ్చామని, బాధితుల్లో ఆనందం నింపేందుకే సీపీ ఆదేశాలతో ఫోన్లు రికవరీ చేస్తున్నామన్నారు. ప్రతి పోలీస్ రక్షకుడనే విషయాన్ని మరవద్దన్నారు. 99 శాతం పోలీసులు మంచి చేసే వారని ఒక్క శాతం మంది పోలీసులతో డిపార్ట్‌మెంట్ నెగెటివ్ ఒపీనియన్ కలుగుతుందన్నారు. విలువైన వస్తువు పోగొట్టుకుంటే తెప్పించేందుకు కృషి చేస్తున్నామన్న విషయం గుర్తించాలన్నారు. మహానగరంలో చెడ్డ వారిని గుర్తించడం కష్టమని, నేను సైతం సీసీ టీవీ కార్యక్రమానికి సహకరించాలని కోరారు. కాలనీలలో అనుమానాస్పద వ్యక్తులను గుర్తిస్తే డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. రోజురోజుకు సైబర్ క్రైం పెరిగిపోయేందుకు స్మార్ట్ ఫోన్ ప్రధాన కారణమన్నారు. సైబర్ క్రైం బాధితుల్లో విద్యావంతులు, డాక్టర్లు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ఎక్కువగా ఉంటున్నట్లు తెలిపారు. సోషల్ మీడియా వాడకం, ఈజీ మనీ కోసం వచ్చే ప్రకటనలను నమ్మడం, అనుమానాస్పదమైన లింక్స్ ఓపెన్ చేయడంతో బాధితులకు ఆర్థికంగా నష్టం వాటిల్లుతుందన్నారు. బ్యాంక్ ఉద్యోగులమని, పోలీసులమని చెప్పినా మీ బ్యాంక్, వ్యక్తి వివరాలు ఇవ్వవద్దని సూచించారు. యూపీఐ వాడుతున్నప్పుడు పిన్ నెంబర్ తెలుసుకునేందుకు మీ పక్కన్నే నేరస్తులు ఉండే అవకాశం ఉంటుందన్నారు. అలాంటి వారిని గుర్తించకుంటే ఫోన్ స్నాచింగ్ చేసి బ్యాంక్‌లోని నగదును స్వాహా చేసే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీసీఎస్‌ఏసీపీలు శశాంక్ రెడ్డి, కళింగరావు, ఇన్‌స్పెక్టర్లు సంజయ్ కుమార్, పవన్, జగదీష్, రాజు, నర్సింహ్మ, ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, బాధితులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు కృతజ్ఞతలు

జూన్ 14న చందానగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో పెళ్లి కోసం వచ్చాను. ఐస్‌క్రీమ్ తినేటప్పుడు టేబుల్‌పై సెల్ ఫోన్ పెట్టాను. అక్కడే మరిచిపోయి కిలోమీటరు దూరం వెళ్లిన తర్వాత గుర్తొచ్చి తిరిగి వచ్చి చూడగా ఫోన్ కనిపించలేదు. ఇక ఫోన్ దొరకదని అనుకున్నా. పోయిన సెల్ ఫోన్‌ను అందించిన పోలీసులు కృతజ్ఞతలు.

– విష్ణువర్ధన్ రెడ్డి, బాధితుడు

సెల్ ఫోన్ దొరకడం కష్టమన్నారు

2022 డిసెంబర్‌లో నేను చింతల్ బస్‌స్టాప్‌లో ఆటో దిగి డబ్బులిచ్చిన రెండు నిమిషాలకే ఫోన్ కనిపించలేదు. ఆరు నెలల తరువాత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాను. అక్కడి పోలీసులు కూడా ఫోన్ దొరకడం కష్టమని, ప్రయత్నం చేస్తామని చెప్పారు. ఇన్ని రోజుల తర్వాత నాకు పోయిన ఫోన్ తిరిగి ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉంది.

– మౌనిక, బాధితురాలు

తండ్రి హత్య కేసులో..

కుమారుడు, ఇద్దరు కుమార్తెలకు జీవిత ఖైదు

రంగారెడ్డి కోర్టులు: డబ్బుల కోసం విశ్రాంత ఉద్యోగి అయిన తండ్రిని కడతేర్చిన కేసులో కుమారుడు, ఇద్దరు కుమార్తెలకు జీవిత ఖైదు విధిస్తూ రంగారెడ్డి జిల్లా 8వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి సతీశ్ కుమార్ శుక్రవారం తీర్పు చెప్పారు. ఏపీపీ గంగా రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మేడిపల్లి కృష్ణ ప్రభుత్వ ఉద్యోగిగా 2018 జూన్ నెలలో పదవీ విరమణ పొందాడు. ఆయనకు ఆరుగురు కుమార్తెలు, ఒక్క కుమారుడు ఉన్నారు. ఇద్దరు కుమార్తెలకు వివాహం జరిగింది. మిగిలిన ముగ్గురు కుమార్తెలు, కుమారుడితో కలిసి మీర్‌పేట్ ఠాణా పరిధిలో జిల్లెలగూడలో నివాసం ఉండేవాడు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కోసం కృష్ణతో అతడి కుమారుడు, కుమార్తెలు తరచూ గొడవపడుతుండటంతో విసుగు చెందిన కృష్ణ వేరుగా నివాసం ఉండేవాడు. 2018, నవంబర్ 11న జిల్లెలగూడలోని ఇంటికి వచ్చిన కృష్ణతో కుమార్తెలు అంజలి, ప్రియాంక, కుమారుడు తరుణ్ డబ్బుల విషయమై గొడవ పడ్డారు. దీంతో తరుణ్ ఇనుప రాడ్డుతో కొట్టడంతో తీవ్రంగా గాయపడిన కృష్ణ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన మీర్‌పేట్ పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయడంతో విచారణ చేపట్టిన న్యాయస్థానం నిందితులకు పై విధంగా శిక్ష ఖరారు చేస్తూ తీర్పు వెలువరించింది. సంచలనం సృష్టించిన కేసులో నిందితులకు శిక్ష పడేందుకు కృషి చేసిన మీర్‌పేట్ పోలీసులు యాదగిరి, కవితలను ఉన్నతాధికారులు అభినందించారు.

వెంబడించి..కారుతో ఢీకొట్టి

ఆకతాయిల హల్‌చల్

- ఇద్దరు విద్యార్థినులకు గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం
- పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు
- పరారీలో మరొకరు




వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కొందరు ఆకతాయిలు రోడ్డుపై వెళుతున్న విద్యార్థినులను కారుతో వెంబడించి వారిని ఢీ కొట్టిన సంఘటన బాగ్‌లింగంపల్లిలోని మదర్ డైరీ పార్కు ఎదుట శుక్రవారం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరు బాలికలు గాయపడగా రెండు కార్లు ధ్వంసమయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం క్లేవ్ ఓవెన్ బేకరీలో సమీపంలో నలుగురు యువకులు నిలుచుని ఉన్నారు. అదే సమయంలో అంబేడ్కర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు ఫుట్‌పాత్‌పై నడుచుకుంటూ వెళ్తున్నారు. దీంతో సదరు యువకులు కారులో విద్యార్థినులను వెంబడించడమేగాక ఢీకొట్టారు. ఈ ఘటనలో కారు అదుపు తప్పి సమీపంలో ఉన్న కారును బలంగా ఢీకొనడంతో రెండు కార్లు ధ్వంసమయ్యాయి.

మైనర్‌ను పట్టుకున్న స్థానికులు..

కారు ఢీ కొనడంతో ఓ విద్యార్థిని తలకు తీవ్ర గాయం కాగా, మరో బాలికకు కాలికి గాయాలు కావడంతో స్థానికులు వారిని ఆస్పత్రికి తరలించారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కారులో నలుగురు యువకులు ఉండగా స్థానిక సెయింట్ ఆడమ్స్ స్కూల్ విద్యార్థిని స్థానికులు పట్టుకుని చిక్కడపల్లి పోలీసులకు అప్పగించారు. మిగతా ముగ్గురు యువకులు పరారయ్యారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన చిక్కడపల్లి పోలీసులు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. కారులో కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఓక్ ఉడ్ ఫామ్‌హౌస్ సీజ్



కీసర: యాద్గార్‌పల్లి గ్రామ పరిధిలోని ఓక్ ఉడ్ ఫామ్‌హౌస్‌ను శుక్రవారం ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు కీసర తహసీల్దార్ అశోక్ కుమార్‌తో కలిసి సీజ్ చేసినట్లు కీసర ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య తెలిపారు. వివరాలివీ... యాద్గార్‌పల్లి గ్రామ సమీపంలోని ఓక్ ఉడ్ ఫామ్‌హౌస్‌లో ఇటీవల స్విమ్మింగ్ పూల్‌లో పడి అనుమానాస్పద స్థితిలో కాప్రా ప్రాంతానికి చెందిన రాగిడి సందీప్‌రెడ్డి(29) మృతి చెందిన విషయం విదితమే. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కీసర కేసు నమోదైంది. అనుమతి లేని ఫామ్‌హౌస్‌పై చర్యలు తీసుకోవాలని పలువురు కీసర ఆర్డీఓ కార్యాలయంలోనూ ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన కీసర ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డి ఫామ్‌హౌస్‌ను సీజ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆ ఫామ్‌హౌస్‌ను సీజ్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

లీడర్‌గా ఎదగాలనే...

- కాల్పుల కేసులో నిందితుల అరెస్ట్
- ప్రధాన నిందితుడు నరేష్‌పై పలు స్టేషన్లలో కేసులు
- పీడీ యాక్ట్ నమోదుకు సిఫారసు



వివరాలు వెల్లడిస్తున్న మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి



కుత్బుల్లాపూర్: లీడర్‌గా ఎదగాలన్న లక్ష్యంతోనే నాటు తుపాకీతో కాల్పులకు పాల్పడినట్లు గుర్తించామని మేడ్చల్ డీసీపీ కోటి రెడ్డి అన్నారు. నాటు తుపాకీతో కాల్పులకు పాల్పడిన కేసులో 15 మందిని జీడిమెట్ల పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం బాలానగర్ డీసీపీ కార్యాలయంలో డీసీపీ కోటిరెడ్డి వివరాలు వెల్లడించారు. ఈ నెల 28 రాత్రి గాజులరామారం ప్రాంతానికి చెందిన పూర్ణిమ అనే మహిళతో పాటు అజయ్ చంద్ర, గౌతమ్ అనే వ్యక్తులు మల్లంపేట నుంచి వస్తుండగా బైక్‌లో పెట్రోల్ అయిపోయింది. దీంతో వారు గాజులరామారం చౌరస్తాలోని ఎల్ఎన్ బార్ వద్ద పార్కు చేసి ఉన్న బైకు నుంచి పెట్రోల్ చోరీ చేస్తుండగా బార్‌లో పని చేస్తున్న అఖిలేష్ అనే వ్యక్తి బయటికి వచ్చి వారిని మందలించాడు. దీంతో గౌతమ్ అతడితో వాగ్వాదానికి దిగాడు. అదే సమయంలో బార్ సిబ్బంది అక్కడికి చేరుకోవడంతో వారి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో పూర్ణిమ మల్లంపేటకు చెందిన నరేష్, శివలకు ఫోన్ చేసి సమాచారం అందించడంతో రెండు వాహనాల్లో నరేష్, శివ, సోహెల్, శ్యాంసన్, నరేందర్, ఉజ్వల్ అక్కడికి వచ్చారు. వచ్చీ నరేష్ ఆదేశాలతో శివ నాటు తుపాకీతో గాల్లోకి కాల్పులు జరిపాడు. అంతేగాక అఖిలేష్, నిశాంత్‌లపై కాల్పులు జరిపారు. అంతటితో ఆగకుండా జీప్‌తో వారిని ఢీ కొట్టే ప్రయత్నం చేయగా నిశాంత్ పాదల్లో పడిపోవడంతో గాయాలయ్యాయి. అయితే ఈ విషయాన్ని దాచిన నరేష్ అక్కడికి వచ్చిన పోలీసులతో గౌతమ్‌ను కొట్టి తనను బెదిరించారని అజయ్ చంద్రతో జీడిమెట్ల పోలీసులు ఫిర్యాదు ఇప్పించి వెళ్లిపోయాడు.

బార్ సిబ్బంది ఫిర్యాదుతో 'సీన్' రివర్స్

జీడిమెట్ల పోలీసులు రాత్రి జరిగిన సంఘటన గొడవగానే భావించి లైట్‌గా తీసుకున్నారు.. బుధవారం ఉదయం అఖిలేష్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి రాత్రి నాటు తుపాకీతో కాల్పులు జరిగినట్లు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కంగుతిన్నారు. వెంటనే అప్రమత్తమైన సీఐ మల్లేష్ ఉన్నతాధికారులకు సమాచారం అందించి దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో పూర్ణిమ, గౌతమ్, అజయ్ చంద్ర, సోహెల్, శ్యాంసన్, నరేందర్ లను అదుపులో తీసుకుని తమదైన శైలిలో ప్రశ్నించగా నరేష్ తీసుకువచ్చిన నాటు తుపాకీతో శివ కాల్పులకు పాల్పడినట్లు తెలిపారు.

బీహార్ నుంచి నాటు తుపాకీ తెప్పించి..

రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరుతో భూకబ్జాలకు పాల్పడుతున్న నరేష్ గతంలో మల్లంపేట ప్రాంతంలో పని చేసి బీహార్ కు వెళ్లిపోయిన అమిత్ సహాయంతో నాటు తుపాకి తెప్పించుకున్నాడు. అందుకు అతడి స్నేహితులు సమీర్, బుగ్గప్ప, జగ్గు, కరణ్ సహకరించారు. అనంతరం దానిని తన సోదరుడు శ్రీకాంత్ వద్ద దాచి పెట్టాడు. ప్రధాన నిందితుడు నరేష్ కూకట్‌పల్లి ప్రాంతంలో ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 87 బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. 15 మందిని అరెస్టు చేసి మూడు కార్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన పోలీసు బృందాలను అభినందించారు.

'పీడీ' కిలి బిగిస్తాం...

కాల్పుల కేసులో ప్రధాన నిందితుడైన నరేష్ పై గతంలో దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో నాలుగు కేసులు నమోదు కాగా సంగారెడ్డిలో ఒకటి, బాచుపల్లి ఒక ఫిర్యాదు అందినట్లు డీసీపీ తెలిపారు. అతడికి నేర చరిత్ర ఉన్నందున కష్టడీలోకి తీసుకుని పూర్తి వివరాలు రాబడతామన్నారు. వివిధ కేసుల్లో ప్రధాన నిందితుడిగా ఉన్న నరేష్ పై రౌడీషీట్ ఓపెన్ చేయడమే కాకుండా పీడీ యాక్ట్ నమోదుకు సిఫార్సు చేయనున్నట్లు తెలిపారు. అతడి బాధితులు ఆయా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

రిమాండ్ ఖైదీ ఆత్మహత్య

రహమత్‌నగర్ : ఎర్రగడ్డ మానసిక చికిత్సాలయంలో చికిత్స పొందుతున్న రిమాండ్ ఖైదీ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చర్లపల్లి జైలులో రిమాం డ్ ఉన్న ప్రశాంత్(35)కు మానసిక స్థితి సరిగా లేక పోవడంతో అతడిని చికిత్స నిమిత్తం ఈ నెల 28న ఎర్ర గడ్డలోని మానసిక ఆసుపత్రిలో చేర్పించారు. శుక్రవారం ఉదయం అతను డైనింగ్ హాల్ తలుపు కొక్కానికి తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసిన బోరబండ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

మా ఆదేశాలనే అమలు చేయరా?

సాక్షి, హైదరాబాద్: జూబ్లీ హిల్స్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీకి సంబంధించి గతంలో తాము ఇచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదో నేరుగా కోర్టుకు హాజరై వివరణ ఇవ్వాలని కో ఆపరేటివ్ సొసైటీస్ కమిషనర్ అండ్ రిజిస్ట్రార్‌ను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు హరితకు ఫారమ్–1 నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణకు హాజరు కావాలని ఆదేశిస్తూ, విచారణ సెప్టెంబర్ 27కు వాయిదా వేసింది. జూబ్లీ హిల్స్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ అక్రమాలపై తాము దాఖలు చేసిన ఫిర్యాదుపై చేపట్టిన విచారణ నివేదికను బహిర్గతం చేయడంలో కమిషనర్ ఫర్ కోఆపరేటివ్ రిజిస్ట్రార్ నిర్లక్ష్యాన్ని సవాల్ చేస్తూ జూబ్లీ హిల్స్ మాజీ కార్యదర్శి మురళీ ముకుంద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయమూర్తి.. 2022, మార్చి 23న సమర్పించిన విచారణ నివేదికను పిటిషనర్‌కు రెండు వారాల్లో అందజేయాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే, కోర్టు ఆదేశాలు జారీ చేసి నాలుగు నెలలు దాటినా కో ఆపరేటివ్ అధికారులు ఇప్పటికి అమలు చేయడం లేదంటూ మురళీ ముకుంద్ హైకోర్టులో ధిక్కరణ వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున న్యాయవాది అరువ రఘురాం వాదనలు వినిపిస్తూ.. జూబ్లీ హిల్స్ కో ఆపరేటివ్ సొసైటీపై ఇలాంటి ఫిర్యాదులు చేసిన వారు 60 మంది వరకు ఉంటారని, వీరంతా నివేదిక కోసం ఎదురు చూస్తున్నారన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. నేరుగా హాజరై వివరణ ఇవ్వాలని కో ఆపరేటివ్ సొసైటీస్ కమిషనర్ అండ్ రిజిస్ట్రార్ ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేశారు.

తప్పించుకోబోయి.. రెండో అంతస్తు నుంచి దూకి..

ఫేక్ సర్టిఫికెట్‌ల కేసులో నిందితుడి మృతి

రాజేంద్రనగర్: పోలీసులు అరెస్టు వారెంట్ తీసుకుని రావడంతో వారి నుంచి తప్పించుకునే క్రమంలో ఫేక్ సర్టిఫికెట్ కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి రెండో అంతస్తు నుంచి కిందకు దూకి మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. టోలిచౌకి ప్రాంతానికి చెందిన అప్సరుద్దీన్ (60) నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన ఫేక్ సర్టిఫికెట్ల కేసులో నిందితుడుగా ఉన్నాడు. పంజగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఫేక్ సర్టిఫికెట్ లో అరెస్ట్ వారెంట్ పెండింగ్ లో ఉంది. అప్సరుద్దీన్ కు ఇద్దరు భార్యలు. మొదటి భార్య టోలిచౌకిలో ఉండగా రెండో భార్య రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సన్ సిటీలో నివాసముంటోంది. అప్సరుద్దీన్ సన్‌సిటీలోని నివాసంలో ఉన్నట్లు సమాచారం అందడంతో శుక్రవారం సాయంత్రం పంజగుట్ట పోలీసులు అరెస్ట్ వారెంట్‌తో రాజేంద్రనగర్ పోలీసులతో కలిసి అక్కడికి చేరుకున్నారు. పోలీసులు ఇంటి గేటు బయట నిలబడి అప్సరుద్దీన్ కోసం వచ్చినట్లు చెబుతుండగానే పోలీసుల రాకను ముందే పసిగట్టిన వారి నుంచి తప్పించుకునేందుకు అతను రెండో అంతస్తు నుండి కిందికు దూకాడు. తీవ్రంగా గాయపడిన అతడిని పోలీసులు 108లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పనుల నాణ్యతల్లో ఎటువంటి రాజీపడొద్దు

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న దానం నాగేందర్

బంజారాహిల్స్: అభివృద్ధి పనులు చేపడుతున్న సమయంలో నాణ్యతలో ఎటువంటి రాజీపడొద్దని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సూచించారు. హిమాయత్‌నగర్ డివిజన్ పరిధిలోని అవంతినగర్ కెనరా బ్యాంక్ నుంచి ప్లాట్ నెంబర్–14 మీదుగా ప్లాట్ నెంబర్ 83 వరకు రూ.60 లక్షల వ్యయంతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్థానిక కార్పొరేటర్ మహాలక్ష్మీతో కలిసి శంకుస్థాపన చేశారు. అలాగే ముత్యాలబాగ్ నుంచి సెయింట్‌పాల్ స్కూల్ రోడ్డులో రూ. 42 లక్షల వ్యయంతో వీడీసీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరగా ఈ రోడ్డు పనులు పూర్తి చేయాలని, నాణ్యతలో ఏమాత్రం అశ్రద్ధ చూపవద్దని సూచించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

డీఎంసీ రజినీకాంత్‌రెడ్డి



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంసి

బంజారాహిల్స్: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఎంతటివారినైనా సహించేది లేదని ఖైరతాబాద్ సర్కిల్–17 డీఎంసీ రజినీకాంత్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఉదయం జీహెచ్ఎంసీ, పోలీసు అధికారుల సమన్వయ కమిటీ ఎన్టీఆర్‌మార్గ్‌లో పర్యటించిన సమయంలో రోడ్లపక్కన మట్టిని, వ్యర్థాలను గుర్తించిన డీఎంసి అక్కడే ఉన్న మెక్లిన్ సూపర్‌వైజర్‌ను హెచ్చరించారు. తాను ఇక్కడ రోడ్లపై వ్యర్థాలు మట్టి కనిపించకుండా శుభ్రం చేయాలని చెప్పినా ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. మరోసారి ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

తాత్కాలిక కొలనుల ఏర్పాటు



బేబీపాండ్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సర్కిల్-17 అధికారులు

బంజారాహిల్స్: వినాయక చవితి పర్వదినం నేపథ్యంలో వేడుకల ఏర్పాట్లపై జీహెచ్ఎంసీ అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. సెప్టెంబర్ 7 నుంచి 17వ తేదీ వరకు గణేష్ నవరాత్రి ఉత్సవాలతో పాటు విగ్రహాల నిమజ్జనాలు కూడా జరగనుండటంతో ఎక్కడికక్కడ తాత్కాలిక కొలనులు ఏర్పాటు చేస్తున్నారు. శుక్రవారం జీహెచ్ఎంసీ సర్కిల్–17 డీసీ రజినీకాంత్‌రెడ్డితో పాటు సంబంధిత అధికారులు సర్కిల్ పరిధిలో అమీర్‌పేట్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, సనత్‌నగర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ మైదానాల్లో బేబీపాండ్ల నిర్మాణాల ఏర్పాట్లను పరిశీలించారు. ఒక్కో బేబీ పాండ్‌ను రూ. 5 లక్షల వ్యయంతో నిర్మిస్తున్నట్లు డీసీ తెలిపారు. ఇప్పటికే పీపుల్స్‌ప్లాజాలో బేబీ పాండ్ ఉందని కొత్తగా ఈ రెండు చోట్ల తాత్కాలిక నిర్మాణం చేపడుతున్నామని అన్నారు. సెప్టెంబర్ 6వ తేదీలోపు నిర్మాణ పనులు పూర్తి చేస్తామని నిమజ్జనానికి బేబీపాండ్లు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

డీఎంసీ జకీరా సుల్తానాకు వినతి

రహమత్‌నగర్: నిమజ్జనం సందర్భంగా వినాయక విగ్రహాలు తరలివెళ్లే దారుల్లో చెట్ల కొమ్మలు తొలగించి, విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతూ భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి జూబ్లీహిల్స్ నియోజకవర్గం కన్వీనర్ తంగలపెల్లి లక్ష్మణ్ ఆధ్వర్యంలో శుక్రవారం జీహెచ్ఎంసీ సర్కిల్ 19 డీఎంసీ జకీరా సుల్తానాకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ రహదారులపై గుంతలను పూడ్చివేయాలని కోరారు. నిమజ్జనానికి వెళ్లే వినాయక విగ్రహాలకు ఏలాంటి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి పెద్దలు బంగారు ప్రశాంత్, కో-కన్వీనర్ కృష్ణమోహన్, గణేష్ ప్రసాద్, పవన్‌కుమార్, సత్యనారాయణ, వెంగళరావునగర్ , బోరబండ, రహమత్ నగర్ డివిజన్ కన్వీనర్లు శివ, సురేష్ గౌడ్, లక్క మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రహ్మోత్సవాలు

వెంగళరావునగర్: వెంగళరావునగర్ డివిజన్ జీటీఎస్‌కాలనీలోని వీరాంజనేయ భవానీశంకర అయ్యప్పస్వామి సాయిబాబా దేవస్థానంలో ఘనంగా భవానీశంకర స్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం 9.30 నుంచి వివిధ పూజాది కార్యక్రమాలను ప్రారంభించారు. ఇందులో భాగంగా రాజశ్యామలా హోమం, వారాహి హోమం కార్యక్రమాలను నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు జీటీఎస్ కాలనీ, జవహర్‌నగర్, కళ్యాణ్‌నగర్‌కాలనీ, రాజీవ్‌నగర్‌కాలనీ, ఎస్ఆర్‌నగర్, రహమత్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. మధ్యాహ్నం ఒంటిగంటకు పూర్ణాహుతి, నీరాజన మంత్రపుష్పం, పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

జన్యుపర కదలిక రుగ్మతలపై ప్రత్యేక శ్రద్ధ

మూవ్‌మెంట్ డిజార్డర్ క్లినిక్‌ను ప్రారంభించిన డైరెక్టర్ బీరప్ప

లక్డీకాపూల్: జన్యుపరంగా సంభవించే కదలిక రుగ్మతలను సమవర్తవంతంగా నివారించేందుకు నిమ్స్ చర్యలు చేపట్టిందని డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప తెలిపారు. శుక్రవారం నిమ్స్‌లో న్యూరాలజీ విభాగం హెచ్ఓడి డాక్టర్ సూర్యప్రభ నేతృత్వంలో ఏర్పాటు చేసిన మూవ్‌మెంట్ డిజార్డర్ క్లినిక్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ మెదడుపై తీవ్ర ప్రభావం చూపే రుగ్మతలతో బాధపడుతున్న వారి సంరక్షణకు నిమ్స్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందన్నారు. ముఖ్యంగా పార్కిన్సన్స్ వ్యాధి, అనవసరమైన వణుకు, ఉచ్చారణలో ఇబ్బందులు, నడక తీరులో మార్పులు, వంటి సమస్యలకు చెక్ పెట్టనున్నట్లు చెప్పారు. న్యూరాలజిస్ట్ డాక్టర్ శిరీష, న్యూరోసర్జన్ డాక్టర్ వై. వంశీకృష్ణ, సైకియాట్రిస్ట్ డాక్టర్ పద్మజలతో కూడిన వైద్య బృందం ఈ క్లినిక్‌ను నిర్వహిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ లిజా రాజశేఖర్, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డాక్టర్ శాంతివీర్, ఏఎంఎస్ డాక్టర్ చరణ్, డాక్టర్ రేష్మ, డాక్టర్ భవాని, డాక్టర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో సాగుదాం..!

- భక్తులు, నిర్వాహకులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు
- వ్యర్థాలను తరలించేందుకు అదనపు వాహనాల కేటాయింపు
- మొదలైన ట్రీ ట్రిమ్మింగ్, పాట్‌హోల్స్ పూడ్చివేత
- నెక్లెస్ రోడ్డు, ఎన్టీఆర్ మార్గ్‌లో 23 క్రేన్ల ఏర్పాటు
- కలిసికట్టుగా పనిచేసి చవితి ఉత్సవాలను విజయవంతం చేయాలి
- ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి



ఎన్టీఆర్ మార్గ్‌లో పర్యటిస్తున్న అనురాగ్ జయంతి, పోలీసు విభాగాల అధికారులు...

బంజారాహిల్స్: రానున్న వినాయక చవితి ఉత్సవాలను అన్ని విభాగల అధికారులు సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి సూచించారు. శుక్రవారం ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్డు, ఖైరతాబాద్ బడా గణేష్ ప్రాంతాలను ఆయన జీహెచ్ఎంసీ, జలమండలి, పోలీసు, నీటి పారుదల శాఖ, వీధి దీపాల విభాగం అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగ మొదలైన మూడు రోజు నుంచి విగ్రహాలు నిమజ్జనానికి వస్తాయి కనుక అందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆయన అధికారులకు సూచించారు. అన్ని శాఖల కంట్రోల్ రూమ్‌లు, మంచినీటి వసతి, మొబైల్ టాయ్‌లెట్లు ఏర్పాటు చేయాలని ఆయన సంబంధిత అధికారులకు సూచించారు. అదే విధంగా వేలాదిగా వచ్చే జనాన్ని అదుపు చేసేందుకు తొక్కిసలాటలు జరగకుండా ఉండేందుకు భారీ బారికేడింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని డీసీపీ ఆకాంక్ష్‌యాదవ్‌కు సూచించారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ గణేష్ నిమజ్జనానికి వచ్చే రూట్‌మ్యాప్‌ను కూడా పరిశీలించారు. ఈ పర్యటనలో సర్కిల్–17 డీఎంసీ రజినీకాంత్‌రెడ్డి, సైఫాబాద్ ఏసీపీ సంజయ్‌కుమార్, సైఫాబాద్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, ఎస్ఈ రత్నాకర్, ఏఎంఎంహెచ్‌వో డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు వ్యర్థాల తరలింపు

ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్డులలో ఇప్పటికే వ్యర్థాలు తరలించేందుకు 13 వాహనాలు అందుబాటులో ఉండగా వాటికి అదనంగా మరో 10 వాహనాలను ఏర్పాటు చేయాలని నిశ్చయించారు. మూడు షిఫ్టలలో పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తారని సుమారుగా 450 మంది పారిశుద్ధ్య కార్మికులు విధుల్లో ఉంటారని తెలిపారు. వినాయక విగ్రహాల తరలి వచ్చే మార్గాల్లో ఉన్న పాట్ హోల్స్‌ను పూడ్చడంతో పాటు విగ్రహాలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల ప్రక్రియను ఇప్పటికే మొదలు పెట్టినట్లు తెలిపారు.

23 క్రేన్ల ఏర్పాటు

గతేడాది మాదిరిగానే ఎన్టీఆర్ మార్గ్‌తో పాటు నెక్లెస్ రోడ్డులలో 23 క్రేన్లు ఏర్పాటు చేయాలని అధికారులు నిశ్చయించారు. అయితే చిన్న చిన్న విగ్రహాలు హుస్సేన్‌సాగర్ వరకు రాకుండా ఆయా ప్రాంతాల్లో మినీపాండ్ల నిర్మాణం పూర్తి చేయాలని తద్వారా ఇక్కడ ఒత్తిడి తగ్గుతుందని అన్నారు. నెక్లెస్ రోడ్డు చివరలో ఉన్న మినీ పాండ్‌ను కూడా సిద్ధం చేయాలని సూచించారు. సాధ్యమైనంత వరకు చిన్న విగ్రహాలను మినీ పాండ్లలో నిమజ్జనం చేసే విధంగా అధికారులు రూట్‌మ్యాప్ రూపొందించాలని సూచించారు.

హెచ్ఐవీ బాధిత పిల్లలకు చేయూత

పంజగుట్ట: ఉమెన్స్ కమ్యూనిటీ నిర్వహిస్తున్న ఉమెన్స్, చిల్డ్రన్స్ బెస్ట్ ఆర్గనైజేషన్ (డబ్ల్యుసీబీఓ) సంరక్షణలో ఉన్న 65 మంది హెచ్ఐవీ సోకిన పిల్లలకు భారత్ కిసాన్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఒక నెలకు సరిపడా పౌష్టిక ఆహార సరుకులు అందించారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్‌లోని భారత్ కిసాన్ ఫౌండేషన్ కార్యాలయంలో సంస్థ చైర్మన్ కుమారస్వామి మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల నుంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో హెచ్ఐవీ బాధిత పిల్లలకు నాణ్యమైన పోషక విలువలతో కూడిన పౌష్టిక ఆహార సరుకులు అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో అనాథ ఆశ్రమాలకు, వృద్ధాశ్రమాలకు, రైతులకు, గిరిజన ప్రాంతాల్లో చేయూతనిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ భరత్, ఎండీ కమ్మర చంద్రమౌళి, కాసాల నరసింహరాజు, యాదగిరి పాల్గొన్నారు.

వేడుకగా శ్రావణమాస పూజలు



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ డివిజన్ బంజారాహిల్స్‌రోడ్‌నెం. 2లోని ఇందిరానగర్ నల్లపోచమ్మ ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ నేత విష్ణువర్ధన్‌రెడ్డి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి వేకువజామునే పంచామృతాలతో అభిషేకం, అర్చన ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బస్తీ నేతలు, ఆలయ కమిటీ నేతలు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

బంజారాహిల్స్: పేకాటరాయుళ్ల నుంచి కమీషన్ తీసుకుంటూ అద్దె రూపంలో డబ్బులు వసూలు చేస్తూ గుట్టుచప్పుడు కాకుండా పేకాట గృహాన్ని నిర్వహిస్తున్న వ్యక్తితో పాటు మరో ఏడు మంది పేకాటరాయుళ్లను బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే... బంజారాహిల్స్ రోడ్డునెంబర్–11లోని గౌరీశంకర్‌కాలనీకి చెందిన శ్రీనివాస్‌రెడ్డి కొంతకాలంగా రోడ్డునెంబర్–10 జహ్రా నగర్ చౌరస్తా సమీపంలోని ఓ ఖాళీ ప్లాట్‌లో ఉన్న గదిని పేకాట గృహంగా మార్చాడు. కొంత మందిని ఎంపిక చేసుకుని పేకాటను నిర్వహిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఈ గృహంపై దాడులు నిర్వహించగా పేకాట ఆడుతూ ఏడు మంది పట్టుబడ్డారు. శ్రీనివాస్‌రెడ్డితో పాటు రాంబాబు, నందు, దర్శన్, శివ, శ్రీనివాస్, సురేష్, రోహన్ తదితరులపై పోలీసులు కేసు నమోదు చేశారు. వీరి నుంచి నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

పుట్టమట్టితో వినాయక విగ్రహం



రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్ ఇందిరానగర్ ఫేజ్2 బస్తీలో పుట్ట మట్టితో వినాయక విగ్రహాన్ని నిర్వాహకులు రూపొందిస్తున్నారు. గత ఇరవై ఏండ్లుగా పుట్ట మట్టితో వినాయకుని తయారు చేసి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుపుకోవడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. నగర శివారుల్లోని ప్రాంతాల్లో సేకరించిన పుట్ట మట్టితో ప్రముఖ శిల్పి కృష్ణాచారి వినాయక విగ్రహాన్ని రూపొందిస్తున్నారు. ఈ వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించిన ప్రాంతంలోనే పవిత్ర గంగా జలాలతో నిమజ్జనం చేయడం విశేషం. ఈ క్రమంలోనే వినాయక విగ్రహ తయారీ పనులు శిల్పి కృష్ణాచారి ప్రారంభించారు. అంతకు ముందు ఆలయ ధర్మకర్త వేముల యాదయ్య, బస్తీ వాసులు అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

త్వరలో శ్రీరాంనగర్‌లో మల్టీపర్పస్ మదర్సాను ఏర్పాటు చేస్తాం



రహమత్‌నగర్: తాము నిర్వహిస్తున్న మదర్సాలో 70 మంది విద్యార్థులు అరబ్బిని అభ్యసిస్తున్నారని, అందులో 12 మంది విద్యార్థులు అరబ్బి చదువును పూర్తి చేసుకుని పవిత్ర ఖురాన్ అభ్యసించేందుకు అర్హులైయ్యారని మసీదు కమిటీ అధ్యక్షుడు ఫెరోజ్‌ఖాన్ తెలిపారు. శ్రీరాంనగర్‌లోని మదర్సా సయ్యదిన ఉమర్ ఫరూకీ రజీ అల్లాహు తాలా అన్హులో అరబ్బి అభ్యసించే విద్యార్థుల ఇఫ్తేదాయి ఖురాన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా మసీదు కమిటీ సభ్యులు వారిని సన్మానించి పవిత్ర ఖురాన్‌లను అందజేశారు. ఈ సందర్భంగా మసీదు ఫెరోజ్‌ఖాన్ మాట్లాడుతూ శ్రీరాంనగర్‌లో త్వరలోనే మల్టీ పర్పస్ మదర్సాను ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మసీదు కమిటీ సెక్రటరీ ఇంతేయాజ్ ఖాన్, మౌజమ్ మౌలానా జహంగీర్ ఆలాం, ఇమాం మున్వర్ ఆలాం, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తను తొలగించి.. మొక్కలు నాటి..!



ఫిలింనగర్: బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయకుండా నివారించేందుకు జీహెచ్ఎంసీ అధికారులు అనునిత్యం పలు వినూత్న రకాల కార్యక్రమాలు నిర్వహిస్తూ విజయవంతం అవుతున్నారు. ఇందులో భాగంగా జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రి ఎదురుగా పార్కు పక్కన నిత్యం స్థానికులు పెద్దఎత్తున చెత్తను వేస్తున్నారు. దీన్ని నివారించేందుకు స్థానిక ఎస్ఎఫ్ఏ ఇక్కడున్న చెత్తను పూర్తిగా తొలగించి మొక్కలు నాటారు. దీంతో ఇక్కడ చెత్త వేయకుండా అడ్డుకట్ట వేయవచ్చునని వారు తెలిపారు. ఇప్పటికే ఫిలింనగర్‌లో 90 శాతానికి పైగా బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసే ప్రాంతాలను చెత్త వేయకుండా చేశారు.

హరేకృష్ణ మూవ్‌మెంట్‌కు భారీ విరాళం



బంజారాహిల్స్: హరేకృష్ణ మూవ్‌మెంట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో రూపొందించబడిన సాంస్కృతిక, వారసత్వ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుకు నర్సింగ్ క్లాత్ ఎంపోరియం ప్రైవేటు లిమిటెడ్ విరాళాన్ని అందజేసింది. మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ సింఘానియా, డైరెక్టర్ రవికాంత్ సింఘానియా నేతృత్వంలోని ఈ వ్యాపార సంస్థ ఉదారంగా రూ.25 లక్షల విరాళం అందించింది. సామాజిక, సాంస్కృతిక అభివృద్ధికి తోడ్పాటునందించడంలో తమ సంస్థ అంకితభావాన్ని తెలియజేస్తూ ఈ విరాళాన్ని హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు సత్యగౌర చంద్రదాస ప్రభూజీకి అందించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ సింఘానియా మాట్లాడుతూ సామాజిక కార్యక్రమాల నిర్వహణకు, సామాజిక శ్రేయస్సును పెంపొందించడానికి కట్టుబడి ఉన్నామన్నారు.

పుస్తకావిష్కరణ



బంజారాహిల్స్: డాక్టర్ శాసనకోట ఆవులప్ప జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ కార్యక్రమం బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని హరేకృష్ణ గోల్డెన్ టెంపుల్‌లో శుక్రవారం సాయంత్రం జరిగింది. ఈ కార్యక్రమానికి హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ముఖ్య అతిథిగా విచ్చేసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మహా విష్ణుదాస ప్రభుజీ, హిమాచల్‌ప్రదేశ్ మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మాకాని నారాయణరావు, జస్టిస్ పెమ్మసాని శంకర్ నారాయణ, హైకోర్టు మాజీ న్యాయమూర్తి, మహాదాయి జల ట్రిబ్యునల్ సభ్యుడు, జస్టిస్ జి. చంద్రయ్య, మాజీ హైకోర్టు న్యాయమూర్తి. కోర్ట్ ఆఫ్ యునైటెడ్ ఏపీ గోపాల్ కృష్ణ ఇతర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

డీఎంసీ దృష్టికి డివిజన్ సమస్యలు



రహమత్‌నగర్: జీహెచ్ఎంసీ సర్కిల్19 డీఎంసీగా బాధ్యతలు స్వీకరించిన జకీరా సుల్తానాను రహమత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన డివిజన్‌లోని పెండింగ్ పనులపై సీఎన్ రెడ్డి డీఎంసీతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఈఈ రాజ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఫిలింనగర్‌లో చోరీ

ఫిలింనగర్: ఇంట్లోకి దొంగలు ప్రవేశించి నగదు, నగలు, సెల్‌ఫోన్లు దొంగిలించిన సంఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే...సూర్యానగర్‌కాలనీలోని మెరిడియన్ గార్డెన్ బిల్డింగ్‌లో నివసించే మహ్మద్ ముకీబ్ అహ్మద్ ఇంట్లోకి గురువారం అర్ధరాత్రి దొంగలు ప్రవేశించి రూ.35 వేల నగదుతో పాటు ఆభరణాలు, ఆయన ఫోన్‌ను దొంగిలించారు. బాల్కనీ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు డోర్ తీసి ఇంట్లోకి ప్రవేశించి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తూ అహ్మద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిలింనగర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పరిశోధనల వైపు అడుగులు వేయాలి

ఇస్రో అసిస్టెంట్ డైరెక్టర్, సైంటిస్ట్ వి. శేషగిరిరావు



ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సైంటిస్ట్ శేషగిరిరావు

బంజారాహిల్స్: విద్యార్థులు పరిశోధనలవైపు అడుగులు వేస్తే మరింత విజ్ఞానవంతులు అవుతారని ఇస్రో అసిస్టెంట్ డైరెక్టర్, సైంటిస్ట్ వి. శేషగిరిరావు అన్నారు. శుక్రవారం బంజారాహిల్స్ రోడ్ నెం.7లోని మెరీడియన్ స్కూల్‌లో మోడల్ ఐక్యరాజ్య సమితి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు కెరీర్ ఆధారిత వృత్తులపై కాకుండా పరిశోధన ఆధారిత అధ్యయనంపై కృషి చేయాలని సూచించారు. ఎంచుకున్న సబ్జెక్టుపై పట్టు సాధించేందుకు విద్యార్థులు ఎంతో పరిశోధన చేయాలని సూచించారు. మెరీడియన్ స్కూల్ 9వ ఎడిషన్ ఎంయూఎన్‌లో భాగంగా మూడు రోజులపాటు నిర్వహించే ఈ మోడల్ ఐక్య రాజ్య సమితి కార్యక్రమంలో 300 మంది విద్యార్థులు పాల్గొంటున్నారని, వారు ప్రపంచంలోని పలు దేశాల ప్రతినిధులుగా వ్యవహరిస్తూ ఆయా దేశాలు ఎదుర్కొంటున్న సవాళ్ళు, సమస్యలు, పరిష్కారాలపై చర్చించి తీర్మానాలు ప్రవేశపెడతారని తెలిపారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు విద్యాసంస్థల ప్రెసిడెంట్ లలితా నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ నిషిరాజా, మూడు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమానికి సెక్రటరీ జనరల్ ఆఫ్ ఎంయూఎన్‌గా రాజాస్ అగర్వాల్, డీజీగా శాండిల్య దేవరశెట్టి వ్యవహరిస్తున్నారు.

యోగాసనాల పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన చిన్నారులు

వెంగళరావునగర్ : నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుతో పాటుగా సహపాఠ్య కార్యక్రమాలైన వ్యాయామ విద్య, నైతిక విద్య, సాంకేతిక విద్య, సాంస్కృతిక విద్య, యోగాభ్యసనాల్లో ముందంజ వేస్తున్నారని బ్రహ్మం టాలెంట్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు లిల్లీ ఎలిజబెత్ తెలియజేశారు. స్వామి వివేకానంద స్కూల్ ఆఫ్ యోగా అసోసియేషన్ (తెలంగాణా అసోసియేషన్) ఆధ్వర్యంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణా యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్–24 పేరుతో ఇటీవల జిల్లాస్థాయి యోగాసనాల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో బ్రహ్మం టాలెంట్ హైస్కూల్ చిన్నారులు తమ ప్రతిభను చాటుకున్నారు. 10–12 ఏళ్ళ వయసు విభాగంలో జియాగాంధీ బంగారు పతకం, నోహిత కాంస్య పతకం, అక్షిత నాల్గవ ప్రైజ్, 14–16 ఏళ్ళ విభాగంలో జి.సునయన రజత పతకాలను సాధించారు. ఈ విద్యార్థులు రాష్ట్రస్థాయి యోగాసనాల పోటీలకు ఎంపికయ్యారు. ప్రతిభ చాటుకున్న విద్యార్థులను శుక్రవారం స్కూల్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం, టీచర్లు అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం లిల్లీ ఎలిజబెత్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై మరంత శ్రద్ధ వహించడంలో యోగాసనాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీచర్లు, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

గుడ్ టచ్..బ్యాడ్ టచ్‌పై అవగాహన అవసరం



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న బీవీబీపీ స్కూల్ ప్రిన్సిపాల్ అరుణశ్రీ

ఫిలింనగర్: విద్యార్థులు తప్పనిసరిగా గుడ్ టచ్..బ్యాడ్ టచ్.. విషయాల్లో విషయాల్లో అవగాహన కలిగి ఉండి అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా ఘటన జరిగినప్పుడు ధైర్యంగా ఆ విషయాన్ని ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలని జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యా భవన్ పబ్లిక్ స్కూల్ విద్యాశ్రమం ప్రిన్సిపాల్ అరుణశ్రీ సూచించారు. పాఠశాల ఏడో తరగతి విద్యార్థినీ విద్యార్థులకు శుక్రవారం ఇదే అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ ఇష్టానుసారంగా మాట్లాడుతూ అవతలి వారిని ఇబ్బంది పెట్టవద్దని, చాలా మంది నిక్‌నేమ్‌లతో పిలుస్తూ ఇబ్బందులకు గురిచేస్తుంటారని, అలా చేయవద్దన్నారు. చక్కని క్రమశిక్షణతో ఉండాలన్నారు. తమ స్కూల్‌లో ఉపాధ్యాయులు ఎంతో అనుభవజ్ఞులైన వారని, ఇలాంటి టీచర్లను తానెక్కడా చూడలేదన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. విద్యార్థులు కూడా చదువుల్లోనే కాకుండా ఇతర విషయాల్లో కూడా అంటే చదవడం, కవితలు, నవలలు రాయడం, పాటలు పాడడం, ఆటలు ఆడడం, పెరటి తోటల పెంపకం, తల్లిదండ్రులకు, సమాజానికి సహాయం చేయాలన్నారు.

పరిశోధనలతో మంచి ఫలితాలు అందించడమే లక్ష్యం



సదస్సును ప్రారంభిస్తున్న అతిథులు

బంజారాహిల్స్: పరిశోధనలు విస్తృతపరిచి మంచి ఫలితాలు సమాజానికి అందించడమే కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్శిటీ లక్ష్యమని యూనివర్సిటీ చాన్సలర్ కోనేరు సత్యనారాయణ అన్నారు. కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్శిటీలోని బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 27, 28 తేదీల్లో 'ఎపిజెనెటిక్స్ ఇన్ కేన్సర్ డయాగ్నోసిస్ అండ్ థెరపీ' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు జరిగింది. భారత ప్రభుత్వ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ రీసెర్చ్ బోర్డు (సెర్బ్)కు చెందిన అడ్వాన్స్‌డ్ నెట్‌వర్క్ రీసెర్చ్ ఎక్స్‌లెన్స్ ఫౌండేషన్ సహకారంతో జరిగిన ఈ సదస్సులో ఎపిజెనెటిక్ మెకానిజం ప్రాముఖ్యత, పరిశోధనలు, విద్యార్థుల ఆలోచనల మార్పిడి తదితర అంశాలపై కొనసాగింది. ఈ సందర్భంగా యూనివర్శిటీ చాన్సలర్ కోనేరు సత్యనారాయణ మాట్లాడుతూ కేన్సర్ నిర్ధారణ, చికిత్సను మెరుగుపరచడమే కాకుండా భవిష్యత్తుకు దోహదం చేసే విధంగా నిపుణుల ప్రసంగించారు. ప్రొఫెసర్ కె. జగన్నాథరావు, జీపీ సారథివర్మ, బుచ్చినాయుడు పాల్గొన్నారు.

బాలికా సాధికారతకు 'బీబీజీ' సేవలు స్ఫూర్తిదాయకం

సినీనటి మాళవిక శర్మ



చెక్కును అందజేస్తున్న సినీనటి మాళవికశర్మ

బంజారాహిల్స్: బాలికా సాధికారతపై బిల్డింగ్ బ్లాక్ గ్రూప్ అంకితభావం స్ఫూర్తిదాయకంగా ఉందని సినీ నటి మాళవిక శర్మ తెలిపారు. బంగారు తల్లి 459వ బీబీజీ టాలెంట్ ఫ్యాక్టరీ వేడుకను ఘనంగా నిర్వహించారు. బంగారు తల్లికి బీబీజీ నుంచి రూ. 45 లక్షల చెక్కును ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికా సాధికారతకు కృషి చేయడం అభినందనీయమన్నారు. అనంతరం బిల్డింగ్ బ్లాక్ గ్రూప్ సీఎండీ మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ బాలికా సాధికారతకు కట్టుబడి ఉన్నామన్నారు. శ్రీనివాసరావు, నీరజ, కస్తూరి ఉషతో సహా బంగారు తల్లి సభ్యుల అంకితభావాన్ని కొనియాడారు. హైదరాబాద్, ఖమ్మం, వైజాగ్, విజయవాడ, పాలకొల్లు, నిజామాబాద్, నారాయణఖేడ్, కంతితో సహా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల్లో విస్తరిస్తున్నామని పేర్కొన్నారు. బంగారు తల్లి ఎంతోమంది అమ్మాయిల జీవితాల్లో మార్పును తీసుకురాగలదని విశ్వసిస్తున్నామని చెప్పారు. 2040 నాటికి రెండు మిలియన్ల మంది ఆడపిల్లల జీవితాల ఉద్ధరణ లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు.

ప్రజావాణిలో 680 దరఖాస్తులు



దరఖాస్తులను స్వీకరిస్తున్న ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

లక్డీకాపూల్: ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల కోసం లబ్ధిదారులు ప్రజావాణిలో పెద్ద సంఖ్యలో దరఖాస్తులను సమర్పించారు. అదేవిధంగా పలువురు ఉద్యోగులు సైతం తమ సమస్యలపై అధికారులకు విన్నవించుకున్నారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 680 దరఖాస్తులు అందాయి. వీటిలో ఎస్సీ వెల్ఫేర్ శాఖకు సంబంధించి 215 అర్జీలు ఉన్నాయి. విద్యుత్ శాఖకు సంబంధించి 98, రెవెన్యూ పరమైన సమస్యలపై 94, మైనార్టీ వెల్ఫేర్‌కు సంబంధించి 90, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ 64, ఇతర శాఖలకు సంబంధించి 119 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా.చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు. అంతేగాకుండా ప్రజాభవన్‌కు వచ్చిన వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

నేడు, రేపు 'అసెట్స్ ఫెయిర్'



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఇండియన్ బ్యాంకు ప్రతినిధులు

పంజగుట్ట: మొండిబకాయిల కారణంగా సర్ఫాసి చట్టం ప్రకారం ఇండియన్ బ్యాంకు వారు స్వాధీనం చేసుకున్న ఆస్తులను వేలం వేసే క్రమంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఈ నెల 31, సెప్టెంబర్ 1వ తేదీన ఉదయం 10 నుంచి సాయంత్రం 6 వరకు 'అసెట్స్ ఫెయిర్–2024' పేరుతో ఆస్తుల మేళాను నిర్వహిస్తున్నట్లు ఇండియన్ బ్యాంక్ ఫీల్డ్ జోనల్ మేనేజర్ రాజేశ్వరరెడ్డి తెలిపారు. ఈ మేళా నగరంలో సోమాజిగూడ, రాజ్‌భవన్ రోడ్డులోని జయా గార్డెన్స్‌లో నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఫెయిర్ కరపత్రాన్ని ఫీల్డ్ డీజీఎం సభ్యసాచి, ఏజీఎం యూ.వి.సుబ్బారావు, డిప్యూటీ జోనల్ మేనేజర్ అభిషేక్ రంజన్‌తో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ అవసరాల నిమిత్తం ఆస్తులు తనఖా పెట్టి రుణాలు పొందినవారు, సంస్థలు వాటిని చెల్లించకపోవడంతో ఈ వేలం వేయనున్నట్లు తెలిపారు. ఫెయిర్‌లో ఆస్తుల వివరాలు, వాటి మార్కెట్ విలువ, కమర్షియల్ భవనాలు, స్థలాలు, ఇండస్ట్రీయల్ ప్రాపర్టీస్, ఓపెన్ ప్లాట్స్ మొత్తం తెలుగు రాష్ట్రాల్లో 238, తెలంగాణలో 40 ఆస్తులు ఉన్నాయని వీటి విలువ రూ.10 లక్షల నుంచి కోట్ల విలువ చేస్తుందని అన్నారు. 31వ తేదీ, 1వ తేదీల్లో జరిగే ఫెయిర్‌లో పాల్గొని తాము ప్రదర్శించిన ఆస్తుల వివరాలు తెలుసుకుని, వచ్చేనెల 11, 20వ తేదీల్లో జరిగే వేలం పాటలో పాల్గొనవచ్చని తెలిపారు.

ఓయూలో సైన్స్ మార్చ్



ఉస్మానియా యూనివర్సిటీ: ఇండియా మార్చ్ ఫర్ సైన్స్ హైదరాబాద్ ఆర్గనైజింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఓయూలో సైన్స్ మార్చ్(ర్యాలీ) నిర్వహించారు. ఎన్‌సీసీ గేటు నుంచి ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ వరకు అక్కడి నుంచి క్యాంపస్‌లోని ఆంధ్రమహిళ కాలేజీ వరకు మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా శుక్రవారం నిర్వహించిన ర్యాలీని సీసీఎంబీ సైంటిస్టు డాక్టర్ వి. రాధ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆంధ్ర మహిళా సభ కాలేజీలోని ఎంవీ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డా.రాధ మాట్లాడుతూ సైన్స్ అనేది జీవితంలో ఒక భాగం, కేవలం చదువుకు మాత్రమే సైన్స్‌ను పరిమితం చేయకూడదని, జీవితంలో అన్ని విషయాల్లోనూ సైన్స్‌ను ఆచరించాలన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'చిత్రపురి'పై చట్టప్రకారం ముందుకెళ్లండి

మణికొండ మున్సిపల్ అధికారులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని చిత్రపురి కాలనీలో అక్రమ నిర్మాణాల కూల్చివేతపై చట్టప్రకారం ముందుకు వెళ్లాలని అధికారులను హైకోర్టు ఆదేశించింది. ప్రస్తుతం జారీ చేసిన నోటీసులను షోకాజ్‌గా పరిగణించి 7 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని చెప్పింది. పిటిషనర్లు వారి వద్ద ఉన్న పత్రాలు, రసీదులను అధికారులకు సమర్పించాలని సూచించింది. వాదనలు విన్న తర్వాత చట్టప్రకారం చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించింది. ఈ అంశంలో మెరిట్‌లోకి వెళ్లబోవడం లేదని స్పష్టం చేసింది. చిత్రపురికాలనీలో జీవో 658కి విరుద్ధంగా 225 రో హౌస్‌లు కట్టినట్లు మున్సిపాలిటీ అధికారులు గుర్తించారు. వాస్తవానికి ఈ విల్లాల నిర్మాణానికి జీ+1 మాత్రమే అనుమతి ఉందని, గత పాలకవర్గం తప్పుడు నిర్ణయం వల్ల చిత్రపురి సొసైటీకి సుమారు రూ.50 కోట్ల నష్టం జరిగిందని ఫిర్యాదులు అందాయి. దీంతో అవకతవకల విషయం తేల్చేందుకు మణికొండ మున్సిపల్ కమిషనర్ నోటీసులు జారీ చేశారు. 15 రోజుల్లోగా వివరణ ఇవ్వకుంటే కూల్చివేతలు చేపడతామని హెచ్చరించారు. మణికొండ మున్సిపల్ కమిషనర్ ఈ నెల 23న జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ తెలుగు సినీ వర్కర్స్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. పిటిషన్‌పై జస్టిస్ టి.వినోద్‌కుమార్ శుక్రవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. చట్టప్రకారం ముందుకు వెళ్లాలని ఆదేశిస్తూ, విచారణ ముగించారు.

పీఓడబ్ల్యూ మహాసభలను జయప్రదం చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మహిళల సమాన హక్కులు, సమాన అవకాశాల కోసం రాజీలేని పోరాటం చేస్తున్నామని పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ అన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీన పీఓడబ్ల్యూ తెలంగాణ రాష్ట్ర 7వ మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 11గంటలకు వీఎస్టీ నుంచి ఇందిరా పార్కు వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. దళిత, ఆదివాసీ, మైనార్టీ హక్కులపై దాడి చేస్తున్న విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నామన్నారు. జనాభా ప్రాతిపదికన చట్ట సభల్లో ఉద్యోగ, ఉపాధి, విద్యా రంగంలో మహిళలకు రిజర్వేషన్‌లు కల్పించి అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. పీఓడబ్ల్యూ ప్రధాన కార్యదర్శి అందె మంగ, ఉపాధ్యక్షురాలు అరుణ, అనసూయ, నగర కార్యదర్శి పుష్ప, సుజాత పాల్గొన్నారు.

సిక్‌లీవ్‌లో.. స్ట్రీట్‌లైట్స్!

ప్రజలెంత మొత్తుకున్నా పట్టించుకుంటే ఒట్టు

'జీహెచ్‌ఎంసీలో స్ట్రీట్‌లైట్లు సిక్‌లీవ్‌లో ఉన్నాయి.' 'గ్రేటర్ నగరంలో వీధి దీపాలకు కేన్సర్ సోకింది' అంటూ నగరంలో స్ట్రీట్ లైట్స్(వీధి దీపాల) సమస్యల గురించి ఫిర్యాదులు చేసి చేసి విసిగిపోయిన పౌరులు ఎక్స్ వంటి సామాజిక మాధ్యమాల్లో చేసిన పోస్టులు ఇవీ.. అయినా ఇటు జీహెచ్‌ఎంసీ, అటు నగరంలో స్ట్రీట్ లైట్స్ నిర్వహణ బాధ్యతలు తీసుకున్న ఈఈఎస్‌ఎల్ కానీ పట్టించుకోవడం లేదు. ప్రజలు ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా, పత్రికల్లో కథనాలు వచ్చినా డోంట్ కేర్ అన్నట్లు వ్యవహరిస్తోంది ఈఈఎస్ఎల్.

– సాక్షి, సిటీబ్యూరో



నగరంలోని చాలా ప్రాంతాల్లో రాత్రి వేళలో ఒక్క నిమిషం కూడా వీధి దీపాలు వెలగడం లేవు. అనేక ప్రాంతాల్లో పట్టపగలు సైతం వెలుగులు చిమ్ముతూనే ఉన్నాయి. వెలగని వీధి దీపాల కారణంగా అసాంఘిక శక్తుల అరాచకాలతో ప్రజలకు ముప్పు పొంచి ఉండగా, పగలే వెలుగుతున్న వాటితో జీహెచ్‌ఎంసీ ఖజానాపై బిల్లుల భారం తడిసి మోపెడవుతోంది. జీహెచ్‌ఎంసీలో విద్యుత్ పొదుపు కోసం ఆరేళ్ల క్రితం ఎల్‌ఈడీ వీధి దీపాల ఏర్పాటు, నిర్వహణ బాధ్యతల్ని ఈఈఎస్‌ఎల్(ఎనర్జీ ఎఫీషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్)కు అప్పగించారు. ఒప్పందం మేరకు 98 శాతం లైట్లు వెలగకపోతే నెలవారీ చెల్లించాల్సిన డబ్బు(యాన్యుటీ) చెల్లించకపోవడంతో పాటు ఈఈఎస్‌ఎల్‌కు పెనాల్టీ విధించాలి. కానీ ఐదారేళ్ల వరకు 50 శాతం వెలగకున్నా చెల్లింపులు చేసినట్లు సమాచారం. దీంతో మిగిలిన ఆరేడు నెలల కాలానికి తమకు యాన్యుటీ చెల్లించకపోయినా ఇప్పటికే పొందిన భారీ లాభాలతో నష్టమేమీ లేదనే ధీమాతో జీహెచ్‌ఎంసీని ఈఈఎస్‌ఎల్ ఖాతరు చేయడం లేదు. ఈ వైఖరిని గుర్తించిన గత కమిషనర్లు లోకేశ్‌కుమార్, రోనాల్డ్‌రాస్‌లు ఒకటి రెండు పర్యాయాలు మాత్రం పెనాల్టీలు విధించారు. వారు బదిలీపై వెళ్లిపోవడంతో మళ్లీ ఈఈఎస్‌ఎల్ ఆడిందే ఆటగా మారింది.

మాటల్లోనే ఆటోమేటిక్..

స్ట్రీట్‌లైట్స్ ఆటోమేటిక్‌గా చీకటి పడగానే వెలగాలి.. పగలు కాగానే ఆరిపోవాలనేది ఒప్పందంలో భాగం. కానీ దాన్ని పట్టించుకోకుండానే నిరంతరాయంగా చెల్లింపులు చేశారు. మహా అంటే మూడు నెలల యాన్యుటీ మాత్రం చెల్లించలేదని విశ్వసనీయ సమాచారం. ఇప్పటికే పొందిన బిల్లుల్ని పరిగణనలోకి తీసుకుంటే ఈఈఎస్‌ఎల్ గడువు ముగిసేంత దాకా చెల్లించకున్నా నష్టమేమీ లేదని నిపుణులైన విద్యుత్ ఇంజినీర్ల ద్వారా తెలిసింది. అయినా బల్దియా ఉన్నతాధికారులు ఎందుకు ఉపేక్షిస్తున్నారో అర్థం కాదు. ఆన్, ఆఫ్, గ్లోయింగ్ శాతం తెలిపే డ్యాష్‌బోర్డు కూడా పనిచేయడం లేదని సమాచారం.



ఆజంపురాలో పగలే వెలుగుతున్న వీధి దీపాలు

బల్దియాలో చీకటి రాజ్యం

- పరిష్కరించకుండానే ఫిర్యాదులు క్లోజ్
- వెలుగులు లేకున్నా ఈఈఎస్‌ఎల్‌కు బిల్లుల చెల్లింపు

జీహెచ్‌ఎంసీ– ఈఈఎస్‌ఎల్ ఒప్పందం ఇదీ..

- ఒప్పంద కాలపరిమితి: మే 2018 నుంచి ఏప్రిల్ 2025 వరకు.
- రహదారుల వెంబడే కాకుండా లింక్‌రోడ్లు, ఫ్లైఓవర్లు, పార్కులు, చెరువులు, శ్మశానవాటికల వద్ద సైతం వీధి దీపాల నిర్వహణ ఈఈఎస్‌ఎల్‌దే..
- ఎల్‌ఈడీల ఏర్పాటు వల్ల ఏడేళ్ల కాలానికి జీహెచ్‌ఎంసీకి దాదాపు రూ.673 కోట్లు ఆదా అవుతుందని పేర్కొన్నారు. అలా పేర్కొంటూ రూ.563.58 కోట్లకు ఒప్పందం కుదుర్చుకున్నారు. దాదాపు రూ.500 కోట్ల వరకు చెల్లింపులు జరిగినట్లు తెలుస్తోంది.
- ఉండాల్సిన వీధి దీపాలు 5,40,494
- ఆటోమేటిక్ వ్యవస్థ పనిచేసేందుకు ఉండాల్సిన సీసీఎంఎస్‌లు(స్విచింగ్ పాయింట్లు) 30,239. కానీ లేవు.
- 2017లో ఏడాదికి జీహెచ్‌ఎంసీకి విద్యుత్ బిల్లుల ఖర్చు రూ.137 కోట్లు
- 2019 నాటికే అది రూ.94 కోట్లకు తగ్గాలి. కానీ 2022–23లో రూ.106 కోట్లకు పైగా చెల్లించారు.

మచ్చుకు కొన్ని వెలగని ప్రాంతాలు..

ఎగ్జిబిషన్ గ్రౌండ్స్, గాంధీభవన్, గృహకల్ప కాంప్లెక్స్, రాజేంద్రనగర్, మెటల్ చార్మినార్, మూసాపేట, ప్యారడైజ్, డీఎల్‌ఎఫ్, గచ్చిబౌలి, చిక్కడపల్లి, మార్కెట్ స్ట్రీట్ సికింద్రాబాద్, హబీబ్‌నగర్ నాలా, మల్లేపలి, హైటెక్‌సిటీ రైల్వేస్టేషన్ రోడ్, హఫీజ్‌పేట తదితర ప్రాంతాలు.

ఆరని ప్రాంతాలు..

సికింద్రాబాద్, మల్కాజిగిరి, మలక్‌పేట, చందానగర్ తదితర ప్రాంతాలు



మలక్‌పేటలో..

పోల్స్ వేసినా..

కొత్తగా వెలసిన ప్రాంతాల్లో అదనంగా వీధి దీపాలు ఏర్పాటు చేయాలి. అందుకుగాను పోల్స్ బాధ్యత జీహెచ్‌ఎంసీది కాగా, బల్బులు ఈఈఎస్‌ఎల్ అమర్చాలి. పోలీసులు, జీహెచ్‌ఎంసీ గుర్తించిన చీకటి ప్రాంతాలు 10వేలకు పైగా ఉన్నాయి. తొలిదశలో దాదాపు 2వేల ప్రాంతాల్లో ఏర్పాటుకు జీహెచ్‌ఎంసీ పోల్స్ ఏర్పాటు చేసింది. కానీ ఈఈఎస్‌ఎల్ మాత్రం బల్బులు అమర్చలేదు. పాత పోల్స్‌కు ఉన్న బల్బులు పోయినా కొత్తవి వేయడం లేదు. మరమ్మతులు అవసరమైనా చేయడం లేదు. అయినా జీహెచ్‌ఎంసీ పట్టించుకోవడం లేదు.. ఎందుకో..?

నగరంలో నేడు..

- శ్రీత్యాగరాయ గానసభ, తెలంగాణ హరికథా కళాకారుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో చిక్కడపల్లిలోని త్యాగరాయ సభలో ఉదయం 10 గంటలకు ఆదిభట్ల నారాయణ దాసు జయంత్యోత్సవాలు జరుగుతాయి.
- ది హౌజ్ ఆఫ్ కంచి వీవ్స్ అయిన సఖీ శారీస్ స్టోర్ ఏఎస్‌రావు నగర్‌లో ఉదయం 10.30గంటలకు కొత్త స్టోర్‌ను ప్రారంభించనుంది.
- జనరల్ ఇన్సూరెన్స్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదర్‌గూడలోని ది సెంట్రల్ పార్క్‌లో ఉదయం 11 గంటలకు నుంచి అఖిల భారత జనరల్ ఇన్సూరెన్స్ పెన్షనర్స్ లీడర్‌షిప్ సదస్సు ఉంటుంది.
- వర్క్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌజ్‌లో సాయంత్రం 6 గంటలకు ఎన్‌జీవో ఫెలిసిటేషన్ ప్రోగ్రామ్ జరుగుతుంది.
- శ్రీమహర్షి రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వేదిక్ టెక్నాలజీ(ఎస్‌ఆర్‌ఐవీటీ) ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని టీ హబ్‌లో ఉదయం 9.15 గంటలకు అంతర్జాతీయ సదస్సు జరుగుతుంది. సదస్సుకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హాజరుకానున్నారు.
- బిగ్ ఎఫ్‌ఎం, రీ సస్టైయినబిలిటీ ఆధ్వర్యంలో పర్యావరణహిత, గో గ్రీన్ గణేశా కార్యక్రమాన్ని ఉదయం 8.30 గంటలకు గచ్చిబౌలిలోని గెలాక్సీలో నిర్వహిస్తారు. నటుడు సుధీర్‌బాబు హాజరవుతారు.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

ప్రత్యామ్నాయ జర్నలిజానికి నాంది పలికిన హనుమంతరావు

తెలంగాణ మీడియా అకాడమీ అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న కేవీపీ రామచంద్రారావు, చిత్రంలో కే.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

పంజగుట్ట: తెలుగు జర్నలిజంలో ఆర్థిక అంశాలపై సామాజిక స్పృహ కల్పించిన వ్యక్తి సుప్రసిద్ధ పాత్రికేయులు వి.హనుమంతరావు అని తెలంగాణ మీడియా అకాడమీ అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అప్పటి వరకు ఆర్థిక అంశాలను కూడా వార్తల్లా చదివిన వారికి విశ్లేషించుకునే స్థాయికి తీసుకువెళ్లిన గొప్ప జర్నలిస్టు వీహెచ్ అని కొనియాడారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వయోధిక పాత్రికేయ సంఘం ఆధ్వర్యంలో సుప్రసిద్ధ పాత్రికేయులు, డీఎస్ఎఫ్ వ్యవస్థాపకులు, వయోధిక పాత్రికేయ సంఘం వ్యవస్థాపక ఉపాధ్యక్షుడు వి.హనుమంతరావు శత జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. వీహెచ్ స్వాతంత్ర్యోద్యమం ముందు చూశారు.. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొదటితరం జర్నలిస్టు కావడం, జాతీయోద్యమం నుంచి వచ్చిన జర్నలిస్టు కావడంతో ప్రత్యామ్నాయ జర్నలిజానికి నాంది పలికినవారిలో ముందంజలో ఉన్నారని తెలిపారు. హనుమంతరావు శత జయంతి పురస్కరించుకుని ఆయన పేరుపై ఏదైనా కార్యక్రమం చేసేందుకు సీనియర్ జర్నలిస్టులతో చర్చిస్తామని తెలిపారు. మాజీ రాజ్యసభ సభ్యులు కె.వి.పి.రామచంద్రారావు మాట్లాడుతూ.. ఒక పాత్రికేయుడి జీవితం ఆ రోజుల్లో ముళ్లబాట అని, కుటుంబం ఎన్ని ఇబ్బందులు పడుతున్నా విలువలతో కూడిన జర్నలిజం చేసేవారన్నారు. ప్రముఖ విశ్లేషకులు పరకాల ప్రభాకర్ మాట్లాడుతూ.. అప్పట్లోనే బడ్జెట్‌లో ఏపీ కేటాయింపులపై ఎంతో విశ్లేషణ చేసేవారని అన్నారు. వీక్షణం సంపాదకులు ఎన్.వేణుగోపాల్, హనుమంతరావు సతీమణి సరళావి, జర్నలిస్ట్ డైరీ నిర్వాహకులు సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ హంగులతో ఉస్మానియా నూతన భవనం

గోషామహల్ పోలీస్ స్టేడియాన్ని పరిశీలించిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



గోషామహల్ పోలీస్ స్టేడియాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

గన్‌ఫౌండ్రీ: హైదరాబాద్ నగరం నడిబొడ్డున నూతనంగా నిర్మించనున్న ఉస్మానియా ఆస్పత్రి భవన నిర్మాణం కార్పొరేట్ ఆస్పత్రులకు ఏమాత్రం తగ్గకుండా ఉంటుందని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. గోషామహల్ స్టేడియం, పక్కన ఉన్న పలు భవనాలు, నాలా ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఉస్మానియా ఆస్పత్రి భవన నిర్మాణం కోసం గోషామహల్ పోలీస్ స్టేడియం స్థలాన్ని పరిశీలించినట్లు చెప్పారు. అన్ని రకాల సదుపాయలతో నూతన భవనాన్ని నిర్మించి నగరవాసులకే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల వారికి సైతం మెరుగైన వైద్య సేవలు అందించేలా ఉండాలన్నారు. గోషామహల్ పోలీస్ స్టేడియంలో ఉన్న పోలీస్ అకాడమి, అనుబంధ శాఖలను బహదూర్‌పురా పేట్లబుర్జులోని ఆర్గనైజేషన్‌కు మారుస్తామని, అక్కడ కూడా పోలీస్ శాఖకు అన్ని హంగులతో కూడిన శిక్షణ కేంద్రాలను నిర్మిస్తామని అన్నారు. అనంతరం గోషామహల్ పోలీస్ స్టేడియంలోని 31 ఎకరాల 39 గుంటల స్థలాన్ని స్వయంగా బైక్‌పై వెళ్లి రోడ్లు, నాలాలు, స్టేడియంతో పాటు పలు ప్రాంతాలను పరిశీలించారు. ఇన్‌చార్జి ఆర్డీఓ జ్యోతి, ఏసీపీ ఉదయ్‌కృష్ణ, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ శశిరేఖ, తహసీల్దార్ ప్రేమ్‌కుమార్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హరేకృష్ణ హెరిటేజ్ ప్రాజెక్టుకు భారీ విరాళం

రూ.25 లక్షలు అందజేసిన నల్సింగ్ క్లాత్ ఎంపోరియం

సాక్షి, సిటీబ్యూరో: హరే కృష్ణ హెరిటేజ్ టవర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం నల్సింగ్ క్లాత్ ఎంపోరియం భారీ విరాళం అందజేసింది. ఈ ప్రాజెక్టు కోసం రూ.25 లక్షల విరాళాన్ని హరేకృష్ణ మూవ్‌మెంట్ హైదరాబాద్ ప్రెసిడెంట్ సత్యగౌర చంద్రదాస ప్రభుజీకి సంస్థ ఎండీ సంజయ్ సింఘానియా, డైరెక్టర్ రవికాంత్ సింఘానియా అందజేశారు.

దేశం పురాతన వారసత్వాన్ని తిరిగి పొందుతోంది

బెహ్నో న్యూయార్క్ వ్యవస్థాపకుడు శివం పుంజ్య



సమావేశంలో అతిథులు

రాయదుర్గం: భారతదేశం తన పురాతన వారసత్వాన్ని తిరిగి పొందుతోందని బెహ్నో న్యూయార్క్ వ్యవస్థాపకుడు శివం పుంజ్య పేర్కొన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని కోరమ్ క్లబ్‌లో సస్టేనబుల్ ఫ్యాషన్స్ యంగ్ ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్(వైఎఫ్‌ఎల్‌ఓ) శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న శివం పుంజ్య మాట్లాడుతూ భారతదేశం విలాసవంతమైన తమ ఉత్పత్తులను ప్రపంచానికి అందించడంలో తమవంతు పాత్రను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తోలు వంటి రంగాల్లో భారతీయ లగ్జరీని ప్రదర్శించడంలో సహకరిస్తున్నందుకు తాము గర్విస్తున్నట్లు చెప్పారు. టెక్స్‌టైల్ అండ్ ఫ్యాషన్ డిజైనర్ గౌరంగ్‌షా మాట్లాడుతూ ఫ్యాషన్ కోసం ప్రపంచం భారతదేశం వైపు చూస్తోందన్నారు. ఎందుకంటే ఇంత గొప్పగా చేతితో తయారు చేసిన వస్త్రాలు మరెక్కడా దొరకవన్నారు. ఏదైనా ఫంక్షన్‌కు మాత్రమే చీర కట్టుకోవాలి అన్నట్లుగా మారిందన్నారు. ఎంటర్‌ప్రెన్యూర్ పింకీరెడ్డి, వైఎఫ్‌ఎల్‌ఓ చైర్‌పర్సన్ రిధిషా, సహారా కాన్షియస్ ఎఫర్ట్ స్థాపకురాలు సాచిబహ్లా పాల్గొన్నారు.

ఓయూ కామర్స్ డీన్‌గా ప్రొ.చెన్నప్ప

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ కామర్స్ డీన్‌గా ప్రొ.చెన్నప్ప శుక్రవారం నియమితులయ్యారు. గతంలో కామర్స్ హెడ్‌గా, బీవోఎస్‌గా, సికింద్రాబాద్ పీజీ కాలేజీ, ఓయూ క్యాంపస్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కాలేజీ ప్రిన్సిపల్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

నేడు 'టీహబ్'లో 'ఐకాన్ భారత్' అంతర్జాతీయ సదస్సు

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీ హబ్‌లో అంతర్జాతీయ సదస్సు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. శనివారం ఉదయం 9.15 గంటలకు 'ఐకాన్ భారత్' పేరిట 'యునైటింగ్ వేదిక్ నాలెడ్జ్ విత్ మోడ్రన్ టెక్నాలజీస్' అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తారు. ముఖ్యఅతిథిగా కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు, డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డి, బిట్స్ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ వి.రాంగోపాల్‌వర్మ, ఎస్‌ఆర్‌ఐవీటీ వ్యవస్థాపకుడు, చైర్మన్ డాక్టర్ ఏబీఎస్ శాస్త్రి పాల్గొంటారు.

యాంటీ మైక్రోబియల్ నిరోధకతపై నిమ్స్‌లో సదస్సు



లక్డీకాపూల్: యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్‌పై పోరాడేందుకు నిమ్స్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని నిమ్స్ డైరెక్టర్ బీరప్ప పేర్కొన్నారు. నిమ్స్‌లో యాంటీ మైక్రోబియల్ స్టీవార్డ్ షిప్(ఏఎంఎస్) వర్క్‌షాప్ శుక్రవారం జరిగింది. యాంటీ మైక్రోబియల్ మందులు ఇచ్చే విషయంలో ప్రమాణాలు పాటించి, యాంటీ మైక్రోబియల్ నిరోధకతను తగ్గించేందుకు కృషి చేసేందుకు ఈ సదస్సు నిర్వహించారు. దాదాపు 100 మంది వైద్య నిపుణులు హాజరయ్యారు. డాక్టర్లు తమ ఆస్పత్రుల్లో ఏఎంఎస్ ప్రాక్టీస్ అమలు చేయాలని ప్రతినిధులు కోరారు. సదస్సులో నిమ్స్ డీన్ డాక్టర్ లిజా, డాక్టర్లు సుబ్బలక్ష్మి, చంద్ర, ఉమాబాల, సుకన్య, కవిత, సుచంద్ర, భానుప్రసాద్ పాల్గొన్నారు.

మెట్రో స్టేషన్ల వద్ద ఉచిత పార్కింగ్ కల్పించాలి

మెట్రో రైల్ ఎండీకి యువజన సంఘాల వినతి



సాక్షి, సిటీబ్యూరో: మెట్రో ప్రయాణికుల నుంచి పార్కింగ్ చార్జీల వసూళ్లను వెంటనే ఉపసంహరించుకోవాలని, మెట్రోస్టేషన్ల వద్ద ప్రయాణికులకు ఉచిత పార్కింగ్ సదుపాయం కల్పించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రదీప్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోటా రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జావీద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదరాబాద్ మెట్రో రైల్, ఎల్ అండ్‌టీ సంస్థలు పార్కింగ్ చార్జీలను రద్దు చేయాలని కోరుతూ బేగంపేట్‌లోని మెట్రో రైలు కార్యాలయంలో మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రయాణికులకు ఉచిత పార్కింగ్ సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత మెట్రో సంస్థదేనని పేర్కొన్నారు. మెట్రో రైల్ నిర్మాణంలో భాగంగానే నిర్మాణ సంస్థకు ప్రభుత్వం ఉచితంగా భూములను అందజేసిందని, అలాంటి స్థలాల్లో ఎలాంటి సదుపాయాలు కల్పించకుండానే ప్రయాణికులు వాహనాలు నిలిపితే పార్కింగ్ చార్జీల పేరుతో దోపిడీకి పాల్పడటం దారుణం అని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఒక వైపు ప్రయాణికుల నుంచి రూ.వందల్లో మెట్రో చార్జీలు వసూలు చేస్తూనే మరోవైపు పార్కింగ్ రవాణా చార్జీలతో సమానంగా పెద్ద మొత్తంలో పార్కింగ్ చార్జీలు వసూలు చేయడం ఎంతవరకు సమంజసం అన్నారు. తక్షణమే నాగోల్, మియాపూర్ స్టేషన్లతో పాటు అన్ని మెట్రో స్టేషన్లలో ఉచిత పార్కింగ్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. సానుకూల నిర్ణయం తీసుకోకపోతే యువజన సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు సెప్టెంబర్ 1న నాగోల్ మెట్రో స్టేషన్ వద్ద ధర్నా చేపట్టనున్నట్లు చెప్పారు. కళ్యాణ్, అనిల్ కుమార్(ఏఐవైఎఫ్), హస్మీబాబు(డీవైఎఫ్ఐ), ఎం.రవికుమార్, బి.ఎస్ కృష్ణ, మనోహర్(పీవైఎల్) తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి

పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద ధర్నా



ఇందిరాపార్కు ధర్నాలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ

కవాడిగూడ: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే లక్ష్యంతో గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేశారని, కానీ కనీస వసతులు, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో తరచూ ఫుడ్‌పాయిజన్, విషజ్వరాలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వసతులు కల్పించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. అధికారంలోకి వచ్చి 9 నెలలు గడిచినా కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శులు మైస శ్రీనివాస్, ముత్యాల రవీందర్, పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు భూవనగిరి మధు, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోడపంగి నాగరాజు, ఉపాధ్యక్షుడు డి.ప్రణయ్, మంద నవీన్, నాయకులు నర్సింహారెడ్డి, మామిడాల మహేష్, శ్యామ్, నాగరాజు, ప్రవీణ్, సందీప్, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టీఎఫ్ సభ్యుడు నాగేశ్వరరెడ్డిని కలిసిన జూడాలు


20 ప్రతిపాదనలతో వినతిపత్రం



ఎన్‌టీఎఫ్ సభ్యుడు డాక్టర్ నాగేశ్వరరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న టీ–జూడా ప్రతినిధులు

గాంధీఆస్పత్రి: నేషనల్ టాస్క్‌ఫోర్స్ సభ్యుడు, ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంట్రాలజీ(ఏఐజీ) వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ డీ.నాగేశ్వరరెడ్డిని తెలంగాణ జూనియర్ డాక్టర్ల అసోషియేషన్ (టీ–జూడా) ప్రతినిధులు శుక్రవారం కలిసి 20 ప్రతిపాదనలతో వినతిపత్రం అందించారు. ఈ మేరకు జూడా సంఘ ప్రతినిధులు మీడియాతో మాట్లాడుతూ విధి నిర్వహణ సమయంలో భద్రత, సెక్యూరిటీ వ్యవస్థ పటిష్టత, డిస్ట్రిక్ట్ రెసిడెన్సీ ప్రోగ్రాం(డీఆర్‌పీ) సమయంలో వసతి సౌకర్యాల కల్పన, మహిళా వైద్యులు, వైద్య విద్యార్థినులకు ప్రత్యేకంగా డ్యూటీ రూమ్‌లు ఏర్పాటు తదితర అంశాలపై వినతి పత్రం అందించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగితో పాటు సహాయకుడిగా ఒకరికే అనుమతి, ఆస్పత్రి ఎంట్రీ పాయింట్ వద్ద బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు, శిక్షణ పొందిన సెక్యూరిటీ గార్డుల ఏర్పాటు, స్టైఫండ్ పెంపుతో పాటు వ్యత్యాసాలు లేకుండా దేశవ్యాప్తంగా అందరికీ ఒకేలా స్టైఫండ్ ఇవ్వాలని కోరినట్లు వివరించారు. ఎన్‌టీఎఫ్ సభ్యుడు నాగేశ్వరరెడ్డి సానుకూలంగా స్పందించారని, త్వరలో జరిగే సమావేశంలో వినతి పత్రంలో పొందుపర్చిన పలు అంశాలపై చర్చిస్తానని హామీ ఇచ్చారని జూడాలు తెలిపారు. టీ–జూడా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాహుల్, ఇసాక్ న్యూటన్, ఉపాధ్యక్షుడు ఆశిష్, గాంధీ యూనిట్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు డాక్టర్ వంశీకృష్ణ, అజయ్ కుమార్ పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, శనివారం, 31, ఆగస్టు, 2024



మొదట న్యూయార్క్‌లో ప్రారంభించిన హైదరాబాదీ..

తక్కువ నూనెలు, తక్కువ కారం.. సుగంధ ద్రవ్యాలు

గ్లోబల్ ఫేవరెట్ డిష్‌గా మొరాకో రుచులు..

గ్లోబల్ ఫేవరెట్.. మొరాకో



హైదరాబాద్ వైబ్స్

దేశంలో తొలి మొరాకో రెస్టారెంట్ సిటీలోనే..

న్యూయార్క్ తో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందిన మొరాకన్ రెస్టారెంట్ నగరంలోని జూబ్లీహిల్స్ వేదికగా ప్రారంభమైంది. అరుదైన వంటకాలతో వినూత్నమైన, పసందైన రుచులను అందించడం మొరాకన్ ప్రత్యేకత. భారతీయులకు ఈ మొరాకన్ రుచులను అందించడం కోసం దేశంలోనే మొట్టమొదటిసారిగా హైదరాబాదులో రెస్టారెంట్ ప్రారంభించడం విశేషం. అయితే ఈ మొరాకన్ వ్యవస్థాపకులు, ప్రముఖ చెఫ్ అనీసా వహీద్ హైదరాబాదీ కావడం మరో విశేషం.

– సాక్షి, సిటీబ్యూరో



లగ్జరీ వంటకాలుగా ఆదరణ పొందిన మొరాకో డిషెస్ సుగంధ ద్రవ్యాలతో పాటు భారతీయ వంటకాల్లో వినియోగించే కొన్ని ఫ్లేవర్స్ తో తయారు చేస్తారు. ఉత్తర ఆఫ్రికన్, మెడిటరేనియన్, అరబ్, పెర్షియన్ పాకశాస్త్ర మూలాల ప్రపంచ–ప్రసిద్ధ సమ్మేళనంతో సువాసనగల మొరాకో రుచులు భారత్ లోని మధ్యధరా/మధ్యప్రాచ్య ప్రాంతాల్లో విస్తరణకు పూనుకున్నారు. తారా కిచెన్ లోకి ప్రవేశించగానే ఎడారి–పర్వత–సముద్ర సెట్టింగులు దేశ వైభవాన్ని ప్రదర్శిస్తాయి. సహారా–ప్రేరేపిత డైనింగ్ రూమ్‌లో అతిథులకు వెండి టీ కుండల నుంచి అందించే మొరాకో పుదీనా టీతో స్వాగతం పలుకుతుంది. మొరాకో ప్రసిద్ధ బ్రైజ్డ్ డిష్, వినూత్నమైన మటన్–చికెన్, సీఫుడ్, ముఖ్యంగా టాగిన్ అని పిలువబడే కూరగాయలు.. వీటిని సంప్రదాయ శంఖు ఆకారపు కుండలో టేబుల్ పైన వడ్డించే విధానం అద్భుతం. ముఖ్యంగా సువాసనతో కూడిన మసాలా మిశ్రమాలు, గులాబీ సువాసనగల బక్లావా వంటి డెజర్ట్స్ నోరూరిస్తాయి. వెజిటబుల్, ఫ్రూట్ సలాడ్లు, డిప్ల వంటకాల అద్భుతమైన రుచులను అందిస్తుంది. ఆరోగ్య సంరక్షణ కోసం సమతుల్య పోషకాలతో వంటకాలను అందించడం ఈ రెస్టారెంట్ ప్రత్యేకత. అతి తక్కువ నూనెలు, పాల ఉత్పత్తులతో.. బాదం, దానిమ్మ మొలాసిస్‌తో ఫిగ్ సలాడ్, కాల్చిన వంకాయ, జాలోక్ కూరగాయల కౌస్కాస్, ఆలివ్ ఫిష్ ట్యాగిన్ ఇలా వినూత్న వంటకాలు వాహ్ అనిపిస్తాయి. ఈ వంటలలో గ్లూటెన్ ఇతర అలెర్జీ కారకాలు ఉండవని చెఫ్ లు తెలిపారు.

నా నగరం, నా ఇల్లు..

మన దేశంలో లేని వంటకాలు ఏవైనా ఉన్నాయంటే అవి మొరాకో రుచులు మాత్రమే. అందుకే నా నేల పై, నా నగరానికి, నా ఇంటికి తీసుకొచ్చాను. పురాతన వాణిజ్య మార్గాలు, విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలను అనుసంధానం చేసే వారధి 'ఆహారం'. దీంతో పాటు స్థానిక వారసత్వ వంటలతో పాటు విభిన్న కాంటినెంటల్ రుచులను ఆహ్వానించి, ఆస్వాదించే సంప్రదాయం ఈ నగరానికి ఉంది. మొరాకోలోని మర్రకేష్లో నా భాగస్వామి ముంటాసిమ్ తో మొదలైన ప్రేమకు గుర్తుగా ఈ మొరాకో రెస్టారెంట్ ప్రారంభించాం. ఇది ప్రేమకు చిహ్నమైన భాగ్యనగరానికి రావడం సంతోషంగా ఉంది. స్థానిక ఎన్‌జీఓకు చేయూతనివ్వడంతో పాటు, వ్యాపార ఔత్సాహికుల కోసం వనరులను అందించే ఇంక్యుబేటర్ని ప్రారంభించాం.



– ప్రముఖ చెఫ్ అనీసా వహీద్, ఫౌండర్, ఈజీ మొరాకన్ కుక్‌బుక్ రచయిత



పురాణకాలం నుంచి నేటివరకూ దేవునికి సంబంధించిన ప్రతి ఉత్సవంలోనూ రథం ప్రధాన పాత్ర పోషిస్తుంది. అనేక రకాల వాహనసేవలు ఉన్నప్పటికీ స్వామివారు రథంపై ఊరేగుతున్న వైభవం తిలకించేందుకు రెండుకళ్లూ చాలవు. ఆ సమయంలో భక్తులు పొందే ఆధ్యాత్మికత, ఆనందం, అనుభూతి వర్ణనాతీతం. సూర్యభగవానుడు మకరరాశి ప్రవేశంతో ఉత్తరాయణం ప్రారంభ సూచకంగా రథసప్తమి అనే పేరువచ్చిందని, సూర్యుని గమనం ఏడు గుర్రాల బంగారు రథంపై సాగుతుందనేది వేదసారాంశం. నాటి మహాభారతం నేటి బాహుబలి సినిమా వరకూ రథాలకు ప్రత్యేకత కొనసాగుతోంది. దీనిపై ప్రత్యేక కథనం.. – చిలకలగూడ

రథ సారథి..

రథ శిల్పి సింహాద్రి గణపతిచారి ప్రత్యేక తయారీలో సిద్ధహస్తుడు

తెలుగురాష్ట్రాల్లోని పలు ఆలయాలకు సేవలు

సికింద్రాబాద్ శ్రీనివాస నగర్‌కు చెందిన సింహాద్రి గణపతిచారి రథాలను రూపొందించడంలో సిద్ధహస్తుడు. తెలుగు రాష్ట్రాల్లోని పలు ఆలయాలకు వివిధ రూపాలు, విభిన్న శైలిలో రథాలను రూపొందించి తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. అమెరికాలోని నార్త్ కరోలినాలోని బాలాజీ ఆలయానికి 16 అడుగుల ఎత్తుగల రథాన్ని రూపొందించి షిప్‌లో అక్కడికి తీసుకెళ్లి ప్రవాస భారతీయుల ప్రశంసలు పొందాడు. గత మూడు దశాబ్దాలుగా రథాలను తయారు చేయడంతోపాటు రథసప్తమితోపాటు పలు ఆధ్యాత్మిక వేడుకల్లో ఉత్సవమూర్తుల ఊరేగింపులో రథానికి సారథిగా వ్యవహరించి తన ప్రత్యేకత చాటుకున్నాడు. తాను రూపొందించిన రథాలకు స్టీరింగ్ బ్రేక్ సిస్టం వినియోగిస్తామన్నారు. అప్పటి ఉప రాష్ట్రపతి కృష్ణకాంత్ చేతులమీదుగా ఉత్తమ శిల్పి అవార్డుతోపాటు ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. చిన్నజీయర్‌స్వామి ఆశీస్సులు కూడా పొందారు.

నియమనిష్టలతో తయారీ..

రథం తయారుచేసేందుకు సుమారు ఆరునెలల సమయం పడుతుందని, ఆ కాలంలో అత్యంత నియమనిష్టలతో తయారీపనులు కొనసాగిస్తామని సింహాద్రి గణపతిచారి వివరించారు. రథం తయారీకి బల్లాస టేకు, చక్రాలకు తుమ్మ, మద్దికర్రను వినియోగిస్తామని, శిల్పశాస్త్రం ప్రకారం రథాల ఎత్తు, పొడవు తదితర అంశాలను నిర్ణయిస్తామన్నారు. రథం తయారీకి 9వ అంకెకు సంబంధం ఉందని, ముందుగా కొలతలు తీసుకుని 9 భాగాలుగా తయారు చేసి వాటిని కలుపుతానని, నాగోలులోని వర్క్‌షాపులో నిర్మాణ పనులు చేపట్టి ప్రత్యేక వాహనాల్లో తరలిస్తామన్నారు. రథాలతోపాటు పల్లకీలు, దేవతల విగ్రహాలు, ఆలయాల ప్రధాన ద్వారాలు, పూజా మందిరాలు, శేషవాహనం, గరుడవాహనం వంటి వాహనాలను ఆర్డర్‌పై రూపొందిస్తామన్నారు. రథం తయారీ ఆర్డర్ వస్తే సదరు ఊరుకు భార్య రేఖచారితో కలిసి వెళ్లి నిర్మాణ పనులు పూర్తయ్యే వరకూ అక్కడే ఉంటారు.

అన్నవరం ఆలయానికి..

తెలుగు రాష్ట్రాల్లోని పలు ఆలయాలకు అవసరమైన రథాలను రూపొందించినట్లు గణపతిచారి తెలిపారు. అన్నవరం ఆలయానికి రూ.3 కోట్ల వ్యయంతో బంగారు రథాన్ని తయారుచేసినట్లు తెలిపారు. ద్వారక తిరుమల, దిల్‌సుఖ్‌నగర్ అష్టలక్ష్మీ దేవాలయం, నల్లకుంట శంకరమఠం, జూబ్లీహిల్స్ హనుమాన్ దేవాలయం. కొండాపూర్ వేంకటేశ్వరస్వామి, బల్కంపేట ఎల్లమ్మ, సికింద్రాబాద్ గణేష్ టెంపుల్, యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయాలతోపాటు తెలుగు రాష్ట్రాల్లోని ద్రాక్షారామం, కాళహస్తి, అన్నవరం, పులివెందుల, బిట్రగుంట, అంతర్వేది, బాపట్ల, ఆహోబిలం తదితర ఆలయాలకు 18 నుంచి 45 అడుగుల ఎత్తు గల రథాలను తయారుచేసినట్లు వివరించారు. ఆలయ గర్భగుడిని అనుసరించి చతుర్భుజి, అష్టభుజి, దీర్ఘచతురస్రాకారాల్లో రథాన్ని రూపొందిస్తామని, ఆలయ విశిష్టతలను ప్రతిబింబించేలా రథంపై దశావతారాలు, అష్టలక్ష్ములు, వినాయకుడు, ఏనుగులు, గుర్రాలు, సింహాలు, శివలింగాలను చెక్కుతానని తెలిపారు. వీటిలో భార్య రేఖచారి సహాయ సహకారం ఎంతో ఉందన్నారు.



సిక్కోలు నుంచి సిటీకి..

గణపతిచారి పూర్వీకులు శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం నౌపడ గ్రామానికి చెందినవారు. ఆయన తండ్రి సింహాద్రి వీరాచారి నాలుగు దశాబ్దాల క్రితం నగరానికి వలసవచ్చి రథాలను తయారుచేయడంతోపాటు ఆలయపనులు నిర్వహించేవారు. వంశపారంపర్యంగా సంక్రమించిన నైపుణ్యంతో గణపతిచారి రథాల తయారీపై తనదైన ముద్ర వేసుకున్నారు. తాను రూపొందించిన రథాన్ని చూసి చిన్నజీయరుస్వామి మెచ్చుకోవడం తనజీవితంలో మర్చిపోలేని ఘటనగా గణపతిచారి అభివర్ణించారు. అమెరికాలో స్థిరపడిన ప్రవాసభారతీయుల కోరిక మేరకు రథాన్ని తయారుచేసి షిప్‌లో అక్కడికి తీసుకెళ్లి వారి మన్ననలు పొందడం గుర్తుండిపోయే విషయమన్నారు. రథాలు, ఆలయాల నగిషీలు, దేవతల వాహనాలు తదితర అంశాలకు సంబంధించి సందేహాలు ఉంటే సెల్‌ఫోన్ నంబర్ 8520006789లో సంప్రదించవచ్చని గణపతిచారి తెలిపారు.



నగరంలో పర్యావరణ సంరక్షణకు ఈవీ వాహనాలు..

లక్ష వాహనాల ఆవిష్కరణకు ప్రణాళికలు..

వోల్టా–వార్కస్ వ్యూహాత్మక ఒప్పందం..

సాక్షి, సిటీబ్యూరో: విపత్కర పరిస్థితుల్లో అత్యవసర సహాయాన్ని అందించే ఎస్‌ఓఎస్ (సాస్) వంటి వినూత్న ఫీచర్లతో సేవలందిస్తూ ప్రత్యేకతను చాటుకుంటోంది ప్రముఖ రైడ్–హెయిలింగ్ యాప్ వోల్టా. ఇలాంటి అధునాతన సాంకేతికతతో పాటు మరిన్ని సౌకర్యాలను అందించాలనే లక్ష్యంతో ప్రముఖ ఈవీ స్కూటర్ తయారీ సంస్థ వార్కస్‌తో వోల్టా వ్యూహాత్మక ఒప్పందాన్ని కదుర్చుకుంది. వోల్టా యాప్ వ్యవస్థాపకులు శశికాంత్ కనపర్తి, సీఈఓ రాజా విక్రమ్, వార్కస్ వ్యవస్థాపకులు రామ్ వేమిరెడ్డి సమక్షంలో శుక్రవారం ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఇందులో భాగంగా రానున్న ఐదేళ్లలో వోల్టా ఫ్లీట్‌లోకి ఏకంగా లక్ష ఎలక్ట్రిక్ స్కూటర్లను ప్రవేశపెట్టనున్నారు. ఈ సందర్భంగా రాజా విక్రమ్ మాట్లాడుతూ.. రైడ్–హెయిలింగ్ మార్కెట్‌లో వోల్టా ఒక ఈవీ ఎకోసిస్టమ్ రూపొందిస్తూ ఎలక్ట్రిక్ వాహనాల పర్యావరణ అనుకూల ప్రయోజనాలను వినియోగదారులకు అందించేలా కృషి చేస్తున్నామని అన్నారు. ఈ పర్యావరణ సంరక్షణ రైడింగ్ సేవలు, కస్టమర్లతో పాటు పార్సిల్ సేవలకు ఉపయోగించనున్నామని తెలిపారు. నగరంలో విపరీతంగా పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించడంలో భాగంగా తమ భాగస్వామ్యాన్ని నిర్వర్తించడం గర్వంగా ఉందని వార్కస్ వ్యవస్థాపకులు రామ్ వేమిరెడ్డి పేర్కొన్నారు. డిజిటల్ మీటర్లు, డ్రైవర్‌లకు జీరో కమీషన్ వంటి మంచి నియమాలతో సేవలందిస్తున్న వోల్టాతో కలవడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్కస్ సీఓఓ ఎల్ఎన్ రావు పాల్గొన్నారు.



టెక్కీ



నెట్టింట వైరల్‌గా తెలుగు ఇండియన్ ఐడల్ ప్రోమో..

తమన్.. తుంటరి పిల్లాడే..

సాక్షి, సిటీబ్యూరో: హత్తుకునే సంగీతంతో టాలీవుడ్ ప్రేక్షకులను అలరిస్తున్న ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ తమన్ అలియాస్ ఘంటసాల సాయి శ్రీనివాస్ చిన్నప్పుడు అల్లరి చేష్టలకు మారుపేరుగా ఉండేవాడని తన తల్లి సావిత్రి తెలిపారు. చిన్నతనంలో క్లాస్‌రూమ్‌లో కన్నా మైదానంలోనే ఎక్కువగా ఉండేవాడని, అస్సలు భయం లేకుండా, స్కూల్లో గొడవలు పడేవాడని చెప్పుకొచ్చారు. ఆహా ఓటీటీ వేదికగా రసవత్తరంగా సాగుతున్న తెలుగు ఇండియన్ ఐడల్ సీజన్ 3 వేదికకు సర్‌ప్రైజ్‌గా వచ్చిన ఆమె తమన్ గురించి పలు విషయాలను పంచుకున్నారు. తోటి పిల్లల టిఫిన్ బాక్సులు తెరచి తిన్నాడని ఎన్నో ఫిర్యాదులు వచ్చేవని గుర్తు చేసుకున్నారు. అయితే చేసే పనిలో అంకితభావాన్ని ప్రదర్శిస్తాడని.. ముఖ్యంగా సంగీతం, క్రికెట్ తప్ప తనకు మరో ప్రపంచం లేదని వివరించారు. ప్రస్తుతం ఈ ఎపిసోడ్ ప్రోమో నెట్టింట వైరల్‌గా మారింది.

ఓ హాబీ.. మ్యూజియం ఏర్పాటుకు దారి తీసింది. ఇది ఓ విజ్ఞాన గని. కార్ల గ్యారేజ్ అని చెప్ప వచ్చు. చిన్నారులతో పాటు యువతీ–యువకులు, సీనియర్ సిటిజన్స్‌ను మంత్ర ముగ్ధులను చేస్తోంది.. బహదూర్‌పురాలోని సుధా కార్స్ మ్యూజియం. షూ కార్, కెమెరా, వంకాయ, బర్గర్, క్రికెట్ బ్యాట్, క్రికెట్ బాల్, బాస్కెట్ బాల్, వాలీ బాల్, స్నూకర్స్, లేడీస్ షూ కార్, లిప్‌స్టిక్, పెన్, పెన్సిల్, రబ్బర్, ఆరేసర్, డ్రెస్స్, డబుల్ డెక్కర్, వినాయకుడి లడ్డు.. ఇలా బుల్లి బుల్లి వెరైటీ డిజైన్లతో కార్లను రూపొందించి వాటితో మ్యూజియం నిర్వహిస్తున్నారు సుధాకర్. ఇప్పటి వరకూ 22 సీసీ ఇంజన్ కెపాసిటీ నుంచి 150 సీసీ ఇంజన్ కెపాసిటీ గల కార్లను తయారు చేశారు. – చార్మినార్

స్క్రాప్ నుంచి..

ఒక్కసారి లోపలికి వెళితే.. ఉదయం నుంచి సాయంత్రం పడుతుంది. వాడి పడేసిన స్క్రాప్ నుంచి అవసరమైన వాటిని తీసుకుని మైల్డ్ స్టీల్(ఎంఎస్)తో అరుదైన.. వింతైన కార్లను తయారు చేసి వాటితో రికార్డులను నెలకొల్పుతున్నారు సుధాకర్. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని చేసిన ఈ కార్ల రూపకల్పన రానున్న తరాలకు విజ్ఞానాన్ని పంచే విధంగా ఉన్నాయి. ఇప్పటికే టాలెస్ట్ ట్రై సైకిల్ రూపొందించి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సొంతం చేసుకున్నారు. తన 14వ ఏట నుంచే వీటిని తయారు చేయడం ప్రారంభించారు.

200 ఎగ్జిబిట్స్..

తన 40 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో ఇప్పటి వరకూ దాదాపు 200 ఎగ్జిబిట్స్‌తో సుధా కార్ మ్యూజియం నిర్వహిస్తున్నారు. వీటికి తోడు వింటేజ్ కార్స్ కలెక్షన్ కూడా ఉంది. 1925 నాటి రోల్స్ రాయిస్ వింటేజ్ కారు సందర్శకులకు కనువిందు చేస్తోంది. రెండు ఎకరాల విస్తీర్ణంలో ఈ ఎగ్జిబిషన్‌ను ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకూ బహదూర్‌పురా చౌరస్తాలో అందుబాటులో ఉంటుంది.



విజ్ఞాన గని..

సుధాకార్ మ్యూజియం

ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి తయారు చేస్తున్న ఈ వింత కార్లు సందర్శకులతో శభాష్ అనిపించుకుంటున్నాయి. కొన్ని వందల ఎగ్జిబిట్స్‌తో మ్యూజియం కొనసాగుతోంది. నిత్యం వందల సంఖ్యలో సందర్శకులు ఇక్కడికి వచ్చి వావ్..అంటూ అభినందిస్తున్నారు.

సంస్కృతి ప్రతిబింబించేలా..

రాఖీ పండుగను పురస్కరించుకుని 50 సీసీ ఇంజిన్ కెపాసిటీతో వెరైటీగా రాఖీ మోడల్ కారును రూపొందించారు. తాజాగా పెళ్లి కూతురు కారును మూడు విభాగాల్లో రూపొందించారు. 100 సీసీ ఇంజిన్ కెపాసిటీ గల ఈ మోడల్ గంటలకు 50 కిలో మీటర్ల వేగంతో పరుగులు తీస్తుందని సుధాకర్ తెలిపారు. దీని తయారీకి ఏడాదిన్నర కాలం పట్టింది. మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా ఆర్టిఫీషియల్ జ్యూయలరీతో తయారు చేశారు.





'జువ్వలదిన్నె' ప్రారంభం
జగన్ కల సాకారం

వర్చువల్ విధానంలో మహారాష్ట్ర నుంచి ప్రధాని మోదీ శ్రీకారం
76.89 ఎకరాల్లో రూ.288.8 కోట్లతో నిర్మాణం

- 1,250 బోట్లు నిలుపుకునేలా హార్బర్ అభివృద్ధి
- ఏడాదికి 40 వేల టన్నుల మత్స్య సంపద వెలికితీసే అవకాశం
- రూ.392.58 కోట్లతో నిర్మిస్తున్న పూడిమడక హార్బర్‌కూ శంకుస్థాపన
- రాష్ట్రంలో మత్స్యకారుల కష్టాలను తీర్చడానికి రూ.3,500 కోట్లతో 10 హార్బర్ల నిర్మాణం చేపట్టిన జగన్ సర్కార్
- తొలిదశలో జువ్వలదిన్నె, నిజాంపట్నం, మచిలీపట్నం, ఉప్పాడ హార్బర్ల నిర్మాణం
- ఎన్నికల కోడ్ రావడంతో జువ్వలదిన్నె ప్రారంభం వాయిదా

సాక్షి, అమరావతి/నెల్లూరు (దగ్గమిట్ట) : ఏపీలోని 555 మత్స్యకార గ్రామాల్లో 6.8 లక్షల మంది మత్స్యకారులకు ప్రయోజనం చేకూర్చే విధంగా సుమారు రూ.3,500 కోట్లతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టిన పది ఫిషింగ్ హార్బర్లు, ఆరు ఫిష్ హ్యాండ్లింగ్ సెంటర్లలోని మొట్టమొదటిదైన జువ్వలదిన్నె హార్బర్ మత్స్యకారులకు అందుబాటులోకి వచ్చింది. నెల్లూరు జిల్లా బోగోలు మండలం జువ్వలదిన్నె వద్ద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో రూ.288.8 కోట్ల వ్యయంతో 76.89 ఎకరాల్లో అభివృద్ధి చేసిన ఈ హార్బర్‌ను ప్రధాని నరేంద్ర మోదీ మహారాష్ట్ర పాలఘర్ నుంచి శుక్రవారం వర్చువల్‌గా ప్రారంభించారు. దీంతో.. ఇప్పటివరకూ పొట్టకూటి కోసం కూలీలుగా పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లిన వారు ఇప్పుడు ఇక్కడే అధునాతన మెకనైజ్డ్ బోట్లతో చేపలు పట్టుకునే వెసులుబాటు అందుబాటులోకి వచ్చింది. ఈ హార్బర్ ప్రారంభంతోపాటు అనకాపల్లి జిల్లా పూడిమడక వద్ద రూ.392.58 కోట్లతో అభివృద్ధి చేయనున్న ఫిషింగ్ హార్బరుకూ ప్రధాని వర్చువల్‌గానే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్ నెల్లూరు కలెక్టరేట్ నుంచి.. అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఏపీ మారిటైమ్ బోర్డు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులూ అనకాపల్లి నుంచి పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌తో వాయిదా..

ఇక రాష్ట్రంలో మొత్తం పది ఫిషింగ్ హార్బర్లలో తొలిదశలో జువ్వలదిన్నె, నిజాంపట్నం, మచిలీపట్నం, ఉప్పాడ హార్బర్ల నిర్మాణాన్ని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టింది. ఇందులో తొలుత జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పూర్తికాగా గత ప్రభుత్వ హయాంలో దీన్ని వర్చువల్‌గా అప్పటి సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా ప్రారంభించడానికి అధికారులు ప్రయత్నించారు. కానీ, ఇటువంటి ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టును నేరుగా మత్స్యకారులతో కలిసి ప్రారంభిస్తానంటూ ఆయన వాయిదా వేశారు. ఆ తర్వాత ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ప్రారంభ కార్యక్రమం వాయిదా పడింది. ఇప్పుడు ప్రధాని 13 రాష్ట్రాలకు చెందిన రూ.1,200 కోట్ల విలువైన 217 మత్స్యకార ప్రాజెక్టులను శుక్రవారం ప్రారంభించగా ఇందులో 'జువ్వలదిన్నె' ఒకటి.

25వేల కుటుంబాలకు లబ్ధి..

ప్రధాని ప్రారంభించిన జువ్వలదిన్నె ప్రాజెక్టు ద్వారా 25,000 మత్స్యకార కుటుంబాలు ప్రయోజనం పొందనున్నాయి. 1,250 మోటరైజ్డ్, మెకనైజ్డ్ బోట్లు నిలుపుకునేలా ఈ హార్బరును అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దారు. ఈ హార్బర్ ద్వారా ఏటా 41,250 టన్నుల మత్స్య సంపద అదనంగా అందుబాటులోకి రానుంది. హార్బర్‌లోనే కోల్డ్‌స్టైజ్, ఐస్‌ప్లాంటు, చిల్‌రూం వంటి మౌలిక వసతులతోపాటు బోట్ రిపేర్ వర్క్‌షాపులు, గేర్‌షెడ్లు, నెట్ మెండింగ్ షెడ్లు వంటి సౌకర్యాలు అందుబాటులోకి తీసుకొచ్చారు. అలాగే, నిర్మాణ పనులు ప్రారంభించిన పూడిమడక హార్బరు ద్వారా 980 బోట్లు నిలుపుకునే వెసులుబాటుతోపాటు 4,870 మంది మత్స్యకార కుటుంబాలు లబ్ధిపొందనున్నాయి. మరోవైపు.. రాష్ట్రంలో తలపెట్టిన పది ఫిషింగ్ హార్బర్లు, ఆరు ఫిష్‌ల్యాండ్ సెంటర్లు పూర్తిగా అందుబాటులోకి వస్తే మొత్తం 6.8 లక్షల మంది మత్స్యకారులు లబ్ధిపొందనున్నారు. వీటిద్వారా 10,521 మెకనైజ్డ్ బోట్లు నిలుపుకునే సామర్థ్యంతోపాటు 4.5 లక్షల టన్నుల అదనపు మత్స్య సంపద సమకూరనుంది. తద్వారా రాష్ట్ర జీడీపీకి రూ.9,000 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా.



ఎక్కడ: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బోగోలు మండలం జువ్వలదిన్నె
పనులు ప్రారంభం : 2021 మార్చి 19న
ఖర్చు : ₹288.8 కోట్లు

పనులు పూర్తి : 2024 ఎన్నికలకు ముందు.. ఎన్నికల కోడ్‌తో ప్రారంభం వాయిదా
ఈ హార్బర్‌తో ఉపయోగం : ఏటా 41,250 టన్నుల మత్స్య సంపదతో పాటు 25,000 మత్స్యకార కుటుంబాలకు లబ్ధి

ప్రజాసంకల్ప పాదయాత్రలో భాగంగా మత్స్యకారుల కష్టాలు స్వయంగా చూసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే తీరంపై ప్రత్యేక శ్రద్ధ చూపి ప్రణాళిక రూపొందించారు.
మొత్తం ప్రణాళిక లక్ష్యం 10 ఫిషింగ్ హార్బర్లు | 6 ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల ఏర్పాటు

ఎంత మందికి లబ్ధి : 555 తీరప్రాంత గ్రామాల్లో దాదాపు 6.8 లక్షల మంది మత్స్యకారులకు మేలు
మొత్తం అంచనా వ్యయం రూ.3,500 కోట్లు

తొలివిడతలో పనులు ప్రారంభమైనవి: జువ్వలదిన్నె, నిజాంపట్నం, మచిలీపట్నం, ఉప్పాడ
వీటి అంచనా విలువ రూ.1,204.56 కోట్లు

చంద్రబాబు ఇకనైనా మేలుకోండి

- విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడకండి
- మాజీ సీఎం వైఎస్ జగన్ హితవు
- కూటమి పాలనలో విద్యా వ్యవస్థ పూర్తిగా దెబ్బతింది
- పాలనను గాలికొదిలేసి ప్రతిపక్షపార్టీపై బురదజల్లుతున్నారు
- కలుషితాహారంతో విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నా ప్రభుత్వం స్పందించడంలేదు
- గోరుముద్ద పథకాన్ని అత్యంత ఘోరమైన కార్యక్రమంగా మార్చేశారు



సాక్షి, అమరావతి: గుడ్లవల్లేరు ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో రహస్య కెమెరాలు పెట్టినట్టుగా వస్తున్న ఆరోపణలు అత్యంత తీవ్రమైనవని, విద్యార్థుల జీవితాలను అతలాకుతలంచేసే ఘటన ఇది అని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. చంద్రబాబూ ఇకనైనా మేలుకోండి. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడకండి, వారి భవిష్యత్తును పణంగా పెట్టకండి అని హితవు పలికారు. ''చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం వచ్చిన 3 నెలల్లో విద్యావ్యవస్థలన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రభుత్వ విద్యాసంస్థలపై నిర్లిప్తత, కాలేజీలపై పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ప్రతిపక్షపార్టీపై బురదజల్లుడు వ్యవహారాలు, రెడ్‌బుక్ రాజ్యాంగం అమల్లో ప్రభుత్వ పెద్దలు, యంత్రాంగం అంతా మునిగిపోయి పాలనను గాలికొదిలేశారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ సహా గవర్నమెంటు రెసిడెన్షియల్ స్కూళ్లలో కలుషితాహారం కారణంగా వందల మంది విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నా, వరుసగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నా, ప్రభుత్వం స్పందన అత్యంత దారుణంగా ఉంది. ముఖ్యమంత్రి కొడుకే విద్యాశాఖ మంత్రి కావడంతో అసలు ఏమీ జరగ లేదన్నట్టుగా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. పిల్లలకు నాణ్యతతో, రోజూ ఒక మెనూతో పెట్టే మధ్యాహ్న భోజనం, గోరుముద్ద పథకాన్నీ అత్యంత ఘోరమైన కార్యక్రమంగా మార్చేశారు'' అంటూ శుక్రవారం వైఎస్ జగన్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు.

జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటు చేయండి

- విద్యాసంస్థల్లో జరుగుతున్న వరుస ఘటనలపై దృష్టిపెట్టాలి
- తల్లిదండ్రుల అసోసియేషన్ డిమాండ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, విద్యా సంస్థల్లో ఘటనలు విద్యార్థుల తల్లిదండ్రులకు తీవ్ర ఆందోళన కల్గిస్తున్నాయని, తమ బిడ్డల రక్షణకు జ్యుడీషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేసి తగిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రుల అసోసియేషన్ (ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు మలిరెడ్డి కోటారెడ్డి, అధ్యక్షుడు నరహరి శిఖరం, కార్యదర్శి జి.ఈశ్వరయ్య శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. లైంగిక దాడులు, విషాహారం, ఆరోగ్య సమస్యలు, మానసిక, శారీరక ఒత్తిళ్లు, దాడులు, ఆత్మహత్యల నుంచి విద్యార్థులకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యా సంస్థలు, వసతి గృహాల్లో తమ బిడ్డలకు రక్షణ కల్పించి తమకు భరోసా ఇవ్వాలన్నారు. ఏ విద్యాసంస్థలోనైనా, హాస్టళ్లలో అయినా లైంగిక దాడులు, అనారోగ్యం, మానసిక, శారీరక ఒతిళ్లు, ఆత్మహత్యలు వంటి ఘటనలు జరిగితే సంబంధిత అధికారులు, యాజమాన్యాలను బాధ్యులను చేయాలని డిమాండ్ చేశారు.

రాక్షస రాజ్యంలో 'గుడ్ల'గూబలు!

విద్యార్థినుల వాష్‌రూమ్‌ల్లో సీక్రెట్ కెమెరాలు.. 300 వీడియోలు రికార్డు



గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ హాస్టల్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థినులు

"న్యూడ్ వీడియోలు ఇతర కాలేజీల విద్యార్థుల ఫోన్లలో ప్రత్యక్షమైనట్లు మాకు ఫోన్లు చేసి చెబుతున్నారు..!! డబ్బులు తీసుకొని వీడియోలు షేర్ చేస్తున్నారు."

"ఆందోళన, కేసులు అంటే మీ భవిషత్తు దెబ్బతింటుంది.. మీరు, మీ తల్లిదండ్రులు కోర్టుల చుట్టూ తిరగాల్సి ఉంటుంది.. సర్టిఫికెట్లు ఇవ్వరు అని బెదిరిస్తున్నారు. సీఎం చంద్రబాబు తక్షణమే వచ్చి దీనికి సమాధానం చెప్పాలి"

– గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థినుల ఆక్రోశం

సాక్షి ప్రతినిధి, విజయవాడ: వేలాది మంది విద్యార్థినులు చదువుతున్న కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల వాష్ రూమ్‌లలో రహస్య కెమెరాలు అమర్చిన ఘటన తీవ్ర కలకలం రేపగా.. అధికార యంత్రాంగం ద్వారా దీన్ని కప్పిపుచ్చేందుకు సర్కారు విఫలయత్నం చేసింది. కాలేజీ నిర్వాహకులు టీడీపీ ప్రముఖులకు సన్నిహితులు కావడంతో దీన్ని పక్కదారి పట్టించేందుకు శతవిధాలా ప్రయత్నించింది. వాష్ రూమ్‌లో రహస్య కెమెరాలు అమర్చి వీడియోలను చిత్రీకరించారంటూ విద్యార్థినులు గురువారం రాత్రి నుంచి నిద్రాహారాలు లేకుండా తల్లడిల్లుతుండగా.. అర్ధరాత్రి హాస్టల్‌లో విద్యుత్తు సరఫరా నిలిపివేసి పోలీసులు గుట్టుగా తనిఖీలు నిర్వహించడం.. స్నానాల గదిలో షవర్లు ఊడదీసి తరలించడం ఈ అనుమానాలకు బలం చేకూర్చుతోంది. సీక్రెట్ కెమెరాలపై ఓ విద్యార్థిని వారం క్రితమే ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం... ఎదురు కేసులు పెడతామని బెదిరించడం.. సాహసించి మీరు ఫిర్యాదు చేసినా ఉదయానికల్లా ఆ వార్త ఫేక్ న్యూస్ అవుతుందని విద్యార్థులను వార్డెన్ హెచ్చరించడం.. మర్నాడు ఉదయం అధికారులు కూడా అది ఫేక్ న్యూస్ అని తొలుత బుకాయించడం గమనార్హం. ఇంత దారుణంజరిగితే సమస్యను చిన్నదిగా చూపేందుకు ప్రభుత్వ పెద్దలు యత్నించడం నివ్వెరపరుస్తోంది. దాదాపు 1,500 మంది విద్యార్థినులు ఉంటున్న చోట జరిగిన ఈ దారుణం వెనుక అధికార పార్టీకి చెందిన ముఖ్యులు ఉన్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది.

వందల వీడియోలు...!

రహస్య కెమెరాలతో ఇప్పటివరకు 300 మంది విద్యార్థినుల వీడియోలు చిత్రీకరించినట్లు తెలియ డంతో గురువారం రాత్రి నుంచి శుక్రవారం సా యంత్రం వరకు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. నిద్రాహారాలు లేకుండా వర్షంలోనూ హాస్టల్ వద్ద బైఠాయించి న్యాయం కావాలంటూ నినదించారు. తరగతులను బహిష్కరించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు బాయ్స్ హాస్టల్ వద్దకు చేరుకుని ఆరోపణలు ఎదుర్కొంటున్న విద్యార్థిని అదుపులోకి తీసుకుని ఫోన్, ల్యాప్‌టాప్, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశా రు. ఒంగోలు విద్యార్థిని తండ్రికి టీడీపీ అండదండలు ఉండటంతో యాజమాన్యం వారితో కుమ్మక్కై విచారించకుండా హాస్టల్‌లో ఉంచి సకల సౌకర్యాలు కల్పిస్తోందని ఇతర విద్యార్థినులు ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయం చేయాలంటూ ఆందోళన చేస్తున్న తమను సర్టిఫికెట్లు ఇవ్వబోమని, మార్కులు వేయమని బెదిరిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు.

కళాశాల వద్ద ఉద్రిక్తత..

గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల వద్ద విద్యార్థులు సైతం విద్యార్థినులతో కలసి ఆందోళనకు దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. న్యాయం చేయాలంటూ రోడ్డు మీద బైఠాయించారు. విద్యార్థి సంఘాలు, స్వచ్ఛంద సంఘాలు వారి ఆందోళనకు మద్దతు పలకడంతో కళాశాల వద్ద యుద్ధ వాతావరణం నెలకొంది. విద్యార్థులతో కళాశాల యాజమాన్యం, పోలీసులు చర్చలు జరిపగా నిందితులను కఠినంగా శిక్షిస్తేనే ఆందోళన విరమిస్తామని తేల్చి చెప్పారు. మంత్రి కొల్లు రవీంద్ర, కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధరరావు, ఎమ్మెల్యేలు వర్ల కుమార్‌రాజా, యార్లగడ్డ వెంకట్రావ్, కాగిత కృష్ణప్రసాద్ కళాశాల వద్దకు చేరుకుని విద్యార్థినులతో పలు దఫాలు చర్చలు జరిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన కళాశాల యాజమాన్యం, వార్డెన్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇవ్వగా యాజమాన్యంపై తమకు నమ్మకం లేదని, రెండు రోజులుగా విషయం తెలిసినా కాలయాపన చేసిందని విద్యార్థినులు పేర్కొన్నారు. గురువారం రాత్రి నుంచి భోజనం, ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం చేయకుండా, వర్షాన్ని సైతం లెక్క చేయకుండా వారంతా మెయిన్ గేట్ వద్ద బైఠాయించారు. కెమెరాలు అమర్చినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ విద్యార్థిని తండ్రి పలుకుబడి ఉన్న టీడీపీ నేతగా చెబుతున్నారు. అధికార పార్టీ నేత కావడంతో ఈ దారుణాన్ని కప్పిపుచ్చేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారని మండిపడుతున్నారు.

ప్రజా సంఘాల మద్దతు..

ఆందోళన చేస్తున్న విద్యార్థినులకు ఏబీవీపీ నాయ కులు మద్దతు పలికారు. ఏబీవీపీ జిల్లా జాయింట్ సెక్రటరీ మాగంటి వెంకట గోపి, బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు సీహెచ్ లీలాకుమారి, యువమోర్చా మహిళా జిల్లా సెక్రటరీ వి.అభినందన, నాయకులు కె.వరుణ్, గోపీలు విద్యార్థినులకు మద్దతుగా ఆందోళనలో పాల్గొన్నారు. కోల్‌కతాలో రెసిడెంట్ వైద్యురాలిపై హత్యాచార ఘటనను మరువక ముందే వేల మంది విద్యార్థినులు ఉంటున్న హాస్టల్‌లో రహస్య కెమెరాల అంశం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. జాతీయ మహిళా కమిషన్ దృష్టికి తెచ్చి కారకులకు కఠిన శిక్షలు పడేవరకు పోరాడతామన్నారు.

అర్ధరాత్రి కరెంట్ ఆపేసి..

అర్ధరాత్రి హాస్టల్‌లో విద్యుత్తు సరఫరా నిలిపివేసి కనీసం జనరేటర్ ఆన్ చేయకుండా బాత్ రూమ్ లలో పోలీసులు తనిఖీ చేశారని విద్యార్థినులు పేర్కొంటున్నారు. బాత్ రూమ్‌లో షవర్స్ మాత్రమే ఎందుకు తీసుకెళ్లారని ప్రశ్నిస్తున్నారు. షవర్లలో రహస్య కెమెరాలున్నట్లు పేర్కొంటున్నారు.

వారం క్రితమే తెలిసినా..

వాష్ రూమ్‌ల్లో సీక్రెట్ కెమెరాల వ్యవహారాన్ని ఓ విద్యార్థిని వారం రోజుల క్రితమే కాలేజీ యాజ మాన్యం దృష్టికి తెచ్చినా నిర్లిప్తంగా వ్యవహరించింది. 'నిన్న సాయంత్రం 5 గంటలకు మరోసారి ఫిర్యాదు చేస్తే విచారణకు నెల సమయం కావాల న్నారు. ఫేక్ న్యూస్ అంటూ మళ్లీ రాత్రి ప్రచారం చేశారు. యజమాన్యం దృష్టికి తెచ్చిన విద్యార్థినిని, తండ్రిని పిలిపించండంటూ రివర్స్ కేసులు పెడతామని బెదిరించారు. మేమేం తప్పు చేశాం? న్యాయం కోరడమే నేరమా?' అని ఆ విద్యార్థి ప్రశ్నిస్తోంది.

ఆధారాలు నేరుగా నాకు పంపండి: సీఎం చంద్రబాబు

గుడ్లవల్లేరు కళాశాల విద్యార్థినుల వద్ద ఆధారాలుంటే నేరుగా తనకే పంపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. ఎవరూ అధైర్య పడవద్దని, తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. శుక్రవారం ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. రహస్య కెమెరాలపై సమగ్ర విచారణ జరపాలని ఆదేశించినట్లు తెలిపారు. ఇంట్లో ఆడబిడ్డకు కష్టం వస్తే ఎలా స్పందిస్తామో అంతే సీరియస్‌గా స్పందించి నిజాలు నిగ్గు తేల్చాలన్నారు. విద్యార్థుల ఫిర్యాదును యాజమాన్యం నిర్లక్ష్యం చేసిందనే ఆరోపణపైనా విచారణ జరపాలన్నారు. ప్రతి మూడు గంటలకు ఒకసారి ఘటనపై తనకు రిపోర్ట్ చేయాలని అధికారులను ఆదేశించారు.

ఆ కాలేజీ టీడీపీ నేత బంధువుదే

గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ టీడీపీ నేత, విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మె ల్యే భార్య గద్దె అనురాధకు చెందిన బంధువుది కావడంతో పచ్చ గద్దలు రంగంలోకి దిగాయి. వాష్ రూమ్‌లలో రహస్య కెమెరాలు లేవని అధికారులతో చెప్పించే యత్నం చేశారు. విద్యార్థుల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురవడంతో కథ అడ్డం తిరిగింది. గురువారం రాత్రి నుంచి ఈ ఘటనపై విద్యార్థులు ఆందోళన చేస్తున్నప్పటికీ విషయం బయటకు పొక్కకుండా ఆరోపణలు ఎదుర్కొంటున్న అమ్మాయి తండ్రి కీలక పాత్ర పోషించారు. అమ్మాయి తండ్రికి సైతం టీడీపీ పెద్దలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. అందువల్ల ఆయన కాలేజీ యజమాన్యంపై ఒత్తిడి తెచ్చి, సీసీ కెమెరాల విషయాన్ని పక్క దారి పట్టించే యత్నం చేశారు. ఓ దశలో తన కూతురి జోలికి వస్తే కాలేజి పరువు తీస్తానని హెచ్చరించినట్లు తెలిసింది. దీంతో కాలేజీ యజమాన్యం.. విద్యార్థిని తండ్రితో కుమ్మక్కు అయ్యింది. టీడీపీ నేతలు, అధికారులు కాలేజీ వద్దకు వచ్చి కేసు తీవ్రతను తగ్గించే యత్నం చేశారు.

వాస్తు గృహమస్తు!



> వాస్తు ప్రకారం ఇల్లు ఉంటే ధనం సమకూరుతుందనుకుంటే పొరపాటు. వాస్తుతో డబ్బు రాదు మనశ్శాంతి చేకూరుతుంది. ప్రతికూల ఆలోచనలు తొలగి, సానుకూల భావాలు కలుగుతాయి. దీంతో చేసే పని మీద ఏకాగ్రత పెరుగుతుంది. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకునే వివేకం కలుగుతుంది. దీంతో ఉన్నత స్థాయికి ఎదుగుతారు.

సాక్షి, హైదరాబాద్: సెల్‌ఫోన్, ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చేశాక వాస్తు తెలియని వాళ్లంటూ లేరు. మానవ జీవితంలో వాస్తును ఎంత వరకు ఉపయోగించుకోగలమనేది ప్రధానాంశం. నీరు, నిప్పు, వాయువు, ఆకాశం, నేల ఈ పంచభూతాలను మిళితం చేసేదే వాస్తు. చిన్నతనంలో అభ్యసించిన పాఠ్యాంశమే జీవితంలో వాస్తు రూపంలో కీలకమైంది. దీంతో సొంతిల్లు, అద్దె దేనికైనా సరే వాస్తుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. డెవలపర్లు కూడా ఓపెన్ ప్లాట్లు, వ్యక్తిగత గృహాలు, విల్లాలు, ఫామ్‌హౌస్‌లు, ఆకాశహర్మ్యాలు అన్ని రకాల నివాస, వాణిజ్య సముదాయాల నిర్మాణాలలో వాస్తుకు ప్రాముఖ్యత ఇస్తున్నారు. వాస్తు చూడనిదే కొనుగోలుదారులు నిర్ణయం తీసుకోవడం లేదు.

అడుగు స్థలం కీలకమే..

హైదరాబాద్‌లో భూమి ఖరీదైనదే కాబట్టి డెవలపర్లు ప్రతీ అంగుళాన్ని వినియోగించుకోవాలని భావిస్తుంటారు. వాస్తు శాస్త్రం జోడిస్తూ ప్రతి అడుగునూ వినియోగించుకునే ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఉదాహరణకు నైరుతీలో బాగా పెరిగిన స్థలం ఉంటే దాన్ని ఖాళీగా వదలకుండా నష్టాన్ని భర్తీ చేసేందుకు ఆ ప్రాంతంలో క్లబ్ హౌస్ వంటి నిర్మాణాలను చేపడుతున్నారు. వాస్తు శాస్త్రం ప్రకారం తూర్పు, ఉత్తరం, పశ్చిమం, దక్షిణం నాలుగు దిక్కులూ మంచివే అయినప్పటికీ.. భాగ్యనగరం మధ్యమ భాగంలో ఉండటంతో ఇక్కడ తడి ప్రదేశం ఎక్కువ. అందుకే ఉత్తర, తూర్పు దిక్కు సూచించే ఓపెన్ ప్లాట్లు, అపార్ట్‌మెంట్లకు డిమాండ్ ఉంటుంది.

ఎక్కడ ఏముంటే బెటర్..

పూరి గుడిసె, రాజ భవనం ఏదైనా వాస్తు ప్రకారం ఉంటేనే శోభ కలుగుతుంది. అక్షాంశ, రేఖాంశల ఆధారంగా వాస్తును నిర్ణయిస్తుంటారు. భారతదేశానికి నైరుతి నుంచి గాలి వీస్తుంది కాబట్టి ఈశాన్యం ప్రాంతాన్ని ఖాళీగా ఉంచుకోవాలి. దీంతో ప్రతికూల పవనాలు, భావాలు ఈ దిక్కు నుంచి తొలగిపోతాయని వాస్తు శాస్త్రం చెబుతోంది. ఈశాన్యంలో నీరు, ఆగ్నేయంలో వంటశాల, నైరుతిలో యజమాని గది ఇలా వాస్తును బట్టి ఎంపిక చేసుకుంటే ఆయురారోగ్యాలతో ఉంటారు.

95 % వాస్తు ప్రకారమే..



గతంలో ముంబై, చెన్నై, ఢిల్లీ, బెంగళూరు నగరాల్లో వాస్తును పెద్దగా పట్టించుకునేవారు కాదు. స్థలం కొరత, అధిక ధరలు వంటి ఇతరత్రా కారణాల వల్ల అక్కడి డెవలపర్లు వాస్తుకు ప్రాముఖ్యత ఇచ్చేవారు కాదు. కానీ, కాలానుగుణంగా దేశమంతటా వాస్తు శాస్త్రానికి ప్రాముఖ్యత పెరిగిపోయింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అయితే 95% వాస్తు ఆధారంగానే కొనుగోళ్లు జరుపుతుంటారు. – ప్రశాంత్ రావు, డైరెక్టర్, పౌలోమి ఎస్టేట్స్

వాస్తు ముఖ్యమైనదే..



గృహాలు, ఆఫీసులు, హోటళ్లు, ఇతరత్రా వాణిజ్య సముదాయాలతో పాటు పరిశ్రమల స్థాపనలో కూడా వాస్తుకు ప్రాముఖ్యత ఇస్తున్నారు. స్థల విస్తీర్ణంతో సంబంధం లేకుండా వాస్తు ప్రకారం నిర్మాణం చేపడితేనే మంచిది. సొంతిల్లు, అద్దె అన్నింటికీ వాస్తు ముఖ్యమైనదే. – మల్లికార్జున రావు, వాస్తు నిపుణులు

జగన్ చేసింది నిజం – లోకేశ్ చూసిందే సాక్ష్యం

నాడు-నేడుతో పాఠశాలల రూపురేఖలే మారిపోయాయి. తరగతి గదులు ఆహ్లాదకరంగా రూపుదిద్దుకున్నాయి. క్లాస్ రూంలలో సైన్స్ ల్యాబ్‌లు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్‌తో పాటు పిల్లలకు కావాల్సిన బ్యాగులు, నోట్ పుస్తకాలు తదితరాలన్నీ అందాయి. సమూలంగా మారిపోయిన పాఠశాల రూపురేఖలు, తరగతి గదుల స్థితిగతులు శుక్రవారం మంత్రి లోకేశ్ విశాఖలోని పలు పాఠశాలల సందర్శనలో ఆయన కళ్లకు కట్టాయి.



■ ఇన్ని చేశాడా జగన్..!



■ పని జగన్ ది - పోజు లోకేశ్ ది



■ మా జగన్ మామయ్య ఇచ్చిన బ్యాగ్



■ జగన్ 'ప్రయోగం' కళ్లారా చూసినంత నిజం



■ జగన్ బడిలో లోకేశ్ పాఠాలు



■ డిజిటల్ క్లాసు.. జగన్ బడి శభాసు..

న్యూస్‌మేకర్

'ఖయామత్ సే ఖయామత్ తక్' సినిమాతో దేశానికి పరిచయం అయిన జూహీ చావ్లా మన దేశంలో అత్యంత సిరి గల మహిళల్లో ఒకరిగా నిలిచింది. తాజాగా విడుదలైన 'హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2024' ప్రకారం మనదేశంలో అత్యధిక సంపద కలిగిన మొదటి పదిమంది స్త్రీలలో జూహీ 6 వస్థానంలో ఉంది. సినిమా, క్రికెట్ వంటి రంగాల్లో పెట్టిన పెట్టుబడి ఆమెను ఈ స్థానానికి చేర్చింది. ఆమె పరిచయం, మిగిలిన స్థానాల్లో ఉన్న ఇతరుల గురించి కథనం.


రాధా వెంబు | ఫాల్గుణి నాయర్ | జయశ్రీ ఉల్లాల్ | కిరణ్ మజుందార్ | నేహా నార్ఖెడె


జూహీ చావ్లా

జూహి 4,600 కోట్ల సంపద

సిరిలో బెస్ట్

సంపద మగవాడి సొత్తు అనుకునే రోజుల నుంచి సంపద సృష్టించే మహిళా పారిశ్రామికవేత్తల వరకూ కాలం మారింది. మారిందనడానికి వివిధ సూచికలు సాక్ష్యం పలుకుతున్నాయి. మన దేశంలో సంపన్నుల జాబితాను ఏ ఏటికా ఏడు వెల్లడి చేసే 'హురున్ ఇండియా' సంస్థ 2024కు గాను విడుదల చేసిన సంపన్నుల జాబితాలో స్త్రీలు పెద్ద సంఖ్యలో ఉండటం సంతోషం కలిగించే సంగతి. పురుషుల్లో అదానీ 1,161,800 కోట్లతో మొదటి స్థానంలో ఉంటే అంబాని 1,014,700 కోట్లతో రెండవ స్థానంలో ఉన్నారు. అయితే స్త్రీలలో జోహో గ్రూప్‌కు చెందిన రాధా వెంబు 47,500 కోట్లతో మొదటి స్థానంలో ఉంటే, నైకా గ్రూప్‌కు చెందిన ఫాల్గుణి నాయక్ 32,200 కోట్లతో రెండోస్థానంలో ఉంది. పురుషులతో పోల్చితే స్త్రీల దగ్గర సగం సంపదే ఉన్నా స్త్రీలు ఆ స్థాయిలో వ్యాపార సంపదను సృష్టించడం పెద్ద ఘనత. మరో ఆసక్తి కలిగించే అంశం ఏమిటంటే సంపద ఎక్కువ కలిగిన స్త్రీలలో జూహి చావ్లా 4,600 కోట్లతో ఆరవ స్థానంలో నిలవడం.

సినిమా రంగంలో 2వ స్థానం

'హురున్ ఇండియా రిచ్‌లిస్ట్ 2024' వివిధ కేటగిరీలలో సంపద కలిగిన వారి ర్యాంకులను ఇచ్చింది. సినిమా రంగానికి సంబంధించి షారుక్ ఖాన్ 7,300 కోట్లతో మొదటి స్థానంలో ఉండగా జూహి చావ్లా రెండో స్థానంలో ఉండటం విశేషం. మూడో స్థానంలో హృతిక్ రోషన్ (2000 కోట్లు), ఆ తర్వాత అమితాబ్ బచ్చన్ (1200 కోట్లు), కరణ్ జోహార్ (1400 కోట్లు) ఉన్నారు. జూహి చావ్లా దాదాపుగా సినిమాలలో నటించకపోయినా బాలీవుడ్‌లో భారీ పారితోషికం తీసుకునే నటీమణులు ప్రస్తుతం ఉన్నా ఆమె సంపద భారీగా కలిగి ఉండటం ఆమెలోని ఆర్థిక దృష్టికి నిదర్శనం.

ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసర్ కూతురు

జూహీ చావ్లా అంబాలా (హర్యాణా)లో పుట్టి ముంబైలో పెరిగింది. తండ్రి ఇన్‌కంటాక్స్ ఆఫీసరు. తల్లి గృహిణి. బాల్యంలో నటి ముంతాజ్, తర్వాత శ్రీదేవిలను చూసి సినిమాల్లోకి రావాలనుకున్న జూహీ మోడల్‌గా పని చేసింది. 1984లో 'మిస్ ఇండియా' కిరీటం సాధించడంతో ఆమెను బాలీవుడ్ గుర్తించింది. అదే సంవత్సరం ఆమె నటించిన మొదటి సినిమా 'సల్తనత్' భారీ అపజయం మూటగట్టుకుంటే వేషాలు లేని జూహి దక్షిణాదికి వచ్చి కన్నడ సినిమా 'ప్రేమలోక' (1987) చేసింది. ఆ సినిమాతో ఆమె పేరు మార్మోగింది. 1988లో 'ఖయామత్ సే ఖయామత్ తక్'లో నటించాక ఆమె వెనక్కు తిరిగి చూసే పని లేకుండాపోయింది.

మన దేశ మహిళా శ్రీమంతులు

రాధా వెంబు
(మొదటి స్థానం – 47,500 కోట్లు): సోదరులు శ్రీధర్ వెంబు, శేఖర్ వెంబుతో కలిసి రాధా వెంబు స్థాపించిన 'జోహో' సంస్థ భారీ విజయాలు సాధిస్తుండటంతో ఆమె సంపద పెరిగింది. జోహో అందరికంటే ఎక్కువ వాటా ఉన్న రాధాకే. చెన్నైలో పుట్టి పెరిగిన రాధ ఐఐటీ మద్రాసులో చదువుకుంది. పబ్లిసిటీకి దూరంగా ఉండటాన్ని ఇష్టపడుతుంది. ఆమెకు భర్త, కుమారుడు ఉన్నారు.

ఫాల్గుణి నాయర్
(రెండవ స్థానం – 32,200 కోట్లు): ఆన్‌లైన్ బ్యూటీ బ్రాండ్‌కు ఏమాత్రం అనుకూలత లేని కాలంలో 'నైకా' స్థాపించి ఘన విజయం సాధించింది ఫాల్గుణి నాయర్. నైకా ప్రారంభించేనాటికి ఆమెకు 50 ఏళ్లు. ఐ.ఐ.ఎం. అహ్మదాబాద్‌లో చదవడం వల్ల ఆమెకు వ్యాపారసూత్రాల మీద పట్టు వచ్చింది. సౌందర్య సాధనాల పట్ల ఉన్న ఆసక్తి వినియోగదారులకు ఎలాంటివి కావాలో తెలిసేలా చేసింది. ఫాల్గుణి అమ్మే ఉత్పత్తులు ఆమెకు సంపద తెచ్చిపెడుతున్నాయి.

జయశ్రీ ఉల్లాల్
(మూడవ స్థానం – 32,100 కోట్లు): లండన్‌లో పుట్టి ఢిల్లీలో చదువుకుని అమెరికాలో స్థిరపడిన జయశ్రీ ఉల్లాల్ ఇం/టనీరింగ్‌లో ఎం.ఎస్ చేసి 'అరిస్టా' అనే క్లౌడ్ నెట్‌వర్కింగ్ కంపెనీని స్థాపించి బిలియనీర్‌గా ఎదిగింది.

కిరణ్ మజుందార్
(నాలుగో స్థానం – 29,000 కోట్లు): తన బ్యాంకు ఖాతాలో ఉన్న పది వేల రూపాయల పెట్టుబడితో ఒక కారుషెడ్డులో మొదలైన బయోకాన్ ఇండియా సంస్థ కిరణ్ మజుందార్‌ను ఇవాళ ప్రపంచవ్యాప్త గుర్తింపుతో, సంపదతో నిలబెట్టింది. నాడు మహిళలు ఎవరూ చదవని విభాగం 'ఫర్మంటేషన్'లో పి.జి చేసిన కిరణ్ తొలత ఎంజైమ్స్ తయారు చేస్తూ నేడు మానవాళికి మేలు చేసే జీవ రక్షకాల తయారీ వరకూ చేరుకుంది. కిరణ్ ఎప్పుడూ అపర కుబేరుల టాప్ లిస్ట్‌లో ఉంటూనే ఉంటుంది.

నేహా నార్ఖెడె
(ఐదో స్థానం – 4,900 కోట్లు): కాన్‌ఫ్లుయెంట్ అనే క్లౌడ్ కంపెనీకి కో ఫౌండర్‌గా చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్‌గా ఉన్న నేహా నార్ఖెడె ఇందిరా గాంధీ, కిరణ్ బేడీ వంటి మహిళల నుంచి స్ఫూర్తి పొంది జీవితంలో ఏదైనా సాధించాలనుకుంది. పూణె నుంచి అమెరికా వెళ్లి చదువుకుని 2014లో కాన్‌ఫ్లుయెంట్‌ను స్థాపించింది.

షారూక్ ఖాన్‌తో ప్రొడక్షన్ హౌస్

'రాజూ బన్‌గయా జంటిల్‌మెన్' సినిమాలో షారూక్, జూహీ చావ్లా స్నేహం మొదలయ్యింది. ఆ స్నేహం బలపడి నేటికీ కొనసాగుతూ ఉంది. మొదట అతనితో కలిసి 'డ్రీమ్స్ అన్‌లిమిటెడ్' అనే ప్రొడక్షన్ సంస్థ స్థాపించి 'ఫిర్ భీ దిల్ హై హిందూస్థానీ', 'అశోక', 'చల్తే చల్తే' సినిమాలు తీసింది జూహీ. ఆ తర్వాత షారూక్ స్థాపించిన రెడ్ చిల్లీస్ సంస్థలో భాగస్వామి అయ్యింది. ఐపీఎల్ మొదలయ్యాక షారూక్‌తో కలిసి కోల్‌కటా నైట్‌రైడర్స్‌కు సహ భాగస్వామి అయ్యింది.

వ్యాపారవేత్తతో వివాహం

జూహీ చావ్లా 'మెహతా గ్రూప్' అధినేత జయ్ మెహతాను 1995లో వివాహం చేసుకుంది. జయ్ మెహతా మొదటి భార్య సుజాతా బిర్లా విమాన ప్రమాదంలో మరణించడంతో జయ్ మెహత్ ఈమెను వివాహం చేసుకున్నాడు. ఆఫ్రికా దేశాలలో సిమెంట్, ప్లాస్టిక్ తదితర పరిశ్రమలు ఉన్న జయ్ మెహతా వ్యాపారాల్లో కూడా జూహీ భాగస్వామి కావడంతో ఆమె సంపద మెల్ల మెల్లగా పెరుగుతూ పోయింది. అయితే ఈ క్రమంలో ఆమె ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొంది. సొంత అన్న, చెల్లి ఇద్దరూ మరణించారు. ఒక దశలో మాధురి దీక్షిత్ వంటి స్టార్ల హవా వల్ల సినిమాలు లేని స్థితి. 'అయినా నీ లోపల ఉన్న ఆత్మిక శక్తిని ఉద్దీపనం చేయగలిగితే నువ్వు ముందుకు పోగలవు' అంటుంది జూహీ.

మన బంగారం

'పుస్తకం హస్తభూషణం' అంటారు. అయితే అది అలంకారం మాత్రమే కాదు అంధకారాన్ని పారదోలే వజ్రాయుధం అనేది ఎంత నిజమో చెప్పడానికి అవని లేఖరా ఒక ఉదాహరణ. కారు ప్రమాదం తాలూకు జ్ఞాపకాల కారు చీకట్లో నిస్తేజంగా మారిన అవని జీవితంలో ఒక పుస్తకం వెలుగు నింపింది. విజేతను చేసింది. తాజాగా... పారిస్ పారాలింపిక్స్ షూటింగ్‌లో స్వర్ణం గెలుచుకొని మరోసారి సత్తా చాటింది అవని లేఖరా...

ప్రమాదం నుంచి పతకం దాకా

గురిలో ఫస్ట్


అవని లేఖరా

టోక్యోలో జరిగిన పది మీటర్‌ల ఎయిర్ రైఫిల్ స్టాండింగ్ ఎస్ హెచ్ 1 ఈవెంట్‌లో అగ్రస్థానంలో నిలిచి పారాలింపిక్స్‌లో స్వర్ణ పతకం సాధించిన తొలి భారతీయ మహిళగా చరిత్ర సృష్టించింది అవని లేఖరా.

చిన్నప్పటి నుంచే అవనికి ఆటలు అంటే ఇష్టం. తండ్రి సలహా మేరకు ఆర్చరీ ప్రాక్టిస్ చేసేది. ఆ తరువాత తన ఆసక్తి షూటింగ్ వైపుకు మళ్లింది. జైపూర్(రాజస్థాన్)లోని కేంద్రీయ విద్యాలయాలో చదువుకున్న అవని అక్కడే షూటింగ్‌లో తొలిసారిగా బంగారు పతకాన్ని గెలుచుకుంది.

2012లో కారు ప్రమాదంలో వెన్నెముక గాయంతో పక్షవాతానికి గురైంది అవని. పక్షవాతం మాట ఎలా ఉన్నా మానసికంగా తాను బాగా బలహీనపడింది. ఆ సమయంలో స్టార్ షూటర్ అభినవ్ బింద్రా ఆత్మకథ అవనికి ఎంతో స్ఫూర్తి ఇచ్చింది, జీవితాన్ని ఉత్సవం చేసుకునే శక్తిని ఇచ్చింది. అలా 2015లో తనకు ఇష్టమైన షూటింగ్ లోకి వచ్చింది. ఒక యజ్ఞంలా సాధన మొదలు పెట్టింది. ఒకే పారాలింపిక్స్ (టోక్యో)లో రెండు పతకాలు అందుకున్న భారతదేశ ఏకైక మహిళా అథ్లెట్‌గా చరిత్ర సృష్టించింది.

గత మార్చిలో అవనికి పిత్తాశయ శస్త్ర చికిత్స జరిగింది. మరోవైపు తన ముందు పారిస్ పారాలింపిక్స్ కనిపిస్తున్నాయి. కొన్ని నెలల విరామం తరువాత మళ్లీ రైఫిల్ చేతిలోకి తీసుకుంది. ఆ సమయంలో ఆపరేషన్ తాలూకు శారీరక బాధ, మానసిక ఒత్తిడి తన నుంచి దూరమయ్యాయి. లక్ష్యం ఒక్కటే తన కళ్ల ముందు కనిపించింది,


టోక్యో పారాలింపిక్స్ విజేతగా అవనిపై దేశవ్యాప్తంగా ఎన్నో అంచనాలు ఉన్నాయి. దీంతో సహజంగానే ఒత్తిడి ఉంటుంది. ఆ ఒత్తిడి తట్టుకోవడం చిన్న విషయమేమీ కాదు. అయితే ఆమెకు ఒత్తిడి అనుకోని అతిథి ఏమీ కాదు. టోక్యో పారాలింపిక్స్ తన తొలి పారాలింపిక్స్. దీంతో ఎంతో ఒత్తిడి ఉంటుంది. అయినా సరే ఆ ఒత్తిడిని చిత్తు చేసి చరిత్ర సృష్టించింది. తాజాగా పారిస్ పారాలింపిక్స్‌లోనూ విజయభేరీ మోగించింది.

'ఒక క్రికెటర్ టోర్నీలో విఫలమైతే తనను తాను నిరూపించుకోవడానికి పట్టే సమయం తక్కువ. అదే ఒలింపియన్ విషయంలో మాత్రం నాలుగేళ్లు వేచిచూడాలి' అభినవ్ బింద్రా ఆత్మకథలోని వాక్యాన్ని అవని ఎప్పుడూ గుర్తుంచుకుంటుంది. దీనివల్ల బంగారం లాంటి అవకాశాన్ని కోల్పోకుండా జాగ్రత పడుతుంది. ఆ జాగ్రత్తే ఈసారి కూడా బంగారు పతకాన్ని మెడలోకి తీసుకు వచ్చింది.

టోక్యో పారాలింపిక్స్‌లో 249.6 పాయింట్లతో రికార్డ్ నెలకొల్పింది అవని. తాజాగా 249.7 పాయింట్‌లతో తన రికార్డ్‌ను తానే బ్రేక్ చేసుకోవడం మరో విశేషం.

పుస్తకం చేతిలోకి వచ్చిన తరువాత...

'ఎప్పుడూ చురుగ్గా ఉండే అవని ఆరోజుల్లో విషాదంగా, మౌనంగా కనిపించేది. ఆమెలో ఉత్సాహం నింపడానికి ఏవో ప్రయత్నాలు చేసే వాళ్లంకానీ అవేమి ఫలించలేదు. అవనిని చూస్తే జాలిగా అనిపించేది. అలాంటి క్లిష్ట సమయంలో దేవుడే పంపినట్లు ఒక పుస్తకం ఆమె చేతికి వచ్చింది. అది అభినవ్ బింద్రా ఆత్మకథ. 'ఏ షాట్ ఎట్ హిస్టరీ' అనే ఆ పుస్తకం చేతికి అందిన రోజు నుంచి ఆమెలో కదలిక మొదలైంది. ఉత్సాహం వచ్చింది. చివరికి ఆ పుస్తకమే ఆమెకు కొత్త జీవితాన్ని ఇచ్చింది. విజేతగా నిలిపింది' అంటున్నాడు అవని తాత జీఆర్ లేఖరా.




'షూటింగ్'కు సంబంధించిన విషయాలు అవనికి కొత్తకాకపోయినా 'ఏ షాట్ ఎట్ హిస్టరీ' అవనిని మరో ప్రపంచంలోకి తీసుకు వెళ్లింది. ఆటలకు కష్టపడే తత్వం, క్రమశిక్షణ ఎంత ముఖ్యం. ఓటమి ఎదురైనప్పుడు ఎలా ఉండాలి. గెలుపు పలకరించినప్పుడు ఎలా ఉండాలి... ఇలా ఎన్నో విషయాలు అవనికి ఉపకరించాయి.

'ఏ షాట్ ఎట్ హిస్టరీ' పుస్తకంలోని 'ప్రాక్టీస్ ఈజ్ ఏ టాలెంట్. హార్డ్‌వర్క్ ఈజ్ ఏ టాలెంట్'లాంటి స్ఫూర్తిదాయక మాటలు అవనికి కంఠోపాఠం.


హెల్దీ డైట్

క్యారమెల్ కస్టర్డ్ విత్ మ్యారీ బిస్కట్స్



కావలసినవి:
మ్యారీ బిస్కట్స్– 25(పొడి చేయాలి);
కోడిగుడ్లు – 2; పాలు – 2 కప్పులు;
చక్కెర – పావు కప్పు; వెనిలా ఎసెన్స్– టీ స్పూన్; చక్కెర – 4 టేబుల్ స్పూన్‌లు (క్యారమెల్ కోసం) నీరు – టేబుల్ స్పూన్.

తయారీ:
- బిస్కట్ పొడి, గుడ్డు సొన, పాలు, చక్కెర, వెనిలా ఎసెన్స్ వేసి మెత్తగా వచ్చే వరకు బ్లెండ్ (హ్యాండ్ బ్లెండర్ లేదా ఎలక్ట్రిక్ బ్లెండర్‌లో) చేసి, పది నిమిషాల సేపు పక్కన పెట్టాలి.
- పెనంలో కారమెల్ కోసం తీసుకున్న చక్కెర వేసి నీరు పోసి మరిగించాలి. చక్కెర పాకం వచ్చి గోధుమ రంగులోకి మారిన వెంటనే బేకింగ్ కంటెయినర్‌లో పోసి చల్లారే వరకు పక్కన పెట్టాలి.
- క్యారమెల్ చల్లారిన తరవాత దాని మీద బిస్కట్ మిశ్రమాన్ని పోసి సమంగా సర్ది ఆ పాత్రను అల్యూమినియం ఫాయిల్‌తో అంచులు అతికించాలి.
- ప్రెషర్ కుక్కర్‌లో కొద్దిగా నీటిని పోసి ఈ పాత్రను పెట్టి కుక్కర్ మీద వెయిట్ పెట్టకుండా మీడియం మంట మీద అరగంట పాటు ఉడికించాలి. దించే ముందు మూత తీసి మిశ్రమంలోకి చాకును గుచ్చి బయటకు తీసి చూడాలి. చాకుకు మిశ్రమం అంటుకోక పోతే చక్కగా ఉడికి తేమ మొత్తం ఆవిరైపోయినట్లు అర్థం. చాకుకు మిశ్రమం అంటితే మరో ఐదు లేదా పది నిమిషాల సేపు ఉడికించాలి. చల్లారిన తర్వాత ముక్కలుగా కట్ చేసి సర్వ్ చేయాలి. పై కొలతలు ఆరు సర్వింగ్స్‌కి వస్తాయి.


డాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ అండ్ వెల్‌నెస్ కోచ్

పోషకాలు ఒక్కో సర్వింగ్‌కి:
కేలరీలు– 190; ప్రొటీన్ – 4 గ్రాములు
కార్బోహైడ్రేట్‌లు – 30 గ్రాములు
ఫ్యాట్– 5 గ్రాములు; ఫైబర్– గ్రాము
చక్కెరలు– 22 గ్రాములు
క్యాల్షియమ్– 90 మిల్లీగ్రాములు

పిల్లలు నిద్రలో పళ్లు కొరుకుతున్నారా?



చిన్నారులు నిద్రలో పళ్లు కొరుకుతున్నారంటే అది వారిలో అంతర్గతంగా ఉన్న ఆందోళన, టెన్షన్, ఒత్తిడి కారణం వల్ల కావచ్చు. ఇలా నిద్రలో పళ్లు కొరికే కండిషన్‌ను వైద్యపరిభాషలో 'బ్రక్సిజమ్' అంటారు. పిల్లల్లో ఇది చాలా సాధారణంగా కనిపించడంతో పాటు వారి మొదటి ఐదేళ్ల వ్యవధిలో మొదలయ్యే సమస్య ఇది. సాధారణంగా చిన్నారుల్లో ఆందోళన, కోపం, వ్యాకులత, కంగారు, తొందరపాటుతో ఉండటం, పోటీ తత్వంతో వ్యవహరించడం వంటివి ఉన్నప్పుడు ఈ బ్రక్సిజమ్ సమస్య వారిలో ఎక్కువగా కనిపిస్తుంటుంది. ఈ సమస్యను అధిగమించాలంటే ముందుగా వాళ్లలో ఆందోళన, వ్యాకులతకు కారణమయ్యే అంశాలేమిటో తెలుసుకుని, దాన్ని తగ్గించేందుకు ప్రయత్నించాలి. నిద్రకు ముందు వాళ్ల సంతోషంగా, ఆహ్లాదంగా ఉండేలా తల్లిదండ్రులు చూడాలి. పిల్లలతో మాట్లాడుతూ వారి మనసుల్లో ఉన్న భయాలు, శంకలు తొలగించేలా వ్యవహరించాలి. అలాగే పిల్లలు నిద్రకు ఉపక్రమించే సమయంలో కెఫిన్ ఎక్కువగా ఉండే పదార్థాలు (కాఫీ, చాక్లెట్లు వంటివి) ఇవ్వకూడదు. సమస్య మరీ ఎక్కువగా ఉంటే నోట్లో అమర్చే మౌత్ గార్డ్స్, మౌత్‌పీసెస్‌తో కొంత ఉపయోగం ఉంటుంది. ఈ సమస్య వల్ల కొన్నిసార్లు డెంటల్ సమస్యలు – మాల్ అక్లూజన్, పళ్లు వదులుకావడం (లూజెనింగ్), పళ్లు పడిపోవడం, దవడ ఎముక జాయింట్ (టెంపోరో మాండిబులార్ జాయింట్) సమస్యలు కూడా రావచ్చు. అలాంటి సందర్భాల్లో దంతవైద్య నిపుణులను సంప్రదించాలి.



- మోడల్ కార్తికేయ
- పర్వతారోహణ చేద్దామా?
- ఏడడుగుల అశ్వత్థామ

నేటి 'సాక్షి' ఈపేపర్‌లో కిడ్స్ స్పెషల్ పేజీ

'సాక్షి' ఈపేపర్‌లో ప్రతిరోజూ ఓ స్పెషల్ ఫ్యామిలీ పేజీ

బ్యూటిప్



- రుబ్బిన మినప పిండిలో చిటికెడు గంధపు పొడి కలిపి ముఖానికి రాసుకుని, ఆరాక శుభ్రపరుచుకోవాలి. ఇలా క్రమం తప్పకుండా నెలరోజులపాటు చేస్తే ముఖ చర్మం నునుపుగా అవుతుంది.



రెడ్ ఐ పై కన్నెర్ర చేద్దాం!



'గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజ్ లేడీస్ హాస్టల్ బాత్రూంలో 29వ తేదీ సాయంత్రం హిడెన్ కెమెరా పట్టుబడింది'. రెండు తెలుగు రాష్ట్రాలను కుదిపేసిన సంఘటన ఇది. సాంకేతిక పరిజ్ఞానాన్ని అసాంఘిక కార్యకలాపాలకు దుర్వినియోగం చేస్తున్న వాళ్లు కూడా విద్యావంతులే.

ఇలాంటి ఒక సంఘటన జరిగినప్పుడు వ్యవస్థ మొత్తం నిద్రలేవడం, ఆ తర్వాత మర్చిపోవడమే జరుగుతోంది. స్పై కెమెరాల దుర్వినియోగం మీద నిఘా వ్యవస్థ రోజూ పని చేయాల్సిందేనన్నారు 'యాంటీ రెడ్ ఐ' యాక్టివిస్ట్ వరలక్ష్మి. ఈ దేగకన్ను గురించి సామాన్యుల్లో అవగాహన కల్పించడానికి సినిమా హాళ్లలో ప్రకటనల రూపంలో స్పై కెమెరాలు ఎన్ని రకాలుగా అమర్చే అవకాశం ఉంటుందో బొమ్మలతో చూపిస్తూ న్యూస్ రీల్ వేయాలన్నారు.

తరచూ తనిఖీలు తప్పనిసరి!

విద్యాసంస్థలకు అనుమతులిచ్చేటప్పుడే అమ్మాయిలు, అబ్బాయిల హాస్టల్ భవనాలు ఏ దిశలో ఉన్నాయి. రెండు భవనాల్లో బాత్‌రూమ్‌లు ఒకరికొకరు కనిపించని విధంగా నిర్మాణం ఉండాలి. షీ టీమ్స్, భరోసా టీమ్ సభ్యులు ప్రతి విద్యాసంస్థ నుంచి కొందరు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ ఉమెన్ క్యాడెట్‌లను సమీకరించి వర్క్‌షాపులు నిర్వహించాలి. ఆ ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ క్యాడెట్‌లు తమ విద్యాసంస్థలో వర్క్‌షాపులు నిర్వహిస్తూ స్పై కెమెరాలను గుర్తించడం, గుర్తించిన వెంటనే ఇంటర్నల్ కమిటీలకు తెలియచేయడం మీద చైతన్యవంతం చేయాలి. పోలీస్ డిపార్ట్‌మెంట్ పట్టణం, నగరంలోని విద్యాసంస్థలు, సినిమా హాళ్లు, హాస్పిటళ్లు, హోటళ్లు, షాపింగ్ మాల్స్‌లో తనిఖీలు చేసి 'ఫలానా తేదీన, ఫలానా టైమ్‌లో తనిఖీ జరిగింది. అసాంఘికంగా ఎటువంటి స్పై కెమెరాలు లేవు' అనే స్టిక్కర్ అతికించాలి. స్పై కెమెరాను గుర్తిస్తే ఆ విద్యాసంస్థ, వ్యాపార సంస్థ ఏదైనా సరే తక్షణమే మూసివేయడం, యజమాని మీద నాన్‌బెయిలబుల్ సెక్షన్‌ల కింద కేసు నమోదు చేయడం వంటి కఠినచర్యలు ఉండాలి. రోజూ నగరంలో ఏదో ఒక చోట తనిఖీలు జరుగుతుంటే ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు కళ్లెం పడుతుంది. వ్యాపార సంస్థల ప్రకటనల హోర్డింగ్‌లో స్పై కెమెరా లోగో, 'మహిళల భద్రత మా బాధ్యత' అనే క్యాప్షన్ ముద్రించడం తప్పనిసరి చేయాలి.

స్పై కెమెరాలు లక్షల్లో అమ్ముడవుతున్నాయి!

స్పై కెమెరాల అమ్మకం మీద కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలి. స్పై కెమెరా కొంటున్న వారి ఆధార్ నంబరు, స్పై కెమెరా కొంటున్న అవసరం ఏమిటో స్పష్టంగా తెలియచేయాలనే నిబంధన పెట్టాలి. ప్రతి జిల్లాలో కలెక్టర్ ఆధ్వర్యంలో లోకల్ కమిటీలున్నాయి. జిల్లా కలెక్టర్, షీ టీమ్స్ సేవలను విస్తృతం చేయడంతో పాటు బాధితులు సమాచారం అందించడానికి జిల్లాకో ఫోన్ నంబరును ప్రజల్లోకి తీసుకువెళ్లాలి. అప్పుడే ఇలాంటి దుశ్చర్యలకు అడ్డుకట్ట పడుతుంది.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

కెమెరా లేదనే భరోసానిద్దాం!

హెవెన్ హోమ్స్ సొసైటీ ద్వారా ఆపదలో ఉన్న అమ్మాయిలను రక్షించడం, వారికి సాధికారమైన ఉపాధి కల్పించడం, వివిధ సామాజికాంశాలపై అవగాహన కోసం సదస్సులు, శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నాం. ముఖ్యంగా 'యాంటీ రెడ్ ఐ' పేరుతో స్పై కెమెరాల మీద యుద్ధం మొదలు పెట్టాం. ఈ దుర్మార్గాన్ని అరికట్టడానికి ఒక నియమావళిని రూపొందించాను. ఆ సూచనలతో తెలంగాణ ప్రభుత్వం ఆగస్టు 15న స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా మహిళల భద్రత కోసం 'నో హిడెన్ కెమెరా ఇన్‌సైడ్' అనే ప్రోగ్రామ్ మొదలు పెట్టింది. సీసీటీవీలున్న చోట 'మీరు సర్వేలెన్స్ కెమెరా నిఘాలో ఉన్నారు' అనే హెచ్చరిక ఉన్నట్లే... 'స్పై కెమెరా లేదా హిడెన్ కెమెరా లేదు. మీరు ధైర్యంగా ఉండవచ్చు' అని భరోసా కలిగించే క్యాప్షన్ కూడా ఉండాలి. నిర్భయ నిధులు ప్రతి రాష్ట్రానికీ విడుదలవుతుంటాయి. కానీ ఖర్చు చేయకుండా ఉండిపోతుంటాయి. ఆ నిధులను ఇలా సద్వినియోగం చేయాలి.



– అడపా వరలక్ష్మి,
సామాజిక కార్యకర్త

ఎందుకీ పాట్లు..? కునుకు వెయ్యండి...

రాత్రంతా సరిగ్గా నిద్రపోలేదా.. తెల్లవారినా ఇంకా నిద్ర వస్తున్నట్లు... అలసిపోయినట్లు అనిపిస్తోందా? మీ శరీరం నిద్రను కోరుకున్నపుడు, దానిని అదుపులో ఉంచడానికి ప్రయత్నించడం మంచిది. కాదు. కనీసం కాసేపయినా సరే, కునుకు తీయడం మంచిది. అది కేవలం 10-15 నిమిషాలే అయినా సరే, అద్భుతంగా పనిచేస్తుంది.



నిద్ర మనిషికి అత్యంత అవసరం. కానీ ప్రస్తుతం ఇప్పుడున్న కాలంలో నిద్రకు కూడా తగినంత సమయం ఉండటం లేదు. దీంతో అనారోగ్యం, దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారు. సరైన నిద్ర లేకపోతే చికాకుగా.. నీరసంగా.. అలసటగా అనిపిస్తుంది. అయితే రాత్రిళ్ల చాలా మందికి నిద్ర పట్టదు. దానికి అనేక కారణాలు ఉంటాయి. ఇంట్లోని సమస్యలు, ఆఫీసులోని టెన్షన్స్, వివాహ బంధంలో గొడవలు, మనస్పర్ధలు ఇలా చాలా కారణాలు ఉంటాయి. ఒక మనిషి ఆరోగ్యంగా, ప్రశాంతంగా ఉండాలంటే నిద్ర ముఖ్య పాత్ర పోషిస్తుంది. ఎంత పని ఉన్నా సరే.. ఓ కునుకు తీస్తే కానీ మనిషి.. మనిషిలా ఉండడు. ప్రతి మనిషికి తగినంత నిద్ర అవసరం. కనీసం 7 గంటలైనా నిద్ర పోవాలని నిపుణులు చెబుతున్నారు.

ఈ క్రమంలోనే స్లీప్ నాప్స్ అంటే కునుకు పాట్లు తీయడం మంచిదేనా? అంటే మంచిదే అని అంటున్నారు నిపుణులు. ఎందుకంటే రాత్రిళ్ల సరిగ్గా నిద్రపోని వారు పగలు ఓ కునుకు తీస్తే సరి... వారికి హాయిగా ఉంటుంది. అయితే ఆ కునుకు రాత్రి నిద్రకి ఆటంకం కాకుండా చూసుకోవాలి. ఎందుకంటే మధ్యాహ్నం ఎక్కువసేపు పడుకుంటే.. కొంత మందికి నిద్రపట్టదు కనుక.

అందువల్ల ఒకవేళ మీరు కునుకు పాట్లు తీయాల్సి వస్తే ఓ అరగంటకు మించి పడుకోవడం అంత శ్రేయస్కరం కాదు. కొరియా, జపాన్ వంటి దేశాల్లో పలు కంపెనీల్లో ఉద్యోగులు ఓ అరగంట పాటు కునుకు తీసేందుకు వీలు కల్పిస్తారు. ఇలా చేస్తే వారికి ప్రయోజనాలు కలుగుతాయని, బ్రెయిన్ కూడా ఫ్రెష్‌గా, చురుగ్గా పని చేస్తుందని అంటారు. కునుకు పాట్లు తీయడం వల్ల జ్ఞాపకశక్తి కూడా పెరుగుతుందని తాజాగా పలు అధ్యయనాల్లో వెల్లడైంది. పగటి పూట కునుకు తీయడం వల్ల ఆరోగ్యంతో పాటు రోగ నిరోధక శక్తి కూడా మెరుగు పడుతుందట. అంతే కాకుండా చర్మం కూడా నిర్జీవంగా కాకుండా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. నిజానికి కునుకు తీయటానికి సరైన సమయమంటూ ఏదీ లేదు గానీ.. మధ్యాహ్నం 1-4 గంటల మధ్య పడుకోవటం మేలు. ఆ తర్వాత అంటే ముఖ్యంగా సాయంసంధ్యవేళలలో అస్సలు నిద్రపోరాదు. సెలవురోజుల్లోనూ గంట కన్నా ఎక్కువసేపు కునుకు తీయొద్దు. ఇది రాత్రి నిద్రను దెబ్బతీస్తుంది. కునుకు అంటే కునుకులాగే ఉండాలి.

గుడ్డు (గుడ్) పేరెంటింగ్!



పిల్లల పెంపకం కత్తిమీద సాములాంటిది. వారి అభిరుచులకు తగ్గట్టు పెంచడమా... మన అభిరుచులకు అనుగుణంగా వారిని మలచుకోవడమా..? అమిత గారాబం చేయడమా..? అతి క్రమశిక్షణతో పెంచడమా? ఇవన్నీ కూడా పరస్పర విరుద్ధమైన అంశాలే. అయితే వాటిలో తల్లిదండ్రులు ఏ ఒక్కదానినో మాత్రమే అనుసరించి, మిగిలిన వాటిని గాలికి వదిలేస్తే మాత్రం దాని ప్రభావం పిల్లల మీద పడుతుంది. అందువల్ల పిల్లల పెంపకంలో చాలా జాగ్రత్తగా ఉండాలంటున్నారు కాలిఫోర్నియాలోని న్యూ పోర్ట్‌కు చెందిన క్లినికల్ సైకాలజిస్ట్ డాక్టర్ కిమ్ సేజ్. అయితే ఎగ్‌షెల్ పేరెంటింగ్ మాత్రం అన్నింటికన్నా మంచిదంటున్నారాయన. ఇంతకీ ఎగ్‌షెల్ పేరెంటింగ్ అంటే ఏమిటో తెలుసుకుందామా....

చాలామంది తల్లిదండ్రులు వారి పిల్లలతో ఫ్రెండ్లీగా ఉండరు. వాళ్లమీద అజమాయిషీ చేయిస్తూ ఉంటారు. తల్లిదండ్రులు, పిల్లల మధ్య స్నేహపూర్వకమైన వాతావరణం ఉండదు. కొంతమంది పిల్లలు వాళ్ల సమస్య గురించి చెప్పినా కసురుకుంటూ ఉంటారు. దీంతో చిన్నారులు వారి మనసులోని భావాలను తల్లిదండ్రులతో పంచుకోవడానికి ఇష్టపడరు. ఇలాంటి వాతావరణం కుటుంబ సభ్యుల మధ్య ఉండటం అంత మంచిది కాదు. అందుకే ఇంట్లో ఎప్పుడూ స్నేహపూర్వకమైన, సరదాలతో కూడిన వాతావరణం ఉండేలా తల్లిదండ్రులు చూసుకోవాలి. అలాగని వారికి పూర్తిగా స్వేచ్ఛ నివ్వమని కాదు. వారికి స్నేహహస్తాన్ని అందిస్తూనే.. తప్పు చేస్తున్నప్పుడల్లా హెచ్చరిస్తుండాలి. పిల్లలకు కొన్నిసార్లు చిన్న చిన్న పనులు చేయమని చెప్తుంటాం. వారు ఆ పనులు చేయకపోతే తిట్టడం, కొట్టడం, అరవడం చేస్తే పిల్లలు ఇంకా మొండిగా తయారవుతారు. ఆప్యాయంగా దగ్గరకి పిలుచుకుని చెప్తే పిల్లలు మాట వింటారు.? కొందరు తల్లిదండ్రుల వారి పిల్లలపై లక్ష్యాలు, ఆశయాలను బలవంతంగా రుద్దుతుంటారు. ఇలాంటి వాతావరణంలో పెరిగే చిన్నారులు తీవ్రమైన ఒత్తిడికి గురవుతుంటారు. ఫలితంగా వారు చేయాలనుకున్న వాటిని చేయలేకపోతుంటారు. అందువల్ల వాళ్ల ఆసక్తిని గుర్తించి, ఆ దిశగానే ప్రోత్సహించాలి.

కవచంలా ఉండాలి



ఈ పేరులోనే అర్థం అంతా ఉంది. గుడ్డు లోపల ఉన్న పదార్థానికంతటికీ గుడ్డు పెంకు ఒక రక్షణ కవచంలా ఉంటుంది. దీంతో లోపలున్న పదార్థం చాలా నిశ్చింతగా ఏం ఆలోచించాల్సిన పని లేకుండా ఉంటుంది. మరి మీ పిల్లల్నీ ఇలాగే పెంచుతున్నారా? ఒక్కసారి ఆలోచించుకోవాల్సిన అవసరం ఉంది.

ఎగ్‌షెల్ పేరెంటింగ్‌లో ఉన్న ప్రధాన లోపం ఏమిటంటే పిల్లలకు ఏమీ తెలియదని, అన్నీ మీరే చూసుకోవాలని, అమర్చి పెట్టాలనీ అనుకోవడం. అయితే అది తప్పు. పిల్లలు చిన్నప్పటి నుంచి అన్ని నైపుణ్యాల్నీ నేర్చుకోవాలి. బయట నాలుగు చోట్లకీ తిరగాలి. నలుగురితో మాట్లాడాలి. సమస్యల్ని, సవాళ్లని తమంతట తాము పరిష్కరించుకునేలా తయారవ్వాలి. అంతే తప్ప ప్రతి విషయంలోనూ వారు మీపై ఆధార పడుతున్నారేమో ఆలోచించి చూడండి. అలా వారిని ఏ పనీ చేయనివ్వకుండా మీరు అతి ప్రేమ చూపిస్తున్నారేమో పరిశీలించుకోండి.

అతి గారాబం

పిల్లలను అతి గారాబం గా చూసుకోవడం, అతి ప్రేమగా జాగ్రత్తగా చూసుకోవడమూ వారిని మానసికంగా ఎదగనీయకుండా అడ్డుపడతాయని కొన్ని అధ్యయనాల్లో తేలింది. కొందరు పిల్లలు ఏం అడిగితే దాన్ని తల్లిదండ్రులు కొని ఇచ్చేస్తూ ఉంటారు. అది అవసరమా, కాదా.. అని ఏ మాత్రం ఆలోచించరు. తన కొడుకు లేదా కూతురు మహారాజు లేదా మహారాణి అనే ఫీలింగ్‌లో ఉంటారు. ఆ రకంగా వారిని ఎక్కువగా ప్యాంపర్ చేస్తూ ఉంటారు. దీంతో పిల్లల్లో పెంకి మనస్తత్వం పెరిగిపోతుంది. పెద్దయ్యే కొద్దీ వారు అనుకున్నది ఏదైనా జరగకపోతే వారు తట్టుకోలేరు. తీవ్రంగా ప్రవర్తిస్తారు.

మేలు చేసేలా ఉండాలి: మనం వారి పట్ల చూపే ప్రేమ వారికి మంచి చేసే విధంగా ఉండాలి తప్ప ఇబ్బంది కలిగించేలా మాత్రం ఉండకూడదు. అందుకనే వారికి చిన్నప్పటి నుంచి అన్ని పనులనూ నేర్పించండి. కష్టమైన పనులనూ పూర్తి చేయమని చెప్పండి. ప్రతి విషయాన్ని అర్థం అయ్యేలా చెప్పేందుకు ప్రయత్నించండి. మాట వినకపోతే కటువుగానూ మాట్లాడవలసి ఉంటుంది. అంతమాత్రాన మీకు వారి మీద ప్రేమ లేనట్లు కాదు కదా..

బుర్ర పాదరసంలా పరిగెట్టాల్సిందే!

శరీరంలో ముఖ్యమైన భాగాల్లో మెదడు ఒకటి. మెదడు ఆదేశాల ప్రకారమే శరీరంలోని అన్ని భాగాలు నడుస్తాయి. మెదడు సరిగ్గా పని చేయకపోతే.. మనిషి ఏ పనీ సరిగ్గా చేయలేడు. అలాంటి మెదడు ఆరోగ్యంగా ఉండాలంటే.. కొన్ని చెయ్యాలి... కొన్నింటిని తినాలి... అవేంటో చూద్దాం...



దేనినైనా సరే, సరిగ్గా పని చేయిస్తేనే అది సక్రమంగా పని చేస్తుంది. ఎన్ని వేలు పోసి కొన్న యంత్రాన్నైనా సరే, దానితో పని చేస్తేనే కదా అది సరిగ్గా పనిచేసేదీ లేనిదీ తెలిసేది! అందువల్ల మెదడు సరిగ్గా పని చేయాలంటే దానికి ఎప్పుడూ తగిన పని చెబుతూనే ఉండాలి. కొన్ని రకాలైన ఆహార పదార్థాలను అందిస్తూ ఉండాలి.

ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్: మెదడు సరిగ్గా పని చేయాలంటే ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ తీసుకోవడం అవసరం. ఎందుకంటే ఈ ఫ్యాటీ యాసిడ్స్ మెదడు కణాల మధ్య కమ్యూనికేషన్‌ను ప్రోత్సహిస్తాయి. తృణ ధాన్యాలు కూడా మెదడును ఆరోగ్యంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తాయి.

యాంటీ ఆక్సిడెంట్లు: ఇవి కూడా మెదడు కణాలను ఒత్తిడి, వాపు నుంచి రక్షించడంలో సహకరిస్తాయి. అదే విధంగా అధికంగా చక్కెర తీసుకోవడం వల్ల మెదడు పనితీరు మందగిస్తుంది. ఫలితంగా జ్ఞాపకశక్తి తగ్గి మతి మరుపు పెరుగుతుంది. కాబట్టి షుగర్ తక్కువగా ఉండే ఆహారాలు తీసుకోవడం ఉత్తమం. అదేవిధంగా హైడ్రేట్‌గా ఉండటం వల్ల మెదడు చురుగ్గా ఉంటుంది.

అరోమా: కొన్ని రకాల మూలికలు, సుగంధ ద్రవ్యాలు మెదడు కణాలను పరిరక్షించే సమ్మేళనాలను కలిగి ఉంటాయి, ఇవి ఐక్యూని మెరుగుపరుస్తాయి. కాబట్టి మీ ఆహారంలో పసుపు, దాల్చిన చెక్క, రోజ్ మేరీ వంటివి ఉండేలా చూసుకోండి.

ఇవిగాక మెదడును చురుగ్గా ఉంచేలా పదవినోదాలు, పదవిన్యాసాలు పూర్తి చేయడం, సుడోకు వంటివి ఆడటం, క్యారమ్స్, చదరంగం వంటి ఇన్‌డోర్ గేమ్స్ ఆడటం, రోజూ కొన్ని పదాలను గుర్తు పెట్టుకోవాలనే నియమాన్ని పెట్టుకుని దానిని సరిగ్గా అనుసరించడం వల్ల బుర్ర పాదరసంలా పరుగెడుతుంది.

సెల్‌ఫోన్ తెస్తే స్కూలుకు రావద్దు!



పది హేనేళ్ల లోపు పిల్లలు స్కూల్‌కు సెల్‌ఫోన్ తీసుకు రావడానికి వీల్లేదంటూ ఫ్రాన్స్ ప్రభుత్వం పిల్లలకు ఉన్న సెల్ బంధాన్ని తెగ్గొట్టే ప్రయత్నం చేస్తోంది. ఇతర దేశాలలో కూడా ఈ చట్టం అమలయిందంటే ఎంత హాయో కదా...

ఇటలీ నుంచి ఫ్రాన్స్ వరకు యూరోపియన్ దేశాలు పదిహేను సంవత్సరాలలోపు వయసు ఉన్న పిల్లలు స్కూల్‌కి సెల్‌ఫోన్ తీసుకు రాకుండా చేస్తే ఎలా ఉంటుందా అని ఆలోచనలు చేస్తున్నాయి. అయితే ఫ్రాన్స్ మాత్రం ఆ దిశగా ఒకడుగు ముందుకేసింది. విద్యాసంస్థలన్నీ సెల్‌ఫోన్‌తో అవసరం లేకుండా చదువు చెప్పాలని, పిల్లలు కూడా స్కూల్‌కి సెల్‌ఫోన్ తీసుకెళ్లకూడదని ఆదేశాలు జారీ చేసింది. ఇది విజయవంతం అయితే గనక వచ్చే ఏడాది జనవరి నుంచి చాలా దేశాలలోబడి పిల్లల చేతిలో సెల్‌ఫోన్ కనిపించదు. ఫ్రాన్స్‌లో లాగే ఇతర దేశాలలో కూడా పదిహేనేళ్లలోపు పిల్లల చేతిలో సెల్‌ఫోన్ ఉండకూడదన్న చల్లటి మాట చెబితే తల్లిదండ్రులెంతో సంతోషిస్తారు కదా...

ఇలా అన్నారు

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రభావం అన్ని రంగాల్లో ఏ మేరకు ఉంటుంది? కొందరు ఉపాధి కోల్పోయేలా చేస్తుందా? వంటి చర్చలు జరుగుతున్న విషయం తెలిసిందే. సినిమా రంగంపైనా ఏఐ ప్రభావం భారీగా ఉంటుందన్నది కొందరి ఊహ. ముఖ్యంగా మ్యూజిక్ విభాగంపై ఎక్కువ ప్రభావం పడుతుందనే ఊహాగానాలు ఉన్నాయి. ఈ అంశంపై ఇటీవల 'సాక్షి' సినిమా పేజీలో ఓ కథనం కూడా ప్రచురితమైంది. తాజాగా 'స్టార్ రైటర్స్' చంద్రబోస్, రామజోగయ్య శాస్త్రి 'ఏఐ' గురించి తమ అభిప్రాయాలను 'సాక్షి'తో ఈ విధంగా పంచుకున్నారు.



అది మనకు బానిస.... మనం బాస్

- చంద్రబోస్

మనిషి కంటే.. మనిషి మేధస్సు కంటే ఏదీ గొప్పది కాదు. కాకపోతే కొత్త కొత్త ఆవిష్కరణలన్నీ కూడా మనిషికి సాయం చేయడానికే కనిపెట్టబడుతున్నాయి. మనిషిని కొల్లగొట్టడానికి, కూల్చేయడానికి కాదు. ఈ కోణంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అర్థం చేసుకుని ఆహ్వానిస్తే అన్నీ మంచి ఫలితాలే వస్తాయి. నిజమే... అన్నింటా ఏఐ పరిజ్ఞానంపై చర్చ జరుగుతోంది... కాదనడం లేదు. సెల్‌ఫోన్ చాలా రకాల పనుల్ని చేస్తోంది. అందులో ఉన్న కెమెరాలతో ఫొటోలు, వీడియోలు తీసుకుంటున్నాం. అయినా బయట ఫొటో, వీడియో స్టూడియోలు ఉన్నాయి. అందులో సరికొత్త నిపుణులు పుట్టుకొచ్చారు. ఇంకా పెద్దగా అది విస్తరించింది. చాలా మందికి ఉపాధి లభిస్తోంది. ఏ వస్తువొచ్చినా కూడా మనిషి మాత్రమే ప్రత్యేకంగా చేయగలిగింది ఒకటుంటుంది. కాబట్టి కంగారు పడాల్సిన పని లేదు. దాంతో (టెక్నాలజీ) మనం చాకిరీ చేయించుకోవాలి. బానిసలాగా ఆ కొత్త పరిజ్ఞానాన్ని వాడుకోవాలి. అక్కడే మనిషి ప్రతిభ తెలుస్తుంది. అది బాణీలు కట్టి సాహిత్యాన్నిస్తుంటే.. దాన్నుంచి వందల కొద్దీ బాణీలు తీసుకుని అందులోని ఆత్మను ఎంపిక చేసి దానికి మనం మెరుగులు అద్దుకోవాలి. ఉదాహరణకు కంప్యూటర్ వల్ల మనకు ఎంతో సమయం ఆదా అవుతోంది. అలా ఆదా అయిన సమయాన్ని వేరే దానికి మళ్లిస్తున్నాం. అలాగే సంగీతంలో కూడా ఏఐ ఇచ్చే ట్యూన్ల నుంచి మంచిది ఎంపిక చేసుకుని దానికి మన సృజనాత్మకతను జోడించి ఏఐ కూడా చేయలేని సరికొత్త రాగాన్ని సృష్టించాలి. అంతే కానీ ఎవరి ఉద్యోగాలూ పోవు. ఎవరి పనులూ ఆగిపోవు. అదేమీ దేవుడు కాదు. కాకపోతే దాన్ని అర్థం చేసుకోవాలి. కంప్యూటర్ వచ్చినప్పుడు అందరి ఉద్యోగాలూ పోతాయన్నారు.. మరి కంప్యూటరే లక్షల ఉద్యోగాల్ని క్రియేట్ చేసింది. ఒకప్పుడు పేపర్ మీద పాట రాసుకునేవాడ్ని. ఇప్పుడు రిమార్కర్ అనే సాంకేతికత ద్వారా రాసుకుంటున్నా. ఒకప్పుడు తప్పులొస్తే తుడిచేయడానికి వైట్ మార్కర్‌తో కొట్టేయాల్సి వచ్చేది. ఇప్పుడు రిమార్కర్‌పైన ఆ సమస్యే లేదు. అందుకే ఏ సాంకేతికతనైనా విశాల హృదయంతో స్వీకరించినప్పుడే అది మనకు ఉపయోగపడుతుంది. దానిని సరిగ్గా వాడుకోవడం తెలుసుకుంటే అది మనకు బానిసే అవుతుంది.. దానికి మనం బాసే అవుతాం.



ఏఐ ఆత్మను ఆవిష్కరించగలదా?

- రామజోగయ్య శాస్త్రి

మనం సంధి కాలంలో ఉన్నాం. నేను రోళ్లు చూశాను.. మిక్సీలు చూశాను. మార్పును తిరస్కరించలేం. టెక్నాలజీ పరంగా ఎదగాల్సిందే. అయితే.. దేనిని ఎంత మేర వాడుకోవాలన్నది మన చేతుల్లోనే ఉంటుంది. ఇప్పుడు పంచాంగం చూడాలంటే ఫోనులో 'మెటా'ని అడిగినా చెబుతుంది. అదే ఫోన్‌ను మంచికీ చెడుకీ వాడొచ్చు. సో.. టెక్నాలజీని తప్పనిసరిగా స్వాగతించాల్సిందే. పాటలు లేకుండా సినిమాలు ఆడతాయని కొందరు అన్న సందర్భాలు ఉన్నాయి. మరి జరిగిందా? సో.. తెలుగువాళ్లను సినిమాల నుంచి వేరు చేయలేము... పాటల నుంచీ వేరు చేయలేము. పల్లెల్లో పని చేసుకునేవాళ్లు తమకొచ్చినది పాడుతుంటారు. వాటిల్లోనూ మంచి ట్యూన్లుంటాయి. అలాగే హైదరాబాద్‌లోనే చాలా మంది మ్యూజిక్ డైరెక్టర్లున్నారు. కూచోబెట్టి 15 ట్యూన్లు అలవోకగా పాడేవాళ్లుంటారు. అంతటితో అయిపోతుందా.. దానికి పరిపుష్టి చేకూర్చేలా వాయిద్యాల సహకారం, ప్లాన్ చేయటం, పాడించడం వంటివన్నీ ఉంటాయి కదా. ఓ ట్యూన్ జనరేట్ చేసి ఆర్కెస్ట్రైజేషన్ చేస్తే సరిపోతుందా? అది నచ్చాలి కదా.. తుది మెరుగులు దిద్దితేనే అది బాగుంటుంది. 'లాభం ఎంతొచ్చిందమ్మా సౌభాగ్యం అమ్మేశాక...' ('శుభలగ్నం'లో సిరివెన్నెల సీతారామ శాస్త్రి రాసిన 'చిలుకా ఏ తోడు లేక...' పాటను ఉద్దేశించి) అనే పాటను ఏఐ ఇవ్వగలదా? ఒక మనిషి తాలూకు భావనను పరికించి.. పరిశీలించి.. ప్రతిస్పందించి ఇవ్వగలిగేది మనిషి, మనసు మాత్రమే. ఆ మనసు ఏఐకి ఉందా? సినీ ఇండస్ట్రీలో పర్ఫెక్షన్ కోసం ఏమిచ్చినా ఇంకా ఏదో కావాలంటాం. 80 శాతం ఫలితమొచ్చినా దాన్ని వంద శాతం తీసుకొచ్చేందుకు మళ్లీ ఓ మనిషి కావాల్సిందే. యంత్రాలొచ్చినప్పుడు కార్మికులకు పని పోతుందనుకున్నాం.. పోయిందా..? ఏఐ కావాల్సిందే.. అదే పనిగా ఏఐతో పది పదిహేను సినిమాలు చేస్తే బోర్ కొట్టేస్తుంది. అప్పుడు మళ్లీ మనుషులే కావాల్సి వస్తారు. పాట అనేది ఆత్మకు సంబంధించిన అంశం. ఇవాళ ఉన్న టెక్నాలజీతో ప్రతి శబ్దాన్ని వర్చ్యువల్‌గా సృష్టించవచ్చు. వయొలిన్, కీ బోర్డ్, మృదంగం ఇలా... కానీ దానిని లైవ్ ఇన్‌స్ట్రుమెంట్స్ శబ్దాలతో మళ్లీ రీ ప్లేస్ చేస్తారు. అలాంటప్పుడు మృదంగం, వయొలిన్ విద్వాంసుల ఉద్యోగాలు ఎప్పుడో పోయుండాలి. ఏదైనా ఆర్గానిక్‌గా వచ్చే దాని అందమే వేరు. సాహిత్యం విషయంలోనూ అంతే. మనిషి అనుభవంతో పలికే పదాలుంటాయి. వాటిని ఏఐ నుంచి ఎలా ఆశించగలం? కొన్నింటిని మనిషే పుట్టించగలడు.. ఏదో ప్రాస కోసం వెదుకుతున్నప్పుడు కొన్ని పదాలను ఏఐ ఇవ్వచ్చేమోగాని పాట యొక్క ఆత్మను ఏఐ ఆవిష్కరించలేదు కదా.

సీన్‌కి అనవసరమైనప్పటికీ నన్ను తాకాడు

- మలయాళ నటి మాలా పార్వతి



మలయాళ చిత్ర పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులపై హేమా కమిటీ నివేదిక ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ నేపథ్యంలో పలువురు మలయాళ సినీ ప్రముఖులపై కేసులు నమోదు అయ్యాయి. అలాగే పలువురు నటీమణులు తమకు ఎదురైన ఇబ్బందుల గురించి బహిరంగంగా మాట్లాడుతున్నారు. తాజాగా మలయాళ నటి మాలా పార్వతి స్పందించారు. ''2010లో నేనొక సినిమా చేశాను. సినిమాలో నా కూతురు న్యాన్సీ (నిత్యా మీనన్) నా చుట్టూ తిరుగుతూ సరదాగా ఆడుకునే సీన్ అది. ఆ సమయంలో నా భర్త పాత్రధారి న్యాన్సీని ఆప్యాయంగా టచ్ చేయాలి. అయితే ఆ వ్యక్తి ఓ చేత్తో న్యాన్సీని టచ్ చేసి, మరో చేత్తో అనవసరం అయినప్పటికీ నన్ను బలంగా తాకాడు. నాకు నొప్పిగా అనిపించింది. ఆ తర్వాత దర్శకుడు శిబీ మలైయిల్ టచ్ లేకుండా ఈ సీన్‌ని రీ టేక్ చేశారు. కానీ అదే వ్యక్తితో ఒకరి పక్కన మరొకరు కూర్చోవడం, హత్తుకోవడం వంటి సన్నివేశాలు ఉన్నాయి. చెప్పాలంటే నాకు ఆ సినిమా ఓ టార్చర్‌లా అనిపించింది. నాకు కంఫర్ట్‌గా అనిపించకపోవడంతో ఆ సినిమాలో నేను సరిగ్గా నటించలేకపోయాను కూడా. మానసికంగా, శారీరకంగా ఇబ్బంది పడ్డాను'' అని ఓ ఆంగ్ల మీడియాతో మాలా పార్వతి చెప్పారు. అలాగే ఆమె జీవితంలోని మరో ఘటనను కూడా పంచుకున్నారు. ఆ ఘటన గురించి మాట్లాడుతూ– ''2019లో 'హ్యాపీ సర్దార్' అనే సినిమా చేశాను. నా కోసం నేను నా ఖర్చుతో క్యారవేన్ పెట్టుకున్నాను. అయితే క్యారవేన్‌కు నేనెలా అర్హురాలినంటూ ఓ సీనియర్ నటుడు నన్ను ప్రశ్నించాడు. నా సొంత ఖర్చులతో నేను పెట్టుకున్నానని చెప్పినా అతని వైఖరి మారలేదు. నా క్యారవేన్‌ను కొందరు నటీమణులు కూడా వినియోగించుకున్నారు. అయితే ఓ రోజు నా క్యారవేన్ దగ్గర రాత్రివేళ అనుకోని ఘటనలు జరుగుతున్నాయని నాకో ఫోన్‌కాల్ వచ్చింది. నేను హడావిడిగా వెళ్లాను. నా క్యారవేన్ కనిపించలేదు. దగ్గర్లో ఓ చెట్టు కింద పార్క్ చేసి ఉందని గమనించాను. నేను అక్కడికి వెళ్తుంటే ఇద్దరు బౌన్సర్స్ నన్ను చూసి పారిపోయారు. అక్కడే ఉన్న అమ్మాయిలను నేను తీసుకువచ్చాను. ఈ భయంకరమైన ఘటన గురించి ఓ సీనియర్ మలయాళ నటుడికి ఫిర్యాదు చేస్తే... ''నువ్వు సామాజిక కార్యకర్తలా వచ్చావా? లేక నటించడానికి వచ్చావా? అని ప్రశ్నించాడు. ఇలాంటివారి వల్లే సినిమాల్లో మహిళలకు భద్రత లేకుండా పోయిందని చాలా బాధ కలిగింది. 'హ్యాపీ సర్దార్' సినిమా నా నట జీవితాన్ని మార్చేసింది. నా గొంతును న్యాయం కోసం వినిపించినందు వల్లే నాకు అవకాశాలు తగ్గిపోయాయి'' అన్నారు మాలా పార్వతి. ఇదిలా ఉంటే... 2010లో మాలా పార్వతి చేసిన చిత్రాల్లో 'అపూర్వ రాగం'లో నిత్యా మీనన్ ఆమె కూతురి పాత్ర చేశారు. సో... ఈ సినిమాలో నటించిన ఓ నటుడి గురించే ఆమె పేర్కొని ఉంటారని ఊహించవచ్చు. ఇక ప్రస్తుత పరిణామాల రీత్యా ఇప్పటికే 'అమ్మ' (అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్) అధినేత మోహన్‌లాల్‌తో పాటు ప్యానల్ సభ్యులందరూ రాజీనామా చేసిన సంగతి తెలిసిందే.

వినోదం రెండింతలు ఉంటుంది

- శ్రీ సింహా



● శ్రీ సింహా, ఫరియా అబ్దుల్లా

''మత్తు వదలరా'ని ప్రేక్షకులు పెద్ద హిట్ చేశారు. మొదటి భాగం కంటే రెండో భాగంలో వినోదం, థ్రిల్ రెండింతలు ఉండేలా తీశాం. సెప్టెంబర్ 13న మా సినిమాని థియేటర్స్‌లో చూసి ఎంజాయ్ చేయండి'' అని హీరో శ్రీ సింహా కోడూరి అన్నారు. ''మత్తు వదలరా' వంటి హిట్ మూవీ తర్వాత శ్రీ సింహా కోడూరి, డైరెక్టర్ రితేష్ రానా కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'మత్తు వదలారా 2'. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్‌పై చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మించిన ఈ సినిమా సెప్టెంబర్ 13న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ఈ చిత్రం టీజర్ లాంచ్ ఈవెంట్‌లో రితేష్ రానా మాట్లాడుతూ– ''అందరూ 'మత్తు వదలరా' చిత్రాన్ని మరోసారి చూసొస్తే రెండో భాగాన్ని ఇంకా బాగా ఎంజాయ్ చేస్తారు'' అని తెలిపారు. ఫరియా అబ్దుల్లా మాట్లాడుతూ– ''ఈ సినిమాలో నేను హీరోయిన్‌గా నటించడంతో పాటు ఓ పాట రాసి, పాడాను. అలాగే కొరియోగ్రఫీ కూడా చేశాను'' అని పేర్కొన్నారు. ''టీజర్ చూసిన తర్వాత చాలా పెద్ద సినిమా అవుతుందనే నమ్మకంతో ఉన్నాం'' అని వై. రవిశంకర్ చెప్పారు. ''మా సినిమాని థియేటర్స్‌లో చూసి ఆదరిస్తారని ఆశిస్తున్నాను'' అని చిరంజీవి (చెర్రీ) అన్నారు. ''థియేటర్స్‌కి రండి... గట్టిగా సౌండ్ చేద్దాం'' అని సంగీత దర్శకుడు కాల భైరవ పేర్కొన్నారు.

న్యాయ పోరాటం షురూ



● ప్రియదర్శి, నాని

ప్రియదర్శి హీరోగా నటించనున్న కోర్ట్ రూమ్ డ్రామా 'కోర్ట్: స్టేట్ వర్సెస్ ఎ నోబడీ'. రామ్ జగదీష్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తూ హీరో నాని సమర్పణలో వాల్ పోస్టర్ సినిమా పతాకంపై ప్రశాంతి తిపిర్నేని ఈ సినిమాను నిర్మించనున్నారు. శుక్రవారం ఈ సినిమా ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో జరిగింది. తొలి సన్నివేశానికి ప్రశాంతి కెమెరా స్విచాన్ చేయగా, నాని క్లాప్ ఇచ్చారు. నిర్మాత పి. కిరణ్ దర్శకత్వం వహించారు. ''అన్యాయంగా ఓ కేసులో ఇరుక్కున్న ఓ కుర్రాడి కోసం జరిగే న్యాయ పోరాటం చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుంది. ఇందులో ప్రియదర్శి లాయర్ పాత్రలో కనిపిస్తారు. సెప్టెంబరులో రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభిస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది. శివాజీ, సాయికుమార్, రోహిణి, హర్షవర్ధన్, హర్ష్ రోషన్ తదితరులు నటించనున్న ఈ చిత్రానికి సంగీతం: విజయ్ బుల్గానిన్, కెమెరా: దినేష్ పురుషోత్తమన్.



రజనీకాంత్ హీరోగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో 'కూలీ' అనే సినిమా తెరకెక్కుతోంది. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమాలోని సైమన్ పాత్రలో నాగార్జున, దయాళ్ పాత్రలో సౌబిన్ షాహిర్ నటిస్తున్నట్లుగా ఇప్పటికే చిత్రబృందం ప్రకటించింది. తాజాగా ఈ చిత్రంలో ప్రీతి పాత్రలో శ్రుతీహాసన్ నటిస్తున్నట్లుగా వెల్లడించి, ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. 'కూలీ' చిత్రం 2025లో రిలీజ్ కానుంది.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
231	84
82,366	25,236

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	17,581	▲ 64
డోజోన్స్	41,235	▽ 100
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,377	▽ 3
డాక్స్	18,907	▽ 6
షాంఘై	2,842	▽ 19
నికాయ్	38,648	▽ 285

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై


బంగారం (99.9 స్వచ్ఛత)	71,958 ▽	43
బంగారం (99.5 స్వచ్ఛత)	71,670 ▽	43
వెండి (కిలో)	85,019 ▽	53

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	83.44	84.46
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	109.21	111.82
€	యూరో	ఒకటి	91.78	94.17
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	57.34	58.65
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	56.13	58.08
S$	సింగపూర్ డాలర్	ఇంటర్‌బ్యాంక్	62.09	66.57
SAR	సౌదీ రియాల్	ఇంటర్‌బ్యాంక్	21.46	22.97
UAE D	యూఏఈ దిర్హామ్	ఇంటర్‌బ్యాంక్	21.95	23.64
¥	చైనా యువాన్	ఇంటర్‌బ్యాంక్	10.89	12.71

ఎకానమీ జోరుకు బ్రేకులు!

- ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో జీడీపీ వృద్ధి 6.7%
- 15 నెలల కనిష్ట స్థాయి ఇది..
- వ్యవసాయం, సేవా రంగాల పేలవ పనితీరు
- 2023 ఇదే కాలంలో వృద్ధి రేటు 8.2 శాతం



న్యూఢిల్లీ: భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు ఏప్రిల్–జూన్ త్రైమాసికం (క్యూ1)లో 6.7 శాతంగా నమోదయ్యింది. గడచిన 15 నెలల కాలంలో ఇంత తక్కువ వృద్ధి రేటు నమోదుకావడం ఇదే తొలిసారి. 2023 జనవరి–మార్చి త్రైమాసికంలో ఎకానమీ 6.2 శాతం వృద్ధి రేటును నమోదుచేసుకుంది. వ్యవసాయం, సేవా రంగాల పేలవ పనితీరు తాజా లెక్కలపై ప్రభావం చూపినట్లు జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) డేటా పేర్కొంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో దేశ వృద్ధి రేటు 8.2 శాతం. తాజా సమీక్షా కాలానికి ముందు త్రైమాసికంలో (జనవరి–మార్చి) రేటు 7.8 శాతం.

6.7 శాతం వృద్ధి ఎలా అంటే..

2024–25 తొలి త్రైమాసికంలో 2011–12 స్థిర ధరల ప్రాతిపదికన ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుని మదింపుచేసే జీడీపీ విలువ రూ.43.64 లక్షల కోట్లు. 2023–24 ఇదే కాలంలో ఇది రూ.40.91 లక్షల కోట్లు. అంటే వృద్ధి రేటు 6.7 శాతమన్నమాట. ద్రవ్యోల్బణాన్ని ప్రాతిపదికకాకుండా, ప్రస్తుత ధరల ప్రకారం పరిశీలిస్తే, 2023 ఏప్రిల్–జూన్ మధ్య జీడీపీ విలువ 9.7 శాతం వృద్ధితో రూ.70.50 లక్షల కోట్ల నుంచి రూ.77.31 లక్షల కోట్లకు ఎగసింది.

వివిధ రంగాల తీరిది...

వ్యవసాయం: 2023–24 తొలి త్రైమాసికంలో వృద్ధి రేటు 3.7 శాతం. తాజా సమీక్షా కాలంలో ఈ రేటు 2 శాతానికి తగ్గింది.

ఫైనాన్షియల్, రియల్టీ, ప్రొఫెషనల్ సేవలు: వృద్ధి 12.6% నుంచి 7.1 శాతానికి డౌన్.

మైనింగ్, క్వారీయింగ్: వృద్ధి రేటు 7% నుంచి 7.2%కి పెరుగుదల.

తయారీ: 5% నుంచి 7%కి వృద్ధి అప్.

ఎలక్ట్రిసిటీ, గ్యాస్, నీటి సరఫరా, ఇతర యుటిలిటీ సేవలు: 3.2% వృద్ధి రేటు 10.4 %కి పురోగతి.

నిర్మాణం: 2023 క్యూ1లో వృద్ధి రేటు 8.6 %కాగా, తాజా సమీక్షా కాలంలో ఈ రేటు 10.5 శాతానికి ఎగసింది.

పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, రక్షణ, ఇతర సేవలు: వృద్ధి రేటు 8.3శాతం నుంచి 9.5 శాతానికి పెరిగింది.

వాణిజ్యం, హోటల్స్, రవాణా, కమ్యూనికేషన్ సేవలు: వృద్ధి రేటు 9.7శాతం నుంచి 5.7 శాతానికితగ్గింది.

'వృద్ధి వేగంలో టాప్' ట్యాగ్ యథాతథం

ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో చైనా వృద్ధి రేటు 4.7 శాతంగా నమోదయ్యింది. ఈ కాలంలో ప్రపంచంలోనే మరేదేశమూ 6.7 శాతం వృద్ధి రేటును అందుకోలేకపోవడంతో, ప్రపంచంలో వేగవంతమైన వృద్ధి రేటు విషయంలో భారత్ తన ప్రత్యేకతను నిలబెట్టుకున్నట్లయ్యింది.

జీవీఏ వృద్ధి 6.8 శాతం

ఉత్పత్తికి సంబంధించిన వ్యయాలను పరిగణనలోకి తీసుకోకుండా లెక్కించే స్థూల విలువ జోడింపు (జీవీఏ) వృద్ధి రేటు 2023–24 చివరి త్రైమాసికంలో 6.3 శాతంగా నమోదయితే, 2024–25 మొదటి త్రైమాసికంలో అరశాతం పెరిగి 6.8 శాతంగా నమోదయ్యింది. వార్షికంగా చూస్తే జీవీఏ విలువ రూ.38.12 లక్షల కోట్ల నుంచి రూ.40.73 లక్షల కోట్లకు ఎగసింది. ఇది 6.8 శాతం వృద్ధి రేటుకాగా, గత ఏడాది ఇదే కాలంలో ఈ రేటు 8.3 శాతం. వివిధ రంగాల వృద్ధి తీరును స్థూలంగా జీవీఏ ప్రాతిపదికన పరిశీలిస్తారు.

నిఫ్టీ 'వరుస లాభాల' రికార్డు

- సెన్సెక్స్ తొమ్మిదో రోజూ లాభాలే
- ఇంట్రాడే, ముగింపుల్లోనూ కొత్త గరిష్టాలు
- 9 రోజుల్లో 10 లక్షల కోట్ల సంపద



ముంబై: అంతర్జాతీయ సానుకూల సంకేతాలు, విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లతో స్టాక్ సూచీల రికార్డుల ర్యాలీ శుక్రవారం కూడా కొనసాగింది. ఫైనాన్స్, ఐటీ, ఫార్మా, యుటిలిటీ షేర్లకు భారీ డిమాండ్ నెలకొంది. అధిక వెయిటేజీ షేర్లు భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీ బ్యాంకు, ఇన్ఫోసిస్ సూచీల ర్యాలీకి దన్నుగా నిలిచాయి. 1996లో ఎన్ఎస్ఈ ప్రారంభం తర్వాత 12 రోజులు వరుసగా లాభాలు గడించిన నిఫ్టీ 84 పాయింట్లు పెరిగి జీవితకాల గరిష్ట స్థాయి 25,236 వద్ద స్థిరపడింది. ఒక దశలో 116 పాయింట్లు బలపడి 25,268 వద్ద కొత్త ఆల్‌టైం హైని తాకింది. సెన్సెక్స్ 502 పాయింట్ల లాభంతో జీవితకాల గరిష్టం వద్ద మొదలైంది. చివరికి 231 పాయింట్ల లాభంతో 82,366 సరికొత్త రికార్డు స్థాయి వద్ద ముగిసింది. ఈ సూచీకిది తొమ్మిదో రోజు లాభాల ముగింపు. ఎఫ్ఎంసీజీ మెటల్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపు అంచనాలతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- గడిచిన తొమ్మిది రోజుల్లో సెన్సెక్స్ 1,941 పాయింట్లు(2.41%) పెరగడంతో బీఎస్ఈలో 10 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.464.39 లక్షల కోట్ల(5.54 ట్రిలియన్ డాలర్లు)కు చేరింది. శుక్రవారం ఒక్కరోజే రూ.1.85 లక్షల కోట్లు ఇన్వెస్టర్ల సొంతమయ్యాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
ఫిన్‌టెక్ ప్రోత్సాహానికి పాలసీల్లో మార్పులు | అదానీ పోర్ట్స్ చేతికి ఆస్ట్రో ఆఫ్‌షోర్

టాటా.. గుడ్‌బై.. విస్తారా



ఇక కనుమరుగు..

- నవంబర్ 12 నుంచి ఎయిరిండియాలో విలీనం
- సెప్టెంబర్ 3 నుంచి బుకింగ్స్ నిలిపివేత
- ఎస్ఐఏ రూ. 2,058 కోట్ల ఎఫ్‌డీఐకి గ్రీన్ సిగ్నల్ ..

న్యూఢిల్లీ: పదేళ్లుగా కార్యకలాపాలు సాగిస్తున్న విమానయాన సంస్థ విస్తారా ఇక కనుమరుగు కానుంది. నవంబర్ 12 నుంచి టాటా గ్రూప్‌లో భాగమైన మరో సంస్థ ఎయిరిండియాలో విలీనం కానుంది. విస్తారా సేవల నిలిపివేతకు నవంబర్ 11 ఆఖరు తేదీగా నిర్ణయించారు. నవంబర్ 12 నుంచి సంస్థ విమానాలు, సిబ్బంది ఎయిరిండియాకు బదిలీ అవుతారని కంపెనీ సీఈవో, ఎండీ క్యాంప్‌బెల్ విల్సన్ తెలిపారు. నవంబర్ 12 లేదా ఆ తర్వాత చేసే ప్రయాణాలకు సంబంధించి సెప్టెంబర్ 3 నుంచి బుకింగ్స్ నిలిచిపోతాయని విస్తారా ఒక ప్రకటనలో తెలిపింది. ఆ తర్వాత నుంచి తమ వెబ్‌సైట్లో బుకింగ్స్ అన్ని ఎయిరిండియా సైటుకు రీడైరెక్ట్ అవుతాయని పేర్కొంది. నవంబర్ 12 తర్వాత ప్రయాణాలకు బుక్ చేసుకున్నవారి ఫ్లయిట్ నంబర్లను సెప్టెంబర్‌లో దశలవారీగా ఆటోమేటిక్‌గా ఎయిరిండియాకు మారుస్తారు. కస్టమర్లకు ఆ వివరాలు తెలియజేస్తారు. మరింత విస్తృత నెట్‌వర్క్, విమానాలతో మెరుగైన ప్రయాణ అనుభూతిని అందించేందుకు ఈ విలీనం తోడ్పడగలదని విస్తారా సీఈవో వినోద్ కణ్ణన్ తెలిపారు.

ఎయిరిండియాలో ఎస్ఐఏకి 25.1 శాతం వాటా..

విలీన డీల్‌లో భాగంగా ఎయిరిండియాలో రూ. 2,058.50 కోట్ల మేర సింగపూర్ ఎయిర్‌లైన్స్ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) పెట్టే ప్రతిపాదనకు శుక్రవారం కేంద్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. దీనితో విలీనానికి మార్గం సుగమమైందని, ఈ ఏడాది ఆఖరు నాటికి ప్రక్రియ పూర్తి కావచ్చని సింగపూర్ ఎయిర్‌లైన్స్ తెలిపింది. విలీనానంతరం ఎయిరిండియాలో సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కి 25.1 శాతం వాటా లభిస్తుంది.


ఫిట్‌మెంట్ ప్రక్రియ ప్రారంభం..

ఎయిరిండియా, విస్తారా విలీన ప్రక్రియపై ప్యాసింజర్లకు స్పష్టతనిచ్చేందుకు ఇప్పటికే ఎఫ్ఏక్యూలను (సందేహాలు, సమాధానాలు) సిద్ధం చేశారు. అలాగే ఫిట్‌మెంట్ ప్రక్రియను కూడా ప్రారంభించారు. టాటా గ్రూప్, సింగపూర్ ఎయిర్‌లైన్స్ జాయింట్ వెంచర్‌గా విస్తారా 2015 జనవరిలో కార్యకలాపాలు ప్రారంభించింది. విస్తారాకు 70 విమానాలు ఉండగా, 50 పైచిలుకు గమ్యస్థానాలకు సర్వీసులు నిర్వహిస్తోంది. ఎయిరిండియాలో కంపెనీ విలీనాన్ని 2022 నవంబర్‌లో ప్రకటించారు. 2023 సెప్టెంబర్‌లో ఈ డీల్‌కు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆమోదం తెలిపింది. నష్టాల్లోనే కొనసాగుతున్న ఎయిరిండియా, విస్తారాలో 23,000 మంది పైగా ఉద్యోగులు ఉన్నారు. ప్రస్తుతం ఎయిరిండియా గ్రూప్ గొడుగు కింద ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, ఏఐఎక్స్ కనెక్ట్ (గతంలో ఎయిర్ ఏషియా ఇండియా) కార్యకలాపాలు సాగిస్తున్నాయి.

రిలయన్స్, డిస్నీ డీల్‌కు ఎన్‌సీఎల్‌టీ ఓకే



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్ఐఎల్), మీడియా దిగ్గజం వాల్ట్ డిస్నీ మధ్య విలీనానికి తాజాగా జాతీయ కంపెనీ చట్ట ట్రిబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ), ముంబై బెంచ్ ఆమోద ముద్ర వేసింది. వెరసి ఆర్ఐఎల్ మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ విభాగాలు(వయాకామ్18, డిజిటల్18), వాల్ట్ డిస్నీకి చెందిన స్టార్ ఇండియా మధ్య విలీన పథకానికి గ్రీన్‌సిగ్నల్ లభించింది. ఇప్పటికే ఈ డీల్‌కు కొన్ని స్వచ్ఛంద సవరణల తదుపరి కాంపిటీషన్ కమిషన్(సీసీఐ) అనుమతించిన సంగతి తెలిసిందే. దీంతో దేశీయంగా రూ. 70,000 కోట్ల విలువైన అతిపెద్ద మీడియా దిగ్గజం ఆవిర్భావానికి మరింత దారి ఏర్పడింది. తమ పరిశీలన ప్రకారం విలీన పథకం సక్రమంగానే ఉన్నట్లు ఎన్‌సీఎల్‌టీ పేర్కొంది. అను జగ్‌మోహన్ సింగ్ (మెంబర్, టెక్నికల్), కిషోర్ వేములపల్లి (మెంబర్, జ్యుడీషియల్)లతో కూడిన బెంచ్ తాజా ఆదేశాలు జారీ చేసింది. ఎలాంటి నిబంధనల ఉల్లంఘన లేకపోవడంతోపాటు ప్రజావిధానాలకు వ్యతిరేకంగా లేదని అభిప్రాయపడ్డారు. ఈ భాగస్వామ్య కంపెనీ(విలీన సంస్థ) రెండు ఓటీటీలతోపాటు 120 టీవీ చానళ్లను కలిగి ఉండనుంది. ఆర్ఐఎల్‌కు 63.16 శాతం వాటా లభించనుండగా.. వాల్ట్ డిస్నీ 36.84 శాతం వాటాను పొందనుంది. మీడియా దిగ్గజాలు సోనీ, నెట్‌ఫ్లిక్స్‌తో మరింత తీవ్రస్థాయిలో పోటీకి దిగేందుకు వీలుగా ఆర్ఐఎల్ దాదాపు రూ. 11,500 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది.



పారిస్ పారాలింపిక్స్‌లో నేటి భారత షెడ్యూల్

షూటింగ్: పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ స్టాండింగ్ ఎస్‌హెచ్1 (క్వాలిఫికేషన్): స్వరూప్ (మధ్యాహ్నం గం. 1:00 నుంచి), మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఎస్‌ఎమ్‌హెచ్1 (క్వాలిఫికేషన్): రుబీనా (మధ్యాహ్నం గం. 3:30 నుంచి).

ట్రాక్ సైక్లింగ్: మహిళల 500 మీటర్ల టైమ్ ట్రయల్ సీ1–3 (క్వాలిఫయింగ్): జ్యోతి (మ. గం. 1:30 నుంచి). పురుషుల 1000 మీటర్ల టైమ్ ట్రయల్ సీ1–3 (క్వాలిఫయింగ్) అర్షద్ షేక్ (మధ్యాహ్నం గం. 1:49 నుంచి).

ఆర్చరీ: మహిళల కాంపౌండ్ (ఎలిమినేషన్): సరితా దేవి X ఎలినోరా సార్టీ (ఇటలీ) (రాత్రి గం. 7:00 నుంచి), మహిళల కాంపౌండ్ (ఎలిమినేషన్): శీతల్ దేవి – మిరియానా జునీగా (చిలీ) (రాత్రి గం. 8:59 నుంచి).

అథ్లెటిక్స్: పురుషుల జావెలిన్ త్రో ఎఫ్57 (పతక పోరు): ప్రవీణ్ కుమార్ (రాత్రి గం. 10:30 నుంచి).

పారాలింపిక్స్‌లో భారత క్రీడాకారుల జోరు మొదలైంది. పోటీల రెండో రోజే మన ఖాతాలో నాలుగు పతకాలు చేరడం విశేషం. షూటింగ్‌లో అవని లేఖరా తనపై ఉన్న అంచనాలను నిలబెట్టుకుంటూ స్వర్ణ పతకంతో మెరిసింది. అదే ఈవెంట్‌లో మోనా అగర్వాల్‌కు కాంస్య పతకం దక్కింది. వీటితో పాటు పురుషుల షూటింగ్‌లో మనీశ్ నర్వాల్ రజతాన్ని గెలుచుకోగా... స్ప్రింట్‌లో ప్రీతి పాల్ కూడా కాంస్య పతకాన్ని అందించింది. అయితే అన్నింటికి మించి గత టోక్యో ఒలింపిక్స్‌లో సాధించిన స్వర్ణాన్ని నిలబెట్టుకున్న అవని లేఖరా ప్రదర్శనే హైలైట్‌గా నిలిచింది.



అవని అద్వితీయం

వరుసగా రెండో పారాలింపిక్స్‌లో స్వర్ణం సాధించిన షూటర్ అవని లేఖరా

- ఈ ఘనత సాధించిన తొలి భారత మహిళగా గుర్తింపు
- భారత్‌కు ఒకే రోజు 4 పతకాలు





పారిస్: పారాలింపిక్స్ చరిత్రలో భారత్‌కు ఒకే ఈవెంట్‌లో తొలిసారి రెండు పతకాలు దక్కాయి. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ స్టాండింగ్ ఎస్‌హెచ్1 ఈవెంట్‌లో అవని లేఖరా స్వర్ణ పతకం సొంతం చేసుకుంది. అవని 249.7 పాయింట్లు స్కోరు చేసి అగ్ర స్థానంలో నిలిచింది. జైపూర్‌కు చెందిన 22 ఏళ్ల అవని టోక్యోలో మూడేళ్ల క్రితం జరిగిన ఒలింపిక్స్‌లోనూ పసిడి పతకం గెలుచుకుంది. ఈ క్రమంలో గత ఒలింపిక్స్‌లో తాను నమోదు చేసిన 249.6 పాయింట్ల స్కోరును కూడా అవని సవరించింది. ఈ ఈవెంట్‌లో దక్షిణ కొరియాకు చెందిన యున్రీ లీ (246.8 పాయింట్లు) రెండో స్థానంలో నిలిచి రజత పతకం గెలుచుకోగా... భారత్‌కే చెందిన మోనా అగర్వాల్ (228.7 పాయింట్లు) కాంస్య పతకం సాధించింది. నడుము కింది భాగంలో శరీరాంగాలు పూర్తి స్థాయిలో పని చేయకుండా ఉండే అథ్లెట్లను ఎస్‌హెచ్1 కేటగిరీలో పోటీ పడేందుకు పారాలింపిక్స్‌లో అనుమతిస్తారు. 'బరిలోకి దిగినప్పుడు ఫలితం గురించి ఎక్కువగా ఆలోచించలేదు. ఆటపై దృష్టి పెట్టడమే తప్ప ఇతర విషయాలను పట్టించుకోలేదు. టాప్–3లో నిలిచిన ముగ్గురు షూటర్ల మధ్య వ్యత్యాసం చాలా తక్కువ. పసిడి పతకం రావడం చాలా సంతోషాన్నిచ్చింది. ఇక్కడ భారత జాతీయ గీతం వినిపించడం గొప్పగా అనిపిస్తోంది. మరో రెండు ఈవెంట్లలో కూడా పతకాలు గెలుచుకునేందుకు ప్రయత్నిస్తా' అని అవని లేఖరా చెప్పింది. అవని సహచర్యం వల్లే తాను ఆటలో ఎంతో నేర్చుకోగలిగానని, ఆమె వల్లే ఇక్కడా స్ఫూర్తి పొంది పతకం సాధించానని 37 ఏళ్ల మోనా అగర్వాల్ వెల్లడించింది. 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ ఈవెంట్‌లో కూడా అవని తలపడనుంది.



మనీశ్ నర్వాల్‌కు రజతం...

పురుషుల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో 22 ఏళ్ల మనీశ్ నర్వాల్ కూడా పతకంతో మెరిశాడు. అయితే గత ఒలింపిక్స్‌లో స్వర్ణం గెలుచుకున్న మనీశ్ ఈసారి రజత పతకానికే పరిమితమయ్యాడు. పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఎస్‌హెచ్1లో మనీశ్ రెండో స్థానంలో నిలిచాడు. మనీశ్ మొత్తం 234.9 పాయింట్లు సాధించాడు. ఫైనల్లో ఒకదశలో మెరుగైన ప్రదర్శనతో అగ్రస్థానంలో కొనసాగిన ఈ షూటర్ ఆ తర్వాత వరుస వైఫల్యాలతో వెనుకబడిపోయాడు. ఈ పోరులో జెంగ్దూ జో (కొరియా; 237.4 పాయింట్లు) స్వర్ణ పతకం గెలుచుకోగా... చావో యాంగ్ (చైనా; 214.3)కు కాంస్యం లభించింది.

కంచు మోగించిన ప్రీతి పాల్...




పారాలింపిక్స్ చరిత్రలో భారత్ తరపున ట్రాక్ ఈవెంట్‌లో ప్రీత్ పాల్ తొలి పతకాన్ని అందించింది. మహిళల 100 మీటర్ల టి–35 పరుగులో ప్రీతికి కాంస్యం లభించింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన 23 ఏళ్ల ప్రీతి రేసును 14.21 సెకన్లలో పూర్తి చేసింది. ఈ క్రమంలో తన వ్యక్తిగత అత్యుత్తమ టైమింగ్‌ను నమోదు చేసి మూడో స్థానంలో నిలిచింది. 1984 నుంచి పారాలింపిక్స్ అథ్లెటిక్స్‌లో భారత్‌కు అన్ని పతకాలు ఫీల్డ్ ఈవెంట్లలోనే వచ్చాయి. ఇటీవలే ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో కాంస్యం సాధించిన అనంతరం ప్రీతి ఒలింపిక్స్‌లోకి అడుగు పెట్టింది. ఆమెకు ఇవే తొలి పారాలింపిక్స్.

సెమీస్‌లో సుహాస్, నితీశ్...

పారా బ్యాడ్మింటన్‌లో సుహాస్ యతిరాజ్, నితీశ్ కుమార్ సెమీఫైనల్లోకి ప్రవేశించగా... మనోజ్ సర్కార్, మానసి జోషి నిష్క్రమించారు. టోక్యో ఒలింపిక్స్ రజత పతక విజేత సుహాస్ (ఎస్ఎల్4 ఈవెంట్) 26–24, 21–14తో షియాన్ క్యూంగ్ (కొరియా)పై నెగ్గగా... నితీశ్ (ఎస్ఎల్3 ఈవెంట్) 21–5, 21–11తో యాంగ్ జియాన్‌యువాన్ (చైనా)ను చిత్తు చేశాడు. 2019 వరల్డ్ చాంపియన్ మానసి జోషి (ఎస్ఎల్3) 21–10, 15–21, 21–23తో ఒక్సానా కొజినా (ఉక్రెయిన్) చేతిలో... గత ఒలింపిక్స్ కాంస్యపతక విజేత మనోజ్ 19–21, 8–21తో బున్సున్ (థాయిలాండ్) చేతిలో ఓడారు. టేబుల్ టెన్నిస్ మహిళల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో భారత ద్వయం భవీనా–సోనాలీబెన్ పటేల్ 5–11, 6–11, 11–9, 6–11 స్కోరుతో యంగ్ జుంగ్–సుంగ్యా మూన్ (కొరియా) చేతిలో ఓటమి పాలయ్యారు.

ప్రిక్వార్టర్స్‌లో రాకేశ్

మరోవైపు ఆర్చరీలో పురుషుల కాంపౌండ్ ఓపెన్ ఈవెంట్‌లో రాకేశ్ కుమార్ తొలి రౌండ్‌లో 136–131తో ఆలియా డ్రేమ్ (సెనెగల్)ను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరాడు. పురుషుల సైక్లింగ్ పర్స్యూట్ సీ2 కేటగిరీలో భారత ఆటగాడు అర్షద్ షేక్ తొమ్మిదో స్థానంలో నిలిచి నిష్క్రమించాడు.



అల్‌కరాజ్ అవుట్

ప్రపంచ మూడో ర్యాంకర్‌ను ఓడించిన నెదర్లాండ్స్ ప్లేయర్ బోటిక్



న్యూయార్క్: యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో శుక్రవారం పెను సంచలనం నమోదైంది. పురుషుల సింగిల్స్ విభాగంలో 2022 చాంపియన్, టైటిల్ ఫేవరెట్స్‌లో ఒకడైన కార్లోస్ అల్‌కరాజ్ రెండో రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టాడు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో మూడో స్థానంలో ఉన్న అల్‌కరాజ్‌ను నెదర్లాండ్స్‌కు చెందిన ప్రపంచ 74వ ర్యాంకర్ బోటిక్ వాన్ డె జాండ్‌షుల్ప్ వరుస సెట్లలో ఓడించి తన కెరీర్‌లోనే చిరస్మరణీయ విజయం సాధించాడు. 2 గంటల 19 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోటిక్ 6–1, 7–5, 6–4తో మూడో సీడ్ అల్‌కరాజ్‌ను ఓడించి మూడో రౌండ్‌లోకి దూసుకెళ్లాడు. యూఎస్ ఓపెన్‌లో అల్‌కరాజ్ రెండో రౌండ్‌లోనే ఓడిపోవడం ఇదే ప్రథమం. 2021లో క్వార్టర్ ఫైనల్ చేరిన అతను, 2022లో ఏకంగా విజేతగా అవతరించాడు. 2023లో అల్‌కరాజ్ సెమీఫైనల్లో నిష్క్రమించాడు. అల్‌కరాజ్‌తో మ్యాచ్‌లో బోటిక్ ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేశాడు. 22 విన్నర్స్ కొట్టిన బోటిక్ 21 అనవసర తప్పిదాలు చేశాడు. మరోవైపు అల్‌కరాజ్ 27 అనవసర తప్పిదాలు చేశాడు. ఐదో సీడ్ మెద్వెదెవ్ (రష్యా), పదో సీడ్ డిమినార్ (ఆస్ట్రేలియా) మూడో రౌండ్‌లోకి ప్రవేశించగా... 16వ సీడ్ సెబాస్టియన్ కోర్డా (అమెరికా) రెండో రౌండ్‌లోనే వెనుదిరిగాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



బెలూగా.. భలేగా..


శంషాబాద్‌కు ప్రపంచంలోని అతిపెద్ద కార్గో విమానాల్లో ఒకటైన ఎయిర్‌బస్ బెలూగా

శంషాబాద్: ఆకాశ తిమింగలంగా పేరొందిన ప్రపంచంలోని అతిపెద్ద కార్గో విమానాల్లో ఒకటైన ఎయిర్‌బస్ బెలూగా (ఏ300–608ఎస్‌టీ3) మరోసారి భాగ్యనగరాన్ని పలకరించింది. గురువారం అర్ధరాత్రి 12:23 గంటలకు ముచ్చటగా మూడోసారి శంషాబాద్ విమానాశ్రయంలో ల్యాండ్ అయింది. ఈ నెల 27న ఫ్రాన్స్‌లోని టూలూజ్ నుంచి థాయ్‌లాండ్ వెళ్లేందుకు బయలుదేరిన ఈ విమానం 28న ఫ్రాన్స్‌లోని మార్సెల్లే, 29న ఈజిప్టు రాజధాని కైరో, ఒమన్ రాజధాని మస్కట్ మీదుగా ప్రయాణించి ఇంధనం నింపుకోవడంతోపాటు సిబ్బంది విశ్రాంతి కోసం హైదరాబాద్ చేరుకుంది. దాదాపు 15 గంటల హోల్డింగ్ అనంతరం శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు థాయ్‌లాండ్ బయలుదేరింది. బెలూగా–3 విమానం 2022 డిసెంబర్‌లో తొలిసారి, 2023 ఆగస్టులో రెండోసారి శంషాబాద్ విమానాశ్రయంలో ల్యాండైంది.

ప్రత్యేకతలు ఇవీ..

రష్యన్ భాషలో బెలూగా అంటే తెల్ల తిమింగలం అని అర్థం. ప్రపంచవ్యాప్తంగా ఈ రకం విమానాలు కేవలం ఐదే ఉన్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద కార్గో విమానమైన అంటోనోవ్–225కన్నా ఇది 20 మీటర్లు చిన్నగా ఉంటుంది. సాధారణ కార్గో విమానాల్లో తరలించలేని భారీ సామగ్రిని ప్రత్యేకించి విమానాల విడిభాగాలు, రక్షణ రంగ పరికరాలను ఈ విమానంలో తరలిస్తారు. దీని పొడవు పొడవు 56.15 మీటర్లు, ఎత్తు 17.24 మీటర్లు, కార్గో మోసుకెళ్లే సామర్థ్యం 47 టన్నులు.

టుడేస్ గ్రాఫిక్



వరంగల్ చెరువులపై డ్రోన్ల చక్కర్లు!

• లైడర్ సర్వేకు సిద్ధమైన ప్రభుత్వం

సాక్షి, వరంగల్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 75 చెరువులపై లైడర్ (లైట్ డిటెక్షన్ అండ్ రేజింగ్) సర్వే చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇరిగేషన్ అండ్ కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ (సీఏడీ) విభాగ అధికారులు నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సీ) సహకారంతో వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని చెరువుల విస్తీర్ణం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ ఎంత, ప్రస్తుతం ఏమేర ఉన్నాయి, ఎంతవరకు ఆక్రమణకు గురయ్యాయి అనే వివరాలు లైడర్ ద్వారా సేకరించిన సమాచారంతో పోల్చి చూస్తారు. డ్రోన్లు వినియోగించి చెరువుల కొలతలు తీస్తారు. అదే సమయంలో రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు నిర్ణయించిన ఎఫ్‌టీఎల్‌తో కూడా సరిపోలుస్తారు. ఇలా అధ్యయనం చేసిన తర్వాత ఆక్రమణలపై ఉక్కుపాదం మోపే యోచనలో ప్రభుత్వం ఉంది. హైడ్రా తరహాలో ఇక్కడా కూడా ఓ వ్యవస్థను ఏర్పాటు చేసే అవకాశాలున్నాయి.

గోండ్వానా టు ఆస్ట్రేలియా.. వయా ఇండియా!

• పురాతన జీవరాశులు తరలిపోయిన క్రమాన్ని తేల్చిన సీసీఎంబీ శాస్త్రవేత్త జాహ్నవి జోషి
• నాటి కాలం నుంచే మన దేశంలో జీవ వైవిధ్యం ఉన్నట్టు గుర్తింపు


స్కటీగెరో మోర్ఫా

సాక్షి, హైదరాబాద్: ఎక్కడో వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆస్ట్రేలియాకు మన దేశం నుంచి జీవజాతులు తరలిపోయినట్టు 'సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ)' శాస్త్రవేత్త జాహ్నవి జోషి తేల్చారు. మన దేశంలో కోట్ల ఏళ్ల కిందటి నుంచే జీవ వైవిధ్యం ఉందనే ఆధారాలను గుర్తించారు. నిజానికి ఇప్పుడు భూమి ఎన్నో ఖండాలుగా విడిపోయి ఉన్నా.. ఒకప్పుడు 'గోండ్వానా'గా పిలిచే ఒకే మహా ఖండంగా ఉండేవి. ఇరవై కోట్ల ఏళ్ల క్రితం విడిపోవడం మొదలై.. ఇప్పుడున్నట్టుగా ఏర్పడ్డాయి. ఈ క్రమంలో మన పశ్చిమ, తూర్పు కనుమల్లోని విభిన్న జీవరాశులపై జాహ్నవి జోషి పరిశోధన చేశారు. అవి గోండ్వానా కాలం నాటివా? ఇక్కడే పరిణామం చెందాయా? అన్నది పరిశీలించారు. ఇందుకోసం గొంగడి పురుగులాంటి 'స్కటీగెరోమోర్ఫా'లపై అధ్యయనం చేసి.. అది గోండ్వానా కాలం నాటి నుంచీ ఉన్నదేనని తేల్చారు. అంతేగాకుండా వీటి జన్యుక్రమాన్ని ప్రపంచవ్యాప్తంగా ఇతర ప్రాంతాల్లోని 'స్కటీగెరో మోర్ఫా' జాతి పురుగుల డీఎన్ఏతో సరిపోల్చి ఆసక్తికర అంశాన్ని గుర్తించారు. ''ఆఫ్రికా ఖండం నుంచి ఆరున్నర కోట్ల ఏళ్ల క్రితం భారత భూభాగం విడిపోయినప్పటి ప్రభావంతో ఇక్కడ జీవ వైవిధ్యం ఏర్పడిందని భావించేవారు. కానీ కొన్ని జీవజాతులు అంతకంటే ముందే.. అంటే గోండ్వానా మహాఖండం కాలం నాటివని మా అధ్యయనంలో తేలింది''అని జాహ్నవి జోషి, మరో శాస్త్రవేత్త మాయా మణివణ్ణన్ వెల్లడించారు.

మన వద్ద నుంచే ఆస్ట్రేలియాకు..

ప్రస్తుతం ఆస్ట్రేలియాలో జీవిస్తున్న 'స్కటీగెరో మోర్ఫా'జాతి పురుగులు సుమారు పది కోట్ల ఏళ్ల కింద భారత్‌లోని జీవజాతుల నుంచి విడిపడి ఉంటాయని గుర్తించినట్టు శాస్త్రవేత్త మాయా మణివణ్ణన్ తెలిపారు. ''ఇండియా – ఆస్ట్రేలియా మధ్య జీవజాతుల సంబంధం వివరాలు మనకు చాలా తక్కువగా తెలుసు. పదమూడు కోట్ల ఏళ్ల క్రితం వరకూ ఇవి కలిసే ఉండేవి. ఇప్పుడు వీటి మధ్య వేల కిలోమీటర్ల దూరం ఉంది. ఈ 'స్కటీగెరోమోర్ఫా'గోండ్వానా నుంచి భారత్ మీదుగా ఆస్ట్రేలియాకు వెళ్లి ఉండవచ్చు''అని పేర్కొన్నారు.

సామూహిక వరలక్ష్మి వ్రతాలు



యాదగిరిగుట్ట రూరల్ : శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతాలు ఘనంగా నిర్వహించారు. సుమారు 200 మంది మహిళలు వ్రతాలు ఆచరించారు. అమ్మవారికి షోడశోపచార పూజలు చేసి వాయినాలు ఇచ్చుకున్నారు. అర్చకులు మహిళలందరితో వేర్వేరుగా కలశస్థాపన పూజ చేయించారు. వ్రతకథను పఠించి వ్రత మహిమ విశిష్టతను వివరించారు. అంతకుముందు దేవస్థానం ఈవో భాస్కర్‌రావు, ధర్మకర్త నరసింహమూర్తిస్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి వ్రతాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులు దోర్బాల భాస్కర్, హరికిషన్, నటరాజ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పాత పింఛను విధానమే కావాలి

• తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులందరికీ పాత పింఛను విధానాన్నే అమలు చేయాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి డిమాండ్ చేశారు. ఏకీకృత పింఛను (యూపీఎస్), కంట్రిబ్యూటరీ పింఛను (సీపీఎస్)లలో ఏదీ ఉద్యోగులకు ఆమోదయోగ్యంకాదని, తమ విశ్రాంత జీవితానికి భరోసా కల్పించే పాత పింఛను విధానాన్నే అమల్లోకి తేవాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం జేఏసీలోని వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలతో ఆయన సమావేశమయ్యారు. జేఏసీ భవిష్యత్‌కార్యాచరణ, విస్తరణ తదితర అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ...సెప్టెంబర్1 నుంచి ఐదో తేదీ వరకు రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సంఘాల నేతలతో సమావేశమవుతామని చెప్పారు. పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని కోరుతూ శనివారం ప్రజాభవన్‌కు వెళ్లి ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డిని జేఏసీ ప్రతినిధి బృందం కలసి వినతిపత్రం అందజేస్తామని వెల్లడించారు. సమావేశంలో పలు సంఘాల నేతలు రాములు, కె.రామకృష్ణ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

చెవిలో పూలు పెట్టుకుని..

రుణమాఫీ చేయలేదని రైతు వినూత్న నిరసన



మెట్‌పల్లి రూరల్ (కోరుట్ల): రుణమాఫీ చేయనందుకు ఒక రైతు వినూత్నంగా నిరసన తెలిపారు. చెవిలో పూలు పెట్టుకుని అధికారులకు ధ్రువపత్రాలు అందజేశారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం వెల్లులలో వ్యవసాయధికారులు శుక్రవారం రైతు కుటుంబ సభ్యుల నిర్ధారణ సర్వే నిర్వహించారు. ఇందులో భాగంగా రుణమాఫీ కానీ రైతుల నుంచి ఆధార్, ఇతర ధ్రువపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రైతు మారు మురళీధర్ రెడ్డి చెవిలో పూలు పెట్టుకొచ్చి.. తన కుటుంబసభ్యుల ధ్రువపత్రాలను అధికారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం వద్ద రైతులకు సంబంధించి పూర్తి వివరాలున్నా రూ.2 లక్షల రుణమాఫీ చేయడం లేదని విమర్శించారు. షరతులు లేకుండా తక్షణమే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

అలా చేస్తేనే మానవ అక్రమ రవాణాకు చెక్

• ఉమ్మడి వ్యూహాలతో అరికట్టాలి
• బాధితులకు తగిన సాయం అందించాలి
• మహిళా భద్రత విభాగం డీజీ శిఖాగోయల్



సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి వ్యూహాలు, అన్ని భాగస్వామ్య పక్షాల పరస్పర సహకారంతోనే మానవ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయవచ్చని మహిళా భద్రత విభాగం డీజీ శిఖాగోయల్ అన్నారు. ఇందుకు అవసరమైన పరిశోధన, సమాచార విశ్లేషణ జరగాలని, మానవ అక్రమ రవాణాకు గురైన బాధితులకు తగిన సహాయం అందించే వ్యవస్థలను ఏర్పాటు చేయాలని శిఖాగోయల్ తోపాటు సదస్సులో పాల్గొన్న ఇతర వక్తలు అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ మహిళా భద్రత విభాగం, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ (ఐజేఎం) సంయుక్త ఆధ్వర్యంలో 'నేషనల్ కన్సల్టేషన్ ఆన్ ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ హ్యూమన్ ట్రాఫికింగ్ అండ్ స్ట్రాటజీస్ టు కంబాక్ట్ దెమ్'అన్న అంశంపై గురు, శుక్రవారాల్లో మాదాపూర్ హెచ్ఐసీసీలో సదస్సు నిర్వహించారు. సదస్సులో ఐఏఎస్ అధికారులు, పోలీస్ అధికారులు, రిటైర్డ్ జడ్జిలు, మీడియా ప్రతినిధులు, న్యాయవాద వృత్తికి సంబంధించిన వారితో సహా దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి 225 మంది పాల్గొన్నారు. శుక్రవారం సదస్సు ముగింపు సందర్భంగా శిఖాగోయల్ మాట్లాడుతూ, మహిళా భద్రతకు తెలంగాణ పోలీస్ తీసుకుంటున్న చర్యలను వివరించారు. సెక్స్, లేబర్ ట్రాఫికింగ్, ఆన్‌లైన్‌లో చిన్నారులపై లైంగిక వేధింపులు, మానవ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడంలో మీడియా పాత్ర తదితర అంశాలపై సదస్సులో పాల్గొన్న వక్తలు టి కురళముత్తన్, ప్రియాంక గ్రేవల్, ధీరేంద్ర నాథ్ పాత్ర, డా.తినా కురియాకోసే మాట్లాడారు. కాగా, సదస్సులో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మహిళా భద్రత విభాగం డీఐజీ రెమా రాజేశ్వరి పాల్గొన్నారు.

సెల్ఫీ పిచ్చి.. ప్రాణం మీదకు తెచ్చి..



వేములపల్లి: నల్లగొండ జిల్లా వేములపల్లి మండల కేంద్రం సమీపంలోని నాగార్జునసాగర్ ఎడమకాల్వ వద్ద ఓ మహిళ సెల్ఫీ దిగుతూ.. ప్రమాదవశాత్తు కాల్వలో పడింది. హైదరాబాద్‌కు చెందిన ఓ కుటుంబం మిర్యాలగూడలో ఓ శుభకార్యానికి వెళ్తూ వేములపల్లి సమీపంలోని నాగార్జునసాగర్ ఎడమకాల్వ వద్ద ఆగింది. కారులో మహిళ, ఆమె భర్త, కూతురు, సోదరుడు ఉన్నారు. అందులోని మహిళ కాల్వ వంతెన వద్దకు వెళ్లి సెల్ఫీ దిగేందుకు ప్రయత్నించింది. ఇంతలో చెప్పులు జారడంతో ఆమె కాల్వలో పడబోతూ.. వంతెన వద్ద వేలాడుతున్న ఓ ఇనుప కడ్డీని పట్టుకుంది. వెంటనే చుట్టుపక్కల వారు కాపాడేందుకు ప్రయత్నించగా.. ఆమె కడ్డీని వదిలేయడంతో కాల్వలో పడిపోయింది. ప్రవాహంలో కొట్టుకుపోతున్న మహిళను స్థానికులు సుమారు 40 నిమిషాల పాటు తీవ్రంగా శ్రమించి తాళ్ల సహాయంతో కాపాడి కాల్వ ఒడ్డుకు చేర్చారు. తర్వాత స్థానికులు ఆమె భర్తపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫొటోల కోసం దిగి ప్రాణాల మీదకు తెచ్చుకున్నారంటూ మండిపడ్డారు.

హైకోర్టు ఆదేశించినా ఇంజనీరింగ్ సీటుకు నో!



• ఓ యువ చెస్ క్రీడాకారుడికి ప్రవేశం కల్పించేందుకు అధికారుల ససేమిరా
• సాంకేతిక విద్యామండలి కమిషనర్ గోడు పట్టించుకోవట్లేదని బాధితుడి ఆవేదన

సాక్షి, హైదరాబాద్: ప్రపంచ చదరంగంలో ఇంటర్నేషనల్ మాస్టర్(ఐఎం) హోదా సాధించిన నిజామాబాద్ జిల్లా రెంజల్ మండల కేంద్రానికి చెందిన శ్రీశ్వాన్ మరలాక్షికరి అనే యువ చెస్ క్రీడాకారుడికి స్పోర్ట్స్ కోటాలో ఇంజనీరింగ్ సీటు కేటాయించేందుకు అధికారులు ససేమిరా అన్నారు. ఇది సరికాదంటూ హైకోర్టు చెప్పినా వారు పట్టించుకోలేదు.

స్వర్ణ పతకం పొందినా..:

2006లో పుట్టిన శ్రీశ్వాన్.. చిన్నప్పటి నుంచే చదరంగంలో దిట్ట. 2019లో జరిగిన అండర్–14 ఆసియన్ ఇంటర్నేషనల్ యూత్ చెస్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో అతను స్వర్ణ పతకాన్ని గెలు చుకున్నాడు. పలు అంతర్జాతీయ పోటీల్లోనూ భారత గౌర వాన్ని నిలబెట్టాడు. ఈ ఏడాది ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌లో క్రీడాకారుల కోటా కింద సీటు కోసం దరఖాస్తు చేసుకు న్నాడు. అయితే అధికారులు అతనికి సీటు ఇవ్వకపోగా క్రీడా కోటా పొందేందుకు అతను అనర్హుడని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ అధికారులు పేర్కొన్నారు. దీంతో శ్రీశ్వాన్ హైకోర్టుకెక్కాడు. అయితే స్పోర్ట్స్ అథారిటీ చూపిన నిబంధనలను తోసిపుచ్చిన హైకోర్టు.. క్రీడల కోటాలో సీటు పొందేందుకు శ్రీశ్వాన్ అర్హుడని తెలుస్తూ ఇటీవల మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. ఈ నేపథ్యంలో శ్రీశ్వాన్ తన తల్లిదండ్రులతో కలిసి రాష్ట్ర సాంకేతిక విద్య కమిషనర్ దేవసేనను కలిసేందుకు వెళ్లగాలోనికి రానివ్వలేదని అతను ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయమై వివరణ కోసం కమిషనర్ దేవసేనను 'సాక్షి' ప్రతినిధి ఫోన్లో సంప్రదించగా సంబంధిత అధికారులు మాట్లాడే ఏర్పాటు చేస్తానని బదులిచ్చారు. కానీ తమను అధికారు లెవరూ సంప్రదించలేదని శ్రీశ్వాన్ తల్లిదండ్రులు తెలిపారు.

చిట్టి చేతులకు పెద్ద కష్టం



మణుగూరు టౌన్: విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయులు విద్యార్థులతో పనులు చేయించిన ఘటన ఇది. చిన్నాచితక పనులు కాకుండా గడ్డి తీయించడం, రాళ్లు ఎత్తించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం సమితి సింగారంలోని జెడ్పీ పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పెరిగిన గడ్డి తొలగించాలని శుక్రవారం ఉపాధ్యాయులు సూచించారు. దీంతో పిల్లలు పలుగు, పారలు చేత పట్టి గడ్డి తొలగించడమే కాక మరుగుదొడ్ల వద్ద బురదలో జారిపడకుండా నాపరాళ్లను తెచ్చి వేశారు. ఈ విషయమై ఉపాధ్యాయులను వివరణ కోరగా డ్రిల్ పీరియడ్ కావడంతో పనులు చెప్పామని పేర్కొనడం గమనార్హం.

సెక్యూరిటీ గార్డులకు కనీస వేతనాలు

• త్వరలోనే ఖరారు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు: భట్టి
• నేషనల్ ఫిజికల్ సెక్యూరిటీ సమ్మిట్–24కు హాజరు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పని చేస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు త్వరలో కనీస వేతనాలను ఖరారు చేయనున్నట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. ప్రస్తుతం ఇక్కడి కంటే తమిళనాడు, కర్ణాటకల్లో సెక్యూరిటీ గార్డుల వేతనాలు ఎక్కువగా ఉన్నాయని, త్వరలో తెలంగాణలో దేశంలోనే ఉత్తమమైన వేతనాలను సిఫార్సు చేయనున్నట్లు ఆయన తెలిపారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్(టీజీ సీసీసీ)లో శుక్రవారం జరిగిన నేషనల్ ఫిజికల్ సెక్యూరిటీ సమ్మిట్–2024ను భట్టి విక్రమార్క ప్రారంభించారు. హైదరాబాద్ పోలీసులు, హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (హెచ్‌సీఎస్సీ) సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ సమ్మిట్‌కు నగర కొత్వాల్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి, అదనపు డీజీ (శాంతిభద్రతలు) మహేశ్‌ఎం.భగవత్, అదనపు సీపీ (శాంతిభద్రతలు) విక్రమ్‌సింగ్ మాన్‌తో పాటు హెచ్‌సీఎస్సీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ..''రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాలు 3.5 లక్షల వరకు ఉండగా.. ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు 4 లక్షల మంది ఉన్నారు. అపారమైన ఉద్యోగావకాశాలు ఉన్న ఈ రంగం యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తోంది. ఈ సమ్మిట్ చేసే సిఫార్సులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుంది.''అని చెప్పారు.

సెక్యూరిటీ ఏజెన్సీలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి: సీపీ

నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు ఇప్పటికీ తక్కువ జీతాలే ఇస్తున్నారు. రాష్ట్రంలో 1500 ఏజెన్సీలు ఉండగా... 500 మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి. మిగిలినవీ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి'అని పేర్కొన్నారు. ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు ఏదైనా ఉదంతం జరిగినప్పుడు ఫస్ట్ రెస్పాండెంట్స్‌గా మారాలని అదనపు డీజీ (శాంతిభద్రతలు) మహేశ్ ఎం.భగవత్ పిలుపునిచ్చారు. 'పోలీసులు వచ్చే వరకు నేర స్థలిని పరిరక్షించాలి. చట్ట వ్యతిరేకంగా జరుగుతున్న ప్రతి అంశాన్నీ గుర్తిస్తూ, సంబంధిత శాఖలు, పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ప్రైవేట్ సెక్యూరిటీలకు సంబంధించిన పసేరా చట్టం కూడా అదే చెప్తోంది. సెక్యూరిటీ గార్డులు ఇలా రూపొందేలా ప్రతి ఏజెన్సీ వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి. పోలీసు విభాగం అప్పట్లో నక్సలైట్లతో ఇప్పుడు సైబర్ క్రిమినల్స్‌తో పోరాటం చేస్తోంది. ఒక్కమాటలో చెప్పాలంటే సైకిల్ పెట్రోలింగ్ పోయి సైబర్ పెట్రోలింగ్ వచ్చింది'అని మహేశ్‌భగవత్ అభిప్రాయపడ్డారు.

ఛేజ్ చేసి పట్టుకుంటే చాల్లే ఊరుకోమన్నారు!

మణిపూర్‌లో అంతే.. వెరైటీ 'పెళ్లిళ్లు'

• అక్కడ అత్యధికంగా జరిగేవి గాంధర్వ వివాహాలే
• పారిపోయి చేసుకునే పెళ్లిళ్లపై ఠాణాల్లో కేసులు
• ఆపై పోలీసుస్టేషన్‌లోనే ఇరుపక్షాల రాజీ
• తన అనుభవాలను పంచుకున్న మహేశ్ భగవత్
• నేషనల్ ఫిజికల్ సెక్యూరిటీ సదస్సులో ప్రసంగం

సాక్షి, హైదరాబాద్: బంజారాహిల్స్‌లోని తెలంగాణ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్(టీజీ సీసీసీ)లో శుక్రవారం జరిగిన నేషనల్ ఫిజికల్ సెక్యూరిటీ సమ్మిట్–2024కు అదనపు డీజీ (శాంతిభద్రతలు) మహేశ్ ఎం.భగవత్ ప్యానల్ స్పీకర్‌గా హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ (ఉమ్మడి) క్యాడర్‌కు రావడానికి ముందు ఆయన కొన్నాళ్లు మణిపూర్‌లో పని చేశారు. వివాహాలకు సంబంధించి అక్కడ, భద్రత కోణంలో న్యూయార్క్‌లో తనకు ఎదురైన అనుభవాలను ఆయన పంచుకున్నారు.

అక్కడ ఎస్పీ కూడా అలానే వివాహం చేసుకున్నారట...

నేషనల్ పోలీసు అకాడమీ నుంచి బయటకు వచ్చిన తర్వాత 1997లో ట్రైనీ ఏఎస్పీ హోదాలో మణిపూర్‌లోని ఓ పోలీసుస్టేషన్‌కు స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ)గా పని చేశా. ఓ రోజు ఠాణాలో ఉండగా నలుగురు యువకులు ఓ యువతిని కిడ్నాప్ చేశారంటూ ఫోన్ చేసిన వ్యక్తి వాళ్లు వెళ్లిన వాహనం నెంబర్ కూడా చెప్పారు. వెంటనే అప్రమత్తమై అందుబాటులో ఉన్న సిబ్బందితో కలిసి రంగంలోకి దిగా. నాలుగు కిలోమీటర్లు ఛేజ్ చేసి కిడ్నాపర్ల వాహనాన్ని పట్టుకుని యువతిని రెస్క్యూ చేశాం. వాళ్లను ఠాణాకు తీసుకువచ్చిన తర్వాత మా ఎస్పీకి ఫోన్ చేసి పెద్ద ఆపరేషన్ చేశానని చెప్పాం. దీనికి ఆయన ఫక్కున నవ్వుతూ తానూ అలాంటి గాంధర్వ వివాహమే చేసుకున్నానని అన్నారు. అలాంటప్పుడు ఫిర్యాదు, కేసు ఎందుకని ప్రశ్నించా. ''అది అక్కడ ప్రొసీజర్ అని, కేసు పెట్టి ఇరుపక్షాలను ఠాణాకు పిలవాల్సిందేనని''అన్నారు. ''ఆపై యువతీయువకులు తమ సర్టిఫికెట్లు చూపించి మేజర్లుగా నిరూపించుకుంటారు. వారి కుటుంబీకులకు కౌన్సెలింగ్ చేసి అప్పగిస్తే మూడునాలుగు రోజులకు మరోసారి ఘనంగా వివాహం చేస్తారు ''అని ఎస్పీ చెప్పడంతో నాకు ఆశ్చర్యమేసింది.



అమెరికాలో బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ అడిగితే అనుమానించారు...

అమెరికాలో వ్యాపార ఆసక్తి కంటే దేశ భద్రతపై ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. 2001లో జరిగిన 9/11 ఎటాక్స్ తర్వాత ఇది చాలా పెరిగింది. 2004లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం యాంటీ టెర్రరిజం శిక్షణ కోసం ఓ పోలీసు బృందాన్ని అమెరికా పంపింది. ఆ బృందంలో నేను కూడా ఉన్నా. అప్పట్లో నక్సలిజం చాలా ఎక్కువగా ఉండటంతో భద్రతాపరంగా అనేక చర్యలు తీసుకునేవాళ్లం. అమెరికాలోని న్యూజెర్సీలో ఉన్న ఓ దుకాణానికి వెళ్లి బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ అడిగా. విక్రయించనంటూ నిర్మొహమాటంగా చెప్పేసిన దాని యజమాని బయటకు వచ్చి నేను వినియోగించిన వాహనం నెంబర్ కూడా నోట్ చేసుకున్నాడు. కానీ ఇక్కడ ఎవరైనా అలాంటి ఓ దుకాణానికి వెళ్లి అడిగితే.. వారి వద్ద లేకపోయినా పది నిమిషాలు కూర్చోమంటూ ఎన్ని కావాలంటే అన్ని తెచ్చి ఇస్తామంటారు. ఈ ధోరణి మారి వ్యాపార ఆసక్తి కంటే దేశ భద్రతపై ఆసక్తి పెరగాలి.

ప్రజలను చైతన్యవంతం చేయడమే సవాల్...

ఇక్కడ నివసిస్తున్న ప్రజలను నేరాలు, అసాంఘిక కార్యకలాపాలకు వ్యతిరేకంగా పోరాడేలా మోటివేట్ చేయడమే పెద్ద సవాల్. నగరంలో ఉన్న హుస్సేన్‌సాగర్‌లో సరాసరిన రోజుకో ఆత్మహత్య చొప్పున జరుగుతూ ఉంటుంది. ఇలా ఆత్మహత్యకు యత్నించిన వారిని రక్షించడానికి పోలీసు విభాగం తరఫున సుశిక్షితులైన సిబ్బంది పని చేస్తున్నారు. అయితే ఆ ఉదంతం జరిగే ప్రాంతానికి చుట్టుపక్కల ఉన్న వాళ్లు మాత్రం స్పందించరు. తొలి ప్రాధాన్యం వీడియో చిత్రీకరించడానికే ఇస్తారు. తాము ఫస్ట్ సేవర్ కావాలని ఆశించడం కన్నా సోషల్‌మీడియాలో పెట్టడానికి ఫస్ట్ రికార్డర్ కావాలని భావిస్తుంటారు. దీనికి భిన్నంగా ప్రజలను మోటివేట్ చేయడమే ప్రస్తుతం సమాజంలో ఉన్న పెద్ద సవాల్.

పోటెత్తిన వరదలో గర్భిణి కష్టాలు



మేడిపల్లి(వేములవాడ): భారీ వర్షానికి వరద పోటెత్తింది. కల్వర్టుపై నుంచి ప్రవహించింది. వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది.. ఆ సమయంలో ఒక గర్భిణిని గ్రామస్తులు నీటిలో నడిపిస్తూ కల్వర్టు దాటించారు. జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలంలో జరిగిన ఈ సంఘటన వివరాలివి. శుక్రవారం ఉదయం కురిసిన భారీ వర్షానికి మేడిపల్లి మండలం కొండాపూర్– విలాయతబాద్ గ్రామాలను కలిపే ప్రధాన రహదారిపై గల లో లెవల్ కల్వర్టుపై వరద పోటెత్తింది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఈక్రమంలో విలాయతబాద్ గ్రామానికి చెందిన ఓ గర్భిణికి పురిటినొప్పులు రావడంతో అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అయితే కల్వర్టుపై నీటి ప్రవాహం ఎక్కువ ఉండటంతో అంబులెన్స్ రాలేకపోయింది. దీంతో బాధితురాలిని గ్రామస్తులు మోకాలిలోతు నీటిలో నడిపిస్తూ ఒడ్డుకు చేర్చారు. తర్వాత అంబులెన్స్‌లో కోరుట్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఏటా వర్షాకాలం వచ్చిందంటే ఇలాంటి పరిస్థితి ఎదురవుతోందని స్థానికులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే చొరవ చూపి వంతెన నిర్మించాలని కోరారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.






● మీట్ ది ఆథర్

ఆర్.కె.నారాయణ్



ఆర్.కె.నారాయణ్ అనగానే ఎవరికైనా 'మాల్గుడి డేస్' గుర్తుకు వస్తుంది. 'స్వామి అండ్ హిజ్ ఫ్రెండ్స్' కూడా. భారతదేశంలో పుట్టి సొంత భాష (తమిళం)లో కాకుండా ఇంగ్లిష్‌లో రాసి ప్రపంచ పాఠకులకు చేరువైన రచయిత ముఖ్యంగా బాలలు కూడా ఇష్టంగా చదివే రచయిత ఆర్.కె.నారాయణ్. ఆయన రాసినదంతా చిన్న మనుషులు, చిన్న సంపాదనలు, చిన్న సమస్యల గురించి. ఆయన పుస్తకాలు కూడా చిన్నవిగానే ఉంటాయి. మొదట్లో ఉపాధ్యాయుడిగా పని చేసిన ఆర్.కె.నారాయణ్ (1906-2001) ఆ పని అంతగా నచ్చక రచయిత అయిపోదామని వాళ్ల బామ్మ దగ్గర ప్రకటించేసి, ముహూర్తం చూసుకుని మరీ నోట్‌బుక్ ముందేసుకుని కూర్చున్నాడు. అతని ఊహల్లో కల్పితమైన మాల్గుడి అనే ఊరు కనిపించింది. ఆ ఊరి రైల్వేస్టేషన్, వీధులు... అన్నీ ఊహించసాగాడు. ఆ ఊరిలో జరిగినట్టుగా 'స్వామి అండ్ ఫ్రెండ్స్', 'మాల్గుడి డేస్' రాశాడు. 'ది ఇంగ్లిష్ టీచర్', 'ద బాచిలర్ ఆఫ్ ఆర్ట్స్', 'మిస్టర్ సంపత్', 'ఫినాన్సియల్ ఎక్స్‌పర్ట్', 'వెయిటింగ్ ఫర్ ద మహాత్మ', 'ద గైడ్', 'ద మ్యాన్ ఈటర్ ఆఫ్ మాల్గుడి', 'టాకెటివ్ మ్యాన్', 'అండర్ ద బన్యాన్ ట్రీ', 'మై డేస్' ఇవన్నీ ఆయన రచనలు. చదవడానికి సులువుగా ఉండే ఆర్.కె.నారాయణ్ పుస్తకాలు తప్పకుండా చదవండి.



● హాబీ

పర్వతారోహణ చేద్దామా?




'పర్వతాలు పిలుస్తాయి... వెళ్లాలి' అంటారు పర్వతారోహకులు. మనకున్న ఎన్నో హాబీల్లో పర్వతారోహణ ఒకటి. చిన్న గుట్టలతో మొదలయ్యే హాబీ కొండలకు పర్వతాలకు ఎదిగి ఆఖరకు 'ఎవరెస్ట్' అధిరోహించడంతో ముగుస్తుంది. పర్వతారోహణ చేసేవారు జీవితంలో ఒక్కసారైనా పర్వతారోహణ చేయాలని కోరుకుంటారు. కొంతమంది ఏడు ఖండాల్లోని ప్రతి ఎత్తైన పర్వతాన్ని అధిరోహించాలనుకుంటారు. ఇంతకూ పర్వతారోహణ వల్ల ఏమవుతుంది?

- పర్వతాలు ఎక్కే క్రమంలో ప్రకృతి పెట్టే పరీక్షలను ఓర్చడం వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. శిఖరం వరకూ చేరాక భూమ్మీద ఎదురయ్యే కష్టాలు చాలా చిన్నవిగా కనిపిస్తాయి. ఇంకా ముఖ్యంగా జీవితం ఎంత విలువైనదో తెలుస్తుంది.
- జీవితం అంటే చిన్న చిన్న విషయాలు కాదు ఉదాత్తమైనవి ఉన్నతమైన విషయాలను సాధించడం అని తెలుస్తుంది. 'పర్వతం వంటి వ్యక్తి', 'శిఖరం వంటి వ్యక్తి' అని కొందరిని పోలుస్తారు. అంటే ఏ రంగాన్ని అయితే ఎంచుకుంటారో ఆ రంగంలో వారు అత్యున్నత విజయాన్ని సాధించినవారన్నమాట. శాస్త్రవేత్తలలో ఐన్‌స్టీన్ శిఖరం వంటివాడు. సినిమా నటులలో అమితాబ్ బచ్చన్ శిఖరం వంటివాడు. మనం ఒక చిత్రకారులం కావాలనుకుంటే పికాసో అంతటి వాళ్లం కావాలని లక్ష్యం పెట్టుకోవాలి. అలాంటి స్ఫూర్తి పర్వతారోహణ వల్ల కలుగుతుంది.
- అబ్బాయిల కంటే మేము ఎందులోనూ తక్కువ కాదు అని ఆత్మవిశ్వాసం తెచ్చుకోవడానికి అమ్మాయిలకు పర్వతారోహణ ఒక మంచి మార్గం.
- పర్వతారోహణలో వీపు వెనుక బరువు వేసుకుని ఎక్కాలి. జీవితంలో సవాళ్లను ఎదుర్కొనడం పెద్ద కష్టం కాదని ఈ కష్టం పడినప్పుడు తెలుస్తుంది. పర్వతారోహణలో పొదుపు తెలుస్తుంది. తీసుకెళ్లిన ఆహారాన్ని పొదుపుగా వాడుకోవాలి. నీళ్లను పొదుపుగా వాడుకోవాలి. జీవితంలో కూడా ఉన్న నిధులను ఎలా జాగ్రత్త చేసుకోవాలో దీని వల్ల తెలుస్తుంది.
- అహం (ఇగో) కొన్నిసార్లు మేలు చేస్తుంది. కొన్నిసార్లు హాని చేస్తుంది. అంత ఎత్తయిన పర్వతం మౌనంగా ఉన్నప్పుడు ఆరడుగుల మనిషి ఎందుకు మిడిసి పడాలి. ఎదిగేకొద్దీ వొదగడం పర్వతం నేర్పిస్తుంది. వినయం విజయానికి తొలి మెట్టు.
- ఉదయాన్నే లేచి స్కూలుకు వెళుతున్నాం, ప్లేగ్రౌండ్‌లో ఆడుకుంటున్నాం అనుకుంటాంగాని కొండనో పర్వతాన్నో ఎక్కితేనే మనం ఎంత ఫిట్‌గా ఉన్నామో తెలుస్తుంది. మన ఊపిరితిత్తులు, మోకాళ్లు, పిక్కలు ఎంత బలంగా ఉన్నాయో పర్వతారోహణ తెలియచేస్తుంది. ఈ హాబీని ఫాలో అయ్యేవారు ఫిట్‌గా ఉండటానికి ప్రయత్నిస్తారు. మరిన్ని పర్వతాలు ఎక్కేందుకు మరింత ఫిట్‌గా ఉంటారు. కాబట్టి పర్వతారోహణ మిమ్మల్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.

● కామెడీ క్లాస్



పోలీస్: నువ్వు ఎక్కడుంటావు?
రవి: మా అమ్మానాన్నలతో
పోలీస్: వాళ్లు ఎక్కడుంటారు?
రవి: నాతో
పోలీస్: మీరందరూ ఎక్కడ ఉంటారు?
రవి: ఒకే దగ్గర ఉంటాం
పోలీస్: ఇంతకీ మీ ఇల్లు ఎక్కడ బాబూ?
రవి: రమేష్ ఇంటి పక్కన
పోలీస్: రమేష్ ఇల్లు ఎక్కడ?
రవి: చెబితే మీరు నమ్మరు.
పోలీస్: ఫరవాలేదు చెప్పు
రవి: మా ఇంటి పక్కనే



ఈ వారం
కొన్ని పదాలు...

శార్దూలము	పులి
శ్యామిక	చీకటి, నలుపు
అనలము	అగ్ని
ద్వయము	రెండు
ధూమిక	దట్టమైన మంచు



మన పొడుపు కథలు

1) మా ఇంటి పిల్లలను లెక్క పెట్టలేము
2) పువ్వుగాని పువ్వు పూనుకుంటే నవ్వు

జవాబు: 1) చుక్కలు 2) కుంకుమ పువ్వు

మోడల్ కార్తికేయ



నడకతోపాటే నాట్యం కూడా నేర్చుకున్నాడు కార్తికేయ. వినాయక చవితి స్టేజీతో మొదలు పెట్టి అంతర్జాతీయ వేదికపై మెరిశాడీ మోడలింగ్ ప్రిన్స్. థాయ్‌లాండ్‌లో జరిగిన అంతర్జాతీయ మోడలింగ్ పోటీల్లో 'ప్రిన్స్ వరల్డ్-2024' టైటిల్ సొంతం చేసుకుని వైజాగ్‌కు తిరిగి వచ్చిన కార్తికేయ సక్సెస్ స్టోరీ ఇది.

థాయ్‌లాండ్‌లో 'ప్రిన్స్' కిరీటం..

కార్తికేయ రాష్ట్ర స్థాయిలో జరిగిన స్టార్ కిడ్స్ సీజన్-2, ఆంధ్రా ఫ్యాషన్ వీక్ పోటీలలో విజేతగా నిలిచాడు. కోళికోడ్ నగరంలో జరిగిన జాతీయ స్థాయి మోడలింగ్ పోటీల్లో కూడా విజయం సాధించాడు. ప్రిన్స్ ఆఫ్ ఏపీ సబ్ టైటిల్‌ను గెలిచి అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించాడు. దీంతో ఇటీవల థాయ్‌లాండ్‌లో జూనియర్ మోడల్ ఇంటర్నేషనల్ పేరుతో పోటీలు నిర్వహించారు. దీనికి 11 దేశాల నుంచి 45 మంది చిన్నారులు పోటీ పడ్డారు. ఇందులో కార్తికేయ మనదేశానికి ప్రాతినిధ్యం వహించాడు. నాలుగవ తరగతి చదువుతున్న ఈ విశాఖపట్నం కుర్రాడు మోడలింగ్‌తోపాటు వ్యాఖ్యానం, నటన, కథలు చెప్పడం, యోగా ఇలా అనేక రంగాల్లో ప్రతిభ చూపిస్తున్న బహుముఖ ప్రజ్ఞాశాలి. కార్తికేయ తండ్రి బి.జె.శ్రీనివాసరెడ్డి ఇంజినీర్స్ ఇండియా లిమిటెడ్‌లో అసిస్టెంట్ జనరల్ మేనేజర్. ఆయన కథలు, కవితలు, వెబ్ పేజీలకు ఆర్టికల్స్ రాస్తుంటారు. వీటితోపాటు సేంద్రియ వ్యవసాయం, తేనెటీగల పెంపకం ఆయన ఆసక్తులు. కార్తికేయ తల్లి పావనీ లత భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్ (బీహెచ్‌ఈఎల్)లో ఇంజినీర్. చిత్రకారిణి కూడా. తల్లిదండ్రులిద్దరిలోనూ సృజనాత్మకత మెండుగా ఉండడం పిల్లల మీద మంచి ప్రభావం చూపించింది.



రెండేళ్లకు బ్రేక్

కార్తికేయ రెండేళ్ల వయసులో గాజువాకలో వినాయక చవితి ఉత్సవాలలో తొలిసారిగా చేసిన డ్యాన్స్‌కు మంచి ప్రశంసలందాయి. ప్లే స్కూల్‌లో పిల్లలందరూ ఏడుస్తూ ఉంటే.. కార్తికేయ డ్యాన్సులతో ఆ పిల్లలను అలరించేవాడు. దీంతో తల్లిదండ్రులు మంచి డ్యాన్సర్‌ను చేయాలని నిర్ణయించుకున్నారు. అయితే మూడో ఏట కాలికి సర్జరీ అవడంతో ఏడాదిపాటు డ్యాన్స్‌కు దూరం కావల్సి వచ్చింది. గాయం తగ్గిన వెంటనే మళ్లీ డ్యాన్స్ ఫ్లోర్ ఎక్కాడు. పాశ్చాత్య నృత్యాన్ని అభ్యసించాడు. స్కూల్‌లో జరిగే కల్చరల్ కార్యక్రమాల్లో వ్యాఖ్యాతగా వ్యవహరించేవాడు. అతడు ప్రదర్శించిన అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయం విమర్శకుల మన్ననలు పొందింది. రాగయుక్తంగా శ్లోకాలు, గీతాలు పాడి అందరి అభినందనలు అందుకున్నాడు. డ్యాన్స్‌లోనే కాకుండా తొలిసారిగా ఫ్యాషన్ షోలో కూడా అందరినీ ఆకట్టుకున్నాడు. డ్యాన్సర్‌గా, మోడల్‌గా పలు రాష్ట్రాల్లో షోలు చేస్తూ గుర్తింపు తెచ్చుకుంటున్నాడు.

– దుక్క మురళీకృష్ణారెడ్డి, సాక్షి, విశాఖపట్నం



కార్తికేయ

ఇద్దరూ ఆణిముత్యాలే

తమ్ముడు కార్తికేయ రెడ్డి డ్యాన్స్, మోడలింగ్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న విషయం తెలిసిందే. అక్క హరి శ్రేయసి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదు చేసుకుంది. 34 శ్లోకాల సమాహారమైన 'శ్యామలదండకం' వల్లించినందుకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో పేరు నమోదైంది. అలాగే చిత్ర లేఖనం, పాటల పోటీలలో కూడా బహుమతులు గెలుచుకుంది. 2024లో ఉగాది ప్రతిభా పురస్కారం అందుకుంది.



హరి శ్రేయసి

● నాకో డౌటు


టేస్ట్ ఎలా తెలుస్తుంది?



చాక్లెట్, బిస్కెట్, ఐస్ క్రీమ్, పిజా... టేస్టీగా ఉందని లాగేస్తాం. టేస్ట్ తెలియాలంటే దానిని నాలుక మీద పెట్టాలి. నాలుక మీద పెడితే టేస్ట్ తెలుస్తుంది. నాలుక మీదున్న టేస్ట్ బడ్స్ వల్ల మనకు రుచి తెలుస్తుందని మనకు తెలుసు. అయితే ఇది సగమే కరెక్ట్. టేస్ట్‌ను తెలిపేవి రుచి మొగ్గలే (టేస్ట్ బడ్స్) అయినప్పటికీ నిజానికి మనకు పూర్తి టేస్ట్ తెలిసేది లాలాజలం వల్లనే. ఎందుకంటే మనం తిన్న పదార్థం లాలాజలంలో కరిగిన తర్వాతే నాలుకపై ఉండే రుచిమొగ్గలు (టేస్ట్ బడ్స్) వాటిని గ్రహించగలుగుతాయి. అందుకే నమలడం మొదలుపెట్టిన కొద్ది సేపటి తర్వాత రుచి ఇంకా స్పష్టంగా తెలుస్తుంటుంది. అన్నట్టు... మన నోట్లో ప్రతి రోజూ లీటర్ నుంచి 1.6 లీటర్ల వరకు లాలాజలం స్రవిస్తూ ఉంటుంది. లాలాజలం నుంచే జీర్ణప్రక్రియ మొదలవుతుంది. ఆహారాన్ని జీర్ణం చేసే ప్రక్రియను వేగవంతం చేసేందుకు లాలాజలం ఎక్కువగా ఊరుతుంది. ఒకవేళ సరిగ్గా అరగక పోతే కడుపులో ఇబ్బందిగా ఉంటే లాలాజలం మరింత ఊరి పొట్టలో ఉన్న అరగని దానిని వాంతి ద్వారా బయటకు వచ్చేలా చేస్తుంది. అందుకే వాంతికి ముందు నోట్లో ఉమ్ము పెరుగుతుంది.

● ఫొటో ఫీచర్

సముద్రమే బాత్‌రూమ్



గుర్రాన్ని ఏటి దాకా తీసుకెళ్లగలంగానీ నీళ్లు తాగించగలమా అని సామెత. గుర్రానికి శుభ్రమైన నీళ్లు తాగడం అలవాటు. నీళ్లు మురికిగా ఉంటే మనం ఎంత ప్రయత్నించినా తాగదు. అందుకే ఆ సామెత. గుర్రాలను పెంచేవారు గుర్రం తాగే నీళ్లలో కొంచెం ఆపిల్ జ్యూస్, లేదా స్ట్రాబెర్రీ జ్యూస్ కలిపితే ఇష్టంగా తాగుతుందట. గుర్రాలకు స్నానం చేయించడం కూడా ముఖ్యం. అయితే వాటిని సముద్రానికి తీసుకెళ్లి స్నానం చేయించేవారు కూడా ఉంటారు. గుర్రాలకు సముద్ర స్నానం ఇష్టం. ఇక్కడ చూస్తున్నది లిబియాలో మిస్రతా అనే ఊళ్లో సముద్రం నీళ్లలో గుర్రాలను స్నానం చేయించడం. లిబియాలో గుర్రం రేసులకు మంచి గిరాకీ ఉంది. సంవత్సరంలో 40 రోజులు గుర్రాల రేసులుంటాయి. వాటి కోసం గుర్రాలను పెంచుతారు. అన్నట్టు ప్రపంచంలో ఎక్కువ గుర్రాలు ఎక్కడున్నాయో తెలుసా? అమెరికాలో. ప్రపంచంలోని గుర్రాలలో 18 శాతం అమెరికాలోనే ఉన్నాయి. గుర్రాలలో శ్రేష్ఠమైనది అరేబియన్ గుర్రం అని మనకు తెలిసిందే. వాటి గురించి మళ్లెప్పుడైనా.

● డూప్

ఏడడుగుల అశ్వత్థామ



'కల్కి' సినిమాలో అశ్వత్థామ మనందరికీ నచ్చాడు కదా. అమితాబ్ బచ్చన్ ఆ పాత్రలో కనిపిస్తాడు. ద్వాపర యుగం నాటి పాత్ర కాబట్టి సినిమాలో మిగిలిన అన్ని పాత్రలు ఇప్పటి ఎత్తులో ఉన్నా అమితాబ్ 7 అడుగుల ఎత్తులో ఉంటాడు. కాని సినిమాల్లో అన్ని సన్నివేశాల్లో హీరోలు యాక్ట్ చేయరు. వాళ్లకు డూప్స్ ఉంటారు. 'కల్కి'లో కూడా అమితాబ్‌కు డూప్ ఉన్నాడు. అతని పేరు సునీల్ కుమార్. ఇక్కడ ఫోటోల్లో ఉన్నాడే... అతనే. ఇతని ఎత్తు ఏడు అడుగుల ఏడంగుళాలు. జన్యుపరమైన ఇబ్బందుల వల్ల ఇంత ఎత్తు పెరిగాడు. జమ్ము- కశ్మీర్‌లో పోలీస్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. ఈ మధ్యనే సినిమాల కోసం ఇతణ్ణి ఉపయోగిస్తున్నారు. కల్కి సినిమా మొత్తం అమితాబ్‌కు డూప్‌గా నటించాడు. అమితాబ్ సునీల్‌ని చూసి 'అరె... నేనే లంబు అనుకుంటే ఇతను నాకంటే లంబుగా ఉన్నాడే' అని సరదా పడ్డాడట. సునీల్ కుమార్ ఇటీవల పెద్ద హిట్ అయిన 'స్త్రీ2'లో కూడా ఉన్నాడు. అందులో 'సర్‌కటా' అనే దెయ్యం వేషం వేశాడు. షూటింగ్‌ల కోసం లీవ్ పెట్టి ముంబై, హైదరాబాద్ తిరగాలంటే సెలవు కొంచెం కష్టమైనా సినిమాల్లో నటించడం బాగానే ఉందని సంతోషపడుతున్నా సునీల్.




బిజినెస్ రీల్

సావరీన్ గ్రీన్ బాండ్లలో విదేశీ పెట్టుబడులు

ఐఎఫ్ఎస్సీ ద్వారా అనుమతించిన ఆర్బీఐ



ముంబై: విదేశీ ఇన్వెస్టర్లు 'ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్' (ఐఎఫ్ఎస్సీ) ద్వారా సావరీన్ గ్రీన్ బాండ్లలో పెట్టుబడులు పెట్టేందుకు వీలుగా ఒక పథకాన్ని ఆర్బీఐ ప్రకటించింది. 2023 జనవరిలో కేంద్ర సర్కారు సావరీన్ గ్రీన్ బాండ్లను జారీ చేయగా, 2023–24లోనూ రుణ సమీకరణలో భాగంగా ఈ బాండ్ల జారీని చేపట్టింది. ప్రస్తుతం సెబీ వద్ద నమోదైన విదేశీ పోర్ట్ఫోలియో ఇన్వెస్టర్లకే (ఎఫ్పీఐలు) సావరీన్ గ్రీన్ బాండ్లలో పెట్టుబడులు పెట్టేందుకు అనుమతి ఉంది. విదేశీ ఇన్వెస్టర్లు మరింత మంది సావరీన్ గ్రీన్ బాండ్లలో పెట్టుబడులకు వీలు కల్పించడంలో భాగంగా ఆర్బీఐ తాజా నిర్ణయం తీసుకుంది.

ఎన్పీసీఐ నుంచి యూపీఐ సర్కిల్

ముంబై: నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ (ఎన్పీసీఐ) తాజాగా రెండు కొత్త ప్రోడక్టులను ఆవిష్కరించింది. వ్యాపార సంస్థల కోసం భారత్ బిల్పే ఫర్ బిజినెస్ (బీ2బీ ప్లాట్ఫామ్స్), యూపీఐ చెల్లింపులకు సంబంధించి యూపీఐ సర్కిల్ వీటిలో ఉన్నాయి. గ్లోబల్ ఫిన్టెక్ ఫెస్ట్–2024 సందర్భంగా రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ వీటిని ఆవిష్కరించారు. బీ2బీ చెల్లింపులు, వసూళ్ల క్రమబద్ధీకరణకు భారత్ బిల్పే ఫర్ బిజినెస్ సేవలు ఉపయోగపడతాయి. ఇక ప్రైమరీ యూజర్లు చెల్లింపుల అధికారాన్ని సెకండరీ యూజర్లకు బదలాయించేందుకు (డెలిగేట్) యూపీఐ సర్కిల్ ఫీచర్ ఉపయోగపడుతుంది. డెలిగేషన్ రకాన్ని బట్టి నెలకు రూ. 15,000, ప్రతి లావాదేవీపై రూ. 5,000 పరిమితి ఉంటుంది. అయిదుగురు సెకండరీ యూజర్లకు ప్రైమరీ యూజరు చెల్లింపు అధికారాలను డెలిగేట్ చేయొచ్చు.

జెన్ఏఐ సొల్యూషన్స్ కోసం ఇన్ఫీ, ఎన్విడియా జట్టు

న్యూఢిల్లీ: టెలికం ఆపరేటర్ల కోసం జెనరేటివ్ ఏఐ ఆధారిత సొల్యూషన్స్ను రూపొందించే దిశగా అమెరికన్ చిప్ తయారీ సంస్థ ఎన్విడియాతో భాగస్వామ్య ఒప్పందాన్ని పొడిగించినట్లు ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ తెలిపింది. కార్యకలాపాలను మరింత సమర్ధమంతంగా నిర్వహించుకునేందుకు టెలికం సంస్థలు జెనరేటివ్ఏఐని గణనీయంగా ఉపయోగిస్తున్నట్లు వివరించింది. ఎన్విడియా ఉత్పత్తుల తోడ్పాటుతో ఇన్ఫీ ఇప్పటికే మూడు జెన్ఏఐ సొల్యూషన్స్ను అభివృద్ధి చేసింది. వీటితో కచ్చితత్వం 22 శాతం మేర మెరుగుపడిందని కంపెనీ పేర్కొంది.

కోడిగుడ్లు (హోల్సేల్-నెక్ / 100కు రూ.లలో)

31-8-2024	
విశాఖ	525–00
చిత్తూరు	508–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	520–00
విజయవాడ	525–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	495–00
వరంగల్	497–00
రిటైల్ ధర	5.55

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
CIPLA	1,654.60	2.23
BAJFINANCE	7,210.00	2.07
M&M	2,812.00	1.97
DIVISLAB	5,105.00	1.84
NTPC	417.2	1.78

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TATAMOTORS	1,109.00	-1.13
HDFCBANK	1,625.75	-0.78
TECHM	1,635.55	-0.72
COALINDIA	523.95	-0.68
RELIANCE	3,024.95	-0.56

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	8,944
ఎన్ఎస్ఈ	2,09,412
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	2,10,802
ఎఫ్ఐఐ	+5,318
డీఐఐ	-3,198

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	73.50	$ 75.91
బ్రెంట్	76.80	$ 78.82

ఫిన్టెక్ ప్రోత్సాహానికి పాలసీల్లో మార్పులు

- ఏంజెల్ ట్యాక్స్ తొలగింపు చర్యలు తీసుకున్నాం
- జీఎఫ్ఎఫ్లో ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి



న్యూఢిల్లీ: ఫిన్టెక్ రంగాన్ని ప్రోత్సహించేందుకు పాలసీల్లో తగు మార్పులు చేస్తున్నామని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. ఇందులో భాగంగా ఏంజెల్ ట్యాక్స్ను తొలగించడం, దేశీయంగా పరిశోధనలు.. ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు రూ. 1 లక్ష కోట్లు కేటాయించడం, వ్యక్తిగత డేటా భద్రత చట్టం రూపకల్పన వంటి చర్యలు తీసుకున్నామని అయన చెప్పారు. అంకుర సంస్థలను దెబ్బతీసే సైబర్ మోసాలను నివారించడానికి చర్యలు తీసుకోవాలని నియంత్రణ సంస్థలకు సూచించారు. డిజిటల్ అక్షరాస్యతను పెంచేందుకు కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. పేమెంట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఫిన్టెక్ కన్వర్జెన్స్ కౌన్సిల్ సంయుక్తంగా నిర్వహించిన గ్లోబల్ ఫిన్టెక్ ఫెస్ట్ (జీఎఫ్ఎఫ్) 2024లో పాల్గొన్న సందర్భంగా ప్రధాని ఈ విషయాలు చెప్పారు. ఆర్థిక సేవలను అందరికీ అందుబాటులోకి తేవడంలో ఫిన్టెక్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని, గడిచిన పదేళ్లలో 31 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించాయని ఆయన ప్రశంసించారు. డిజిటల్ టెక్నాలజీతో పారదర్శకత పెరిగిందని, దీనికి నగదు బదిలీ పథకంలాంటివి నిదర్శనమని వివరించారు. జన్ ధన్ ఖాతాలు, ఆధార్, మొబైల్ త్రయంతో నగదు లావాదేవీలు తగ్గాయని చెప్పారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జరిగే డిజిటల్ లావాదేవీల్లో దాదాపు సగభాగం భారత్లోనే ఉంటున్నాయని ప్రధాని పేర్కొన్నారు. మరోవైపు, పండుగల వేళ దేశ ఎకానమీ, క్యాపిటల్ మార్కెట్లలో వేడుకల వాతావరణం నెలకొందని చెప్పారు. అధునాతన టెక్నాలజీలు, నిబంధనలతో ఆర్థిక మార్కెట్లను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పారదర్శకమైన, సమర్ధమంతమైన భారీ యంత్రాంగాలను రూపొందిస్తోందని ప్రధాని చెప్పారు.

గూగుల్ పేలో యూపీఐ సర్కిల్..

జీఎఫ్ఎఫ్ సందర్భంగా గూగుల్ పే యూపీఐ సర్కిల్ను ఆవిష్కరించింది. బ్యాంకు ఖాతాలను లింక్ చేయకుండానే డిజిటల్ చెల్లింపులు చేసేందుకు యూజర్లు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులను సెకండరీ యూజర్లుగా యాడ్ చేసేందుకు ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది. అటు ఈ-రూపీ (యూపీఐ వోచర్లు), రూపే కార్డులకు సంబంధించి మొబైల్ ఫోన్ ద్వారా ట్యాప్ అండ్ పే ఫీచర్ను, యూపీఐ లైట్లో ఆటోపే ఆప్షన్ను కూడా గూగుల్ పే ఆవిష్కరించింది.

అదానీ పోర్ట్స్ చేతికి ఆస్ట్రో ఆఫ్షోర్

- 80 శాతం వాటా కొనుగోలు
- డీల్ విలువ రూ. 1,550 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ ఆస్ట్రో ఆఫ్షోర్లో 80 శాతం వాటా కొనుగోలు చేయనుంది. ఇందుకు తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు అదానీ పోర్ట్స్ తెలియజేసింది. వాటాను సొంతం చేసుకునేందుకు పూర్తి నగదు రూపేణా 18.5 కోట్ల డాలర్లు(రూ. 1,550 కోట్లు) వెచ్చించనున్నట్లు వెల్లడించింది. ఆస్ట్రో ప్రస్తుత ప్రమోటర్లు మిగిలిన 20 శాతం వాటాను కొనసాగించనున్నట్లు తెలియజేసింది. ఈ డీల్ తొలి ఏడాది నుంచే విలువ జోడింపునకు సహకరించనున్నట్లు పేర్కొంది. 2009లో ఏర్పాటైన ఆస్ట్రోను 23.5 డాలర్ల విలువలో కొనుగోలు చేస్తున్నట్లు తెలియజేసింది. ప్రధానంగా మధ్యప్రాచ్యం, తూర్పు ఆసియా, ఆఫ్రికా ప్రాంతాలలో ఆఫ్షోర్ సపోర్ట్ వెస్సల్స్(ఓఎస్వీ) నిర్వాహక కంపెనీగా సేవలందిస్తోంది. కంపెనీ 26 ఓఎస్వీలను కలిగి ఉంది. యాంకర్ హ్యాండ్లింగ్ టగ్స్, ఫ్లాట్ టాప్ బార్జీలు, మల్టీపర్పస్ సపోర్ట్ వెస్సల్స్(ఎంపీఎస్వీలు), వర్క్ బోట్లు తదితరాలను సైతం కంపెనీ అందిస్తోంది. 2024 ఏప్రిల్30తో ముగిసిన గతేడాది 9.5 కోట్ల డాలర్ల ఆదాయం, 4.1 కోట్ల డాలర్ల నిర్వహణ లాభం(ఇబిటా) సాధించింది.

అదానీ పోర్ట్స్ షేరు ఎన్ఎస్ఈలో 0.4 శాతం బలపడి రూ. 1,482 వద్ద ముగిసింది.

ద్రవ్యలోటు 17.2 శాతానికి అప్

ఏప్రిల్–జూలై మధ్య రూ.2,76,945 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ ఆదాయాలు–వ్యయాలకు మధ్య నికర వ్యత్యాసం– ద్రవ్యలోటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూలై ముగిసే నాటికి బడ్జెట్ లక్ష్యంలో 17.2 శాతానికి చేరినట్లు కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ (సీజీఏ) గణాంకాలు వెల్లడించాయి. వివరాల్లోకి వెళితే, ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు రూ.16,13,312 కోట్లుగా (జీడీపీలో 4.9 శాతం కట్టడి అంచనా) ఉండాలన్నది బడ్జెట్ లక్ష్యం. జూలై నాటికి రూ.2,76,945 కోట్లకు చేరింది. 2023–24లో జీడీపీలో ద్రవ్యలోటు 5.6 శాతానికి కట్టడి జరిగిన సంగతి తెలిసిందే.

జూలైలో ఇన్ఫ్రా 6.1 శాతం



న్యూఢిల్లీ: ఎనిమిది మౌలిక పారిశ్రామిక రంగాల గ్రూప్ జూలైలో 6.1 శాతం వృద్ధి రేటు సాధించింది. 2023 జూలైలో ఈ వృద్ధి రేటు 8.5 శాతం. వార్షికంగా రేటు తగ్గినా, నెలవారీగా చూస్తే (జూన్లో 5.1% వృద్ధి) పురోగతి నమోదుకావడం గమనార్హం.

- గ్రూప్లోని ముడి చమురు (2.9 శాతం క్షీణత), సహజ వాయువు (1.3 శాతం క్షీణత) క్షీణత నమోదుచేసుకున్నాయి.
- బొగ్గు (6.8%), స్టీల్ (7.2%), సిమెంట్ (5.5%), విద్యుత్ (7%) రంగాలు వృద్ధి బాటన ఉన్నాయి. అయితే ఈ వృద్ధి రేట్లు 2023 ఇదే నెలతో పోల్చితే తగ్గాయి.
- రిఫైనరీ ప్రొడక్టులు (6.6%), ఎరువుల (5.3%) రంగాలు మాత్రం 2023 జూలైతో పోల్చితే పెరిగాయి.

నాలుగు నెలల్లో 6.1 శాతం పురోగతి: కాగా, ఏప్రిల్–జూలై మధ్య 2023 ఇదే కాలంతో పోల్చితే ఈ గ్రూప్ వృద్ధి రేటు 6.6 శాతం నుంచి 6.1 శాతానికి తగ్గింది. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ)లో ఎనిమిది రంగాల వాటా 40.27 శాతం.

ఎన్హెచ్పీసీ, ఎస్జేవీఎన్కు నవరత్న హోదా

రైల్టెల్, ఎస్ఈసీలకు సైతం ఇదే హోదా



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ విద్యుదుత్పత్తి సంస్థలైన ఎన్హెచ్పీసీ, ఎస్జేవీఎన్లకు నవరత్న హోదా దక్కింది. అలాగే, సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్ఈసీఐ), రైల్టెల్కు సైతం నవరత్న హోదా లభించింది. "ప్రభుత్వరంగ సంస్థల విభాగం ఆగస్ట్ 30న ఎన్హెచ్పీసీని నవరత్న కంపెనీగా ప్రకటించింది. ఇది నిర్వహణ, ఆర్థిక పరంగా స్వయం ప్రతిపత్తిని తీసుకొస్తుంది" అని ఎన్హెచ్పీసీ తెలిపింది. కంపెనీకి ఇది చరిత్రాత్మకమని ఎన్హెచ్పీసీ సీఎండీ ఆర్కే చౌదరి అభివర్ణించారు. కంపెనీ ఆర్థిక, నిర్వహణ సామర్థ్యాలకు గుర్తింపు అని పేర్కొన్నారు. ఈ హోదాతో వేగంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం లభిస్తుందన్నారు. ఇప్పటి వరకు ఎన్హెచ్పీసీ మినీరత్న కేటగిరీ–1 కంపెనీగా ఉంది. ఎస్జేవీఎన్ సైతం మినీతర్న కేటగిరీ –1గా ఉండడం గమనార్హం.

ఐఎఫ్ఎస్సీ లిస్టింగ్కు జోష్

పబ్లిక్ వాటా 10 శాతానికి కుదింపు



న్యూఢిల్లీ: దేశీయంగా ఏర్పాటు చేసిన తొలి అంతర్జాతీయ ఆర్థిక సేవల కేంద్రం(ఐఎఫ్ఎస్సీ)లోని స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయ్యే కంపెనీలకు ఆర్థిక శాఖ తాజాగా వెసులుబాటు కల్పించింది. ప్రస్తుతమున్న పబ్లిక్కు కనీసం 25 శాతం వాటాను 10 శాతానికి కుదించింది. దీంతో పబ్లిక్కు కనీసం 10 శాతం వాటా(పబ్లిక్ ఫ్లోట్) కలిగిన కంపెనీలు సైతం లిస్టయ్యేందుకు వీలు చిక్కనుంది. ఫలితంగా ఐఎఫ్ఎస్సీ స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయ్యేందుకు కంపెనీలు ఆసక్తి చూపేందుకు దారి ఏర్పడింది. 2005 సెజ్ నిబంధనల ప్రకారం గాంధీనగర్లోని గిఫ్ట్ సిటీలో ఐఎఫ్ఎస్సీ ఏర్పాటైన సంగతి తెలిసిందే. ఇందుకు ఆర్థిక వ్యవహారాల శాఖ 1956 ఎస్సీఆర్ఆర్ నిబంధనలను సవరించింది. ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా లిస్టింగ్ను సరళతరం చేసింది.

ఆర్బీఐ పేరుతో మోసాలు

అప్రమత్తంగా ఉండాలని రిజర్వ్ బ్యాంక్ సూచన



ముంబై: రిజర్వ్ బ్యాంక్ పేరును ఉపయోగించుకుని మోసాలకు పాల్పడుతున్న అసాంఘిక శక్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ప్రజలను ఆర్బీఐ హెచ్చరించింది. సెంట్రల్ బ్యాంక్ ఉద్యోగులుగా నటిస్తూ నకిలీ లెటర్ హెడ్స్, ఈమెయిల్ అడ్రెస్లను ఉపయోగించి లాటరీలు.. ఫండ్ ట్రాన్స్ఫర్, విదేశీ రెమిటెన్సులు, ప్రభుత్వ పథకాల పేరిట కొందరు మోసగిస్తున్నారని పేర్కొంది. కరెన్సీ ప్రాసెసింగ్ ఫీజులు, ట్రాన్స్ఫర్/రెమిటెన్స్/ప్రాసీజర్ చార్జీలంటూ వసూలు చేస్తున్నారని వివరించింది. ఆర్బీఐ/ప్రభుత్వ అధికారుల్లాగా నటిస్తూ ప్రభుత్వ కాంట్రాక్టులు, స్కీములతో నిధులు పొందేందుకు సెక్యూరిటీ డిపాజిట్లు కట్టాల్సి ఉంటుందని చిన్న, మధ్యతరహా వ్యాపార సంస్థలను మోసగిస్తున్నట్లు రిజర్వ్ బ్యాంక్ తెలిపింది. సాధారణంగా వీరు ఐవీఆర్ కాల్స్, ఎస్ఎంఎస్, ఈమెయిల్స్ ద్వారా బాధితులను సంప్రదిస్తున్నారు. ఆర్బీఐ అధికారులుగా పరిచయం చేసుకునే సదరు మోసగాళ్లు బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేసేస్తామని బెదిరిస్తూ, నిర్దిష్ట వ్యక్తిగత వివరాలు ఇచ్చేలా బాధితులను బలవంతపెడుతున్నారు. ఈ నేపథ్యంలో అపరిచితులకు అకౌంట్ లాగిన్ వివరాలు, ఓటీపీ లేదా కేవైసీ పత్రాలు మొదలైనవి ఇవ్వరాదని రిజర్వ్ బ్యాంక్ సూచించింది.

కాల్స్, ఎస్ఎంఎస్లను బట్టి టారిఫ్!



న్యూఢిల్లీ: ఇబ్బంది పెట్టే కాల్స్ను అరికట్టడానికి.. కాల్స్, ఎస్ఎంఎస్ల కోసం గ్రేడ్స్ వారీ అధిక టారిఫ్ను ప్రవేశపెట్టాలని టెలికం నియంత్రణ సంస్థ ట్రాయ్ తాజాగా పరిశ్రమను కోరింది. రోజుకు 50కి పైగా కాల్స్, లేదా 50 ఎస్ఎంఎస్లు పంపిన టెలికం సబ్స్క్రైబర్లను ఇబ్బందికర కాలర్లుగా పరిశీలించాలని టెలికం కంపెనీలకు సూచించింది. 'టెలికం కమర్షియల్ కమ్యూనికేషన్స్ కస్టమర్ ప్రిఫరెన్స్ రెగ్యులేషన్స్–2018' నిబంధనల పరిధిలో నమోదైన ఒక సంస్థ కాకుండా ఇతర వ్యక్తుల కు ఒక సిమ్కు రోజుకు ఒక నిర్దిష్ట పరిమితిని మించి ఎస్ఎంఎస్, వాయిస్ కాల్స్ కోసం గ్రేడ్స్ వారీ టారిఫ్ ఉండాలని స్పష్టం చేసింది.

ఇండిగోలో ప్రమోటర్ గంగ్వాల్ వాటాల విక్రయం

న్యూఢిల్లీ: ఇండిగో ఎయిర్లైన్స్ మాతృ సంస్థ ఇంటర్గ్లోబ్ ఏవియేషన్లో ప్రమోటర్ రాకేశ్ గంగ్వాల్, ఆయన కుటుంబ ట్రస్ట్ 5.83 శాతం వాటాలను విక్రయించాయి. వీటి విలువ రూ. 10,500 కోట్లు. గంగ్వాల్ 22.50 లక్షల షేర్లు, చింకర్పూ ఫ్యామిలీ ట్రస్టు 2.02 కోట్ల షేర్లను విక్రయించాయి. దీనితో ఇంటర్గ్లోబ్ ఏవియేషన్లో గంగ్వాల్ వాటా 5.89 శాతం నుంచి 5.31 శాతానికి, చింకర్పూ ఫ్యామిలీ ట్రస్ట్ వాటాలు 13.49 శాతం నుంచి 8.24 శాతానికి తగ్గాయి. సహ వ్యవస్థాపకుడు రాహుల్ భాటియాతో విభేదాల నేపథ్యంలో 2022 నుంచి గంగ్వాల్, ఆయన కుటుంబం క్రమంగా కంపెనీలో వాటాలను తగ్గించుకుంటూ వస్తోంది.

ప్రెస్టీజ్ ఎస్టేట్స్ నిధుల సమీకరణ

క్విప్ ద్వారా రూ. 5,000 కోట్లకు రెడీ

న్యూఢిల్లీ: రియల్టీ రంగ దిగ్గజం ప్రెస్టీజ్ ఎస్టేట్స్ ప్రాజెక్ట్స్ నిధుల సమీకరణ ప్రణాళికలకు తెరతీసింది. అర్హతగల సంస్థాగత ఇన్వెస్టర్లకు షేర్ల జారీ(క్విప్) ద్వారా రూ. 5,000 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. ఈ బాటలో షేరుకి రూ. 1,755.09 ఫ్లోర్ ధరలో తాజాగా క్విప్నకు శ్రీకారం చుట్టింది. ఇందుకు కంపెనీ బోర్డులోని నిధుల సమీకరణ కమిటీ ఆమోద ముద్ర వేసింది. ఈ ఏడాది జులైలోనే కంపెనీ క్విప్ తదితర మార్గాలలో రూ. 5,000 కోట్లకు మించకుండా నిధుల సమీకరణకు వాటాదారుల నుంచి అనుమతిని పొందింది. బెంగళూరు రియల్టీ కంపెనీకి దక్షిణాదిలో ప్రధానంగా పట్టున్న సంగతి తెలిసిందే. ముంబై, ఢిల్లీ ఎన్సీఆర్ మార్కెట్లలోనూ కార్యకలాపాలు విస్తరించింది. ఈ ఏడాది(2024–25) తొలి త్రైమాసికానికి అమ్మకాల బుకింగ్స్ 23% క్షీణించి రూ. 3,030 కోట్లకు పరిమితమైనట్లు గత నెలలో కంపెనీ వెల్లడించింది. కొత్త ప్రాజెక్టుల విడుదల ఆలస్యంకావడం, అమ్మకాలు మందగించడం ప్రభావం చూపాయి. కాగా.. క్యూ1(ఏప్రిల్–జూన్)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 13% నీరసించి రూ. 233 కోట్లకు చేరింది. అధిక వ్యయాలు లాభాలను దెబ్బ తీశాయి. అయితే మొత్తం ఆదాయం రూ. 1,966 కోట్ల నుంచి రూ. 2,025 కోట్లకు బలపడింది. ఈ కాలంలో కంపెనీ 2.86 మిలియన్ చదరపు అడుగులను విక్రయించింది. గతేడాది(2023–24) క్యూ1లో 3.83 మిలియన్ చదరపు అడుగుల అమ్మకాలు సాధించింది.

ఎన్ఎస్ఈలో ప్రెస్టీజ్ ఎస్టేట్స్ షేరు 3.7 శాతం జంప్చేసి రూ. 1,790 వద్ద ముగిసింది.

పండుగలకు జోరుగా టూ వీలర్ల అమ్మకాలు

న్యూఢిల్లీ: గ్రామీణ డిమాండ్ తిరిగి బలంగా పుంజుకోవడం, రుతుపవనాల పునరుద్ధరణ కారణంగా రాబోయే పండుగ సీజన్లో ద్విచక్ర వాహనాల విక్రయాలు పెద్ద ఎత్తున జరుగుతాయని టీవీఎస్ మోటార్ కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, కమ్యూటర్ బిజినెస్ హెడ్ అనిరుద్ధ హల్దార్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో స్కూటర్లకు ఆదరణ పెరగడం ద్విచక్ర వాహన పరిశ్రమ వృద్ధిని నడిపిస్తోందని అన్నారు. మొత్తం ద్విచక్ర వాహన పరిశ్రమలో స్కూటర్ల విభాగం వాటా ప్రస్తుతం 32 శాతం ఉందని, ఇది మరింత వృద్ధి చెందుతుందని ఆయన చెప్పారు. టెక్నాలజీ కారణంగా స్కూటర్లు మెరుగైన మైలేజీ ఇవ్వడం కూడా కస్టమర్ల ఆసక్తికి కారణమైందని వివరించారు. అదనంగా స్థలం, సౌకర్యం, సౌలభ్యం ఉండడం కలిసి వచ్చే అంశమని అన్నారు. మారుమూల ప్రాంతాల్లోనూ రోడ్లు మెరుగవడం కూడా స్కూటర్ల వినియోగం పెరిగేందుకు దోహదం చేసిందని చెప్పారు. అటు కుటుంబ సభ్యులు సైతం సౌకర్యంగా నడపవచ్చని అన్నారు.



గ్రామీణ ప్రాంతాల డిమాండ్..

ఈ ఆర్థిక సంవత్సరం మొదటి కొన్ని నెలల్లో టూ వీలర్స్ పరిశ్రమలో 13 శాతం వృద్ధిని చూశామని అనిరుద్ధ హల్దార్ తెలిపారు. 'ఇది ఇటీవలి సంవత్సరాలలో మనం చూసిన దానికంటే ఎక్కువ. ఈమధ్య గ్రామీణ ప్రాంతాల డిమాండ్ పట్టణ ప్రాంతాలను మించిపోవడం మరింత సంతోషకరమైన విషయం. గ్రామీణ డిమాండ్ పట్టణ డిమాండ్ను అధిగమించడం ప్రారంభించినప్పుడు ఇది మొత్తం ద్విచక్ర వాహన పరిశ్రమకు చాలా మంచి సంకేతం. పండుగల సీజన్లో మొత్తం ద్విచక్ర వాహన పరిశ్రమ ప్రస్తుత వృద్ధి రేటును అధిగమిస్తుందని విశ్వసిస్తున్నాం. పరిశ్రమను మించిన వృద్ధిని టీవీఎస్ నమోదు చేస్తుందని నమ్మకంగా ఉంది' అని హల్దార్ చెప్పారు.

రైల్వేస్తో అమెజాన్ ఒప్పందం



న్యూఢిల్లీ: రైల్వే మంత్రిత్వ శాఖ, ఈ-కామర్స్ మార్కెట్ప్లేస్ అమెజాన్ ఇండియా గురువారం ఒక అవగాహన ఒప్పందంపై సంతకం చేశాయి. భారతీయ రైల్వేకి ఉన్న బలమైన ప్రాంతీయ నెట్వర్క్ ద్వారా అమెజాన్ ఇండియా ప్యాకేజీలను మరింత వేగవంతంగా కస్టమర్లకు అందజేసేందుకు ఇప్పటికే ఉన్న భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం దీని ముఖ్య ఉద్దేశం. ఇందులో భాగంగా హబ్ అండ్ స్పోక్ విధానాన్ని అమలు చేసి ఫలితాలను ఇరు సంస్థలు విశ్లేషించి దేశవ్యాప్తంగా విస్తరిస్తాయి. 2019 నుంచి భారతీయ రైల్వే ద్వారా అమెజాన్ సరుకుల రవాణా చేపడుతోంది. ఒక రైలుతో మొదలుకుని ప్రస్తుతం 120కిపైగా రైళ్ల ద్వారా సరుకు రవాణా జరుగుతోంది. సరుకు రవాణా 15 రెట్లు పెరిగిందని అమెజాన్ తెలిపింది.

జిల్లెట్ ఇండియా లాభం అప్

షేరుకి రూ. 45 డివిడెండ్



న్యూఢిల్లీ: షేవింగ్ ప్రొడక్టుల దిగ్గజం జిల్లెట్ ఇండియా ఈ ఏడాది(2023–24) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. ఏప్రిల్–జూన్(క్యూ4)లో నికర లాభం 26 శాతం పైగా జంప్చేసి రూ. 116 కోట్లను తాకింది. కంపెనీ జులై–జూన్ కాలాన్ని ఆర్థిక సంవత్సరంగా పరిగణిస్తుంది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 92 కోట్లు ఆర్జించింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 45 చొప్పున తుది డివిడెండును ప్రకటించింది. కాగా.. మొత్తం ఆదాయం మాత్రం 4 శాతం పుంజుకుని రూ. 645 కోట్లను అధిగమించింది. అయితే మొత్తం వ్యయాలు స్వల్పంగా 1 శాతం నీరసించి రూ. 495 కోట్లకు పరిమితమయ్యాయి. ఇక పూర్తి ఏడాదికి కంపెనీ నికర లాభం 16 శాతం ఎగసి రూ. 412 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం 6 శాతం బలపడి రూ. 2,633 కోట్లను తాకింది.

బీఎస్ఈలో జిల్లెట్ ఇండియా షేరు 1శాతం నష్టంతో రూ. 8,886 వద్ద ముగిసింది.

భారీ పెట్టుబడుల దిశగా రియల్ ఎస్టేట్

20 నెలల్లో రూ.లక్ష కోట్లు • రియల్ ఎస్టేట్ కంపెనీల సమీకరణ • అధిక మొత్తం డెట్ రూపంలోనే



న్యూఢిల్లీ: రియల్ ఎస్టేట్ పరిశ్రమ డిమాండ్కు తగ్గట్టుగా భారీ పెట్టుబడుల దిశగా అడుగులు వేస్తోంది. గడిచిన 19–20 నెలల్లో రియల్ ఎస్టేట్ సంస్థలు రూ.లక్ష కోట్ల మేర పెట్టుబడులు సమీకరించడం ఈ డిమాండ్కు అద్దం పడుతోంది. 92 శాతం పెట్టుబడులను డెట్ ఇష్యూల జారీ ద్వారానే సమీకరించాయి. అంతేకాదు మరో రూ.28,000 కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఇష్యూలు త్వరలో మార్కెట్లోకి రానున్నాయి. హౌసింగ్ మార్కెట్లో బూమ్కు తోడు స్థిరమైన నగదు ప్రవాహాలు ఈ రంగంలోని కంపెనీలకు అనుకూలిస్తున్నాయి. తక్కువ క్రెడిట్ రిస్క్ ఉండడంతో డెట్ పత్రాల మార్గంలో నిధుల సమీకరణకు మొగ్గు చూపిస్తున్నాయి. 2023, 2024లో ఇప్పటి వరకు రియల్ ఎస్టేట్, సివిల్ కన్స్ట్రక్షన్ కంపెనీలు డెట్ మార్గంలో రూ.95,975 కోట్ల నిధులు సమీకరించాయి. ఇందులో 2023లో రూ.61,600 కోట్లు, ఈ ఏడాది రూ.34,375 కోట్ల చొప్పున సమకూర్చుకున్నాయి. ఈక్విటీ రూపంలో నిధుల సమీకరణ తక్కువగానే ఉన్నప్పటికీ, ఈ ఏడాది గణనీయంగా పెరిగింది. 2023లో ఈక్విటీ జారీ రూపంలో రియల్ ఎస్టేట్, నిర్మాణ కంపెనీలు రూ.124 కోట్లు రాబట్టగా, 2024లో ఇప్పటి వరకు రూ.8,772 కోట్లు సమీకరించాయి. ఇందులో ఐపీవోలు కూడా ఉన్నాయి. ఇక సమీప కాలంలో సమీకరించనున్న రూ.28,350 కోట్లలో.. డెట్ మార్గంలో రూ.16,635 కోట్లు, రూ.9,695 కోట్లు క్యూఐపీ రూపంలో, మిగిలినది ఐపీవోల రూపంలో రానుంది.

మెరుగైన అమ్మకాలు

లిస్టెడ్ రియల్ ఎస్టేట్ కంపెనీల అమ్మకాలు కరోనా అనంతరం ఏటా 15–20 శాతం మేర వృద్ధి చెందడంతో నగదు ప్రవాహాలు (నికర నిధుల మిగులు) మెరుగయ్యాయి. అంతేకాదు భవిష్యత్ నగదు ప్రవాహాలు అంచనాలపైనా స్పష్టత ఏర్పడింది. "ఇళ్ల అమ్మకాలపై చెల్లింపులు సాధారణంగా క్రమానుగతంగా (మైలురాయి చేరికల ఆధారంగా) ఉంటుంది. ఇది రియల్ ఎస్టేట్ సంస్థల నగదు ప్రవాహాలు మెరుగయ్యేలా చేసింది" అని ఈక్విరస్ ఇన్వెస్ట్మెంట్ బ్యాంకింగ్ ఎండీ విజయ్ అగర్వాల్ తెలిపారు. కొత్త ప్రాజెక్టులను ఆరంభించిన వెంటనే 25–30 శాతం మేర అమ్ముడుపోయే పరిస్థితులు కనిపిస్తున్నట్టు చెప్పారు. దీంతో నగదు ప్రవాహాలపై అంచనాలకు ఇది వీలు కల్పిస్తోందని, దీంతో అవి డెట్ రూపంలోనిధుల సమీకరణకు ఆసక్తి చూపిస్తున్నట్టు వివరించారు.

ఈక్విటీ మార్గమే చౌక

ఈ ఏడాది ఈక్విటీ జారీ రూపంలో రియల్ ఎస్టేట్ కంపెనీలు పెద్ద మొత్తంలో నిధుల సమీకరణకు ఉన్న కారణాలను నిపుణులు వెల్లడిస్తున్నారు. రుణాలపై వడ్డీ రేట్లు పెరిగిపోవడం ఇందులో ప్రధానమైనది. రియల్ ఎస్టేట్ కంపెనీలు రెండంకెల రాబడులను ఆశిస్తుంటాయి. దీంతో ప్రస్తుత తరుణంలో ఈక్విటీ జారీయే మెరుగైన మార్గమని భావించడంతో.. ఈ దిశగా ఆసక్తి నెలకొంది. ఈ నిధులను భూముల సమీకరణపై ఎక్కువగా వెచ్చిస్తున్నాయి. 2024 మొదటి ఆరు నెలల్లో 54 భూ లావాదేవీలు నమోదయ్యాయి. వీటి పరిమాణం 1,000 ఎకరాల పైనే ఉంది. గతేడాది 100 భూలావాదేవీలు నమోదు కాగా, వీటి పరిమాణం 2,700 ఎకరాలుగా ఉంది.



7 నెలల గర్భిణి... విల్లుతో రె'ఢీ'

పారాలింపిక్స్ ఆర్చరీలో బ్రిటన్ ప్లేయర్ జోడీ గ్రిన్‌హామ్ త్రిపాత్రాభియనం





పారిస్: ఆమె ఒక అమ్మ. పైగా ఏడు నెలల గర్భవతి! అయితేనేం పారిస్‌లో ఆర్చర్‌గా పారాలింపిక్స్‌లో పతకంపై గురి పెట్టింది. ఇంట్లో ఓ కంట రెండేళ్ల బాలుడి ఆలనాపాలన చూస్తోంది. మరో కంట రెండు నెలల్లో కళ్లు తెరిచే గర్భస్థ శిశువుని కనిపెడుతోంది. అలాగని రెండు పాత్రలతోనే సరిపెట్టుకో లేదు. ఆర్చరీలో లక్ష్యంపై బాణాలు కూడా సంధిస్తోంది. అలా బ్రిటన్‌కు చెందిన జోడీ గ్రిన్‌హామ్ త్రిపాత్రాభినయానికి సమన్యాయం చేస్తోంది. శుక్రవారం జరిగిన మహిళల వ్యక్తిగత కాంపౌండ్ ఓపెన్ ఈవెంట్ ర్యాంకింగ్ రౌండ్‌లో జోడీ గ్రిన్‌హామ్ 693 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచింది. అనంతరం బ్రిటన్ సహచరుడు నాథన్ మాక్‌క్వీన్‌తో కలిసి మిక్స్‌డ్ టీమ్ కాంపౌండ్ ఓపెన్ ఈవెంట్‌లో రెండో స్థానంలో నిలిచింది. ఒకే రోజు ఓ గర్భిణి రెండు ఈవెంట్లతో పాల్గొని వైకల్యాన్నే చిన్నబోయేలా చేసింది. పోటీల అనంతరం ఆమె మాట్లాడుతూ 'నేను అమ్మను, అలాగే పారా అథ్లెట్‌ను. వీటిలో ఏ ఒక్కటి వదులుకోను. కానీ... ఇంట్లో మాత్రం వందశాతం అమ్మనే' అని అమ్మతనాన్ని, అథ్లెట్ సామర్థ్యాన్ని వివరించింది. 'నేను ఇంకా బాగా రాణించగలనని నాకు తెలుసు. ఇంకాస్త మెరుగైన ప్రదర్శన ఇవ్వాల్సింది. అయినా నాలుగో స్థానమేమి నిరాశపర్చలేదు. మిగతా ఈవెంట్లపై మరింత దృష్టి సారించేలా ఆత్మవిశ్వాసాన్నిచ్చింది' అని తెలిపింది. జోడీ గ్రిన్‌హామ్‌కు ఇదేం తొలి పారాలింపిక్స్ కాదు. రియో పారాలింపిక్స్ (2016)లో పాల్గొని మిక్స్‌డ్ టీమ్ కాంపౌండ్ విభాగంలో రజతం నెగ్గింది. ఇక ఈ పారాలింపిక్స్‌లో ఆమె శని, సోమవారాల్లో పతకాల కోసం రెండు ఈవెంట్‌లలో పాల్గొనాల్సి ఉంది.

'ఈత'కు చేతులు కావాలా!

స్వర్ణం సాధించిన బ్రెజిల్ స్విమ్మర్ గాబ్రియెల్







పారిస్: పారాలింపిక్స్‌లో పాల్గొనే వారంతా వివిధ రకాల వైకల్యాలతో ఇబ్బంది పడేవారే. నిబంధనలకు అనుగుణంగా దాదాపు తమ లాంటి శారీరక లోపాలతో ఉన్న వ్యక్తులతోనే వారంతా పోటీ పడటం కూడా వాస్తవమే. అయినా సరే కొందరు ఆటగాళ్ల శారీరక లోపాలు అయ్యో అనిపిస్తాయి. మరికొందరి పోరాటం కన్నీళ్లు తెప్పిస్తుంది. అలాంటి జాబితాలో ఉండే ప్లేయర్ గాబ్రియెల్ డాస్ సాంతోస్ అరాజో. బ్రెజిల్‌కు చెందిన ఈ స్విమ్మర్ ఈత కొలనులో దూసుకుపోతున్న తీరు చూస్తే ఎలాంటి వైకల్యమైనా తలవంచి అభివాదం చేస్తుంది. పుట్టుకతోనే 'ఫోకోమెలియా' అనే వ్యాధి బారిన పడటంతో గాబ్రియెల్ రెండు చేతులూ పూర్తిగా కోల్పోయాడు. కాళ్లు కూడా అచేతనంగా మారిపోయాయి. ఇలాంటి స్థితిలోనూ అతను స్విమ్మింగ్‌పై ఆసక్తి చూపించి కొలనులోకి దిగాడు. మిగిలిన శరీరాన్ని మాత్రమే కదిలిస్తూ డాల్ఫిన్ తరహాలో ఈతలో దూసుకుపోయే టెక్నిక్‌ను నేర్చుకున్నాడు. తీవ్ర సాధనతో పారాలింపిక్ స్విమ్మర్‌గా ఎదిగాడు. శుక్రవారం పారిస్ ఒలింపిక్స్‌లో 22 ఏళ్ల గాబ్రియెల్ బ్రెజిల్ దేశానికి తొలి పతకాన్ని అందించాడు. ఎస్2 కేటగిరీ 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో దూసుకుపోయిన అతను స్వర్ణం గెలుచుకున్నాడు. 1 నిమిషం 53.67 సెకన్లలోనే అతను దీనిని పూర్తి చేయడం విశేషం. గత టోక్యో ఒలింపిక్స్‌లో కూడా రెండు స్వర్ణాలు, ఒక రజతం గెలిచిన ఘనత గాబ్రియెల్ అతని సొంతం. విజయం సాధించిన తర్వాత తమ దేశ సాంప్రదాయ 'సాంబా' నృత్యాన్ని అతను ప్రదర్శించిన తీరు గాబ్రియెల్ ఘనతకు మరింత ప్రత్యేకతను తెచ్చింది.





రేస్ వాక్‌లో ఆర్తికి కాంస్యం

లిమా (పెరూ): ప్రపంచ అండర్–20 అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత్ పతకాల బోణీ కొట్టింది. మహిళల 10,000 మీటర్ల రేస్ వాక్ ఈవెంట్‌లో భారత అథ్లెట్ ఆర్తి కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. 17 ఏళ్ల ఆర్తి 10,000 మీటర్ల దూరాన్ని 44 నిమిషాల 39.39 సెకన్లలో పూర్తి చేసి మూడో స్థానంలో నిలిచింది. ఈ క్రమంలో 47ని:21.04 సెకన్లతో తన పేరిటే ఉన్న జాతీయ రికార్డును బద్దలు కొట్టింది. జుమా బైమా (చైనా; 43ని:26.60 సెకన్లు) స్వర్ణం, మీలింగ్ చెన్ (చైనా; 44ని:30.67 సెకన్లు) రజతం గెలిచారు.

హైజంప్‌లో పూజా సింగ్ జాతీయ రికార్డు

అంతకుముందు భారత యువ అథ్లెట్ పూజా సింగ్ హైజంప్‌లో జాతీయ రికార్డు తిరగరాసింది. 17 ఏళ్ల పూజ 1.83 మీటర్ల ఎత్తు దూకి ఫైనల్‌కు అర్హత సాధించింది. ఈ క్రమంలో పూజ తన పేరిటే ఉన్న జాతీయ రికార్డును (1.82 మీటర్లు) బద్దలు కొట్టింది. హరియాణాకు చెందిన తాపీ మేస్త్రీ కూతురైన పూజ క్వాలిఫయింగ్ రౌండ్‌లో తొమ్మిదో స్థానంతో ఫైనల్‌కు అర్హత సాధించింది. సరైన సౌకర్యాలు లేకుండానే అండర్–14 స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి స్వర్ణం నెగ్గిన పూజ... ఆ తర్వాత 2022 జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో అండర్–16, అండర్–18 పోటీల్లో పసిడి పతకాలు కైవసం చేసుకుంది.

ఫైనల్లో అనాహత్

కోల్‌కతా: భారత టీనేజ్ సంచలనం అనాహత్ సింగ్ హెచ్‌సీఎల్ స్క్వాష్ టూర్ పీఎస్ఏలో ఫైనల్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో అనాహత్ సింగ్ 11–3, 11–4, 11–4తో ఫెరెష్ట్ ఎహెతెదరి (ఇరాన్)పై అలవోకగా నెగ్గింది. ఆసియా క్రీడల్లో కాంస్య పతకం నెగ్గిన అనాహత్.. శనివారం జరగనున్న తుదిపోరులో జేమ్యా అరిబాడో (ఫిలిప్పీన్స్)తో అమీతుమీ తేల్చుకోనుంది. పురుషుల సింగిల్స్‌లో భారత ఆటగాడు సూరజ్ చంద్ గాయం కారణంగా తప్పుకున్నాడు.

చెన్నైపై యు ముంబా పైచేయి

చెన్నై: అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ (యూటీటీ) లీగ్‌లో భాగంగా సీనియర్ ప్లేయర్ ఆచంట శరత్ కమల్‌తో జరిగిన హోరాహోరీ పోరులో మానవ్ ఠక్కర్ విజయం సాధించాడు. దీంతో మానవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న యు ముంబా టీటీ జట్టు 8–7తో చెన్నై లయన్స్‌పై గెలిచింది. ఈ ఫలితంతో యు ముంబా టీటీ జట్టు పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి చేరింది. 'టై'లో భాగంగా జరిగిన పురుషుల సింగిల్స్ పోరులో మానవ్ 6–11, 11–8, 11–9తో శరత్ కమల్‌పై గెలుపొందాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో మానవ్–మారియా జంట 11–7, 11–10, 11–4తో శరత్–సకురా మోరీ ద్వయంపై గెలిచింది. ఇతర మ్యాచ్‌ల్లో అరునా ఖాద్రి 10–11, 11–9, 11–7తో రోలాండ్‌పై విజయం సాధించగా.. సుతీర్థ ముఖర్జీ 8–11, 10–11, 7–11 సాకురా మోరీ చేతిలో మారియా 10–11, 8–11, 11–10తో మౌమా దాస్ చేతిలో పరాజయం పాలయ్యారు.



డోపింగ్‌లో దొరికిన భారత అథ్లెట్ పర్వేజ్

న్యూఢిల్లీ: భారత అథ్లెట్ పర్వేజ్ ఖాన్ డోపింగ్‌లో దొరికిపోయాడు. నిషిద్ధ ఉత్ప్రేరకాలు తీసుకున్నట్లు తేలడంతో జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) అతనిపై తాత్కాలిక సస్పెన్షన్ వేటు వేసింది. 19 ఏళ్ల భారత మిడిల్ డిస్టెన్స్ రన్నర్ ఈ ఏడాది అమెరికాలోని నేషనల్ కాలేజియట్ అథ్లెటిక్స్ అసోసియేషన్ (ఎన్‌సీఏఏ) సర్క్యూట్‌లో ఫైనల్స్ చేరిన తొలి భారత అథ్లెట్‌గా ఘనతకెక్కాడు. ఈ జూన్‌లో పంచ్‌కులాలో నిర్వహించిన జాతీయ ఇంటర్ స్టేట్ చాంపియన్‌షిప్‌లో 1500 మీటర్ల రన్నింగ్‌లో అతను 3 నిమిషాల 42.95 సెకన్ల టైమింగ్‌తో బంగారు పతకం సాధించాడు. అయితే ఒలింపిక్ క్వాలిఫయింగ్ టైమింగ్ (3ని.33.50 సెకన్లు)ను నమోదు చేయడంలో విఫలమయ్యాడు. ఈ పోటీల సందర్భంగా అతని నుంచి సేకరించిన రక్త, మూత్ర నమూనాలను 'నాడా' లేబోరేటరీలో పరీక్షించగా అతను నిషేధిత ఉత్ప్రేరకాలు తీసుకున్నట్లు తేలింది. కచ్చితంగా ఏ రకమైన ఉత్ప్రేరకాలు తీసుకున్నాడో 'నాడా' వెల్లడించలేదు. ప్రస్తుతానికి తాత్కాలిక నిషేధం విధించినప్పటికీ అతని 'బి' శాంపిల్ పరీక్షలోనూ డోపీగా దొరికితే మాత్రం గరిష్టంగా నాలుగేళ్ల నిషేధానికి గురవుతాడు. హరియాణాకు చెందిన పర్వేజ్ టీనేజ్ ప్రాయం నుంచే పతకాలు సాధిస్తూ వచ్చాడు. ప్రస్తుతం అతను ఫ్లోరిడా యూనివర్సిటీ (అమెరికా)లో స్కాలర్‌షిప్‌తో ఉన్నత విద్యనభ్యసిస్తున్నాడు.



ఆనందమానందమాయె...

పారిస్ పారాలింపిక్స్ మహిళల తైక్వాండో కె44-47 కేజీల విభాగంలో కాంస్య పతకం గెలుచుకున్నాక తన కోచ్‌తో సంబరం చేసుకుంటున్న శరణార్థి పారాలింపిక్ జట్టు క్రీడాకారిణి జకియా ఖుదాదాది.

ప్రిక్వార్టర్స్‌లో కోకో గాఫ్



న్యూయార్క్: యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో డిఫెండింగ్ చాంపియన్ కోకో గాఫ్ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. శుక్రవారం జరిగిన మూడో రౌండ్ మ్యాచ్‌లో మూడో సీడ్ కోకో గాఫ్ 3–6, 6–3, 6–3తో 27వ సీడ్ స్వితోలినా (ఉక్రెయిన్)పై విజయం సాధించింది. ఏడో సీడ్ పౌలా కిన్‌వెన్ జెంగ్ (చైనా), 26వ సీడ్ పౌలా బదోసా (స్పెయిన్) కూడా ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. మూడో రౌండ్ మ్యాచ్‌ల్లో కిన్‌వెన్ జెంగ్ 6–2, 6–1తో జూలీ నెమియర్ (జర్మనీ)పై, పౌలా బదోసా 4–6, 6–1, 7–6 (10/8)తో ఎలెనా రూస్ (రొమేనియా)పై గెలిచారు. పురుషుల డబుల్స్ విభాగంలో గత ఏడాది రన్నరప్ రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ శుభారంభం చేసింది. తొలి రౌండ్‌లో బోపన్న–ఎబ్డెన్ జంట 6–3, 7–5తో సాండెర్ అరెండ్స్–రాబిన్ హాస్ (నెదర్లాండ్స్) జోడీపై విజయం సాధించింది.

అట్కిన్‌సన్ అదరహో

- సెంచరీ కొట్టిన ఇంగ్లండ్ బౌలర్
- లార్డ్స్ ఆనర్ బోర్డులో చోటు
- ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 427
- శ్రీలంక తొలి ఇన్నింగ్స్ 196 ఆలౌట్



లండన్: ఇంగ్లండ్ యువ పేస్ బౌలర్ అట్కిన్‌సన్ (115 బంతుల్లో 118; 14 ఫోర్లు, 4 సిక్సర్లు) లార్డ్స్ ఆనర్ బోర్డ్‌లో చోటు దక్కించుకున్నాడు. శ్రీలంకతో రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో అద్భుత బ్యాటింగ్‌తో ఆకట్టుకున్న అట్కిన్‌సన్ ధనాధన్ ఇన్నింగ్స్‌తో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 26 ఏళ్ల అట్కిన్‌సన్‌కు ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో ఇదే తొలి శతకం కావడం విశేషం. గత నెలలో వెస్టిండీస్ సిరీస్ ద్వారా లార్డ్స్‌లోనే అంతర్జాతీయ టెస్టు అరంగేట్రం చేసిన అట్కిన్‌సన్ ఆడిన మొదటి మ్యాచ్ రెండు ఇన్నింగ్స్‌ల్లో ఐదు వికెట్ల ప్రదర్శనతో మొత్తం 12 వికెట్లు తీసి ఇప్పటికే లార్డ్స్ ఆనర్ బోర్డులో తన పేరు నమోదు చేసుకున్నాడు. ఇప్పుడు బ్యాటింగ్ ప్రతిభతో మరోసారి అందులో చోటు దక్కించుకున్నాడు. అట్కిన్‌సన్ దూకుడుతో ఓవర్‌నైట్ స్కోరు 358/7తో శుక్రవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్ 427 పరుగులకు ఆలౌటైంది. శ్రీలంక బౌలర్లలో అసితా ఫెర్నాండో 5, మిలాన్ రత్నాయకే, లహిరు కుమార చెరో రెండు వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంక 55.3 ఓవర్లలో 196 పరుగులు చేసి ఆలౌటైంది. కమిందు మెండిస్ (120 బంతుల్లో 74; 8 ఫోర్లు, 3 సిక్సర్లు) ఒంటరి పోరాటం చేశాడు. ఇంగ్లండ్ బౌలర్లలో క్రిస్ వోక్స్, అట్కిన్‌సన్, ఓలీ స్టోన్, మాథ్యూ పాట్స్ తలా రెండు వికెట్లు తీశారు. తొలి ఇన్నింగ్స్‌లో 231 పరుగుల ఆధిక్యం దక్కించుకున్న ఇంగ్లండ్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో ఒక వికెట్ కోల్పోయి 25 పరుగులు చేసింది. డాన్ లారెన్స్ (7) ఔట్ కాగా.. కెప్టెన్ ఓలీ పోప్ (2 బ్యాటింగ్), బెన్ డకెట్ (15 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. చేతిలో తొమ్మిది వికెట్లు ఉన్న ఇంగ్లండ్ ఓవరాల్‌గా 256 పరుగుల ఆధిక్యంలో ఉంది.

టి20 ప్రపంచకప్ తర్వాత కెప్టెన్సీకి సోఫీ డివైన్ గుడ్‌బై



క్రైస్ట్‌చర్చ్: న్యూజిలాండ్ మహిళా క్రికెట్ స్టార్ ఆల్‌రౌండర్ సోఫీ డివైన్ త్వరలో జరిగే టి20 ప్రపంచకప్ అనంతరం సారథ్య బాధ్యతల నుంచి తప్పుకోనుంది. పొట్టి ఫార్మాట్‌లో భవిష్యత్ సారథులకు అవకాశామివ్వాలనే ఉద్దేశంతో పాటు తన ఆటతీరుపై మరింత దృష్టి సారించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. అయితే వన్డే ఫార్మాట్‌లో మాత్రం కెప్టెన్‌గా కొనసాగుతానని 34 ఏళ్ల సోఫీ చెప్పింది. కెప్టెన్సీతో కొన్ని సందర్భాల్లో అదనపు ఒత్తిడికి గురవుతున్నట్లు చెప్పిన ఆమె కొన్నిసార్లు కఠిన సవాళ్లు కూడా ఎదుర్కొన్నట్లు పేర్కొంది. 'పొట్టి ఫార్మాట్‌లో నా ఆల్‌రౌండర్ పాత్రను సమర్థంగా పోషించేందుకు నా నిర్ణయం దోహదం చేస్తుంది. అలాగే కొత్త వారిని సారథిగా తయారు చేసేందుకు అవకాశం లభిస్తుంది. వన్డే ఫార్మాట్‌లో మాత్రం ఇప్పుడప్పుడే కెప్టెన్సీని వదులుకోను' అని కివీస్ స్టార్ వివరించింది. ప్రస్తుతం కాలి పాదం గాయం నుంచి కోలుకుంటున్న ఆమె ప్రపంచకప్ నాటికి పూర్తిస్థాయి ఫిట్‌నెస్ సాధిస్తానని చెప్పింది. అంతర్జాతీయ మహిళా క్రికెట్‌లో 2006లో అరంగేట్రం చేసిన ఆమె అనతికాలంలోనే న్యూజిలాండ్ తరుపుముక్కగా ఎదిగింది. కెరీర్‌లో మొత్తం 135 టి20లు ఆడిన ఈ ఆల్‌రౌండర్ 3268 పరుగులు చేసింది. 2020లో జట్టు పగ్గాలు చేపట్టి 56 మ్యాచ్‌ల్లో జట్టును నడిపించింది. ఇందులో 25 మ్యాచ్‌ల్లో కివీస్ నెగ్గగా, 28 మ్యాచ్‌ల్లో ఓడింది. మూడింట ఫలితం రాలేదు. బంగ్లాదేశ్‌లో రాజకీయ సంక్షోభం, హింసాత్మక ఘటనలతో అక్కడ నిర్వహించాల్సిన టి20 ప్రపంచకప్‌ను యూఏఈకి మార్చారు. అక్టోబర్ 3 నుంచి షార్జా, దుబాయ్ వేదికలపై మెగా ఈవెంట్ పోటీలు జరుగుతాయి. ఈ టోర్నీలో పాల్గొనే న్యూజిలాండ్ మహిళల జట్టును వచ్చే నెల 10న ఎంపిక చేస్తారు. ఈ జట్టు ఆస్ట్రేలియాలో ముందుగా మూడు టి20 మ్యాచ్‌ల ద్వైపాక్షిక సిరీస్‌లో తలపడుతుంది.

తొలి రోజు వర్షార్పణం

పాకిస్తాన్, బంగ్లాదేశ్ రెండో టెస్టు



రావల్పిండి: ఎడతెరిపి లేని వర్షం కారణంగా పాకిస్తాన్, బంగ్లాదేశ్ జట్ల మధ్య రెండో టెస్టు తొలి రోజు ఆట సాధ్య పడలేదు. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా తొలి టెస్టులో బంగ్లాదేశ్ విజయం సాధించగా... శుక్రవారం ప్రారంభం కావాల్సిన రెండో మ్యాచ్‌లో టాస్ కూడా పడలేదు. భారీ వర్షం కారణంగా మైదానం మొత్తం నిండిపోవడంతో తొలి రోజు ఆటను రద్దు చేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. టెస్టు క్రికెట్ చరిత్రలో తొలిసారి బంగ్లాదేశ్ చేతిలో పరాజయం పాలై ఇప్పటికే విమర్శలు ఎదుర్కొంటున్న పాకిస్తాన్... ఈ మ్యాచ్‌లోనైనా గెలిచి సిరీస్ సమం చేయాలనుకుంటే తొలి రోజు అది సాధ్యపడలేదు. మిగిలిన నాలుగు రోజులు నిర్ణీత సమయం కంటే అరగంట ముందే ఆట ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్ కోసం పాకిస్తాన్ జట్టు స్టార్ పేసర్ షాహీన్ అఫ్రిదిని పక్కన పెట్టి లెగ్‌స్పిన్నర్ అబ్రార్ అహ్మద్‌ను 12 మందితో కూడిన జట్టులో చోటు కల్పించింది. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో ప్రస్తుతం బంగ్లాదేశ్ 7వ, పాకిస్తాన్ 8వ స్థానాల్లో కొనసాగుతున్నాయి.

తన్వీ రెడ్డి సంచలనం

ఆసియా అండర్–15 చాంపియన్‌పై విజయంతో సెమీస్‌లోకి



పుణే: ఇండియా జూనియర్ ఇంటర్నేషనల్ గ్రాండ్‌ప్రి బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల అండర్–19 సింగిల్స్ విభాగంలో తెలంగాణకు చెందిన అండ్లూరి తన్వీ రెడ్డి సంచలనం సృష్టించింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో తన్వీ రెడ్డి 21–8, 21–10తో ఆసియా అండర్–15 చాంపియన్, నాలుగో సీడ్ తన్వీ పత్రి (భారత్)పై గెలిచి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. తెలంగాణకే చెందిన బోనం ప్రశంస కూడా సెమీఫైనల్ చేరగా... కలగొట్ల వెన్నెల పోరాటం ముగిసింది. ప్రశంస 15–21, 21–15, 21–19తో మూడో సీడ్ ముస్కాన్ ఖాన్ (భారత్)ను బోల్తా కొట్టించగా... వెన్నెల 14–21, 12–21తో థలిత విర్యావాన్ (ఇండోనేసియా) చేతిలో ఓడిపోయింది. అండర్–19 పురుషుల సింగిల్స్ విభాగంలో తెలంగాణ కుర్రాడు తలశిల టంకర జ్ఞాన దత్తు కథ ముగిసింది. క్వార్టర్ ఫైనల్లో జ్ఞాన దత్తు 21–14, 11–21, 14–21తో యాంగ్ చె డాన్ (చైనీస్ తైపీ) చేతిలో పరాజయం పాలయ్యాడు.

సాక్షి ప్లస్
శనివారం: 31-8-2024


వక్ఫ్(సవరణ) బిల్లుపై సూచనలు ఇవ్వండి

- భాగస్వామ్య పక్షాలకు జేపీసీ వినతి
- 15 రోజుల్లోగా అభిప్రాయాలు తెలియజేయాలని సూచన

సాక్షి, న్యూఢిల్లీ: వక్ఫ్(సవరణ) బిల్లుపై భాగస్వామ్య పక్షాల నుంచి సలహాలు, సూచనలు ఆహ్వానించాలని సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) నిర్ణయించింది. కమిటీ రెండో సమావేశం చైర్మన్ జగదాంబికా పాల్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. బిల్లుపై సాధారణ ప్రజలతోపాటు స్వచ్ఛంద సంస్థలు, నిపుణుల నుంచి అభిప్రాయాలు, సూచనలు కోరుతూ లోక్‌సభ సెక్రటేరియట్ ఓ ప్రకటన విడుదల చేసింది. ''లోక్‌సభలో ప్రవేశపెట్టిన వక్ఫ్ (సవరణ) బిల్లు-2024ను పరిశీలన, నివేదిక నిమిత్తం సంయుక్త పార్లమెంటరీ కమిటీకి పంపించారు. ప్రతిపాదిత బిల్లుపై జేపీసీకి లిఖితపూర్వకంగా సలహాలు, సూచనలు 15 రోజుల్లోగా ఇవ్వొచ్చు. ఇందుకోసం రెండు కాపీలు ఆంగ్లం లేదా హిందీ భాషల్లో జాయింట్ సెక్రెటరీ, లోక్‌సభ సెక్రటేరియట్, రూమ్ నెం.440, పార్లమెంట్ హౌస్ అనెక్స్, న్యూఢిల్లీ-110001 చిరునామాకు పంపాలి. jpcwaqfrr@ranrad.nic.in కు ఈ-మెయిల్ చేయొచ్చు''అని సూచించింది. వక్ఫ్ సవరణ బిల్లు ఇప్పటికే లోక్‌సభ వెబ్‌సైట్‌లో ఆంగ్లం, హిందీ భాషల్లో అందుబాటులో ఉంది. భాగస్వామ్యపక్షాల నుంచి వచ్చిన సూచనలు, సలహాలను గోప్యంగా ఉంచుతారు. కమిటీ ముందు ఎవరైనా వ్యక్తిగతంగా హాజరు కావాలని కోరుకుంటే ఆ విషయాన్ని లిఖితపూర్వకంగా తెలియజేయాలి. సెంట్రల్ పోర్టల్ ద్వారా వక్ఫ్ బోర్డు ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియతోపాటు ఇతర సంస్కరణల కోసం వక్ఫ్(సవరణ) బిల్లును కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంగతి తెలిసిందే.

ముస్లిం సంఘాలతో జేపీసీ సమావేశం

ఆల్ ఇండియా సున్ని జమియాతుల్ ఉలామా(ముంబై), ఇండియన్ ముస్లిమ్స్ ఫర్ సివిల్ రైట్స్(ఢిల్లీ), సున్ని సెంట్రల్ వక్ఫ్ బోర్డు(యూపీ), రాజస్తాన్ బోర్డ్ ఆఫ్ ముస్లిం వక్ఫ్, ఇండియన్ ముస్లిం ఫర్ సివిల్ రైట్స్(ఢిల్లీ) తదితర సంఘాల ప్రతినిధులతో జేపీసీ సభ్యులు శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సమావేశం 8 గంటలపాటు సుదీర్ఘంగా జరిగింది. బిల్లుపై ఆయా సంఘాల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వాడీవేడీగా సంవాదం జరిగింది. బిల్లులోని కొన్ని అంశాలపై ప్రతిపక్ష సభ్యులు అభ్యంతరం తెలిపారు. సమావేశం నంచి కొంతసేపు వాకౌట్ చేశారు. వక్ఫ్ ఆస్తిని నిర్ధారించే అధికారాన్ని జిల్లా కలెక్టర్‌కు కట్టబెట్టడం సరైంది కాదని పేర్కొన్నారు. సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్, రాష్ట్రాల వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరులను నియమించాలన్న ప్రతిపాదన పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.



మధ్య ఆసియా దేశం తుర్క్‌మెనిస్తాన్‌లోని కారకుమ్ ఎడారి మధ్యలో ఉన్న అగ్ని జ్వాలల గొయ్యి ఇది. 'దర్వాజా'గా పిలిచే ఈ ప్రాంతం వద్ద 50 ఏళ్ల క్రితం సోవియెట్ యూనియన్ జమానాలో సహజవాయు నిక్షేపాల కోసం డ్రిల్లింగ్ చేపట్టారు. ఫలితం లేక వదిలేశారు. తర్వాత అక్కడ ఇలా భారీ గొయ్యి ఏర్పడింది. మీథేన్ వాయువు విడుదలతో 230 అడుగుల వెడల్పు, 100 అడుగుల లోతులో వలయాకారంలో ఇలా నిరంతరాయంగా మంటలు వస్తూనే ఉన్నాయి. దాంతో ఇది ప్రపంచ పర్యాటకులకు ఆకర్షణస్థలైంది. 'గేట్స్ ఆఫ్ హెల్'గా పిలిచే ఈ మండుతున్న గొయ్యికి అతి సమీపంలోకి పర్యాటకులు వెళ్లకుండా రక్షణ కంచె ఏర్పాటు చేశారు.



పడవ ముందుభాగంలో సరదాగా తెడ్డు వేస్తున్నది కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో. డైవ్ టూర్స్ సీఈవో బ్రాడ్ రాబిన్సన్‌తో కలిసి శుక్రవారం సాల్ట్ స్ప్రి. మేరీ నగర సమీపంలోని సెయింట్ మేరీస్ నదిలో ఇలా పడవ షికారు చేశారు.

విమానం బాత్రూంలో చిన్నారి..

చైనాలో ఇద్దరు మహిళల నిర్వాకం

విమానంలో నాన్‌స్టాప్‌గా ఏడుస్తూ డిస్టర్బ్ చేస్తోందని ఇద్దరు ప్రబుద్ధులు ఓ చిన్నారిని ఏకంగా తమతో పాటుగా బాత్రూంలోకి తీసుకెళ్లి తాళం పెట్టేశారు. ఏడుపు మానాక గానీ బయటికి తీసుకురాలేదు. చైనాలో గుయాంగ్ నుంచి షాంఘై వెళ్తున్న విమానంలో ఈ ఉదంతం చోటుచేసుకుంది. తాతయ్య, నానమ్మలతో పాటు ప్రయాణిస్తున్న ఏడాది వయసున్న పాప విమానం బయల్దేరినప్పటి నుంచీ ఆపకుండా ఏడుపందుకుంది. దాంతో చిర్రెత్తుకొచ్చిన తోటి ప్రయాణికులైన ఇద్దరు మహిళలు తాము ఏడుపు ఆపుతామంటూ పాపను తీసుకుని ఏకంగా బాత్రూంలో దూరి గొళ్లెం పెట్టుకున్నారు. ఒకరు టాయ్‌లెట్ సీటుపై కూచుని ఏడుపు ఆపుతావా లేదా అంటూ గద్దిస్తుంటే ఇంకొకరు తీరిగ్గా వీడియో తీశారు. ఏడుపాపితే గానీ తాత, నానమ్మ దగ్గరికి తీసుకెళ్లేది లేదంటూ పాపను బెదిరించారు. చివరికి తను ఊరుకున్నాక కూడా, ఏడిస్తే మళ్లీ బాత్రూంలోకి తెచ్చి పడేస్తామంటూ బెదిరించారు. పైగా తమ ఘనకార్యాన్నంతటినీ సోషల్ మీడియాలో షేర్ చేశారు. మహిళల బెదిరింపులు, పాప భయపడిపోయి తలుపు కేసి చేయి చాచడం వంటివి చూసి వాళ్ల తీరుపై నెటిజన్లు తీవ్రంగా మండిపడటంతో వీడియోను డిలీట్ చేశారు. ఈ ఘటన ఆగస్టు 24న జరిగినట్టు సంబంధిత ఎయిర్‌లైన్స్ వివరించింది. గుక్కపట్టి ఏడుస్తున్న చిన్నారికి 'పాఠం చెప్పడానికి' వృద్ధుల అనుమతితో వాళ్లిద్దరూ ఇలా చేసినట్టు ఒక ప్రకటనలో చెప్పుకొచ్చింది. దీనిపై విమర్శలు చెలరేగడంతో క్షమాపణలు చెప్పింది. సదరు ప్రయాణికులను తమ సిబ్బంది కూడా మందలించారని వెల్లడించింది. బహిరంగ ప్రదేశాల్లో పిల్లలను ఎలా చూసుకోవాలన్న దానిపై ఆన్‌లైన్‌లో పెద్ద చర్చకు ఈ ఉదంతం దారితీసింది.

– సాక్షి, నేషనల్ డెస్క్



అభిమానులకు అభివాదం చేస్తున్న నార్వే యువరాణి మార్తా లూయిస్. ఆమె కాబోయే భర్త అమెరికాకు చెందిన దురెక్ వెర్రెట్. పెళ్లి వేడుకల కోసం శుక్రవారం కుటుంబసభ్యులతో కలిసి అలెసండ్ ప్రాంతానికి చేరుకున్నప్పటి దృశ్యమిది. ఇక్కడి గైరంగెర్ గ్రామంలో శనివారం వారి వివాహ వేడుక జరగనుంది.

గాజాకు 3 రోజుల ఊరట

- ఇజ్రాయెల్ తాత్కాలిక యుద్ధ విరామం
- గాజాలో పోలియో వ్యాక్సిన్ డ్రైవ్ కోసమే

లండన్: గాజాపై దాడులకు ఇజ్రాయెల్ తాత్కాలిక విరామం ఇచ్చింది. గాజాలో పోలియో వ్యాక్సిన్ డ్రైవ్ కోసం ఇజ్రాయెల్ ఇందుకు అంగీకారం తెలిపిందని ఐరాస ప్రకటించింది. పాతికేళ్ల తరవాత గాజాలో ఓ బాలుడిలో పోలియో వ్యాధిని గుర్తించారు. దీని నివారణకు పిల్లలకు టీకా డ్రైవ్ నిర్వహించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) నిర్ణయించింది. దాంతో ఇజ్రాయెల్ 'మానవతా విరామం'ఇచ్చినట్టు డబ్ల్యూహెచ్‌ఓ తెలిపింది. ఈ నేపథ్యంలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు ఉదయం ఆరింటి నుంచి మధ్యాహ్నం మూడింటి దాకా యుద్ధవిరామం ఉండనుంది. ఇది విరామమే తప్ప కాల్పుల విరమణ కాదని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రకటించారు.

మూడు దశల్లో డ్రైవ్...

గాజా స్ట్రిప్ అంతటా సుమారు 6.4 లక్షల మంది పిల్లలకు టీకాలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు డబ్ల్యూహెచ్‌ఓ సీనియర్ అధికారి రిక్ పీపర్‌కోర్న్ తెలిపారు. డబ్ల్యూహెచ్‌ఓ, యునిసెఫ్, యూఎన్‌ఆర్‌డబ్ల్యూఏ సహకారంతో పాలస్తీనా ఆరోగ్య శాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. ఇది గాజా మధ్య, దక్షిణ, ఉత్తర భాగాల్లో మూడు దశల్లో జరుగుతుంది. గాజాలో ఇప్పటికే 12.6 లక్షల ఓరల్ పోలియో వ్యాక్సిన్ టైప్ 2 (ఎన్‌ఓపీవీ 2) డోసులున్నాయి. త్వరలో మరో 4 లక్షల డోసులు రానున్నాయి. వ్యాక్సిన్ ఇచ్చేందుకు 2,000 మందికి పైగా హెల్త్ వర్కర్లకు శిక్షణ ఇచ్చారు. గాజా లోపల వైరస్ వ్యాప్తిని నివారించడానికి స్ట్రిప్ అంతటా 90% వ్యాక్సిన్ కవరేజీ సాధించాలని డబ్ల్యూహెచ్‌ఓ భావిస్తోంది. అందుకోసం అవసరమైతే మరో రోజు యుద్ధవిరామానికి ఇజ్రాయెల్‌తో ఒప్పందం కుదిరింది. గాజాలో 2022లో 99% పోలియో వ్యాక్సినేషన్ డ్రైవ్ జరిగింది. గతేడాది 89%కి తగ్గింది. యుద్ధం వల్ల వ్యాక్సిన్ వేయక అధిక సంఖ్యలో పిల్లలు పోలియో బారిన పడే ప్రమాదముందని పాలస్తీనా ఆరోగ్య శాఖ తెలిపింది. ఈ నేపథ్యంలో గాజా స్ట్రిప్‌లోని 6.5 లక్షలకు పైగా పాలస్తీనా బాలలను రక్షించడానికి అంతర్జాతీయ సంస్థలతో సహకరించేందుకు సిద్ధమని హమాస్ కూడా తెలిపింది.



పోలియో బాధిత చిన్నారి

తన ఆడి కారును ఢీకొట్టాడని..

క్యాబ్ డ్రైవర్‌ను ఎత్తి నేలకేసి కొట్టిన ముంబై వాసి

ముంబై: ఖరీదైన తన ఆడి కారును ఢీకొట్టాడంటూ క్యాబ్ డ్రైవర్‌పై ప్రతాపం చూపించాడో వ్యక్తి. ముంబై ఘట్కోపర్‌లోని అసల్ఫా ప్రాంతంలో ఆగస్టు 18వ తేదీన రాత్రి 11.20 గంటల సమయంలో చోటుచేసుకుంది. కయాముద్దీన్ అన్సారీ(24) ఓలా క్యాబ్‌ను నడుపుకుంటూ ఉల్వేవైపు వెళ్తూ పొరపాటున ఆడి కారును స్వల్పంగా ఢీకొట్టాడు. దీంతో, ఆ కారుకు పక్కన సొట్ట పడింది. ఆడి కారులో ఉన్న రిషబ్ చక్రవర్తి, అతడి భార్య అంతర ఘోష్‌లు అన్సారీ కారును అడ్డగించి దూషిస్తూ అతడిపై చేయిచేసుకున్నారు. రిషబ్ అంతటితో ఆగక అన్సారీని రెండు చేతులతో పైకెత్తి నేలకేసి కొట్టాడు. జనం పోగవ్వడంతో అక్కడి నుంచి వారు వెళ్లిపోయారు. తలకు తీవ్ర గాయాలతో లేవలేని స్థితిలో ఉన్న అన్సారీని స్థానికులు జేజే ఆస్పత్రిలో చేర్పించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరలవుతోంది. కోలుకున్న బాధితుడు అన్సారీ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు రిషబ్, అంతరలపై శుక్రవారం వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నేటి నుంచి ఆర్‌ఎస్‌ఎస్ సమన్వయ భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) జాతీయ సమన్వయ సమావేశాలు కేరళలోని పాలక్కాడ్‌లో శనివారం ప్రారంభం కానున్నాయి. మహిళల భద్రత, సాధికారతే ప్రధాన ఎజెండాగా సోమవారం వరకు జరిగే వార్షిక సమావేశాలకు సంఘ్ అనుబంధ సంస్థల ప్రముఖులు హాజరుకానున్నారు. మూడు రోజులపాటు జరిగే సమావేశాల్లో దేశంలోని తాజా పరిస్థితులు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు, దేవాలయాల ధ్వంసం వంటి అంశాలను చర్చించే అవకాశముంది. కొద్ది రోజుల క్రితం కేంద్ర మంత్రి అమిత్ షా నివాసంలో బీజేపీ అధ్యక్షుడి ఎంపికపై ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ నేతలు సమావేశమయ్యారు. దీనిపై ఏకాభిప్రాయం కుదరలేదు. ఈ నేపథ్యంలో పాలక్కాడ్ సమావేశాల్లో బీజేపీ అధ్యక్షుడి ఎంపికపై నిర్ణయం తీసుకునే అవకాశముంది.

ఎన్సీపీ మంత్రుల పక్కనకూర్చుంటే వాంతి వస్తుంది

శివసేన మంత్రి తానాజీ సావంత్

ముంబై: కేబినెట్ సమావేశాల్లో నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) మంత్రుల పక్కన కూర్చుంటే.. బయటికి వచ్చా వాంతులు వస్తున్నట్లుగా ఉంటుందని శివసేనకు చెందిన మంత్రి తానాజీ సావంత్ అన్నారు. మహాయుతి కూటమిలో లుకలుకలకు సావంత్ వ్యాఖ్యలు అద్దం పట్టాయి. ఇలాంటి అవమానాలను భరించే బదులు.. ప్రభుత్వం నుంచి వైదొలగడమే మంచిదని ఎన్సీపీ స్పందించింది. ఉస్మానాబాద్‌లో ఒక కార్యక్రమంలో ఆరోగ్య మంత్రి తానాజీ సావంత్ మాట్లాడుతూ తాను కరడుగట్టిన శివసైనికుడినని, ఎన్సీపీతో కలిసి సాగలేనని చెప్పుకొచ్చారు. కేబినెట్ సమావేశాల్లో ఎన్సీపీ మంత్రుల పక్కన కూర్చుంటే బయటికొచ్చాక వాంతి వస్తున్నట్లే ఉంటుందని అన్నారు. మహారాష్ట్రలోని మహాయుతి సంకీర్ణ ప్రభుత్వంలో సీఎం ఏక్‌నాథ్ షిండే సారథ్యంలోని శివసేన, డిప్యూటీ సీఎం అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ, బీజేపీలు భాగస్వాములుగా ఉన్నాయి. 'తానాజీపై వేటు పడాలి, లేదంటే మనం మహాయుతి ప్రభుత్వం నుంచి వైదొలగాలి'అని ఎన్సీపీ అధికార ప్రతినిధి ఉమేశ్ పాటిల్ అన్నారు.

'ఎమర్జెన్సీ' విడుదల ఆపండి

సెన్సార్ బోర్డుకు అకాలీదళ్ లీగల్ నోటీసు

న్యూఢిల్లీ: బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ సినిమా 'ఎమర్జెన్సీ'విడుదలను నిలిపివేయాలని కోరుతూ కేంద్ర సెన్సార్ బోర్డు (సీబీఎఫ్‌ఎస్)కు శిరోమణి అకాలీదళ్ లీగల్ నోటీసు పంపింది. ఈ సినిమా మతపరమైన ఉద్రిక్తతలను రెచ్చగొడుతుందని, అబద్ధాలను వ్యాపింపజేస్తుందని పేర్కొంది. ఎమర్జెన్సీ ట్రైలర్ చారిత్రక వాస్తవాలను తప్పుగా చిత్రీకరించిందని, సిక్కు మతాన్ని తప్పుగా చూపుతోందని, సమాజంలో వైషమ్యాలను పెంచుతోందని, విద్వేషాలకు ఆజ్యం పోస్తుందని అకాలీదళ్ ఆరోపించింది. 'కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా వాస్తవ ప్రకటన చేయడానికి కాకుండా.. సిక్కు మతాన్ని లక్ష్యంగా చేసుకోవడానికే కంగనా రనౌత్ ఎమర్జెన్సీని కథాంశంగా ఎంచుకున్నారని పేర్కొంది. సెన్సార్ సర్టిఫికెట్‌ను ఉపసంహరించి ఎమర్జెన్సీ చిత్రం విడుదలను అడ్డుకోవాలని బోర్డును కోరింది.

సెన్సార్ సర్టిఫికెట్ రాలేదు: కంగన

తన సినిమా ఎమర్జెన్సీకి ఇంకా సెన్సార్ బోర్డు అనుమతి రాలేదని మండి ఎంపీ కంగనా రనౌత్ శుక్రవారం వెల్లడించారు. సెప్టెంబరు 6న విడుదల చేయతలపెట్టిన ఈ సినిమాలో కంగన.. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పాత్రను పోషించారు. దర్శకత్వం వహించారు. తనకు, సెన్సార్ బోర్డు సభ్యులకు బెదిరింపులు వస్తున్నాయని ఎక్స్‌లో కంగన పేర్కొన్నారు. ఇందిరను ఆమె బాడీగార్డులు హతమార్చడాన్ని చూపొద్దని తనపై ఒత్తిడులు వస్తున్నాయన్నారు.

ఉత్తరం కలిపింది వారిని...!

బ్రిటన్‌లో పోస్ట్ చేసిన 121 ఏళ్ల తర్వాత చేరిన ఓ పోస్టు కార్డు ఎప్పుడో వందేళ్ల కింద విడిపోయిన రెండు కుటుంబాలను కలిపింది. 1903లో ఎవార్ట్ అనే బాలుడు తన సోదరి లిడియాకు పంపిన పోస్టు కార్డు ఇటీవలే స్వాన్సీ బిల్డింగ్ సొసైటీ బ్రాడాక్ స్ట్రీట్ బ్రాంచ్‌కు చేరడం, ఈ సంఘటన విపరీతంగా వైరల్ కావడం తెలిసిందే. వారి కుటుంబాలను వెదికేందుకు సొసైటీ పూనుకుంది. కార్డు గురించి పత్రికల్లో వచ్చిన కథనాలతో ఎవార్ట్, లిడియాల మనవడు నిక్ డేవిస్, మనవరాళ్లు హెలెన్ రాబర్ట్, మార్గరెట్ స్పూనర్, ముని మనవరాలు ఫెయిత్ రేనాల్డ్స్ తమ బంధాన్ని గుర్తించారు. వారంతా బుధవారం స్వాన్సీలోని వెస్ట్ గ్లామోర్గాన్ ఆర్కైవ్స్‌లో కలుసుకున్నారు.

ఎవరు ఎవరికి ఏమవుతారంటే..?

ఎవార్ట్, లిడియా కుటుంబం 121 ఏళ్ల కిందట స్వాన్సీ బిల్డింగ్ సొసైటీలో నివసించేది. ఆరుగురు తోబుట్టువుల్లో లిడియా పెద్దది. తమ్ముడైన ఎవార్ట్ ఆమెకు పోస్టు కార్డు రాశాడు. వీరికి స్టాన్లీ అనే సోదరుడున్నాడు. అతని మనవరాళ్లే హెలెన్ రాబర్ట్ (58), మార్గరెట్ స్పూనర్ (61). వెస్ట్ ససెక్స్‌కు చెందిన నిక్ డేవిస్ (65) ఎవార్ట్ మనవడు. డెవాన్‌కు చెందిన ఫెయిత్ రేనాల్డ్స్ (47) లిడియా ముని మనవరాలు. తామంతా కలిసినందుకు లిడియా, ఎవార్ట్, స్టాన్లీ పైనుంచి చూసి సంతోషిస్తూ ఉంటారని వారంటున్నారు. రెండు కుటుంబాలను ఏకం చేసిన వందేళ్ల నాటి పోస్టును తిరిగి ఆర్కైవ్స్‌లోనే ఉంచాలని నిర్ణయించారు.

తాత ఇంటి నుంచి లేఖ..

''పోస్టు కార్డు రాసినప్పుడు ఎవార్ట్‌కు 13 ఏళ్లుండి ఉంటాయి. వేసవి సెలవుల్లో ఫిష్ గార్డ్‌లోని తన తాత ఇంట్లో గడిపేవాడు. పెద్ద సోదరి లిడియాకు పోస్టు కార్డులు సేకరించే అభిరుచి ఉంది. అద్భుతంగా కనిపించిన ఓ పోస్టు కార్డును తన సోదరికి పంపించాడు'' అంటూ ఎవార్ట్ మనవడు నిక్ డేవిస్ అప్పటి విషయాలను పంచుకున్నాడు. కార్డు కారణంగా ఇలా బంధువులను కలవడాన్ని ఇంకా నమ్మలేకపోతున్నానని చెబుతున్నాడు.

ఆశ్చర్యపోయా..

''పోస్టుకార్డు మా కుటుంబానికి చెందినదని భావించిన వారెవరో మమ్మల్ని సంప్రదించారు. దాంతో ఆశ్చర్యపోయా. మా బామ్మకు సోదరులున్నారని తెలియడం, వారి పిల్లలను కలవడం చాలా సంతోషంగా ఉంది. మా కుటుంబం గురించి ఇంకా ఏమేం తెలుస్తాయోనన్న ఎగ్జైట్‌మెంట్ ఉంది'' అని లిడియా ముని మనవరాలు ఫెయిత్ రేనాల్డ్స్ చెప్పుకొచ్చింది.

బంధువులను కలవడం బాగుంది...

''ఆరేళ్లుగా మా కుటుంబ వృక్షాన్ని నిర్మిస్తున్నా. ఇలాంటి కుటుంబ సభ్యులున్నారని ఇన్నాళ్లూ తెలియకపోవడం నన్ను భావోద్వేగానికి గురిచేసింది. వారిని కలుసుకోవడం బాగుంది. అప్పుడు వాళ్లున్న ఇంట్లోని వస్తువులను వేలానికి పంపినప్పుడు ఆ పోస్టు కార్డు బహుశా బైబిల్ లోంచి పడిపోయి ఉంటుంది. తరవాత ఎవరో దాన్ని తిరిగి పోస్టాఫీసుకు పంపి ఉంటారు'' అని స్టాన్లీ మనవరాళ్లు హెలెన్, స్పూనర్ చెబుతున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్



ఫొటోలో వ్యక్తులు ఎడమనుంచి వరుసగా: హెలెన్ రాబర్ట్స్, నిక్ డేవిస్, మార్గరెట్ స్పూనర్, ఫెయిత్ రేనాల్డ్స్

వెస్ట్‌బ్యాంక్‌పై కొనసాగిన దాడులు.. హమాస్ కమాండర్ హతం

ప్రకటించిన ఇజ్రాయెల్ ఆర్మీ

జెనిన్: ఆక్రమిత్ వెస్ట్‌బ్యాంక్‌పై శుక్రవారం వరుసగా మూడో రోజు తమ సైనిక ఆపరేషన్ కొనసాగిందని ఇజ్రాయెల్ ఆర్మీ తెలిపింది. జెనిన్ నగరంలో చేపట్టిన దాడుల్లో హమాస్ కమాండర్ ఒకరు మృతి చెందారని వెల్లడించింది. జెనిన్ ప్రాంత హమాస్ కమాండర్ వసెమ్ హజెమ్ తమ సరిహద్దు పోలీసుల కాల్పుల్లో చనిపోయాడని తెలిపింది. 'ఇతడికి పలు కాల్పులు, బాంబు దాడులతో సంబంధముంది. ఇతడు ప్రయాణిస్తున్న కారులో ఉన్న మరో ఇద్దరు సాయుధులు పారిపోతుండగా డ్రోన్లతో చంపేశాం. వాహనంలో ఆయుధాలు, పేలుడు పదార్థాలతోపాటు పెద్ద మొత్తంలో నగదు దొరికింది'అని ఆర్మీ పేర్కొంది. కాగా, దీనిపై హమాస్ స్పందించలేదు. మరో ఘటన..జెనిన్ శివారులోని జబబ్దెహ్ గ్రామం వద్ద ఇజ్రాయెల్ ప్రత్యేక బలగాలను తప్పించుకునేందుకు జరిగిన ప్రయత్నంలో ఓ వ్యక్తిని కారును గోడకు ఢీకొట్టాడు. అనంతరం బలగాలు ఆ కారుపై బుల్లెట్ల వర్షం కురిపించడంతో అందులోని వ్యక్తి చనిపోయాడని స్థానికులు తెలిపారు. అందులో ఉన్న మరో ఇద్దరు పారిపోతుండగా డ్రోన్లతో దాడి చేసి, చంపారని చెప్పారు. శుక్రవారం ఉదయం ఇజ్రాయెల్ సాయుధ బలగాల వాహనాలు హెలికాప్టర్లు, డ్రోన్ల రక్షణ మధ్య టుల్కారెమ్, జెనిన్ నగరాల్లోకి ప్రవేశించాయి. ఆర్మీ బుల్‌డోజర్లు మిలిటెంట్లు మందుపాతరలను నిర్వీర్యం చేసేందుకు రోడ్డు పక్కన దున్నుకుంటూ ముందుకు సాగాయి.

మానవతా సాయం కాన్వాయ్‌పై దాడి

గాజాలోని రఫా రెడ్‌క్రీసెంట్ ఆస్పత్రికి అత్యవసర మానవతా సాయం తీసుకెళ్తున్న వాహన శ్రేణిపై ఇజ్రాయెల్ ఆర్మీ దాడులు పాల్పడిందని అమెరికాకు చెందిన సంబంధిత రవాణా సంస్థ తెలిపింది. సలాహ్-అల్-దీన్ రహదారిపై జరిగిన ఈ దాడిలో పలువురు ప్రాణాలు కోల్పోయారని పేర్కొంది. అయితే, కాన్వాయ్‌కు ముందున్న వాహనాన్ని కొందరు సాయుధులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం అందడంతో దాడి చేపట్టామని ఇజ్రాయెల్ మిలటరీ పేర్కొంది. మిగతా వాహనాల జోలికి వెళ్లలేదని, మానవతా సాయంతో అవి ఆస్పత్రి దిశగా ముందుకు వెళ్లిపోయాయని వివరించింది.

మధ్యవర్తిత్వ కేంద్రంలో పరిష్కరించుకోండి

- విడాకుల కేసులో ఒమర్ అబ్దుల్లా, పాయల్‌లకు సుప్రీం సూచన
- అంగీకరించిన ఇరువర్గాలు
- 1994లో వివాహం..ఇద్దరు సంతానం

న్యూఢిల్లీ: నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు, పూర్వ జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా భార్య నుంచి విడాకుల కోసం పెట్టుకున్న పిటిషన్‌పై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఒమర్ అబ్దుల్లా, ఆయనతో వేరుపడి ఉంటున్న భార్య పాయల్ అబ్దుల్లాలు తమ సమస్య పరిష్కారం కోసం మధ్యవర్తిత్వ కేంద్రాన్ని ఆశ్రయించాలని సూచించింది. 'కొన్ని వివాహాల విషయంలో సయోధ్య ప్రయత్నాలు ఫలించకపోవచ్చని తెలిసినా వీరి విషయంలో ఒక పరిష్కారం కోసం జరుగుతున్న ప్రయత్నమిది'అని ధర్మాసనం తెలిపింది. ఈ విషయంలో మధ్యవర్తిత్వ కేంద్రం నుంచి నివేదిక అందాక 8 వారాల అనంతరం, నవంబర్ 4వ తేదీన తదుపరి విచారణ చేపడతామని జస్టిస్ సుధాన్షు ధూలియా, జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లాల ధర్మాసనం శుక్రవారం పేర్కొంది. అంతకుముందు, విచారణ సందర్భంగా ధర్మాసనం విడాకులు కోసం భర్త ఒమర్ పెట్టుకున్న పిటిషన్‌పై స్పందించాలని పాయల్‌ను కోరింది. ఒమర్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్, పాయల్ తరఫున మరో సీనియర్ లాయర్ శ్యామ్ దివాన్ వాదనలు వినిపించారు. ధర్మాసనం తెలిపిన విధంగా మధ్యవర్తిత్వంతో సమస్య పరిష్కారానికి ఇరు వర్గాలు అంగీకరించాయి. వాదనల సందర్భంగా కపిల్ సిబల్..'మధ్యవర్తిత్వానికి ఒమర్ సిద్ధంగా ఉన్నారు. అయితే, సమస్యను పరిష్కరించుకునేందుకే తప్ప, భార్యతో కలిసి ఉండేందుకు మాత్రం కాదు. ఈ దంపతులు 15 ఏళ్ల క్రితమే విడిపోయారు'అని తెలిపారు. భార్య నుంచి విడాకులు కోసం ఒమర్ అబ్దుల్లా వేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు గతేడాది డిసెంబర్ 12వ తేదీన కొట్టివేసింది. పాయల్ తన పట్ల క్రూరంగా ప్రవర్తించిందంటూ ఒమర్ చేస్తున్న ఆరోపణలకు ఆధారాలు లేవని పేర్కొన్న న్యాయస్థానం.. విడాకుల మంజూరుకు నిరాకరిస్తూ 2016లో కుటుంబ న్యాయస్థానం ఇచ్చిన తీర్పును సమర్థించింది. ఒమర్ అబ్దుల్లా, పాయల్‌లు 1994 సెప్టెంబర్‌లో వివాహం చేసుకున్నారు. వీరికి జమీర్, జహీర్ అనే కుమారులున్నారు. 17 వేళ్ల వివాహ బంధాన్ని తెంచుకుని, 2011 నుంచి భార్య నుంచి వేరుగా ఉంటున్నట్లు గతంలోనే ఒమర్ ప్రకటించారు.పాయల్‌కు భరణంగా నెలకు రూ.1.50 లక్షలతోపాటు ఇద్దరు కుమారుల పోషణకు రూ.60 వేల చొప్పున ఇవ్వాలంటూ ఒమర్ అబ్దుల్లాను ఢిల్లీ హైకోర్టు గతంలో ఆదేశించింది.



ఒమర్ అబ్దుల్లా, పాయల్



బడి 'బాట'

ఫొటోలో కనిపిస్తున్న దారి ఏదో మారుమూల ప్రాంతంలోనిది కాదు.. ఏలూరులోని సాంఘిక సంక్షేమ హాస్టల్ నుంచి విద్యార్థులు పాఠశాల, కళాశాలకు వెళ్లే దారి దుస్థితి ఇది. హాస్టల్ నుంచి మెయిన్ రోడ్ ఎక్కే వరకూ మొత్తం రోడ్డంతా గుంతల మయం. నీళ్లు నిలిచిపోయిన ఈ రోడ్డుపై విద్యార్థులు అతి కష్టంగా రాకపోకలు సాగిస్తున్నారు. జిల్లా కేంద్రంలోనే ఈ పరిస్థితి ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఏలూరు



అరాచకాలకు ఇదే నిదర్శనం...

అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కూటమి నేతల అరాచకాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. ఒకవైపు చంద్రబాబు ఇసుక ఫ్రీ అని చెబుతుంటే మరోవైపు కూటమి నేతలు భారీఎత్తున ఇసుక అమ్ముకుంటున్నారు. అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను అలిపిరి పోలీసులు పట్టుకుని ఇలా పోలీస్ స్టేషన్ వద్ద ఉంచారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



మనుగడకు మొక్కే దిక్కు

ఒకవైపు జనాభా పెరుగుతుంటే మరోవైపు పచ్చదనం కనుమరుగైపోతోంది. ఫలితంగా పర్యావరణ అసమతుల్యత ఏర్పడి ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయి. దీన్ని గుర్తించిన ప్రభుత్వాలు మొక్కలు నాటడాన్ని ప్రోత్సహిస్తున్నాయి. వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజ్ మైదానంలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

'మిషన్ లైఫ్'తో భవిష్యత్తు!

పర్యావరణ పరిరక్షణ, ఇంధన సంరక్షణ లక్ష్యంగా బీఈఈ అడుగులు

- గత ప్రభుత్వంలో విజయవాడ, విశాఖ, తిరుపతి, కాకినాడ, కర్నూలు ఎంపిక
- ఇప్పుడు రాజమహేంద్రవరంపైనా బీఈఈ దృష్టి
- ఏడు విభాగాల్లో 75 కార్యక్రమాలతో ప్రజల్లో అవగాహన
- 'మిషన్ లైఫ్'తో పర్యావరణ పరిరక్షణ, ఆర్థిక వృద్ధి, గ్రీన్ జాబ్స్ సృష్టించవచ్చని అంచనా

సాక్షి, అమరావతి: వాతావరణంలో జరుగుతున్న అనూహ్య మార్పులు మానవ జీవితాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే పర్యావరణం పూర్తిగా దెబ్బతిని భావితరాలు భూమిపై మనుగడ సాగించడమే కష్టమయ్యే అవకాశముంది. అందుకే పర్యావరణాన్ని కాపాడుకుంటూ.. నీరు, ఇంధనం తదితరాలన్నీ పొదుపుగా వినియోగించాలి. ప్లాస్టిక్‌ను విడనాడాలి.. కాలుష్యాన్ని తగ్గించాలి. ఈ లక్ష్యాలతో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ(బీఈఈ) 'మిషన్ లైఫ్'కు శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వంలో ఏపీ నుంచి పలు నగరాలు ఎంపికవ్వగా.. అందులో రాజమహేంద్రవరం కూడా చేరింది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ కృషితో..

భావితరాలకు ఇంధన వనరులను అందించడం కోసం.. పర్యావరణంలోని కర్బన ఉద్గారాలను తగ్గించి ప్రకృతిని కాపాడటమే లక్ష్యంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతగానో కృషి చేసింది. బీఈఈ నేతృత్వంలో జరిగే 'మిషన్ లైఫ్' కార్యక్రమాలకు చేయూతనందించింది. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ఇంధన సంరక్షణ, నీటి సంరక్షణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను విడనాడడం, మంచి ఆహారపు అలవాట్లు, ఆరోగ్యకరమైన జీవితం, చెత్త, ఈ–వేస్ట్ తగ్గింపు అనే ఏడు విభాగాల్లో 75 కార్యక్రమాలను మన రాష్ట్రంలో అమలు చేసేందుకు బీఈఈ శ్రీకారం చుట్టింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కాకినాడ, కర్నూలు నగరాలను బీఈఈ ఎంపిక చేసుకుంది. ఆ క్రమంలో రాజమహేంద్రవరంపైనా బీఈఈ దృష్టి సారించింది.

విస్తృత ప్రచారం..

మిషన్ లైఫ్‌లో భాగంగా విస్తృత ప్రచారం కోసం స్థానికంగా లైఫ్ గ్రూపులను ఏర్పాటు చేయడం, సైకిల్ ర్యాలీలు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌లపై ప్రత్యేక డ్రైవ్‌లు, సోషల్ మీడియాలో ప్రచారం, కమ్యూనిటీ వర్క్‌షాప్‌లు, సెమినార్లు, క్విజ్ ప్రోగ్రామ్‌లను బీఈఈ నిర్వహిస్తోంది. ట్రాఫిక్ పోలీసులు, వలంటీర్ల ద్వారా.. సిగ్నల్ వద్ద రెడ్ లైట్ పడినప్పుడు వాహనాల ఇంజిన్‌లను ఆపివేసేలా ప్రత్యేక ప్రచారం, కాలుష్య కారక వాహనాలను అరికట్టడం కోసం ప్రత్యేక డ్రైవ్‌లను చేపడుతోంది. స్కూళ్లలో ఎనర్జీ క్లబ్‌ల ఏర్పాటు ద్వారా విద్యార్థులు తమ ఇళ్ల వద్ద ఇంధన పరిరక్షణ ఆవశ్యకత గురించి వివరించేలా కృషి చేస్తోంది. దీని కోసం గత ప్రభుత్వం ప్రత్యేకంగా క్లైమేట్ చేంజ్ సెల్(సీసీసీ)ను రూపొందించింది. ఇందులో నిపుణులు, విద్యుత్ పంపిణీ సంస్థలు, మునిసిపల్, పట్టణాభివృద్ధి, రవాణా తదితర విభాగాలను భాగస్వాములను చేసింది. ఈ సెల్ వాతావరణ మార్పుల వల్ల ఎదురవుతున్న సమస్యలకు పరిష్కారాలను సూచిస్తుంటుంది.

వంద కోట్ల మందికి భాగస్వామ్యమే లక్ష్యం



మిషన్ లైఫ్‌కు ఏపీలోని ఆరు నగరాలను ఎంపిక చేసుకున్నాం. ప్రజలు, వివిధ సంఘాలు, ప్రభుత్వ విభాగాలతో కలిసి కార్యక్రమాలు చేపడుతున్నాం. తద్వారా రాష్ట్రంలో పర్యావరణ క్షీణతను అధిగమించడంతో పాటు ఆర్థిక వృద్ధిని సాధించడం, ఇంధన సామర్థ్యాన్ని మెరుగుపరచడం, స్థిరమైన మౌలిక సదుపాయాలు, మెరుగైన జీవన ప్రమాణాల కోసం గ్రీన్ జాబ్స్ సృష్టించవచ్చని అంచనా వేస్తున్నాం. 2027–28 నాటికి వంద కోట్ల మంది భారతీయుల్ని మిషన్‌లైఫ్‌లో భాగస్వాములను చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

– మిలింద్ దేవ్‌రా, బీఈఈ కార్యదర్శి



మనం మారితేనే..

- ట్రాఫిక్ లైట్లు, రైల్వే క్రాసింగ్‌ల వద్ద వాహనాల ఇంజన్‌లను ఆపితే ఏటా దాదాపు 22.5 బిలియన్ కిలో వాట్స్ ఇంధనం ఆదా చేయొచ్చు.
- షాపింగ్‌లకు క్లాత్ బ్యాగులను వినియోగిస్తే 375 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలోకి వెళ్లకుండా నివారించవచ్చు.
- వ్యర్థ పదార్థాలను కంపోస్ట్ చేయడం వల్ల 15 బిలియన్ టన్నుల ఆహారం వృథా కాదు.
- నీటి కుళాయిలను సకాలంలో ఆపివేయడం వల్ల 9 ట్రిలియన్ లీటర్ల నీటిని ఆదా చేయొచ్చు.
- పని చేయని ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లను రీసైకిల్ చేయడం ద్వారా 0.75 మిలియన్ టన్నుల ఈ–వ్యర్థాలను రీసైకిల్ చేయొచ్చు.
- ఏసీలను 24 డిగ్రీల వద్ద వినియోగించడం, ఎలక్ట్రానిక్ పరికరాలను ఇంధన పొదుపు మోడ్‌లో వాడడం, తక్కువ నీటిని వినియోగించే పంటలు వేయడం, గ్రామీణ నీటి వనరుల రీచార్జ్‌ను ప్రోత్సహించడం, ఎల్‌ఈడీ లైట్లను వినియోగించడం, ప్రజా రవాణా తదితర మంచి విధానాలను ఉపయోగిస్తే.. మిషన్ లైఫ్ లక్ష్యాలను చేరుకోవచ్చు.
- బీఈఈ ఇంధన సామర్థ్య పథకాలు, కార్యక్రమాల ద్వారా.. 2022–23లో 307 బిలియన్ యూనిట్ల విద్యుత్, 24.68 మిలియన్ టన్నుల చమురు సమానమైన థర్మల్ శక్తితో సహా సుమారు 306.40 మిలియన్ టన్నుల ఉద్గారాల్ని తగ్గించింది.

వైఎస్ జగన్ బొమ్మ ధ్వంసం



ధ్వంసం చేయడానికి ముందు వైఎస్ జగన్ బొమ్మ



టెక్కలి మండలం రావివలస సచివాలయం పైభాగంలో వైఎస్ జగన్ బొమ్మను ధ్వంసం చేసిన దృశ్యం.

- శ్రీకాకుళం జిల్లా రావివలస సచివాలయంపై ఉన్న బొమ్మను ధ్వంసం చేసిన టీడీపీ కార్యకర్తలు
- కొనసాగుతున్న టీడీపీ ఆగడాలు

టెక్కలి: టీడీపీ ఆగడాలు కొనసాగుతూనే ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం రావివలస గ్రామ సచివాలయంలో ఉన్న మాజీ సీఎం వైఎస్ జగన్ బొమ్మను కొంత మంది టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు. గత ప్రభుత్వ హయాంలో సచివాలయాన్ని నిర్మించిన కాంట్రాక్టర్ కదంబాల భాస్కరరావు, సర్పంచ్ సర్లాన బాలకృష్ణ తెలిపిన వివరాలు.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.40 లక్షలతో సచివాలయ నిర్మాణం మొదలుపెట్టి చివరి దశకు చేర్చారు. సుమారు రూ.10 లక్షల మేరకు పనులు పెండింగ్‌లో ఉండిపోయాయి. ఈలోగా ప్రభుత్వం మారింది. ఇటీవల 28వ తేదీన మండల జేఈ ఎస్ఎల్ నాయుడు కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసి మరో రెండు రోజుల్లో మంత్రి అచ్చెన్నాయుడు చేతుల మీదుగా సచివాలయ ప్రారంభోత్సవం చేస్తున్నామని, పనులు పూర్తి చేయాలని సూచించారు. అయితే రెండు రోజుల్లో పనులు పూర్తి చేయలేనని చెప్పడంతో, గ్రామానికి చెందిన కొంత మంది టీడీపీ కార్యకర్తలకు ఆ పనులు అప్పగించారు. అయితే టీడీపీ కార్యకర్తలు కవ్వింపు చర్యలకు పాల్పడుతూ సచివాలయంలో ఉన్న వైఎస్ జగన్ బొమ్మను ధ్వంసం చేశారు. దీంతో సర్పంచ్‌తో పాటు గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలంతా భగ్గుమంటున్నారు. విషయం తెలుసుకున్న పీఆర్ ఇన్‌చార్జి ఈఈ సూర్యప్రకాశ్, జేఈ ఎస్ఎల్ నాయుడు తదితరులు సచివాలయాన్ని పరిశీలించి ఘటనపై దర్యాప్తు చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. మండల జేఈ ఎస్ఎల్ నాయుడే.. జగన్ బొమ్మను తొలగించాలని తమకు చెప్పినట్టు టీడీపీ కార్యకర్తలు చెబుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

ఏసీబీ వలలో విద్యుత్ లైన్‌మెన్

- వ్యవసాయ బోర్లకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు లంచం డిమాండ్
- రూ.20 వేల లంచం తీసుకుంటుడగా.. పట్టుకున్న ఏసీబీ



రాచర్ల: వ్యవసాయ బోర్లకు ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు విద్యుత్ లైన్ వేసేందుకు లంచం తీసుకుంటున్న లైన్‌మేన్ ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఒంగోలు ఏసీబీ డీఎస్పీ వి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలు.. ప్రకాశం జిల్లా రాచర్ల మండలం అనుమలవీడుకు చెందిన వాకా కిరణ్ అనే రైతు తన పొలంలో బోర్లు వేశాడు. వ్యవసాయ బోర్లకు ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు విద్యుత్ లైన్ కోసం ఈ నెల 6వ తేదీన గిద్దలూరు విద్యుత్ శాఖ కార్యాలయంలో డీడీ చెల్లించి దరఖాస్తు చేసుకున్నాడు. 14న లైన్‌మెన్ సీహెచ్ రామలింగయ్య.. రైతుకు ఫోన్ చేసి మీ పొలాన్ని చూపిస్తే ఎస్టిమేషన్ వేస్తామని చెప్పగా.. రైతు కిరణ్ పొలాన్ని చూపించాడు. త్వరగా ఎస్టిమేషన్ వేసి వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరా చేయాలని లైన్‌మేన్‌ను కోరాడు. ఈ సందర్భంగా లైన్‌మెన్ రామలింగయ్య.. త్వరగా ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు విద్యుత్ లైన్ లాగాలంటే డీఈ, ఏఈతో మాట్లాడాలని, రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. 23వ తేదీన మళ్లీ లైన్‌మెన్ రామలింగయ్య రైతు వాకా కిరణ్‌తో కలిసి డబ్బులిస్తేనే పని ప్రారంభిస్తానని చెప్పాడు. లంచం ఇవ్వడం ఇష్టం లేని వాకా కిరణ్ ఈ నెల 27వ తేదీన ఒంగోలులోని ఏసీబీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. ఏసీబీ అధికారుల సూచనలతో శుక్రవారం లైన్‌మెన్‌కు రూ.20 వేలు లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం అనుమలవీడు సబ్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు. ఏసీబీ డీఎస్పీ వెంట ఏసీబీ సీఐ శేషు, ఎస్ఐలు షేక్ మస్తాన్ షరీఫ్, ప్రసాదు తదితరులున్నారు.

విశాఖ జైలులో గంజాయి నిందితులే అధికం!

కేంద్ర కారాగారం సామర్థ్యం	914
ప్రస్తుతం ఉన్న ఖైదీలు	1,950
గంజాయి నిందితులు	1,160



ఆరిలోవ (విశాఖ తూర్పు): గంజాయి నిందితులతో విశాఖ కేంద్ర కారాగారం కిటకిటలాడిపోతున్నది. రోజు రోజుకు వీరి సంఖ్య పెరిగిపోతుండడంతో నీరు, విద్యుత్ సరఫరా, పారిశుధ్యం నిర్వహణ జైలు అధికారులకు సవాల్‌గా మారింది. ఈ కారాగారం సామర్థ్యం 914 మంది కాగా ప్రస్తుతం సుమారు 1,950 మంది వరకు ఖైదీలున్నారు. వారిలో శిక్ష పడిన ఖైదీలు 350 మంది ఉండగా సుమారు 1,160 మంది గంజాయి నిందితులే ఉండడం గమనార్హం. మిగిలినవారు 440 మంది వరకు రిమాండ్‌లో ఉన్నారు. వారందరికీ ఇక్కడ అన్ని సౌకర్యాలు పూర్తిస్థాయిలో కల్పించడం అధికారులకు కత్తిమీద సాములా మారింది.

సామర్థ్యం మేరకే వసతులు..

జైలు నిర్మించినప్పుడే సామర్థ్యానికి సరిపడా వసతులు కల్పించారు. ఇప్పుడు ఖైదీల సంఖ్య పెరగడంతో ఆ వసతులు సరిపోవడం లేదు. జైల్ ఆవరణలో ఏర్పాటు చేసిన కుళాయిలు, బోర్లు ద్వారా వచ్చే నీరు చాలడంలేదు. పెరిగిన సంఖ్యకు తగినట్లు అదనంగా ఏర్పాటు చేసిన ఫ్యాన్లకు, పలుమార్లు నీటి కోసం బోర్లు వేయడానికి విద్యుత్ ఎక్కువగా వినియోగించాల్సి వస్తున్నది. దీంతో ప్రారంభంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కెపాసిటీ చాలడంలేదు. ఖైదీల సంఖ్య పెరగడంతో పారిశుద్ధ్య సమస్య ప్రధానంగా తలెత్తుతుంది. ఖైదీల సంఖ్య పెరుగుతున్నప్పటికీ ఇక్కడ పనిచేస్తున్న జైలు సిబ్బంది సంఖ్యలో మాత్రం పెరుగుదల కనిపించలేదు. మొదటి నుంచి ఇక్కడ సూపరింటెండెంట్ నుంచి వార్డరు వరకు 250 మంది లోపే సిబ్బంది ఉన్నారు. వారంతా మూడు షిఫ్టులలో పనిచేస్తున్నారు. వారే ఇక్కడ 1950 మంది ఖైదీలను చూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

చిన్న చిన్న సమస్యలున్నాయి..

విశాఖ కేంద్ర కారాగారంలో సుమారు 1,100 మందికి పైగా గంజాయి ఖైదీలు ఉన్నారు. వీరి వల్ల జైలు సామర్థ్య పరిమితి దాటిపోయింది. పెద్ద జైల్ కావడం, విశాలమైన బేరక్‌లు అందుబాటులో ఉండడంతో ఖైదీలకు వసతి, ఆహారం, సంరక్షణ సౌకర్యంలో ఎలాంటి సమస్యలు లేవు. పారిశుద్ధ్యం, నీరు, విద్యుత్ సౌకర్యం విషయంలో చిన్న చిన్న సమస్యలు ఉన్నాయి.

– ఇండ్ల శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ జైళ్ల శాఖ ఐజీ,

సొంతగూటివైపు.. వలస పక్షుల చూపు

- మారుతున్న ఎన్నారైల ధోరణి.. సొంత దేశమే బెస్ట్ అంటున్న వైనం
- భారత్ బెస్ట్ అని చెప్పడానికి పది కారణాలు చెప్పిన ఐఐటీ జంట

సాక్షి, అమరావతి: ''ఏ దేశ మేగినా ఎందుకాలిడినా.. ఏ పీఠమెక్కినా.. ఎవ్వరేమనినా.. పొగడరా నీ తల్లి భూమి భారతిని.. నిలుపరా నీ జాతి నిండు గౌరవము'' అంటూ రాయప్రోలు రాసిన గేయం మన దేశ ఔన్నత్యాన్ని చాటి చెప్పింది. ఆ కోవలోనే ఖరగ్‌పూర్ ఐఐటీలో ఉన్నత చదువులు చదివి 2016లో అమెరికాకు వెళ్లిన ఓ జంట మన దేశ గొప్పదనంపై మరోసారి చర్చకు తెరదీసింది. అమెరికాలో కొన్నేళ్లు నివాసమున్న తాము తిరిగి భారత్‌కు వచ్చామని, ఇక్కడే స్థిరపడటానికి తమకు పది కారణాలున్నాయని ఆ జంట సామాజిక మాధ్యమంలో చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్‌గా మారుతున్నాయి. వారే కాదు.. మన దేశం నుంచి విదేశాలకు విద్య, ఉద్యోగం, వ్యాపారం కోసం వెళ్లిన చాలా మందిలో ఇదే అభిప్రాయం ఉంది. ఖరగ్‌పూర్ ఐఐటీలో చదివిన నైరిత్ భట్టాచార్య, ఆయన భార్య రిషితా దాస్ గతేడాది ఆగస్టులో అమెరికా నుంచి మన దేశానికి తిరిగి వచ్చారు. ఏడాది ఇక్కడ నివాసం తరువాత ఆ దంపతులు తమ అనుభవాన్ని సోషల్ మీడియాలో పంచుకున్నారు. భారత దేశానికి తిరిగి వెళ్లాలని ఆలోచిస్తున్న 20 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల భారతీయులందరిలోనూ ఓ అనిశ్చితి ఉందని, అలాంటి వారి కోసం తాము నిజాయతీగా పది అంశాలను చెబుతున్నామంటూ వారు 'ఎక్స్'లో ఓ పోస్టును పెట్టారు. ఆ అంశాలివీ..

భారత్ బెస్ట్.. ఎందుకంటే..

- మన దేశంలో గృహ అవసరాలకు మనుషులు సులభంగా దొరుకుతారు. జీతమూ తక్కువే. అమెరికాతో పోలిస్తే ఇది ఇక్కడ ఉన్న చాలా పెద్ద ప్రయోజనం.
- మన దేశంలో ట్రాఫిక్ మరొక ప్రధాన వ్యత్యాసం. అమెరికాలోని కొన్ని ప్రధాన నగరాలతో పోల్చితే మన దేశంలో ట్రాఫిక్ అంత అధ్వాన్నం కాదు.
- ఇక్కడ డిజిటల్ లావాదేవీల సౌలభ్యం ప్రశంసనీయం. 10 నిమిషాల్లో కిరాణా సరుకులు కొనవచ్చు. ఫుడ్ డెలివరీ వేగంగా, సమర్థవంతంగా ఉంటుంది. అమెరికాలో ఇన్‌స్టాకార్ట్, డోర్‌డాష్‌లు ఉన్నాయి. కానీ ఇక్కడ ఇంట్రా–సిటీ లాజిస్టిక్‌లు అక్కడికంటే చాలా ఉన్నతమైనవి.
- అమెరికాలోని యాపిల్ పే కంటే మన యుపీఐ వల్లనే ప్రయోజనాలు ఎక్కువ. యూపీఐ లావాదేవీలు చాలా వరకూ ఉచితంగానే పొందవచ్చు. యాపిల్ పే అలా కాదు.
- సాంస్కృతికంగా మన దేశంలో మంచి బంధాలను ఏర్పరచుకోవచ్చు. అమెరికాలో పైపై మాటలు లేదా పనికి సంబంధించిన చర్చలకు మాత్రమే పరిమితం కావాలి.
- మన దేశంలో కౌంటర్లు, కాఫీ షాప్‌లు, భద్రతా తనిఖీల వద్ద అస్తవ్యస్త లైన్‌లు ఒక సవాలుగా ఉన్నాయి. అయితే చివరికి వాటికి అలవాటు పడిపోతాం.
- బర్గర్‌ల నుంచి భారతీయ వంటకాలకు, ప్రత్యేకించి దోసెలు, బిర్యానీలకు తిరిగి రావడం ఆహార ప్రియుడైన భట్టాచార్య వంటివారికి ఉపశమనం.
- ఉద్యోగ మార్కెట్ రెండు దేశాలలో కఠినంగానే ఉంటుంది. అమెరికాలో ఉద్యోగం లభించవచ్చు. కానీ జీతంతో పాటు ఇల్లు, కారు ఇచ్చే జాబ్ రావడం కష్టం. భారత్‌లో స్నేహితులు, బంధువులతో హాయిగా జీవించవచ్చు.

ఒంటరితనం వేధిస్తుంది



ఉద్యోగం కోసం అమెరికాకు (కనెక్టికట్) వస్తున్నందుకు మొదట్లో చాలా సంతోషించాను. కానీ 5 నెలల్లో నా అభిప్రాయాలన్నీ మారిపోయాయి. తల్లిదండ్రులు, స్నేహితులు ఉండి కూడా ఇక్కడికి వచ్చి ఒంటరిగా జీవించాల్సి వస్తోంది. ఎవరితోనూ మన ఆనందాన్ని, బాధను పంచుకోలేం. ఖర్చు చేయడానికి ఇక్కడ మనకంటూ ఎవరూ లేనప్పుడు.. అదనంగా సంపాదించి ఏం ప్రయోజనం? ఒంటరితనం కారణంగా మానసిక ఒత్తిడి వేధిస్తుంటుంది. మన దేశంలో తాజాగా వండుకుని తింటాం. కానీ ఇక్కడ ప్రతిదీ 3 రోజుల పాటు నిల్వ చేసుకుని తినాలి. అమెరికా నుంచి తల్లిదండ్రులకు డబ్బు పంపవచ్చు. కానీ ఖచ్చితంగా వారితో లేని లోటుతో వేదనకు గురవుతుంటా. కాబట్టి త్వరలోనే తిరిగి వచ్చేయాలనుకుంటున్నాను.

– నజీర్ షేక్, గుడిపూడి గ్రామం, గుంటూరు జిల్లా

అందరిదీ అదే ఆలోచన



మా బంధువులు చాలా మంది అమెరికాలో ఉన్నారు. మేం మలేషియా (జోహోర్)లో పదేళ్లుగా ఉంటున్నాం. మా అందరిదీ ఇప్పుడు ఒకటే ఆలోచన. భారత్‌కు తిరిగి వెళ్లిపోవాలని. కన్నవారిని, సొంత ఊరిని వదిలి, ఉద్యోగం కోసం విదేశాలకు వచ్చిన మాలాంటి ఎంతో మంది ఆలోచన కూడా ఇదే. ఇక్కడ మాకు అన్ని సౌకర్యాలూ ఉంటాయి. కానీ మనం పరాయి వాళ్లలాగే బ్రతకాలి. మన దేశంలో సొంత మనుషుల మధ్య ఉండే ప్రేమానురాగాలు విదేశంలో దొరకవు. మన సంస్కృతి, సంప్రదాయాలు మచ్చుకైనా కనిపించవు. మేం త్వరలోనే స్వగ్రామానికి తిరిగొచ్చేస్తున్నాం.

– ఈదుపుగంటి రాధామాధవి, రామన్నగూడెం గ్రామం, పశ్చిమగోదావరి జిల్లా

కొన్నేళ్ల తర్వాత ఇక్కడ ఉండలేం



అమెరికా (చార్లెట్)లో ఐదేళ్లుగా ఉంటున్నాం. వయసులో ఉన్నప్పుడు ఇక్కడ ఉండటం సులభమే. కానీ వృద్ధాప్యంలో ఉండటం చాలా ఖర్చుతో కూడుకున్నది. ఇక్కడ ఉన్నన్ని రోజులూ ఉద్యోగం ద్వారా సంపాదించుకుని, ఆర్థికంగా స్థిరపడిన తరువాత భారత్‌కు వచ్చేయాలనుకుంటున్నాం. మా పాపకు ఇప్పుడు మూడేళ్లు. మన దేశ సంస్కృతిని పిల్లలకు అందించాలి. ప్రశాంత జీవనాన్ని గడపడానికి కూడా భారత్‌కు రావాలనిపిస్తోంది.

– భరత్ మర్రెడ్డి, ఆళ్లగడ్డ పట్టణం, నంద్యాల జిల్లా.

క్లుప్తంగా...

నల్ల రిబ్బన్లతో ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

బస్టాండ్(విజయవాడ పశ్చిమ): రాష్ట్ర ప్రజా రవాణా సంస్థలో పనిచేసే ఉద్యోగులకు నిలిపి వేసిన అన్ని అలవెన్స్‌లను వెంటనే పునరుద్ధరించాలని కోరుతూ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్‌ఎంయూఏ) ఆధ్వర్యంలో విజయవాడ బస్‌స్టేషన్ ఎదుట శుక్రవారం ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ట్రెజరీ అధికారులు నిర్లక్ష్యం వీడాలని కోరారు. గత రెండేళ్లకు సంబంధించిన పెండింగ్ లీవ్ ఎన్‌–క్యాష్‌మెంట్ నగదును ఖాతాలో జమచేయాలని, అర్హులైన వారికి ఇంక్రిమెంట్ అరియర్స్ ఇప్పించాలని, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు చెల్లించాలని, సర్వీసులో చనిపోయిన ఉద్యోగుల అంత్యక్రియల ఖర్చు రూ.25 వేలు ట్రెజరీ ద్వారా ఇప్పించాలని, జీవో నంబర్ 114లోని అలవెన్స్‌లను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎంయూఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేపీవీ శ్రీనివాసరాజు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రావి సుబ్బారావు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్'ను ఎందుకు అమలు చేయడం లేదు?


రాష్ట్ర ప్రభుత్వానికి వ్యవసాయ కార్మిక సంఘం ప్రశ్న

ఒంగోలు టౌన్: సూపర్ సిక్స్ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకుండా ఎందుకు కాలయాపన చేస్తుందో చెప్పాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 16 రకాల నిత్యావసర వస్తువులను చౌకధరల దుకాణాల ద్వారా ప్రజలకు అందించాలని డిమాండ్ చేశారు. ఒంగోలులోని కాపు కళ్యాణ మండపంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ అమలు చేయాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తోందని చెప్పారు. టీడీపీ ఇప్పుడు ఎన్డీయేలో భాగస్వామ్య పార్టీగా కొనసాగుతోందని, ఈ నేపథ్యంలో ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను దొంకదారిలో అమలు చేసే అవకాశం ఉందన్నారు. గ్రామీణ పేదలందరినీ సమీకరించి సమర శంఖారావం పూరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు సామాజిక బాధ్యతను విస్మరించి విద్య, వైద్యం, మౌలిక వసతులను పేదలకు దూరం చేస్తున్నాయని మండిపడ్డారు. దళితుల సమస్యలను ఎజెండా చేసేందుకు సెప్టెంబర్ 15–30 వరకు క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

కృష్ణా జలాల వివాదంపై మన వాదన వినిపించాలి

సాక్షి, అమరావతి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తమ రాజకీయ ప్రయోజనాల కోసం కృష్ణా జలాల అంశాన్ని తెలుగు రాష్ట్రాల మధ్య వివాదంగా చేయడంపై ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. విభజన చట్టంలో కృష్ణా జలాల పంపకంపై స్పష్టమైన నిర్ణయం ఉన్నప్పటికీ 2023లో తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్ పార్టీతో కలిసి కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల నీటి వివాదాన్ని ముందుకు తీసుకువచ్చాయన్నారు. నీటి కేటాయింపులు సహా 40 అంశాలపై సెప్టెంబర్ 20 నుంచి విచారణ ప్రారంభించాలని బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ నిర్ణయించినందున రాష్ట్ర ప్రయోజనాలను కాపాడే విధంగా మన వాదన బలంగా వినిపించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకరరెడ్డి శుక్రవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎటో వెళ్లిపోతోంది పులస



గోదావరి వైపు చూడని పులసలు

- ప్రతికూల పరిస్థితులతో ముఖం చాటేస్తున్న పులసలు
- రెండు నెలల్లో చిక్కిన చేప ఒకే ఒక్కటి
- ఒడిశా, పశ్చిమ బెంగాల్ వైపు పరుగులు



హిందూ మహాసముద్రంలో సందడి చేసే పులసలు.. గోదావరి వైపు చూడటం లేదు. సంతానోత్పత్తి కోసం నదిలోకి ఎదురీదే పులసలు ఒడిశా, పశ్చిమ బెంగాల్ వైపు తమ రూటు మార్చేశాయి. ఆగస్టు రెండో వారం వచ్చేసినా గోదావరి పాయల వెంట పులస జాడ కనిపించడం లేదు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు గోదావరి తీరంలో ఒక్క పులస మాత్రమే లభ్యమైంది.

సాక్షి ప్రతినిధి, కాకినాడ:

పుస్తెలమ్మి అయినా పులస తినాలనేది గోదావరి జిల్లాల్లో నానుడి. ఏటా జూలై, ఆగస్టు నెలల్లో పులసలు గోదావరి నదిలోకి వరస కట్టి.. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని మాంసాహార ప్రియుల జిహ్వాచాపల్యాన్ని తీర్చేవి. అంతటి విశిష్టత కలిగిన పులసల రాక దాదాపు పదేళ్లుగా ఏటా తగ్గుతూ వస్తోంది. ఈ సీజన్‌లో ఇంతవరకు కోనసీమలోని రాజోలు దీవిలోని గోదావరి తీరంలో కేవలం ఒకే ఒక పులస మత్స్యకారుల వలకు చిక్కింది. ఆ చేపను వేలం వేస్తే రూ.24 వేలు పలికింది. అంతటి డిమాండ్ ఉన్న పులసలు గోదావరిలో అడుగుపెట్టకుండా మొహం చాటేస్తున్నాయి. హిందూ మహాసముద్రం నుంచి వేలాది కిలోమీటర్లు ఈదుకుంటూ బంగాళాఖాతంలోకి పులసలు వస్తున్నా.. గోదావరి నది వైపు చూడకుండా ఒడిశా, పశ్చిమ బెంగాల్ వైపు పరుగులు తీస్తున్నాయి. గోదావరి నదీ తీరం వెంబడి నెలకొన్న ఆటంకాలే ఇందుకు కారణమని మత్స్య శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు.

'క్వీన్ ఆఫ్ ది ఫిష్' ఇటు రావట్లేదు

గోదావరిలో వరద ప్రవాహం పోటెత్తి సముద్రం వైపు పరుగులు తీసే రోజుల్లో.. వరదల్లో కొట్టుకొచ్చే బురద మట్టినే ఆహారంగా తీసుకుంటూ పునరుత్పత్తి కోసం ఇలసలు (సముద్ర జలాల్లో ఉన్నప్పుడు ఇలస అని పిలుస్తారు) గుంపులు, గుంపులుగా ఒక ప్రవాహం మాదిరిగా వలస వస్తుంటాయి. కానీ.. గోదావరి ప్రాంతంలోని సముద్ర తీరం కాలుష్యకారకంగా మారడం, విచ్చలవిడిగా సాగుతున్న చేపల వేటతో 'క్వీన్ ఆఫ్ ది ఫిష్'గా పిలిచే పులస బంగాళాఖాతం నుంచి గోదావరి వైపు రావడం లేదని సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్రెష్ వాటర్ రీఛార్జ్ ఇనిస్టిట్యూట్ (సిఫ్రీ) ఇటీవల నిర్వహించిన అధ్యయనంలో తేల్చింది. ఇలసల్లో కొవ్వు అధికంగా ఉంటుంది. హిందూ మహాసముద్ర ప్రాంతంలోని ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, టాంజానియా తీర ప్రాంతాల నుంచి సముద్ర జలాల్లో సుమారు 11 వేల నాటికల్ మైళ్ల దూరం ప్రయాణించి ఇలసలు పునరుత్పత్తి కోసం గోదావరిలోకి ఎదురీదుతాయి. ఇలా ఎదురీత ప్రయాణం వల్ల వాటిలో ఉండే కొవ్వు కరిగి ఎరుపు, గోధుమ రంగులోకి మారుతుంది. ఈ దశలో పులస శరీరాకృతి పోషక విలువలతో కూడి రుచికరంగా తయారవుతుంది. కృష్ణా, గోదావరి (కేజీ) బేసిన్‌లో చమురు కార్యకలాపాల వెలికితీత కోసం చేపడుతున్న డ్రెడ్జింగ్ వల్ల ధ్వని కాలుష్యం పెరిగిపోయి పులసలు సముద్రం నుంచి గోదావరిలోకి రావడం లేదు. గోదావరి, బంగాళాఖాతం కలిసే సీ మౌత్ (నదీ ముఖద్వారం వద్ద) రిలయన్స్, ఓఎన్‌జీసీ తదితర సంస్థలు డ్రెడ్జింగ్ నిర్వహిస్తున్నాయి. గోదావరి తీరాన రాజమహేంద్రవరం, అంతర్వేది, కరవాక, యానాం, గాడిమొగ, ఎదుర్లంక సమీప ప్రాంతాల్లో పారిశ్రామిక వ్యర్థాలు గోదావరిలో కలిసిపోతున్నాయి. సల్ఫర్, అమోనియా, లెడ్, పాదరసం ఇతర కర్బనాలు నదిలో కలుస్తున్నాయి. తీరం వెంబడి విచ్చలవిడిగా వేల ఎకరాల్లో సాగవుతున్న రొయ్యల చెరువుల వ్యర్థాలు నేరుగా సముద్రం, గోదావరిలోనే కలుస్తున్నాయి. గోదావరి నుంచి సముద్రంలో ఈ అవశేషాలు కలుస్తుండటంతో పులస గోదావరి వైపు రావడం లేదు.



అందుకే.. రూటు మార్చేసింది

గోదావరి తీరం కాలుష్యకారకంగా మారిపోవడం.. పునరుత్పత్తికి అనుకూల పరిస్థితులు లేకపోవడంతో సముద్రం నుంచి ప్రవాహం మాదిరిగా వచ్చే విలసలు అటు నుంచి అటే ఒడిశా, పశ్చిమ బెంగాల్ వైపు పరుగులు తీస్తున్నాయి. ఇందుకు ఒడిశా, పశ్చిమ బెంగాల్ నదీ జలాల్లో ఉన్న సానుకూల వాతావరణమే ప్రధాన కారణమని మత్స్య శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ప్రధానంగా పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ నది వైపు పయనమవుతున్నాయని స్పష్టం చేస్తున్నారు.



రెండు కేజీలు ఉండే పులసలు

ఈ చర్యలు చేపడితే మేలు



అరుదైన పులస జాతిని పరిరక్షించేందుకు, ఆ జాతి వృద్ధి కోసం కోల్‌కతా సిఫ్రీ (సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్రెష్ వాటర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్) కృషి చేస్తోంది. ఇందులో భాగంగా పులస సీడ్‌ను వృద్ధి చేసి బంగాళాఖాతంలో విడిచిపెట్టే ప్రక్రియను రెండేళ్లుగా చేస్తోంది. ఇలాంటి కృషిని మన రాష్ట్రంలో కూడా చేపట్టాలి. సముద్రం, గోదావరి సహా నదుల్లో చేపలు పట్టే వలలకు మెష్ నియంత్రణ పాటించాలి. పిల్లలు పెట్టకుండానే తల్లి చేపలను పట్టేస్తున్న పరిస్థితులను కట్టడి చేయాలి. నదుల్లో విషతుల్యమైన వ్యర్థాలను, ధ్వని కాలుష్యాన్ని నియంత్రించి పులస మనుగడ సాగించేందుకు కృషి జరగాలి.

– సీహెచ్ గోపాలకృష్ణ, మత్స్య శాస్త్రవేత్త, కోనసీమ

పరిరక్షించాల్సిన అవసరం ఉంది



అరుదైన జాతి చేప పులస. ఇప్పటికే చాలా చేపలు అంతరించిపోతున్నాయి. టైమ్స్ ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం.. మితిమీరిన చేపలు వేట, జల కాలుష్యం, సరైన సంరక్షణ కొరత కారణంగా పులస చేపల సంఖ్య తగ్గుతోంది. పులసలు అంతరించిపోవడమనేది చాలా బాధాకరమైన విషయం. పులసలను పరిరక్షించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

– డాక్టర్ కేపీఎస్ మూర్తి, ఫిషరీస్, అగ్రికల్చర్, ఆదిత్య డిగ్రీ కాలేజీ, కాకినాడ

బొండా జాతిలో విద్యా కుసుమం

- సత్తాచాటిన బొండా విద్యార్థి
- ఎంకేసీజీలో ఎంబీబీఎస్‌కు ఎంపిక
- వెన్నుతట్టి ప్రోత్సహించిన ఉపాధ్యాయుడు



మంగళ ముదలి



బొడబెల్ గ్రామంలోని మంగళ నివాసం వద్ద ఉపాధ్యాయుడు ఉత్కళ కేసరి దాస్ తదితరులు

కొరాపుట్/మల్కన్‌గిరి: దేశంలోనే అత్యంత వెనుకబాటుతనానికి ఆప్రాంతం ప్రతిరూపం. అక్కడి బొండా జాతి ప్రజల జీవనం ఇంకా కూడు, గూడు కోసం వెతుక్కునే స్థాయిలోనే ఉంది. ఇక చదువు అనేది వారికి గగన కుసుమమే.. అటువంటి ప్రాంతంలో ఒక విద్యాసూర్యుడు ఉదయించాడు. నీట్ ఫలితాల్లో ఒడిశాలోని మల్కనగిరి ప్రాంతానికి చెందిన విద్యార్థి మంగళ ముదలి సత్తాచాటాడు. అతడు బ్రహ్మపుర ఎంకేసీజీ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చదవడానికి ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని స్వయంగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ ప్రకటించింది. బొండా జాతి యువకుడు ఎంబీబీఎస్ సీటు సాధించడంతో ఇప్పుడు యావత్ ఒడిశా రాష్ట్రం బొండా ఘాట్‌పై దృష్టి సారించింది. మీడియా ప్రతినిధులు, అధికారులు మంగళ ముదలి స్వస్థలమైన మల్కన్‌గిరి జిల్లా ఖోయిర్‌పుట్ సమితి ముదలిపాడు గ్రామ పంచాయతీలోని బొడబెల్ గ్రామాన్ని సందర్శించారు. అతని తల్లిదండ్రులు సంకి ముదలి, హుడు మదలిలకు ఈ విషయం చెప్పగా వారు పెద్దగా స్పందించలేకపోయారు. అంతేకాక తమ కొడుకు ఏం చదువుతున్నాడో తమకు తెలియదన్నారు. తల్లి సంకి మాత్రం తన కొడుకు ఏదో సాధించాడని భావించి ఆనందం వ్యక్తం చేసింది. కొడుకు ఎక్కడున్నాడని ప్రశ్నించగా వారికి తెలియక, భువనేశ్వర్ అని తటపటాయిస్తూ చెప్పారు. బొండా జాతి నుంచి మంగళ ముదలి మొట్టమెదటి వైద్య విద్యార్థి కావడం గమనార్హం.

ఎవరీ బొండా జాతి గిరిజనులు



ఆధునిక సమాజానికి దూరంగా పురాతన గిరిజన సాంప్రదాయాలు నేటికీ పాటిస్తున్న వారు బొండా జాతి ప్రజలు. కొరాపుట్ జిల్లా లమ్తాపుట్, మల్కన్‌గిరి జిల్లా ఖొయిరిపుట్ సమితుల్లో వీరు అత్యధికంగా నివసిస్తున్నారు. పురాణాలు ప్రకారం దండకారణ్యంలో శ్రీరామచంద్రుడు అరణ్యవాసం చేసినప్పుడు, సీతాదేవి స్నానం చేస్తుండగా కొందరు గిరిజన మహిళలు చూసి నవ్వారని చెబుతారు. దీంతో ఆగ్రహించిన సీతాదేవి ఈ జాతి మహిళలు వస్త్రాలు ధరించకుండా జీవించమని శపించిందని, అందుకే నాటి నుంచి వారు వస్త్రాలు కాకుండా పూసలతో తయారు చేసిన మాలలను వస్త్రాలుగా ధరిస్తారని చెబుతారు. వీరిలో అప్పర్ బొండా జాతి వారు సమారు 6,700 మంది ఉండగా, వారు ఇప్పటికీ ఆధునిక సమాజానికి దూరంగా ఉన్నారు. లోయర్ బొండాలో సుమారు 17,000 మంది జనాభా ఉన్నారు. వీరు జన జీవన స్రవంతిలో కలుస్తున్నారు. అయితే వీరి ప్రాంతాల్లోకి అనుమతి లేకుండా ఎవరూ వెళ్లే అవకాశం లేదు.

గురువే దైవమై..

సమాజంలో గురువుల గౌరవం పెంచే ఘటన ఇది. మంగళ బొండాఘాట్‌లో ముదలి పాడ ఉన్నత పాఠశాలలో చదివాడు. అక్కడికి అప్పట్లో ఉత్కళ కేసరి దాస్ అనే వ్యక్తి ఉపాధ్యాయుడిగా వచ్చారు. బొండా జాతి విద్యార్థులను తీర్చిదిద్దేందుకు దృష్టి సారించారు. 8వ తరగతి చదువుతున్న సమయంలోనే మంగళ రాత్రి 12 గంటల వరకు చదువుతుండడం ఆ ఉపాధ్యాయుడు గమనించారు. దీంతో అతడిని ప్రోత్సహించి ప్లస్ 2 మత్తిలిలో చదవడానికి సహకరించాడు. అనంతరం తన స్వస్థలం బాలేశ్వర్‌లో మంగళని ప్రైవేట్ కోచింగ్ సెంటర్‌లో చేర్పించి, తానే వసతి, ఆహారం, ఫీజులు చెల్లించారు. మంగళకి అవసరమైన పుస్తకాలతో సహా అన్ని ఖర్చులు భరించి నీట్ పరీక్ష రాయించారు. ఫలితాలు వెల్లడైన తర్వాత బాలేశ్వర్ జిల్లాలో ఉన్న మంగళ మీడియాతో మాట్లాడుతూ తనకు దైవం అంటే ఉత్కళ కేసరి దాస్ మాత్రమేనన్నారు. తన ఇంటికి విద్యుత్ కూడా లేదని, కానీ ఉత్కళ కేసరి తనకు ఫ్యాన్, లైటు ఉన్న గది ఇచ్చి చదువుకోవడానికి ఏర్పాట్లు చేశారన్నారు. తానెప్పుడు ఫ్యాన్ కింద చదువుతానని అనుకోలేదన్నారు. తాను డాక్టరైన తర్వాత బొండా జాతి గిరిజనులకు చదువుపై అసక్తి పెంచుతానన్నారు. బొండా జాతి విద్యార్థి మంగళ ఎంబీబీఎస్ సీటు సాధించడంపై పలువురు అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధరేంద్ర ప్రధాన్, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి నిత్యానంద గొండో తదితరులు అతడిని అభినందించారు.



శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. ఏ టికెట్లూ లేకుండా దర్శనానికి వెళ్లే వారికి 18 గంటల సమయం పడుతోంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండిపోయాయి. క్యూ టీబీసీ వద్దకు చేరుకుంది. గురువారం అర్ధరాత్రి వరకు 65,529 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 29,730 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారి హుండీకి కానుకల రూపంలో రూ.4.51 కోట్లు లభించింది. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 18 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శన టిక్కెట్లు కలిగిన భక్తులు 2 గంటల్లో స్వామిని దర్శించుకోగలుగుతున్నారు.

వేడుకగా లక్ష కుంకుమార్చన

తిరుపతి కల్చరల్: తిరుపతిలోని శ్రీకపిలేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రావణమాసంలో చివరి శుక్రవారం సందర్భంగా శ్రీకామాక్షి అమ్మ వారికి వేడుకగా లక్షకుంకుమార్చన నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయంలోని మండపంలో శ్రీమహాలక్ష్మి అమ్మవారు, శ్రీసరస్వతి అమ్మవారు, శ్రీకామాక్షి అమ్మవార్లను కొలువు తీర్చి కుంకుమార్చన శాస్త్రోక్తంగా చేపట్టారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రావణ మాసం నాల్గవ శుక్రవారం, మరో రెండు రోజుల్లో శ్రావణ మాసం ముగియనుండటంతో విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ కనిపించింది. తెల్లవారుజాము నుంచే పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లో పాల్గొనేందుకు ఉభయదాతలు టికెట్లను కొనుగోలు చేశారు. ముఖ్యంగా అమ్మవారి ప్రధాన ఆలయంలో నిర్వహించిన ఖడ్గమాలార్చన, ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సామూహిక లక్ష కుంకుమార్చన, శ్రావణ మాసపు ప్రత్యేక లక్ష కుంకుమార్చన, చండీహోమం, శాంతి కల్యాణం, సహస్ర నామ కుంకుమార్చనలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

దుర్గమ్మకు వజ్రపు నత్తు వితరణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు విజయవాడకు చెందిన భక్తులు బంగారం, డైమండ్స్ కలిగిన నత్తును శుక్రవారం సమర్పించారు. విజయవాడ ఎస్బీఐ ఆఫీసర్స్ కాలనీకి చెందిన గొల్లపాటి ప్రత్యూష కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. సుమారు రూ.1.50 లక్షల వ్యయంతో 8.7 గ్రాముల బంగారం, డైమండ్స్‌తో తయారు చేయించిన నత్తును అధికారులకు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

ఐ.పోలవరం: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని అంబేడ్కర్ కోనసీమ జిల్లా మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచీ తరలివచ్చిన సుమారు 1500 మంది మహిళలు పాల్గొన్నారు. ఆలయ ఆవరణలోని కల్యాణ మండపం, అభిషేక మండపం, ప్రదక్షిణలు చేసే ప్రాంతాలలో మహిళలు వరలక్ష్మీ వ్రతాలను ఆచరించారు.


అమ్మవార్లకు పూజలు

భగవద్గీత శ్లోకాలపై పోటీలు

దుత్తలూరు: త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా దుత్తలూరు సెంటర్‌లో కృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం రాధాకృష్ణులను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భగవద్గీత సారాంశాన్ని భక్తులకు వివరించారు. మధ్యాహ్నం విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలపై పోటీలు నిర్వహించారు.

ద్వారకాతిరుమలలో వరలక్ష్మీ వ్రతాలు

ద్వారకాతిరుమల: ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల చిన వెంకన్న క్షేత్రంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు శుక్రవారం నేత్రపర్వంగా జరిగాయి. ఆలయ అనివేటి మండపంలో జరిగిన వేడుకలో సుమారు 2,500 మందికి పైగా మహిళలు పాల్గొని అమ్మవారిని కొలిచారు.



5న గుంటూరులో వ్యవసాయ పాలిటెక్నిక్ అడ్మిషన్లకు కౌన్సెలింగ్

పుంగనూరు: ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విద్యాలయం పరిధిలోని పుంగనూరు పాలిటెక్నిక్ కళాశాలలో కోర్సులకు సెప్టెంబర్ 5న గుంటూరులో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.మంజుల తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ స్థానిక వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు, దరఖాస్తు చేయని విద్యార్థులకు కూడ స్పాట్ కౌన్సిలింగ్ గుంటూరులో జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌ను గానీ, సెల్ నెంబర్లు: 9010402068, 9493253151, 9491459956 లను సంప్రదించాలని కోరారు.

జీజీయూలో ముగిసిన వర్క్‌షాప్

రాజానగరం: తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలోని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లో అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వాణి పథకంపై రెండు రోజులు నిర్వహించిన వర్క్‌షాప్ శుక్రవారం ముగిసింది. పెట్రోలియం విభాగం ఆధ్వర్యంలో విద్యుత్ వాహనాలలో ఉపయోగించి వదిలేసిన బ్యాటరీల నుంచి పర్యావరణంలో వస్తున్న వివిధ పరిణామాలు అనే అంశం పై ఈ వర్క్‌షాప్ జరిగింది.

ఆదిత్యలో జాతీయ స్థాయి టెక్ ఫెస్ట్

గండేపల్లి: కాకినాడ జిల్లా సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో వేద–2కే24 పేరిట జాతీయ స్థాయి టెక్ ఫెస్ట్ నిర్వహించనున్నట్టు యూనివర్సిటీ ఛాన్సలర్ ఎన్.సతీష్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. భారత రత్న మోక్ష గుండం విశ్వేశరయ్య జయంతిని పురస్కరించుకుని ఏటా సెప్టెంబర్ 15న ఇంజినీర్స్ డే నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దీనిలో భాగంగా వేద–2కే24 పేరిట వచ్చే నెల 13, 14 తేదీల్లో జాతీయస్థాయి టెక్ ఫెస్ట్ నిర్వహిస్తామన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆదిత్య యూనివర్సిటిలో వేద–2కే24 జాతీయ స్థాయి టెక్ ఫెస్ట్ పోస్టర్‌ను విడుదల చేశారు.

2న వికాసలో జాబ్ మేళా

కాకినాడ సిటీ: వికాస ఆధ్వర్యంలో సెప్టెంబర్ రెండున కాకినాడలోని సంస్థ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు శుక్రవారం ఇక్కడ తెలిపారు. ఈ జాబ్ మేళాలో క్యాపిటల్ ట్రస్ట్ లిమిటెడ్‌లో బీఎం, బిక్యూఎం, ఆర్ఓ, ఐఆర్‌ఈపీ క్రికెట్ క్యాపిటల్‌లో సేల్ ఆఫీసర్, సీనియర్ సేల్స్ ఆఫీసర్, ఇండో ఎంఐఎం, పానాసోనిక్ కంపెనీల్లో టెక్నీషియన్, రివ్యూటిడ్ ఫార్మా కంపెనీలో టెక్నీషియన్, కెమిస్ట్, హెల్పర్, ట్రైనీ ఇంజినీర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆయా ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ, బీటెక్, బీఎస్సీ, ఎంఎస్సీ, బీటెక్ (బయోటెక్నాలజీ, మైక్రో బయాలజీ 2023, 2024 పాస్ అవుట్) ఉత్తీర్ణులైన 35 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులని తెలిపారు.

యూటీఎఫ్ నేతల ధర్నా

కోవూరు: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూనిఫైడ్ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలంటూ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు తాలూకా ఆఫీసు ఎదుట శుక్రవారం ధర్నా జరిగింది. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ ఖాజావలీ మాట్లాడారు.

ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు ప్రభుత్వ ఉద్యోగాలలో ప్రత్యేక కోటా

నరసరావుపేటరూరల్: ఎన్‌సీసీలో చేరే క్యాడెట్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలో ప్రత్యేక కోటా ఉంటుందని 23 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సునీల్ గౌతమ్ తెలిపారు. పల్నాడు జిల్లా నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీలో చేరే మొదటి సంవత్సరం విద్యార్థులకు శుక్రవారం ఎంపికలు నిర్వహించారు. మొదటి సంవత్సరం చదువుతున్న 400మంది విద్యార్థులు ఎంపికలకు హాజరయ్యారు. ఆర్మీ అధికారులు వీరికి శారీరక పరీక్షలు నిర్వహించి 90 మందిని ఎంపికచేశారు. కల్నల్ సునీల్‌గౌతమ్ మాట్లాడుతూ ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు డిఫెన్స్ ఉద్యోగాలలో రిజర్వేషన్ ఉంటుందని తెలిపారు. దీంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రత్యేక కోటా, బోనస్ మార్కులు కేటాయిస్తారని వివరించారు.

సాక్షి ప్లస్
శనివారం । 31-8-2024

● చిక్కింది చేప



హైటెక్ సిటీకి కూతవేటు దూరంలో నగరం నడిబొడ్డున ఉన్న దుర్గం చెరువులో చేపలు పడుతున్న మత్స్యకారులు

న్యాయవాదులపై దాడిని ఖండించిన బార్ కౌన్సిల్

సాక్షి, హైదరాబాద్: కూకట్‌పల్లి కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాది పి.సంతోష్‌పై అతని ఇంటి వద్ద పోలీసులు దాడి చేయడం అమానుషమని బార్ కౌన్సిల్ చైర్మన్ ఏ.నరసింహారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కూకట్‌పల్లి బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు బార్ కౌన్సిల్ చైర్మన్‌ను కలసి సంతోష్‌పై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని వినతిపత్రం సమర్పించారు. అనంతరం భేటీ అయిన బార్ కౌన్సిల్...చట్టాన్ని ఉల్లంఘిస్తూ పోలీసులు దాడి చేయడాన్ని ఖండించింది. మరో న్యాయవాది చైతన్యపై దాడిని ఖండిస్తూ బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు కె.సునీల్‌గౌడ్, బీసీఐ సభ్యుడు పి.విష్ణువర్ధన్‌రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు.

ప్రత్యామ్నాయం చూపి కూల్చండి

సాక్షి, హైదరాబాద్: హైడ్రా పేరుతో చెరువులు, నాలాల్లోని నిర్మాణాలను తొలగిస్తున్నప్పుడు పేదలు, మధ్యతరగతి ప్రజలు నమిధలు కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విజ్ఞప్తి చేశారు. హైడ్రా వ్యవస్థను ఆహ్వానిస్తున్నామని, కానీ నాలాల పక్కన నివసిస్తున్న పేదలకు ప్రత్యామ్నాయం చూపకుండా వారి ఇళ్లను కూల్చవద్దని శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

నకిలీ క్లినిక్‌లపై కొరడా

- ఇద్దరు నకిలీ వైద్యుల అరెస్టు
- రూ.1.25 లక్షల విలువైన మందులు స్వాధీనం

సాక్షి, హైదరాబాద్: నకిలీ క్లినిక్‌ల నిర్వాహకులపై డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ కొరడా ఝుళిపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన సోదాల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం గౌడ్ల రామవరం గ్రామంలో గన్నగోని గిరిగౌడ్, హైదరాబాద్‌లోని మజీద్ కమాన్ సమీపంలో నకిలీ క్లినిక్ నిర్వహిస్తున్న షేక్ కిఫాయాత్ ఉల్లా షరీఫ్‌లపై చర్యలు తీసుకున్నట్టు డీజీఏ డీజీ కమలాసన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరి నుంచి రూ.1.25 లక్షల విలువైన మందులు స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. సోదాల్లో భద్రాద్రి కొత్తగూడెం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ సంపత్ కుమార్, చార్మినార్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ బి.లక్ష్మి పాల్గొన్నట్టు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా మందులు నిల్వ చేస్తే.. డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్ యాక్ట్ కింద నిందితులకు ఐదేళ్ల జైలు శిక్ష పడుతుందని హెచ్చరించారు.

మధ్యాహ్న భోజన చార్జీలు పెంచండి

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం చార్జీలను.. ప్రస్తుత ధరలకు అనుగుణంగా పెంచాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. సచివాలయంలో శుక్రవారం తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు బీవీ విజయలక్ష్మి మాట్లాడుతూ సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం పాఠశాల ఆవరణలోనే వండి విద్యార్థులకు వేడివేడి భోజనాలు నాణ్యతతో అందించాలన్నారు. సెంట్రలైజ్డ్ కిచెన్ విధానం, హరే కృష్ణ ఫౌండేషన్ తదితర సంస్థలు అందిస్తున్న భోజనం వేడిగా ఉండడం లేదని, ఇందులో నాణ్యత కూడా ఉండదన్నారు. సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. ఈమేరకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. సీఎంను కలిసిన వారిలో యూనియన్ గౌరవాధ్యక్షురాలు డి.కమలారెడ్డి, ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సత్వరమే అభివృద్ధి పనుల పూర్తి

టీయూఐఎఫ్‌డీసీ చైర్మన్ నరసింహారెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వివిధ పట్టణాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలంగాణ రాష్ట్ర పట్టణ ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీయూఐఎఫ్‌డీసీ) చైర్మన్ చల్లా నరసింహారెడ్డి అధికారులను ఆదేశించారు. టీయూఐఎఫ్‌డీసీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం చైర్మన్ అధ్యక్షతన వరంగల్, ఖమ్మం, నల్లగొండ, కరీంనగర్, ఆదిలాబాద్ పరిధిలోని పబ్లిక్ హెల్త్ డివిజన్‌లోని ఎస్‌ఈ, ఈఈ, డీఈలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపాలిటీలలో ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి పనులు, వాటి ప్రస్తుత పరిస్థితి, నిధుల కేటాయింపు తదితర అంశాలపై చర్చించారు. మున్సిపాలిటీలలో జరుగుతున్న మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదిక అందజేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో

ఎస్‌ఈ విశ్వనాథ రాజు, ఓఎస్‌డీ రమణ మూర్తి, వరంగల్ ఎస్‌ఈ శ్రీనివాస రావు, నల్లగొండ ఎస్‌ఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కంగనా సినిమాను నిషేధించాలి

సాక్షి, హైదరాబాద్: ఇందిరాగాంధీ పాత్రలో బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ నటించిన సినిమాను వెంటనే నిషేధించాలని కాంగ్రెస్ సీనియర్ నేత, ఏఐసీసీ కిసాన్ సెల్ వైస్‌చైర్మన్ ఎం.కోదండరెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ హయాంలో గాంధీ కుటుంబాన్ని, కాంగ్రెస్ చరిత్రను ప్రజలకు దూరం చేయాలని జరుగుతున్న కుట్రలో భాగమే ఈ సినిమా అని ఆయన ఆరోపించారు. సినిమాను ప్రదర్శించకుండా నిలిపివేయాలని కేంద్ర ప్రసార మంత్రిత్వ శాఖకు లేఖ రాస్తామని వెల్లడించారు. ఆయన శుక్రవారం గాంధీభవన్‌లో విలేకరులతో పార్టీ సీనియర్ నేతలు జి.నిరంజన్, పి.వినయ్‌కుమార్, టీపీసీసీ అధికార ప్రతినిధి బైకాని లింగం యాదవ్‌తో కలిసి మాట్లాడుతూ.. దేశ చరిత్రను వక్రీకరించి నేటితరానికి తప్పుడు సంకేతాలిచ్చేందుకు ఎమర్జెన్సీని ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. డాక్టర్ పి.వినయ్‌కుమార్ మాట్లాడుతూ దేశ చరిత్రను పుస్తకాల్లో చదవాలి తప్ప.. వాట్సాప్‌లో కాదని చెప్పారు. సీనియర్ నేత నిరంజన్ మాట్లాడుతూ ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందేందుకు సినిమాలను వాడుకోవడం బీజేపీకి అలవాటేనని ఎద్దేవా చేశారు.

టీచర్ల నేస్తం కమలాకర్

పాఠశాల విద్య డైరెక్టర్ నర్సింహారెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో విద్యాభివృద్ధికి, ఉపాధ్యాయ సంఘాలు తమ వంతు కృషి చేయాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వెంకటనర్సింహారెడ్డి కోరారు. ఈ దిశగా పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు నిస్వార్థ సేవలు అందించారని కొనియాడారు. పీఆర్‌టీయూటీఎస్ అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి నేతృత్వంలో శుక్రవారం కమలాకర్ పదవీ విరమణ కార్యక్రమం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ...ఉపాధ్యాయుల సంక్షేమం, విద్యా రంగం అభ్యున్నతే లక్ష్యంగా కమలాకర్ చేసిన సేవలను నర్సింహారెడ్డి కీర్తించారు. సమకాలీన పోకడలకు అనుగుణంగా ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యాలను పెంచుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. టీచర్స్ ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి మాట్లాడుతూ.. టీచర్ల పెండింగ్ బిల్లులు, డీఏల విడుదలపై ఆయన చేసిన కృషిని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీలు బి.మోహన్‌రెడ్డి, పూల రవీందర్, మాజీ బాధ్యులు వెంకట్‌రెడ్డి, పలు సంఘాల నేతలు సదానందంగౌడ్, లింగారెడ్డి, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సవాళ్ల సన్నద్ధతపై సమగ్ర శిక్షణ

ముగిసిన సీనియర్ ఆఫీసర్స్ స్టడీ పిరియడ్ శిక్షణ

సాక్షి, హైదరాబాద్: జాతీయ భద్రతకు సంబంధించి ఎదురయ్యే సవాళ్లు, ఇతర అంశాలపై ఎయిర్ ఫోర్స్ సీనియర్ అధికారులకు నిర్వహించిన 39వ సీనియర్ ఆఫీసర్స్ స్టడీ పిరియడ్ (ఎస్‌వోఎస్‌పీ) శిక్షణ శుక్రవారంతో ముగిసింది. సికింద్రాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ ఎయిర్ వార్‌ఫేర్‌లో ఈ శిక్షణ తరగతులను ఈ నెల 19 నుంచి శుక్రవారం వరకు నిర్వహించారు. ఎయిర్ కమోడోర్ స్థాయికి చెందిన 21 మంది అధికారులు శిక్షణలో పాల్గొన్నారు. శిక్షణలో భాగంగా భౌగోళిక రాజకీయ, సైనిక ప్రాధాన్యమున్న సమకాలీన సమస్యలపై దృష్టి పెట్టేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందని ఉన్నతాధికారులు అభిప్రాయపడ్డారు. శిక్షణ ముగింపులో వెస్ట్రన్ ఎయిర్ కమాండ్ సీనియర్ ఎయిర్ స్టాఫ్ ఆఫీసర్ ఎయిర్ మార్షల్ పీకే వోహ్రా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జెన్‌కో ఏఈ, కెమిస్ట్ ఫలితాలు విడుదల

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో)లో 339 అసిస్టెంట్ ఇంజనీర్, 60 కెమిస్ట్ పోస్టుల భర్తీకి జూలై 14న నిర్వహించిన కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఫలితాలను ప్రకటించినట్టు సంస్థ సీఎండీ రోనాల్డ్ రోస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సంస్థ వెబ్‌సైట్‌లో ఫలితాలను చూసుకోవాలన్నారు.

సీపీఎస్ రద్దు చేయండి

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంను (సీపీఎస్) రద్దు చేయాలని సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాముక కమలాకర్, చీటి భూపతిరావు డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ సెప్టెంబర్ 2న అన్ని జిల్లా కేంద్రాల్లో ఉద్యోగులందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.

భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలి

సాక్షి, హైదరాబాద్: భాషా పండితులు, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేసి పదోన్నతులు కల్పించాలని ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు సి.జగదీశ్ కోరారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఆర్‌యూపీపీటీఎస్ సంఘం పక్షాన ముద్రించిన 'భాషాపండితుల విజయం' అనే పుస్తకాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నేతలు పలువురు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ అయినా.. మ్యుటేషన్ ఆపొచ్చు

- ఆ మూడు రకాల భూముల రికార్డుల నిర్వహణ ఒకే చోట
- పేర్లు, ఇతర పొరపాట్లపై **అప్పీలుకు** అవకాశం
- **ఆర్‌ఓఆర్** బిల్లులో కీలక మార్పులు
- **కొత్త చట్టం** బిల్లుపై జిల్లాల్లో **ప్రజాభిప్రాయ** సేకరణ

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ప్రస్తుతం అమలులో ఉన్న ధరణి విధానంలో ఏదైనా భూమిని తహసీల్దార్ రిజిస్ట్రేషన్ చేస్తే, ఆ రిజిస్ట్రేషన్‌తో పాటే మ్యుటేషన్ కూడా ఆటోమేటిక్‌గా జరిగేది. ఈ రిజిస్ట్రేషన్‌పై ఎవరైనా అభ్యంతరం తెలిపినా మ్యుటేషన్ ఆగేది కాదు. ఉదాహరణకు తండ్రి తన భూమిని ఓ కొడుకు పేరుతో గిఫ్ట్ డీడ్ చేస్తే, మరో కొడుకు అభ్యంతరం తెలిపినా కూడా రిజిస్ట్రేషన్‌తో పాటు మ్యుటేషన్ కూడా ఆగేది కాదు. దీంతో బాధితులు కోర్టును ఆశ్రయించడం తప్ప వేరే మార్గం లేదు. ఇది సామాన్య రైతులకు వ్యయ ప్రయాసలతో కూడుకున్న వ్యవహారం. అయితే రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమలులోకి తేవాలనుకుంటున్న ఆర్‌ఓఆర్ చట్టంలో ఈ విధానంలో మార్పులు చేసింది. భూమి రిజిస్ట్రేషన్ జరిగినప్పటికీ, ఎవరి నుంచైనా అభ్యంతరం వస్తే మ్యుటేషన్ నిలిచిపోతుంది. ఆ అభ్యంతరాలను పరిశీలించాకే తహసీల్దార్లు మ్యుటేషన్ చేస్తారు.



నూతన రెవెన్యూ చట్టం ఆర్‌ఓఆర్-2024 ముసాయిదాపై చర్చా కార్యక్రమం

కీలక మార్పులు..

ధరణి సమస్యలకు చెక్ పెట్టడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకురావాలని నిర్ణయించిన ఆర్‌ఓఆర్-2024 చట్టంలో ప్రస్తుతం ఉన్న విధానాల్లో కీలక మార్పులు చేస్తోంది. ధరణిలో ఉన్న లోపాలను సరిచేసేందుకు కొత్త విధానాలను ఈ చట్టంలో పొందుపరచాలని నిర్ణయించింది. ప్రస్తుతమున్న ధరణి విధానంలో భూమి రికార్డుల్లో రైతు పేరు గానీ, ఇంటి పేరు గానీ, కులం, ఇలా ఏదైనా క్లరికల్ పొరపాట్లు వచ్చినా సదరు రైతు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ వద్దకు వెళ్లాల్సి వస్తోంది. మీసేవాలో దరఖాస్తు చేసుకుంటే కలెక్టర్ ఆ దరఖాస్తును తిరిగి తహసీల్దార్‌కు పంపేవారు. అక్కడి నుంచి నివేదిక వచ్చాకే ఈ క్లరికల్ పొరపాట్లను సరిచేసేవారు. ఈ క్రమంలో రైతులు కలెక్టరేట్‌కు, తహసీల్దార్ కార్యాలయాలకు ఏళ్ల తరబడి తిరగాల్సివస్తోంది. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాఫిర్యాదుల విభాగంలో ఇలాంటి వినతులు పదుల సంఖ్యలో వస్తున్నాయి. ఈ నేపథ్యంలో క్లరికల్ తప్పులను సరిచేసే అధికారాన్ని ఆర్డీవోలకు గానీ, తహసీల్దార్లకు కానీ ఇచ్చే యోచనలో ప్రభుత్వం ఉంది.

అప్పీలుకు అవకాశం..

ఓ రైతు భూమి పొరపాటున ఇతరుల పేరుతో రికార్డుల్లోకి ఎక్కినప్పటికీ.. బాధిత రైతుకు సివిల్ కోర్టు లేదా, హై కోర్టును ఆశ్రయించడం తప్ప వేరే మార్గం లేదు. ఉదాహరణకు ఓ రైతుకు ఉన్న రెండు ఎకరాల్లో ఒక ఎకరం వేరే వారి పేరుతో ధరణిలో తప్పుడుగా రికార్డు అయితే బాధిత రైతు కోర్టుకు వెళ్లాల్సిందే. అలాగే విరాసత్, వీలునామా, మ్యుటేషన్ ఇలా ఏ విధంగానైనా తహసీల్దార్లు, ఆర్డీవోలు తప్పుగా మార్పిడి చేసి ప్రొసీడింగ్స్ ఇచ్చినా కూడా బాధిత రైతు కోర్టు మెట్లు ఎక్కక తప్పదు. కానీ నూతన చట్టంలో అప్పీలుకు అవకాశం కల్పిస్తున్నారు. ఇలా బాధిత రైతు 30 రోజుల్లో కలెక్టర్‌కు అప్పీలు చేసే అవకాశం కల్పిస్తున్నారు.

జిల్లాల్లో చర్చా కార్యక్రమాలు..

నూతన రెవెన్యూ చట్టం.. ఆర్‌ఓఆర్-2024 బిల్లుపై రెవెన్యూ శాఖ విస్తృతంగా చర్చ జరపాలని నిర్ణయించింది. ఇందుకోసం జిల్లాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. రైతులు, రైతు సంఘాలు, ప్రజాసంఘాలతో కలసి చర్చా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. రైతులు, రైతు సంఘాల నేతల నుంచి అభ్యంతరాలను స్వీకరిస్తోంది. ఈ చట్టంపై అభిప్రాయాలను, సూచనలను, సలహాలను ఆన్‌లైన్ ద్వారా కూడా స్వీకరిస్తోంది.

భూముల రికార్డుల నిర్వహణ ఏకీకృతం..

ప్రస్తుతం ఉన్న విధానంలో ఒక గ్రామంలో వ్యవసాయ, వ్యవసాయేతర, ఆబాదీ ఇలా మూడు రకాల భూముల రికార్డులను మూడు శాఖలు నిర్వహిస్తున్నాయి. ఉదాహరణకు వ్యవసాయ భూములను తహసీల్దార్ రిజిస్ట్రేషన్ చేస్తే ఆ వ్యవసాయ భూములను రెవెన్యూ అధికారులు నిర్వహిస్తున్నారు. వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్‌ను సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ఇలా ఒక ఊరిలో ఉన్న భూమి రికార్డులను ఈ రెండు శాఖలు వేర్వేరుగా నిర్వహిస్తున్నాయి. ఆబాదీ భూమికి సంబంధించి పంచాయతీ అధికారులు రికార్డులు నిర్వహిస్తున్నారు. ఇలా ఒకే ఊరిలో ఉన్న భూమికి సంబంధించి మూడు శాఖలు వేర్వేరుగా రికార్డులు నిర్వహిస్తుండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీనికి చెక్‌పెట్టేలా కొత్త చట్టంలో మార్పులు చేస్తున్నారు.

రాజన్నా.. ఆదుకునేది ఎవరన్నా!

- వేములవాడ సన్నిధిలో ప్రాథమిక చికిత్స అందక పోతున్న ప్రాణాలు
- పట్టించుకోని అధికారులు..జాతర సమయంలోనే వైద్యసేవలు
- నిత్యం వేలాదిగా తరలివస్తున్న భక్తజనం

వేములవాడ: దక్షిణకాశీగా పేరొందిన వేములవాడ రాజన్న సన్నిధిలో భక్తులకు ప్రాథమిక చికిత్స అందుబాటులో లేకుండాపోయింది. కేవలం జాతర సమయాల్లో మాత్రమే ప్రాథమిక చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేసి అనంతరం ఎత్తివేస్తున్నారు. సాధారణ రోజుల్లో రాజన్న దర్శనానికి వస్తున్న భక్తులు అస్వస్థతకు గురైతే కనీసం ప్రాథమిక చికిత్స అందడం లేదు. కుటుంబ సభ్యులే ప్రైవేట్ వాహనాల్లో పట్టణంలోని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లాల్సి వస్తోంది. ఈక్రమంలో భక్తులు చనిపోయిన సంఘటనలు సైతం ఉన్నాయి.



నిజామాబాద్ జిల్లా నిజాంసాగర్‌కు చెందిన సాయిలు జూన్ 4, 2023న కుటుంబ సభ్యులతో కలసి రాజన్నను దర్శించుకునేందుకు వచ్చారు. ఈ క్రమంలోనే ఆయనకు ఫిట్స్ వచ్చాయి. అందుబాటులో ప్రాథమిక చికిత్స లేకపోవడంతో సాయిలు మరణించాడని కుటుంబ సభ్యులు ఆలయ యంత్రాంగంపై మండిపడ్డారు. అయినా ఏడాది గడుస్తున్నా కనీసం ప్రథమ చికిత్స సెంటర్లు ఏర్పాటు చేయడం లేదు.




వరంగల్‌కు చెందిన ఓ భక్తురాలు ఈనెల 28న రాజన్నను దర్శించుకునేందుకు కుటుంబ సభ్యులతో కలసి వచ్చింది. మంత్రి పొన్నం ప్రభాకర్ స్వామివారి దర్శనం కోసం రావడంతో కాసేపు క్యూలైన్లు ఆపేశారు. దీంతో ఉక్కపోత భరించలేక, ఉపవాసంలో ఉన్న ఆ మహిళా భక్తురాలు సొమ్మసిల్లి పడిపోయింది. దీంతో హుటాహుటిన కుటుంబ సభ్యులు ఆమెను ఆలయంలోని రుద్రాభిషేకం మంటపంలోకి తీసుకొచ్చారు. ప్రథమ చికిత్స కేంద్రం అందుబాటులో లేకపోవడంతో కుటుంబ సభ్యులు, ఆలయ సిబ్బందే ప్రథమ చికిత్స చేసి ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.



రద్దీ రోజుల్లో ఇబ్బంది

రాజన్నకు ప్రీతిపాత్రమైన సోమవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శనానికి వస్తారు. ప్రస్తుతం శ్రావణమాసం కొనసాగుతుండడంతో భక్తుల సంఖ్య మరింత పెరిగింది. దీంతో దర్శనం కోసం క్యూలైన్లలోనే నాలుగైదు గంటలు ఎదురుచూడాల్సి వస్తోంది. గత కొద్ది రోజులుగా వాతావరణంలో తేమశాతం ఎక్కువగా ఉండడంతో చమటలు కక్కుతున్నారు. ఈక్రమంలో భక్తులు అస్వస్థతకు లోనవుతున్నారు. ఈనెల 28న మంత్రి పొన్నం ప్రభాకర్ రాజన్న దర్శనం కోసం రావడంతో కాసేపు క్యూలైన్లను నిలిపివేశారు. ఈ సమయంలోనే వరంగల్‌కు చెందిన ఓ భక్తురాలు సొమ్మసిల్లి పడిపోయింది. కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నా కనీసం ప్రథమ చికిత్స సెంటర్ లేకపోవడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేస్తాం



"మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఉపవాసంతో వచ్చే భక్తులకు ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈక్రమంలో ప్రథమ చికిత్స కేంద్రాల ఏర్పాటు అంశంపై ఎమ్మెల్యే, కలెక్టర్, జిల్లా వైద్యాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం."

– కొప్పుల వినోద్‌రెడ్డి, ఆలయ ఈవో

కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మి కుటుంబ సభ్యులతో కలసి జూన్ 7, 2023న వేములవాడ రాజన్నను దర్శించుకునేందుకు ఆలయానికి వచ్చింది. భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో వారికి దర్శనభాగ్యం కలగలేదు. దీంతో ఆలయ ఆవరణలోనే రాత్రి బస చేశారు. 8న వేకువజామున రాజన్నను దర్శించుకునేందుకు సమాయత్తమయ్యారు. ఈక్రమంలో తాను ఇక్కడే ఉంటానని లక్ష్మి కుటుంబ సభ్యులకు చెప్పి పడుకుంది. ఈలోగానే గుండెనొప్పి రావడంతో అరుపులు..కేకలు వేసింది. ఎవరూ స్పందించకపోవడంతో తనువు చాలించింది. ఆలయ భద్రతా సిబ్బంది, ఆలయ సిబ్బంది అచేతనంగా చూస్తూ ఉండిపోయారు. బంధువులు గుండెలు బాదుకుంటూ లక్ష్మి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లారు.



సాక్షి ప్లస్
శనివారం । 31-8-2024

సమాఖ్య, ఏక కేంద్ర వ్యవస్థల మధ్య తేడాలు?

భారత సమాఖ్య వ్యవస్థ
కేంద్ర, రాష్ట్ర సంబంధాలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉన్న సంబంధాల ఆధారంగా రాజకీయ వ్యవస్థలను సమాఖ్య లేదా ఏక కేంద్ర ప్రభుత్వాలుగా వర్గీకరిస్తారు.

కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికార విభజన ఉంటే సమాఖ్య వ్యవస్థగా, అధికారాలన్నీ ఒకే ప్రభుత్వంలో కేంద్రీకృతమై ఉంటే దాన్ని ఏక కేంద్ర ప్రభుత్వంగా పేర్కొంటారు.

సమాఖ్య వ్యవస్థ

సమాఖ్య అనే పదాన్ని ఆంగ్లంలో 'ఫెడరేషన్' అంటారు. ఈ పదం లాటిన్‌లోని 'ఫోడస్' అనే పదం నుంచి ఉద్భవించింది. ఫోడస్ అంటే ఒప్పందం లేదా అంగీకారం. సమాఖ్య ప్రభుత్వాలు సాధారణంగా కేంద్రం, రాష్ట్రాల మధ్య ఒప్పందం ద్వారా ఏర్పడతాయి.

సమాఖ్య వ్యవస్థకు ఉదాహరణలు: అమెరికా, కెనడా, స్విట్జర్లాండ్, ఆస్ట్రేలియా, బ్రెజిల్, అర్జెంటీనా మొదలైనవి.

ఏక కేంద్ర వ్యవస్థ

ఈ తరహా వ్యవస్థలో అధికారాలన్నీ ఒకే ప్రభుత్వంలో కేంద్రీకృతమై ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వాలు ఉండవు. పరిపాలనా సౌలభ్యం కోసం ప్రాంతాలను కొన్ని యూనిట్లుగా విభజిస్తారు. వీటికి స్వతంత్ర ప్రతిపత్తి ఉండదు. పూర్తిగా కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉంటాయి.

ఏక కేంద్ర వ్యవస్థకు ఉదాహరణలు: బ్రిటన్, ఫ్రాన్స్, జపాన్, చైనా, ఇటలీ, బెల్జియం మొదలైనవి.

సమాఖ్య, ఏక కేంద్రాల మధ్య పోలికలు, తేడాలు

సమాఖ్య ప్రభుత్వం
- కేంద్ర రాష్ట్రాల మధ్య అధికార విభజన ఉంటుంది.
- లిఖిత, దృఢ రాజ్యాంగం తప్పనిసరి
- ద్వంద్వ ప్రభుత్వాలు ఉంటాయి.
- కేంద్ర శాసనసభ ద్విసభా విధానాన్ని కలిగి ఉంటుంది.
- స్వతంత్ర సర్వోన్నత న్యాయవ్యవస్థ ఉంటుంది.
- రాజ్యాంగ ఆధిక్యత ఉంటుంది.

ఏక కేంద్ర ప్రభుత్వం
- అధికారం కేంద్రీకృతమై ఉంటుంది.
- ఏ తరహా రాజ్యాంగమైనా ఉండవచ్చు.
- కేంద్ర ప్రభుత్వం మాత్రమే ఉంటుంది.
- ద్విసభా విధానం తప్పనిసరి కాదు.
- న్యాయవ్యవస్థ స్వతంత్రంగా ఉండొచ్చు లేదా ఉండకపోవచ్చు.
- కేంద్ర ప్రభుత్వ ఆధిక్యత ఉంటుంది.

సమాఖ్య ఏర్పడే పద్ధతులు

సమాఖ్య సాధారణంగా రెండు పద్ధతుల ద్వారా ఏర్పాటవుతుంది.

రాష్ట్రాల కలయిక వల్ల ఏర్పడే సమాఖ్య (Federation by Integration):
ఈ తరహాలో, స్వతంత్రంగా ఉన్న రాష్ట్రాలు ఆర్థిక, రాజకీయ, సైనిక కారణాల వల్ల సమీకృతమై సమాఖ్యగా ఏర్పడతాయి. ఉదా: అమెరికాలోని రాష్ట్రాలన్నీ ఒక ఒప్పందం ద్వారా1787లో అమెరికా సంయుక్త రాష్ట్రాలు అనే సమాఖ్య రాజ్యంగా ఏర్పడ్డాయి. ఈ విధానాన్ని 'Com ing together' పద్ధతి అంటారు.

విచ్ఛిత్తి ప్రక్రియ వల్ల ఏర్పడే సమాఖ్య (Federation by Disintegration):
భౌగోళికంగా, జనాభాపరంగా పెద్ద దేశాలు పరిపాలనా సౌలభ్యం కోసం కొన్ని స్వతంత్ర ప్రతిపత్తిగల రాష్ట్రాలను ఏర్పాటు చేసి, వాటికి రాజ్యాంగపరంగా అధికారాలు బదలాయిస్తాయి. ఉదా: 1867లో ఏక కేంద్రంగా ఉన్న కెనడా 10 కొత్త రాష్ట్రాలను ఏర్పాటు చేసి సమాఖ్యగా అవతరించింది. ఈ విధానాన్ని 'Holding together' పద్ధతి అంటారు.

భారత సమాఖ్య - చరిత్ర

భారత సమాఖ్య చరిత్ర 1870లో లార్డ్ మేయో వికేంద్రీకరణ విధానంతో ప్రారంభమైందని చెప్పొచ్చు. భారత ప్రభుత్వ చట్టం-1919, దేశానికి నిజమైన సమాఖ్య లక్షణాన్ని ఇచ్చింది. భారత రాజ్యాంగం సమాఖ్య ప్రాతిపదికపై ఏర్పడాలని సైమన్ కమిషన్ ప్రతిపాదించింది. ఆ తర్వాత భారత ప్రభుత్వ చట్టం-1935, భావి భారత రాజ్యాంగానికి నిర్మాణాత్మకమైన సమాఖ్య రేఖాపటాన్ని ఇచ్చింది. అయితే, స్వదేశీ సంస్థానాలు వ్యతిరేకించడంతో ఇది అమల్లోకి రాలేదు. స్వాతంత్ర్యానంతరం, రాజ్యాంగ పరిషత్ భారతదేశానికి సమాఖ్య వ్యవస్థనే ఎంచుకొని, దానికి అనుగుణంగానే రాజ్యాంగాన్ని రచించింది.

ముఖ్య లక్షణాలు

ప్రపంచ సమాఖ్య వ్యవస్థలను పరిశీలిస్తే కింద పేర్కొన్న లక్షణాలుంటాయి.

అధికార విభజన:
అధికార విభజన సమాఖ్య ముఖ్య లక్షణం. రాజ్యాంగపరంగా కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికారాల విభజన ఉంటుంది. ఈ విభజన ఎన్ని జాబితాల్లో ఉండాలనే అంశంపై సార్వత్రిక సమ్మతి లేదు. భారత రాజ్యాంగంలో అధికారాలను మూడు జాబితాలుగా విభజించారు. అమెరికాలో కేవలం ఒకే జాబితా, ఆస్ట్రేలియాలో మూడు జాబితాలున్నాయి.

లిఖిత రాజ్యాంగం
సమాఖ్య వ్యవస్థకు లిఖిత రాజ్యాంగం ఉండాలి. దీంతో కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికార విభజన, పరిధి స్పష్టంగా ఉంటాయి. లిఖిత రాజ్యాంగం ద్వారానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటి పరిధుల్లోనే పనిచేసేలా నియంత్రణ వీలవుతుంది. భారత రాజ్యాంగం లిఖిత రాజ్యాంగమే.

గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
పాలిటీ

సర్వోన్నత, స్వతంత్ర ప్రతిపత్తి ఉన్న న్యాయవ్యవస్థ:
కేంద్ర, రాష్ట్రాల మధ్య వివాదాలు అంటే సమాఖ్య వివాదాలను పరిష్కరించడానికి దేశంలో ఒక అత్యున్నత న్యాయవ్యవస్థ ఉండాలి. అటువంటి న్యాయ వ్యవస్థ రాజ్యాంగ ఆధిక్యతను కాపాడి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ పరిధుల్లోనే పనిచేసేలా చూస్తుంది. న్యాయశాఖ స్వతంత్ర ప్రతిపత్తి కోసం రాజ్యాంగంలో అనేక పరిరక్షణలు పొందుపర్చారు.

ద్విసభా పద్ధతి
సమాఖ్యలో కేంద్ర శాసనసభ ద్విసభా పద్ధతిని కలిగి ఉంటుంది. ఎగువ సభ రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తుంది. రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడుతుంది. భారతదేశంలో రాజ్యసభ రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తుంది. అందుకే దీన్ని రాష్ట్రాల మండలి (Council of States) అంటారు.

రాజ్యాంగ ఆధిక్యత
సమాఖ్యలో రాజ్యాంగం అత్యున్నతమైన చట్టం. రాజ్యాంగమే అన్ని అధికారాలకు మూలం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగానికి లోబడి పనిచేస్తాయి. ఒకవేళ రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా చట్టాలు చేస్తే, అవి చెల్లుబాటు కాకుండా న్యాయ సమీక్షాధికారం ద్వారా సుప్రీంకోర్టు కొట్టివేస్తుంది.

దృఢ రాజ్యాంగం
సమాఖ్య వ్యవస్థకు దృఢ రాజ్యాంగం ఉండాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ అవసరాల కోసం రాజ్యాంగాన్ని అతి సులువుగా సవరించడానికి అవకాశం ఉండదు. అలా ఉంటే రాజ్యాంగం తన ఔన్నత్యం కోల్పోతుంది. రాజ్యాంగాన్ని సవరించడానికి ప్రత్యేక మెజార్టీ కావలసి ఉంటుంది. భారత రాజ్యాంగంలోని చాలా భాగాలు ప్రత్యేక మెజార్టీ ద్వారానే సవరించాలి. కాబట్టి భారత రాజ్యాంగం మౌలికంగా దృఢమైంది.



భారత రాజ్యాంగంలో ఉన్న ఏక కేంద్ర లక్షణాలు

భారత రాజ్యాంగంలో పైన పేర్కొన్న అన్ని సమాఖ్య లక్షణాలున్నాయి. అయితే కొన్ని ఏకీకృత లక్షణాలు కూడా కనిపిస్తాయి. దీని ఆధారంగా, భారత సమాఖ్య నిజమైన సమాఖ్య కాదని, అర్ధ సమాఖ్య అని విమర్శకులు వర్ణించారు. భారత రాజ్యాంగ నిర్మాతలు సంప్రదాయ సమాఖ్య వ్యవస్థ స్వభావంతో విభేదించి, భారతదేశానికి అనువైన సమాఖ్య వ్యవస్థను ఏర్పాటు చేశారు. అందువల్ల కొంత కేంద్ర ఆధిపత్యం, కొన్ని ఏక కేంద్ర లక్షణాలు చొప్పించారు. అవి కింది విధంగా ఉన్నాయి.

ఒకే రాజ్యాంగం
సమాఖ్యలకు ప్రత్యేక రాజ్యాంగాలుంటాయి. కానీ భారతదేశంలో కేంద్ర, రాష్ట్రాలకు కలిపి ఒకే రాజ్యాంగం ఉంటుంది.

ఏక పౌరసత్వం
సాధారణంగా సమాఖ్యల్లో ద్వంద్వ పౌరసత్వం ఉంటుంది. ఉదా: అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో పౌరులకు రెండు పౌరసత్వాలున్నాయి. కానీ భారత సమాఖ్యలో రాజ్యాంగం కేంద్ర, రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాలకు ఏక పౌరసత్వ విధానాన్ని కల్పించింది. అంతేకాకుండా, పౌరసత్వానికి సంబంధించిన చట్టాలను రూపొందించడం, అమలు పర్చడం మొదలైన అంశాలపైన పార్లమెంట్‌కు మాత్రమే అధికారం ఉంటుంది.

ఏకీకృత సమగ్ర న్యాయ వ్యవస్థ
సమాఖ్య వ్యవస్థల్లో కేంద్రానికి, రాష్ట్రాలకు వేర్వేరుగా న్యాయశాఖలుంటాయి. అంటే న్యాయశాఖ విభజన ఉంటుంది. కానీ భారత సమాఖ్యలో కేంద్ర, రాష్ట్రాలకు ఒకే న్యాయవ్యవస్థ ఉంది. సుప్రీం కోర్టు అత్యున్నత న్యాయస్థానంగా వ్యవహరిస్తూ కేంద్ర, రాష్ట్ర చట్టాలను సమీక్షిస్తుంది. రాష్ట్ర చట్టాలని పరిశీలించడానికి ప్రత్యేక కోర్టులు లేవు. సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులను రాష్ట్రపతే నియమిస్తారు. దేశంలో ఒకే విధమైన నేర శిక్షా స్మృతి అమలులో ఉంది.

అఖిల భారత సర్వీసులు
సమాఖ్యలో కేంద్రానికి రాష్ట్రాలకు ప్రత్యేకంగా సివిల్ సర్వీసులుంటాయి. భారత సమాఖ్య వ్యవస్థలో కేంద్రం, రాష్ట్రాలకు వేర్వేరుగా సర్వీసులు ఉన్నప్పటికీ ఉమ్మడిగా వర్తించే అఖిల భారత సర్వీసులు ఉండటం సమాఖ్య విధానానికి విరుద్ధం. ఈ సర్వీసుల్లో యూపీఎస్సీ ఎంపిక చేసిన అభ్యర్థులను రాష్ట్రపతి నియమిస్తారు. వీరు కేంద్ర ప్రభుత్వానికే బాధ్యులై ఉంటారు. రాష్ట్ర పరిపాలనలో కీలకపదవుల్లో నియమితులై, కేంద్ర, రాష్ట్ర చట్టాలను అమలు చేస్తారు.

అత్యవసర అధికారాలు
వివిధ అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి రాజ్యాంగం కేంద్ర ప్రభుత్వానికి అసాధారణ అధికారాలను కల్పించింది. జాతీయ అత్యవసర పరిస్థితి (ప్రకరణ 352), రాజ్యాంగపరమైన అత్యవసర పరిస్థితి (ప్రకరణ 356), ఆర్థిక అత్యవసర పరిస్థితి (ప్రకరణ 360) ఈ మూడు రకాలైన అత్యవసర పరిస్థితుల్లో కేంద్రం అసాధారణ అధికారాలను పొందుతుంది. ఈ సమయంలో కేంద్ర, రాష్ట్రాల మధ్య ఉన్న అధికార విభజన రద్దవుతుంది. అధికారాలన్నీ కేంద్ర ప్రభుత్వానికి బదిలీ అవుతాయి. రాజ్యాంగ సమాఖ్య స్వరూపం ఎలాంటి రాజ్యాంగ సవరణ లేకుండానే ఏక కేంద్ర వ్యవస్థగా మారిపోతుంది.

ఉద్యోగాలు

ఏపీ వైద్య కళాశాలల్లో 488 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ).. ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాసుపత్రుల్లో రెగ్యులర్ ప్రాతిపదికన డైరెక్ట్/లేటరల్ ఎంట్రీ విధానంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం పోస్టుల సంఖ్య: 488.
- **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ ప్రొఫెసర్-బ్రాడ్ స్పెషాలిటీ(క్లినికల్/నాన్ క్లినికల్), అసిస్టెంట్ ప్రొఫెసర్-సూపర్ స్పెషాలిటీస్.
- **అర్హత:** సంబంధిత విభాగంలో మెడికల్ పీజీ(ఎండీ, ఎంఎస్, డీఎన్‌బీ, డీఎం, ఎండీ, ఎంసీహెచ్) ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** ఓసీలకు 42 ఏళ్లు, ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 47 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక విధానం:** విద్యార్హతలో సాధించిన మార్కులు, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 09.09.2024.
- వెబ్‌సైట్: https://dme.ap.nic.in/

ఆర్‌వీఎన్ఎల్, న్యూఢిల్లీలో 24 పోస్టులు

న్యూఢిల్లీలోని రైల్వే వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌వీఎన్ఎల్) రెగ్యులర్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం పోస్టుల సంఖ్య: 24.
- **పోస్టుల వివరాలు:** డిప్యూటీ జనరల్ మేనేజర్-06, సీనియర్ మేనేజర్-06, అసిస్టెంట్ మేనేజర్-02, సీనియర్ ఎగ్జిక్యూటివ్-10.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో సీఏ, బీకామ్, ఎంబీఏ (ఫైనాన్స్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** డీజీఎం పోస్టుకు 45 ఏళ్లు, సీనియర్ మేనేజర్ పోస్టుకు 40 ఏళ్లు, మిగతా పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక విధానం:** దరఖాస్తుల షార్ట్‌లిస్ట్, పని అనుభవం, ఇంటర్వ్యూ ఆధారంగా
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డిస్పాచ్ సెక్షన్, గ్రౌండ్ ఫ్లోర్, ఆగస్ట్ క్రాంతి భవన్, భికాజీ కామా, ఆర్కే పురం, న్యూఢిల్లీ చిరునామకు పంపించాలి.
- దరఖాస్తు ప్రారంభతేది: 06.08.2024.
- దరఖాస్తులకు చివరితేది: 05.09.2024.
- వెబ్‌సైట్: https://www.rvnl.org/

'మ-స-జ-స-త-త-గ' గణాలున్న పద్య పాదం

వ్యాకరణం - ఛందస్సు

డీసెట్ తెలుగులో ఛందస్సు ప్రధానమైంది. విద్యార్థులు పద్య లక్షణాలు, గణాలు వంటివాటిపై పూర్తి అవగాహన పెంచుకోవాలి.

వృత్తాల్లో ఉత్పలమాల, చంపకమాల, శార్దూలం, మత్తేభం ముఖ్యమైనవి. జాతుల్లో కందం, ద్విపద లక్షణాలు తెలుసుకోవాలి. ఉపజాతుల్లో సీసం, తేటగీతి, ఆటవెలది మొదలైన వాటి గురించి తెలుసుకోవాలి. గణాల్లో సూర్యగణాలు, ఇంద్ర గణాలపై అవగాహన ఉండాలి. డీసెట్‌లో ప్రధానంగా పద్యాల గణాలిచ్చి ఏ పద్యపాదమో గుర్తించాలని, పద్యపాదాన్ని ఇచ్చి ఏ పద్య పాదమో తెలపాలని అడుగుతారు. అలాగే సూర్య గణాలు, ఇంద్ర గణాలు కూడా కనుక్కోవాలని ప్రశ్నలు ఇస్తారు.

సూర్య గణాలు: రెండు
1) నగణం (| | |)
2) గలము లేక హగణం (∪ |)
ఇంద్ర గణాలు: ఆరు.
భ-ర-త-నల-నగ-సల

వృత్త పద్యాలు

వృత్త పద్యాల్లో అక్షర సంఖ్యా నియమం, గణ సంఖ్యా నియమం ఉంటుంది. వీటిలో యతి, ప్రాస నియమాలు విధిగా ఉంటాయి.

1. **ఉత్పలమాల:** ప్రతి పద్య పాదంలో 'భ, ర, న, భ, భ, ర, వ' అనే గణాలుంటాయి. ప్రతి పద్య పాదంలో మొదటి అక్షరానికి పదో అక్షరానికి యతిమైత్రి చెల్లుతుంది. పాదం మొత్తానికి ఇరవై అక్షరాలు ఉంటాయి. ప్రాస నియమం ఉంటుంది.

ఉదాహరణ:
ఎక్కడి మంత్రతం త్రముల నె క్క డి
∪| | ∪|∪ | | |∪| |
భ ర న భ
చక్రము లేదపా చికల్
∪| | ∪|∪ |∪
భ ర వ
భ-ర-న-భ-భ-ర-వ గణాలున్నాయి. 1-10 అక్షరాలకు యతిమైత్రి చెల్లింది.

2. **చంపకమాల:** ప్రతి పద్య పాదంలో 'న-జ-భ-జ-జ-జ-ర' అనే గణాలుంటాయి. ప్రతి పాదంలో 1-11 అక్షరాలకు యతిమైత్రి చెల్లుతుంది. పాదం మొత్తానికి 21 అక్షరాలు ఉంటాయి. ప్రాస నియమం ఉంటుంది.

ఉదాహరణ:
అనయ ముదోష మేపరు లయందు
| | | |∪| ∪| | |∪ |
న జ భ జ
కనుంగొ నిపల్కు నట్టియా
|∪| |∪| ∪|∪
జ జ ర
న-జ-భ-జ-జ-జ-ర అనే గణాలున్నా యి. 1-11 అక్షరాలకు యతిమైత్రి చెల్లింది.

3. **శార్దూలం:** ప్రతి పద్య పాదంలో 'మ-స -జ-స-త-త-గ' అనే గణాలుంటాయి. మొదటి అక్షరానికి 13వ అక్షరానికి యతిమైత్రి చెల్లుతుంది. పాదం మొత్తానికి 19 అక్షరాలుంటాయి. ప్రాస నియమం ఉంటుంది.

ఉదాహరణ:
ఇల్లాలిం టి కి దీ పమౌన న గ హీ
∪∪∪ | |∪ |∪| | |∪
మ స జ స
హీయంచు మందుల్ జమ్
∪∪ | ∪∪| ∪
త త గ
మ-స-జ-స-త-త-గ అనే గణాలు వచ్చాయి. 1-13వ అక్షరాలకు యతిమైత్రి చెల్లింది. పాదం మొత్తానికి 19 అక్షరాలున్నాయి.

4. **మత్తేభం:** ప్రతి పద్య పాదంలో 'స-భ-ర- న-మ- య-వ' అనే గణాలుంటాయి. 1-14 అక్షరాలకు యతిమైత్రి చెల్లుతుంది. పాదం మొత్తానికి 20 అక్షరాలుంటాయి. ప్రాస నియమం ఉంటుంది.

ఉదాహరణ:
తనదే శంబుస్వ భాషనై జమత
| |∪ ∪| | ∪|∪| | |
స భ ర న
మున్‌అస్మ త్సదాచా రముల్
∪∪∪ |∪∪ |∪
మ య వ
స-భ-ర-న-మ-య-వ అనే గణాలు వచ్చాయి. 1-14 అక్షరాలకు యతిమైత్రి చెల్లింది. పాదం మొత్తానికి 20 అక్షరాలు ఉన్నాయి. ఇది మత్తేభం.

జాతులు

జాతుల్లో డీసెట్ విద్యార్థులకు కందం, ద్విపద ముఖ్యమైనవి.

1. **కంద పద్యం:** 'భ-జ-స-నలి-గగ' అనే గణాలుంటాయి. 1, 3 పాదాల్లో మూడు గణాలు ఉంటాయి. 2, 4 పాదాల్లో ఐదు గణాలుంటాయి. 2, 4 పాదాల్లో మొదటి గణం మొదటి అక్షరానికి నాలుగో గణం మొదటి అక్షరానికి యతిమైత్రి చెల్లుతుంది. బేసి గణాల్లో 'జగణం' ఉండరాదు.

రెండో పాదంలో మూడో గణంతో నాలుగో పాదంలో మూడో గణంతో జగణంగానీ, నలం గానీ ఉండాలి. రెండు, నాలుగు పాదాల్లో చివరి అక్షరం గురువు ఉండాలి. ప్రాస నియమం ఉంటుంది. ప్రాస పూర్వాక్షరం మొదటి పాదంలో గురువైతే పాదాలన్నింటిలో గురువు ఉండాలి. లఘువైతే లఘువులే ఉండాలి. పద్యం పరిమాణంలో చిన్నదైనా, నియమాలు ఎక్కువగా ఉన్న పద్యం కందం. అందుకే 'కందం రాసినవాడే కవి' అనే సూక్తి వాడుకలో ఉంది.

ఉదాహరణ:
ఆ ప ర మపురం ధ్రులయం
∪| | | |∪ | |∪
భ జ స
దేవు ణ్యాంగన యుభిక్ష యిడద య్యెంగుటా
∪∪ ∪| | |∪| | |∪ | |∪
గగ భ జ స స
భ-జ-స-గగ అనే గణాలు వచ్చాయి. రెండో పాదంలో మొదటి గణం మొదటి అక్షరానికి నాలుగో గణం మొదటి అక్షరానికి యతిమైత్రి చెల్లింది. నియామలన్నీ ఉన్నందుకు ఇది కంద పద్యం.

2. **ద్విపద:** ద్విపదలో రెండు పాదాలు ఉంటాయి. ప్రతి పాదంలో 3 ఇంద్ర గణాలు మిగతా ఒకటి సూర్య గణం ఉంటుంది. ప్రతి పాదంలో మొదటి గణం మొదటి అక్షరానికి మూడో గణం మొదటి అక్షరానికి యతిమైత్రి చెల్లుతుంది. ప్రాస నియమంలేని ద్విపదను మంజరీ ద్విపద అంటారు.

ఉదాహరణ:
మకరతో రణములు మణితోర ణములు
| | |∪ | | | | | |∪| | | |
నగ నల సల న
ముకురతో రణములు మునుఁగట్ట బనిచి
| | |∪| | | | | |∪| | | |
నగ నల సల న
ప్రతి పాదంలో 3 ఇంద్ర గణాలు, 1 సూర్యగణం వచ్చింది. మొదటి గణం మొదటి అక్షరానికి 3వ గణం మొదటి అక్షరానికి యతిమైత్రి చెల్లింది. ప్రాస నియమం ఉంది.

ఉపజాతులు

దేశీయమైన ఛందోరీతులు ఉపజాతులు. ఇవి మాత్రా గణాలతో ఏర్పడతాయి. వీటిలో యతికి బదులు ప్రాసయతి చెల్లుతుంది. ప్రాస నియమం ఉండదు. తేటగీతి, ఆటవెలది, సీసం ముఖ్యమైనవి.

1. **తేటగీతి:** ప్రతి పద్య పాదంలో మొదట ఒక సూర్య గణం, తర్వాత 2 ఇంద్ర గణాలు, తర్వాత 2 సూర్య గణాలు ఉంటాయి. ప్రతిపాదంలో మొదటి గణం మొదటి అక్షరానికి నాలుగో గణం మొదటి అక్షరానికి యతిమైత్రి చెల్లుతుంది. ప్రాస నియమం లేదు. ప్రాసయతి చెల్లుతుంది.

ఉదాహరణ:



టెట్/డీఎస్సీ
తెలుగు

దమము శమముకూ డనిజప తపము లేల?
| | | | | |∪ | | | | | | | ∪|
న నగ నల న హ
మొదట ఒక సూర్య గణం, తర్వాత 2 ఇంద్రగణాలు, తర్వాత 2 సూర్య గణాలు వచ్చాయి. మొదటి గణం మొదటి అక్షరం 'ద' నాలుగో గణం మొదటి అక్షరం 'త'కు యతిమైత్రి చెల్లింది. కాబట్టి ఇది తేటగీతి పద్యం.

2. **ఆటవెలది:** 1, 3 పాదాల్లో మొదటి 3 సూర్యగణాలు, తర్వాత 2 ఇంద్రగణాలు ఉంటాయి. 2, 4 పాదాల్లో అయిదు సూర్య గణాలు ఉంటాయి. ప్రతి పాదంలో మొదటిగణం మొదటి అక్షరానికి నాలుగో గణం మొదటి అక్షరానికి యతిమైత్రి చెల్లుతుంది. ప్రాస నియమం లేదు ప్రాసయతి చెల్లుతుంది.

ఉదాహరణ:
పగయ కలిగె నేని బాముున్న యింటిలో
| | | | | | ∪| ∪∪| ∪|∪
న న హ త ర
నున్న యట్ల కాక యూఱ డిల్లి
∪|∪| ∪| ∪ | ∪|
హ హ హ హ హ
పై పాదాల్లో మొదటి పాదంలో 3 సూర్య గణాలు, తర్వాత 2 ఇంద్ర గణాలు వచ్చాయి. రెండో పాదంలో మొత్తం 5 సూర్యగణాలు వచ్చాయి. మొదటి గణం మొదటి అక్షరానికి నాలుగో గణం మొదటి అక్షరానికి యతిమైత్రి. కాబట్టి ఇది ఆటవెలది.

3. **సీస పద్యం:** సీస పద్యంలో ప్రతిపాదానికి మొదట 6 ఇంద్ర గణాలు, తర్వాత 2 సూర్య గణాలు ఉంటాయి. రచన సౌలభ్యం కోసం ప్రతి పాదాన్ని 4 ఇంద్ర గణాల వరకు పూర్వ పాదంగా, మిగిలిన 2 ఇంద్ర గణాలు, 2 సూర్య గణాలను ఉత్తర పాదంగా విభజించి రాస్తారు. నాలుగు పాదాల తర్వాత తేటగీతిగానీ, ఆటవెలది గానీ అనుబంధంగా ఉంటుంది. ప్రతి పాదంలో మొదటి గణం మొదటి అక్షరానికి (పూర్వ పాదంలో), మూడో గణం మొదటి అక్షరానికి (పూర్వ పాదంలో), అయిదో గణం మొదటి అక్షరానికి, ఏడో గణం మొదటి అక్షరానికి (ఉత్తర పాదంలో) యతిమైత్రి చెల్లుతుంది. ప్రాస నియమం లేదు. ప్రాసయతి చెల్లుతుంది.

ఉదాహరణ:
గుణమింత కుదరక గుఱ్ఱతి రుగుటేల?
| |∪| | | | | ∪| | | |∪|
సల నల భ సల
సంస్కార మబ్బని చదువు లేల?
∪∪ | ∪| | | | | ∪|
త భ న హ
పూర్వ పాదంలో 4 ఇంద్ర గణాలు, ఉత్తర పాదంలో 2 ఇంద్ర గణాలు, 2 సూర్య గణాలు వచ్చాయి. మొదటి గణం మొదటి అక్షరం 'గు'తో మూడో గణం మొదటి అక్షరం 'గు'తో యతిమైత్రి చెల్లింది. 5వ గణం మొదటి అక్షరం 'సం' 7వ గణం మొదటి అక్షరం 'చ'తో యతిమైత్రి చెల్లింది. కాబట్టి ఇది సీస పద్యం.

మాదిరి ప్రశ్నలు

1. 'కామన శాంతిఁబొందుటయు కర్జము దానది యట్లలుండెశ్రీ'- ఈ పాదంలో ఉన్న ఛందస్సు ఏది?
   1) చంపకమాల 2) ఉత్పలమాల
   3) శార్దూలం 4) మత్తేభం
2. 'పగయదగింపు టింతయు శుభంబదిలెన్ను యదంగునేపగం' ఇది ఏ పద్య పాదం?
   1) శార్దూలం 2) తేటగీతి
   3) చంపకమాల 4) మత్తేభం
3. 'మ-స-జ-స-త-త-గ' గణాలున్న పద్య పాదం?
   1) ఉత్పలమాల 2) మధ్యాక్కర
   3) చంపకమాల 4) శార్దూలం
4. 'బ్రోచిన దొరనింద సేయబోకుము కార్యా' ఇది ఏ పద్య పాదమో గుర్తించండి?
   1) ద్విపద 2) తేటగీతి
   3) కందం 4) ఆటవెలది
5. వీటిలో సూర్య గణం ఏది?
   1) గగము 2) గలము
   3) లగము 4) సగణం
6. 13వ అక్షరం యతిమైత్రిగా ఉండే పద్యం?
   1) ఉత్పలమాల 2) మత్తేభం
   3) శార్దూలం 4) చంపకమాల
7. 'రంగదరాతి భంగ, ఖగరాజతురంగ, విపత్పరంపరో' పద్య పాదంలో గణాలు గుర్తించండి?
   1) మ-స-జ-స-త-త-గ
   2) భ-ర-న-భ-భ-ర-వ
   3) న-జ-భ-జ-జ-జ-ర
   4) స-భ-ర-న-మ-య-వ
8. వీటిలో ఇంద్ర గణం కానిది?
   1) భ 2) సల 3) జ 4) నగ
9. 'స్నానంబుల్ నదులందు జేయుట గజ స్నానంబు చందంబుగన్' ఈ పద్య పాదంలో యతి మైత్రి?
   1) జ 2) స్నా 3) జే 4) చం
10. కింది వాటిలో ప్రాస నియమం లేని పద్యం?
    1) కందం 2) ద్విపద
    3) తేటగీతి 4) మత్తేభం
11. 'పవి పుష్పంబగు నగ్నిమందగునకు పారం బు భూమీ స్థలం'- ఏ పద్య పాదమో గుర్తించండి?
    1) మత్తేభం 2) మధ్యాక్కర
    3) శార్దూలం 4) చంపకమాల
12. 'నిద్రింపుము వెలువనేల నీకిటననినన్' ఇది ఏ పద్యం?
    1) ద్విపద 2) తేటగీతి
    3) కందం 4) సీసం

సమాధానాలు

1) 2; 2) 3; 3) 4; 4) 3; 5) 2; 6) 3; 7) 2; 8) 3; 9) 2; 10) 3; 11) 1; 12) 3.

అణు రియాక్టర్ల పితామహుడు ఎవరు?

గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఫిజిక్స్

రేడియోధార్మికత

ఒక రేడియోధార్మిక పదార్థం దానిలో నుంచి రేడియోధార్మిక కిరణాలను విడుదల చేస్తూ దాని అసలు ద్రవ్యరాశిలో సగం ద్రవ్యరాశిగా మార్పు చెందడానికి పట్టే కాలాన్ని 'అర్ధ జీవిత కాలం' అంటారు. అర్ధ జీవిత కాలాల విలువ ఆయా రేడియోధార్మిక కిరణాల స్వభావంపై మాత్రమే ఆధారపడి ఉంటుంది. కాబట్టి వేర్వేరు రేడియోధార్మిక పదార్థాల అర్ధ జీవిత కాలాలు వేర్వేరుగా ఉంటాయి. ఏదైనా ఒక రేడియోధార్మిక పదార్థం దాని నుంచి రేడియోధార్మిక కిరణాలను విడుదల చేస్తూ సీసం (Pb_{82}) ఆకృతిని పొందినప్పుడు స్థిరత్వాన్ని పొందుతుంది. దీంతో ఆ పదార్థ రేడియోధార్మికత ఆగిపోతుంది. అందువల్ల సీసం అర్ధ జీవిత కాలాన్ని అనంతంగా తీసుకుంటారు.

కృత్రిమ రేడియోధార్మికత

ప్రయోగశాలలో ఒక స్థిరమైన పరమాణు కేంద్రకాన్ని భారయుత కణాలతో ఢీకొనే విధంగా చేసినప్పుడు అది రేడియోధార్మికతను ప్రదర్శిస్తుంది. దీన్ని 'కృత్రిమ రేడియోధార్మికత' అంటారు. ఐరీన్ క్యూరీ, ఫ్రెడ్రిక్ జూలియట్ క్యూరీ కృత్రిమ రేడియోధార్మికతను కనుగొన్నారు.

ఉదా: ప్లూటోనియం (Pu), నెప్ట్యూనియం, అమెరిసియం(Americium), లారెన్సియం, క్యూరీయం, ఫెర్మియం, స్ట్రాన్షియం, ఐనిస్టీనియం మొదలైన మూలకాలు కృత్రిమ రేడియోధార్మికత ధర్మాన్ని ప్రదర్శిస్తాయి.

సాధారణంగా వినియోగించే U, Th, Pu రేడియోధార్మిక మూలకాల్లో.. ప్లూటోనియం (Pu)-ను అత్యుత్తమ అణు ఇంధనంగా పరిగణిస్తారు.

స్ట్రాన్షియం (Stansium)–90 అనే రేడియోధార్మిక కిరణాలు అణు రియాక్టర్ల నుంచి విడుదలవుతాయి. ఇవి మానవుల చర్మంపై పడితే చర్మ కేన్సర్‌కు కారణమవుతాయి.

ఐన్‌స్టీన్ ప్రధాన పరిశోధనలు

1. ద్రవ్యరాశి శక్తి తుల్యత నియమం $E = mc^2$
2. సాపేక్ష సిద్ధాంతం
3. కాంతి విద్యుత్ ఫలిత సమీకరణం

కాంతి విద్యుత్ ఫలిత సమీకరణాన్ని ప్రతిపాదించినందుకు ఐన్‌స్టీన్‌కు 1921లో నోబెల్ బహుమతి లభించింది. ఐన్‌స్టీన్‌ను ఈ మిలీనియం శాస్త్రవేత్తగా గుర్తించి, గౌరవించారు.

కేంద్రక విచ్ఛిత్తి

పరమాణు సంఖ్య 82, అంతకంటే ఎక్కువ ఉన్న పరమాణువు కేంద్రకాలను తటస్థ ఆవేశం ఉన్న న్యూట్రాన్‌తో ఢీకొట్టించినప్పుడు అది విచ్ఛిన్నం చెంది దాదాపు సరిసమానమైన రెండు కొత్త పరమాణు కేంద్రకాలుగా విడిపోతుంది. వాటిలో నుంచి కొన్ని న్యూట్రాన్లు, అత్యధిక అణు శక్తి విడుదలవుతాయి. దీన్ని 'కేంద్రక విచ్ఛిత్తి' అంటారు.

ఉదా: ఒక యురేనియం పరమాణు కేంద్రకాన్ని న్యూట్రాన్‌తో తాడనం చెందించినప్పుడు అది విచ్ఛిన్నం చెంది $_{36}Kr$, $_{56}Ba$ అనే కొత్త పరమాణు కేంద్రకాలుగా విడిపోతుంది. ఈ ప్రక్రియలో మూడు న్యూట్రాన్లు, 200 MeVల అణుశక్తి విడుదలవుతుంది.

[illegible] (యురేనియం → ... న్యూట్రాన్లు అణుశక్తి)

సాధారణంగా యురేనియం, థోరియం, ప్లూటోనియం మూలకాలు కేంద్రక విచ్ఛిత్తికి లోనవుతాయి. అందువల్ల వీటిని విచ్ఛిత్తిశీల పదార్థాలు లేదా అణు ఇంధనాలు అంటారు. వీటిలో యురేనియం 'పిచ్‌బ్లెండ్' రూపంలో, థోరియం 'మోనజైట్' రూపంలో భూమిలో లభిస్తాయి. ప్లూటోనియం అనేది మానవుడు రూపొందించిన కృత్రిమ రేడియోధార్మిక పదార్థం. కేంద్రక విచ్ఛిత్తిని ఒట్టోహన్, స్ట్రాస్‌మన్ అనే శాస్త్రవేత్తలు కనుగొన్నారు.

గొలుసు చర్య (శృంఖల చర్య): విచ్ఛిత్తి శీల పదార్థంలో విచ్ఛిత్తి చర్య నిరంతరంగా కొనసాగుతూ అన్ని కణాలకు విస్తరించడాన్ని 'గొలుసు చర్య' లేదా 'శృంఖల చర్య' అంటారు. గొలుసు చర్య రేటు కింద పేర్కొన్న అంశాలపై ఆధారపడి ఉంటుంది.

1. విచ్ఛిత్తి శీల పదార్థ స్వభావం.
2. గొలుసు చర్యలో పాల్గొంటున్న న్యూట్రాన్ల వేగం (న్యూట్రాన్ల వేగం పెరిగితే గొలుసు చర్య రేటు కూడా పెరుగుతుంది).

గొలుసు చర్యలో వెలువడే న్యూట్రాన్ల సగటు సంఖ్య 2.5 మాత్రమే. గొలుసు చర్య పూర్తి కావడానికి పట్టే సమయం కేవలం 10^{-8} సెకన్లు. దీన్ని ఒక "Shake" అంటారు.

1 Shake = 10^{-8} sec.

ఇది కాలాన్ని కొలవడానికి ఉపయోగించే అతి చిన్న ప్రమాణం. కాలాన్ని కొలవడానికి అతి పెద్ద ప్రమాణం - కాస్మిక్ సంవత్సరం.

1 కాస్మిక్ సంవత్సరం = 250 మిలియన్ సంవత్సరాలు (సుమారు)

గొలుసు చర్యను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు.

1. **అనియంత్రిత గొలుసు చర్య:** గొలుసు చర్యలో పాల్గొంటున్న న్యూట్రాన్ల వేగాన్ని అదుపు చేయలేకపోతే అది నిరంతరంగా కొనసాగుతుంది. దీన్ని 'అనియంత్రిత గొలుసు చర్య' అంటారు.

   ఉదా: అణుబాంబు.

   అణుబాంబు నిర్మాణంలో ఇమిడి ఉన్న సూత్రం కేంద్రక విచ్ఛిత్తి. అణుబాంబు విస్ఫోటం జరిగినప్పుడు అనియంత్రిత గొలుసు చర్య పద్ధతిలో అణుశక్తి విడుదలవుతుంది. సాధారణంగా అణుబాంబులను తయారు చేసిన తర్వాత అల్యూమినియం పాత్రలో భద్రపరుస్తారు. అల్యూమినియం ద్వారా న్యూట్రాన్ ($_0n^1$) చొచ్చుకువెళ్లదు.
2. **నియంత్రిత గొలుసు చర్య:** గొలుసు చర్యలో పాల్గొంటున్న న్యూట్రాన్ల వేగాన్ని తగ్గిస్తే ఆ చర్య అదుపులోకి వస్తుంది. దీన్ని 'నియంత్రిత గొలుసు చర్య' అంటారు. ఈ పద్ధతిలో వెలువడిన అణుశక్తిని మానవాళి అభివృద్ధి కోసం ఉపయోగిస్తారు.

న్యూక్లియర్ రియాక్టర్ (అణు రియాక్టర్)

న్యూక్లియర్ రియాక్టర్ నిర్మాణంలో కేంద్రక విచ్ఛిత్తి అనే సూత్రం ఇమిడి ఉంటుంది. ఇందులో నియంత్రిత గొలుసు చర్య ప్రకారం అణుశక్తి విడుదలవుతుంది. 1942 డిసెంబర్‌లో చికాగో(అమెరికా)లో ఫెర్మి అనే శాస్త్రవేత్త మొట్టమొదటి అణు రియాక్టర్‌ను నిర్మించాడు. అందువల్ల ఇతడిని 'అణు రియాక్టర్ల పితామహుడు' అంటారు. అణు రియాక్టర్లలో ప్రధానంగా కింద పేర్కొన్న భాగాలు ఉంటాయి.

1. అణు ఇంధనాలు (కోర్): యురేనియం, థోరియం, ప్లూటోనియంలలో ఏదో ఒక పదార్థాన్ని చిన్న స్థూపాకార కడ్డీలుగా తయారు చేసి రియాక్టర్‌లో వివిధ వరుసల్లో పేర్చుతారు.

2. మితకారులు (Moderators): అణు రియాక్టర్‌లో న్యూట్రాన్ల వేగాన్ని తగ్గించి గొలుసు చర్యను అదుపు చేయడానికి మితకారులను ఉపయోగిస్తారు. సాధారణంగా భారజలం (D_2O), గ్రాఫైట్ కడ్డీలు, దృఢమైన ప్లాస్టిక్ పదార్థాలను మితకారులుగా ఉపయోగిస్తారు.

భారజలాన్ని యూరే అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. దీన్ని హైడ్రోజన్ ఐసోటోప్ అయిన డ్యుటీరియాన్ని ఉపయోగించి తయారీ చేస్తారు. అందువల్ల భారజలాన్ని డ్యుటీరియం ఆక్సైడ్ అంటారు.

3. నియంత్రకాలు: న్యూక్లియర్ రియాక్టర్‌లోని న్యూట్రాన్లను శోషించుకొని గొలుసు చర్యను పూర్తిగా ఆపడం కోసం నియంత్రకాలను ఉపయోగిస్తారు.

ఉదా: కాడ్మియం కడ్డీలు, స్టీల్ కడ్డీలు, బోరాన్ కడ్డీలు.

4. శీతలీకరణి (కూలంట్): న్యూక్లియర్ రియాక్టర్‌లో స్టీల్ పైపులను అమర్చి వాటి ద్వారా సాధారణ లేదా భారజలాన్ని ప్రవహింపజేస్తారు. ఇది రియాక్టర్ లోపలి ఉష్ణాన్ని గ్రహించి వేడెక్కి వెలుపలికి వెళుతుంది.



5. షీల్డింగ్: న్యూక్లియర్ రియాక్టర్‌పై అల్యూమినియం, సీసం, కాంక్రీట్‌ల మిశ్రమాన్ని ఉపయోగించి ప్రత్యేక పైకప్పును నిర్మిస్తారు. దీన్ని 'షీల్డింగ్' అంటారు. రియాక్టర్ సామర్థ్యం ఆధారంగా దీని మందం ఏడు అంగుళాల నుంచి 10 మీటర్ల వరకు ఉంటుంది. అణు రియాక్టర్‌లో గొలుసు చర్య జరుగుతున్నప్పుడు వెలువడే ప్రమాదకరమైన రేడియోధార్మిక కిరణాలు ఈ పైకప్పును ఢీకొని తిరిగి రియాక్టర్ లోపలికి వెళతాయి. దీనివల్ల పరిసరాల్లోని వాతావరణం, జలావరణం, జీవావరణానికి ఎలాంటి ప్రమాదం ఉండదు. న్యూక్లియర్ రియాక్టర్ నిర్మాణం పూర్తైన తర్వాత అది అణుశక్తిని ఉత్పత్తి చేసే దశకు చేరుకుంటే దాన్ని 'సందిగ్ధ స్థితి' అంటారు.

కేంద్రక సంలీనం

రెండు తేలికైన పరమాణు కేంద్రకాలు కలిసి ఒకే కేంద్రకంగా మారినప్పుడు అత్యధిక శక్తి విడుదలవుతుంది. దీన్ని 'కేంద్రక సంలీనం' అంటారు.

ఉదా: రెండు ప్రోటాన్లు కేంద్రక సంలీనంలో పాల్గొని డ్యుటీరియంగా మారినప్పుడు 26.8 MeV శక్తి విడుదలవుతుంది.

$$_1H^1 + {}_1H^1 \rightarrow {}_1H^2 + 26.8\ MeV$$

($_1H^1$ ↓ P^+, $_1H^1$ ↓ P^+, $_1H^2$ ↓ డ్యుటీరియం, 26.8 MeV ↓ అణుశక్తి)

సాధారణ గది ఉష్ణోగ్రత, పీడనాల వద్ద సజాతి ఆవేశాలున్న ప్రోటాన్లు పరస్పరం వికర్షించుకొని ఒక దాని నుంచి మరొకటి దూరంగా వెళతాయి. కాబట్టి 'కేంద్రక సంలీనం' జరగదు. కానీ సుమారు 20 మిలియన్ సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత, అధిక పీడనం వద్ద ప్రోటాన్లు వాటి మధ్య వికర్షణ బలాన్ని అధిగమించి కేంద్రక సంలీనంలో పాల్గొంటాయి. అధిక ఉష్ణోగ్రత, పీడనాల వద్ద జరగడం వల్ల కేంద్రక సంలీనాన్ని 'ఉష్ణ కేంద్రక చర్య' అని కూడా అంటారు. సూర్యుడు, నక్షత్రాల స్వయం ప్రకాశకత్వానికి కారణం కేంద్రక సంలీన చర్యే. సూర్యుడు, నక్షత్రాల్లో అత్యధిక ఉష్ణోగ్రత, పీడనాల వద్ద ప్రోటాన్లు కేంద్రక సంలీనంలో పాల్గొని కాంతి శక్తిని విడుదల చేస్తాయి. విశ్వంలోని హైడ్రోజన్, హీలియం వాయువులను 'శాశ్వత వాయువులు'గా పేర్కొంటారు.

కేంద్రక విచ్ఛిత్తి, కేంద్రక సంలీనాల మధ్య భేదాలు

కేంద్రక విచ్ఛిత్తి	కేంద్రక సంలీనం
1. సాధారణ గది ఉష్ణోగ్రత, పీడనాల వద్ద భారయుత యురేనియం, థోరియం, ప్లూటోనియం లాంటి కణాల్లో జరుగుతుంది.	1. అత్యధిక ఉష్ణోగ్రత, పీడనాల వద్ద తేలికైన ప్రోటాన్ల మధ్య కేంద్రక సంలీనం జరుగుతుంది.
2. దీనిలో గొలుసు చర్యను మితకారులను ఉపయోగించి నియంత్రించవచ్చు.	2. ప్రస్తుత శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం ప్రకారం కేంద్రక సంలీనంలోని గొలుసు చర్యను నియంత్రించడానికి వీలుకాదు.
3. ఇందులో తక్కువ శక్తి విడుదలవుతుంది.	3. సంలీనంలో ఎక్కువ శక్తి విడుదలవుతుంది.
4. ఓపెన్ హైమర్ అనే అమెరికా శాస్త్రవేత్త కేంద్రక విచ్ఛిత్తి అనే సూత్రం ఆధారంగా 1945లో అణు బాంబును నిర్మించాడు.	4. హైడ్రోజన్ బాంబు కేంద్రక సంలీనం అనే సూత్రం ఆధారంగా పనిచేస్తుంది. ఒక హైడ్రోజన్ బాంబు సామర్థ్యం, 1000 అణుబాంబుల సామర్థ్యానికి సమానం. హైడ్రోజన్ బాంబ్‌ను మొదటగా 1954లో ఎడ్వర్డ్ టెల్లర్ అనే అమెరికా శాస్త్రవేత్త తయారు చేశాడు. దీనిపేరు మైక్.

అడ్మిషన్స్

ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్శిటీలో మాస్టర్స్, పీహెచ్‌డీ

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్శిటీ అనుబంధ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి మాస్టర్స్, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం సీట్ల సంఖ్య: 186.

» **కోర్సు వ్యవధి:** రెండేళ్లు.
» **మాస్టర్స్ కోర్సులు:** ఎంఎస్సీ(అగ్రికల్చర్), ఎంబీఏ(ఏబీఎం), ఎంటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్), ఎంఎస్సీ(కమ్యూనిటీ సైన్స్).
» **పీహెచ్‌డీ కోర్సులు:** పీహెచ్‌డీ(అగ్రికల్చర్), పీహెచ్‌డీ(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్), పీహెచ్‌డీ (కమ్యూనిటీ సైన్స్). మొత్తం సీట్ల సంఖ్య: 47. **కోర్సు వ్యవధి:** మూడేళ్లు.
» **అర్హత:** సంబంధిత విభాగంలో బ్యాచిలర్స్/మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **గరిష్ట వయోపరిమితి:** 40 ఏళ్లు.
» **ప్రవేశ విధానం:** పీజీ కోర్సులకు డిగ్రీ మార్కులు, ఏఐఈఈఏ(ఐకార్) స్కోరు, పీహెచ్‌డీ కోర్సులకు డిగ్రీ, పీజీ మార్కులు, ఏఐసీఈ (ఐకార్)స్కోరు, ఇంటర్వ్యూ ఆధారంగా
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 13.09.2024.
» **ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.09.2024.
» **వెబ్‌సైట్:** https://angrau.ac.in/

యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్‌లో పీహెచ్‌డీ

యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్ 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ సబ్జెక్టులు/విభాగాల్లో పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. జేఆర్‌ఎఫ్ ఉన్నవారు పరీక్ష రాయనవసరం లేదు.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 170.
» **సబ్జెక్టులు:** ఇంగ్లిష్, తెలుగు, ఉర్దూ, అప్లైడ్ లింగ్విస్టిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, ఆంత్రోపాలజీ, ఎడ్యుకేషన్, రీజనల్ స్టడీస్, జెండర్ స్టడీస్, ఎకనామిక్స్, డ్యాన్స్, కమ్యూనికేషన్, మెటీరియల్ ఇంజనీరింగ్, నానో సైన్స్ అండ్ టెక్నాలజీ తదితరాలు.
» **అర్హత:** కనీసం 55% మార్కులతో సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 14.09.2024.
» **ప్రవేశ పరీక్ష తేదీలు:** 19.10.2024, 20.10.2024.
» **ఇంటర్వ్యూ తేదీలు:** 18.11.2024 నుంచి 21.11.2024 వరకు.
» **తరగతుల ప్రారంభం:** 02.01.2025.
» **వెబ్‌సైట్:** http://acad.uohyd.ac.in.

What is the colour of milk?



Model questions

Directions: Read the questions carefully and answer them.

1. Four of the following five are alike in a certain way and so form a group. Which is the one that does not belong to the group?
A) Sand B) Stone C) Cement D) Brick E) Wall
Explanation: Sand, stone, Cement and Brick are the raw materials. **Ans:** E
2. If Yellow is called Green, Green is called Black, Black is called White, White is called Red, Red is called Blue, Blue is called Orange then what is the colour of milk?
A) White B) Black C) Red D) Green E) None of these
Explanation: The colour of milk is white, and white is called red. **Ans:** C
3. Pointing to a photograph Seema said "He is the only grandson of my mother's father-in-law, and my father has neither brother nor sister". How is the man in photograph related to Seema?
A) Father B) Uncle C) Cousin D) Brother E) None of these
Ans: D
4. If '+' means '×', '×' means '+', '+' means '–' and '–' means '+' what is the value of
17 + 15 – 135 × 9 ÷ 70?
A) 270 B) 240 C) 170 D) 200 E) None of these
Ans: D
5. If it is possible to make a meaningful word from the fourth, the sixth, the eighth and the eleventh letters of the word GOURMANDISE using each letter only once first letter of the word is your answer. If more than one such word can be formed your answer is X. If no such word can be formed your answer is Y.
A) D B) R C) M D) X E) Y
Explanation: READ, DEAR, DARE. **Ans:** D
6. Four of the following five are alike in a certain way and so form a group. Which is the one that does not belong to the group?
A) Silver B) Gold C) Nickel D) CopperE) Brass
Explanation: Brass is an alloy where as the remaining are elements. **Ans:** E
7. In a certain code EXTRA is written as % 5 # 73 and NOSE is written as 4@8%; how is STORE written in that code?
A) 5#@7% B) 8#@7% C) 8#@%5 D) 8@75% E) None of these
Ans: B
8. In a row of children facing North, Shamika is third to the right of Nikhil who is seventeenth from the right end of the row. Ravi is fifth to the left of Shamika and is twentieth from the left end. Total how many children are there in the row?
A) 39 B) 38 C) 37 D) Cannot be determined E) None of these
Explanation: Shamika is 14th from the right end. Ravi is 19th from the right end.
20 + 19 – 1 = 38 **Ans:** B
9. How many such pairs of letters are there in the word EXAMINATION each of which has as many letters between them in the word, as they have in the English alphabet?
A) None B) One C) Two D) Three E) None of these
Explanation: EI, NO **Ans:** C
10. In a certain code ACQUIRE is written as EIRUAQC, how is DENSITY written in that code?
A) YTISNDE B) YTISNED C) YTISNED D) YITSNDE E) None of these
Explanation: The letters in the word ACQUIRE
A=1, C=2, Q=3, U=4, I=5, R=6, E=7 are rearranged as 7564312
Ans: D

Directions (Q. No. 11-16): Study the following information carefully and answer the questions given below.

An organization wants to recruit System Analysts. The following conditions apply.

The candidate must:

i) be an engineering graduate in Computer/IT with at least 60% marks.
ii) have working experience in the field of Computer at least for 2 years after acquiring the requisite qualification.
iii) have completed minimum 25 years and maximum 30 years of age as on 1.12.2015.
iv) be willing to sign a bond for Rs. 50,000.
v) have secured minimum 55% marks in selection test.

However, if a candidate fulfills all other conditions except-

a) At i) above, but is an Electronics Engineer with 65% or more marks the case is to be referred to the General Manager (GM)-IT.

b) At iv) above, but has an experience of at least 5 years as a Software Manager, the case is to be referred to the VP.

In each question below, detailed information of candidate is given. You have to carefully study the information provided in each case and take one of the following courses of actions based on the information and the conditions given above. You are not to assume anything other than the information provided in each question. All these cases are given to you as on 01.12.2015. You have to indicate your decision by marking answers to each question as follows. Mark answer-

A) If the case is to be referred to VP.
B) If the case is to be referred to GM.
C) If the data provided is not sufficient to take a decision.
D) If the candidate is to be selected.
E) If the candidate is not to be selected.

11. Ms. Suneeta is an IT Engineer with 60% marks at graduation as well as in selection test. She is working as a Software Engineer for last 3 years after completing engineering degree and has completed 27 years of age. She is willing to sign the bond of Rs. 50,000.
12. Rakesh Rao is a Computer Engineer Graduate and thereafter is working as a Software Manager for past 6 years. He has secured 72% marks at graduation and 67% marks in selection test. His date of birth is 5th December 1986. He is not willing to sign the bond for Rs. 50,000.
13. Nishant is an Electronics Engineer passed out in June 2012 at the age of 22 years. Since then he is working as a Programmer in a software company. He has passed the selection test with 66% marks and is willing to sign the bond.
14. Abhijit is a Computer Engineer with 65% marks passed out in 2011 at the age of 22 years. Since then he is working as a Software Engineer, in a private firm. He is willing to sign the bond for the required amount. He has secured 63% marks in selection test.
15. Giridhar is working as a Software Engineer in a reputed company for past 4 years after completing Computer Engineering wi-th 68% marks. He has cleared the selection test with 75% marks & is willing to sign the bond. His DOB is December 17, 1988.
16. Mr. Rajan is working as a Programmer for the last 6 years in an engineering firm after passing engineering examination. He has passed Electronics Engineering with 76% marks. His date of birth is 16.05.88. He has cleared the selection test with 62% marks and is willing to sign the bond for Rs. 50,000.

Explanations:

11. Ms.Suneeta fulfils all the conditions. Hence she is to be selected. **Ans:** D
12. Rakesh Rao fulfils all the conditions except (iv) but he has been working as a software manager for the last 6 years so according to (b) his case is to be referred to V.P. **Ans:** A
13. Since the marks obtained by Nishant in graduation are not given. So the data provided is not sufficient to take a decision. **Ans:** C
14. Abhijit fulfils all the conditions. Hence he is to be selected. **Ans:** D
15. Giridhar fulfils all the conditions. Hence he is to be selected. **Ans:**D
16. Mr.Rajan does not fulfil the condition (i) But he passed the Electronics Engineering will more than 65%. Hence according to (a) his case is to be referred to G.M. **Ans:** B

17. **Directions:** Given a statement followed by two assumptions numbered I and II. You have to consider the statement and the following assumptions and decide which of the assumptions is implicit in the statement.
Mark (A) if only assumption I is implicit
Mark (B) if only assumption II is implicit
Mark (C) if either I or II is implicit
Mark (D) if neither I or II is implicit

Statement: Even with the increase in the number of sugar factories in India, we still continue to import sugar.

Assumptions:
I) The consumption of sugar per capita has increased in India.
II) Many of the factories are not in a position to produce sugar to their fullest capacity.

Explanation: As the statement says that despite increase in the number of sugar factories in India we are still continuing to import sugar, it must be that either the consumption of sugar has increased or many of the factories are not producing sugar to the maximum capacity. **Ans:** C